
'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 351

గురువారం 13-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సింధు ఆరో'సారీ'...
ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో మళ్లీ తొలి రౌండ్‌లో ఓడిన భారత స్టార్. - 16లో



ఐటీ షేర్లలో అమ్మకాలు
అమెరికా ఆర్థిక వృద్ధిపై ఆందోళన ఎఫెక్ట్. సెన్సెక్స్ నేలచూపులు. - 17లో



మాయా చర్మం..
అది ఎంతటి గాయాన్నయినా నాలుగే గంటల్లో 90% దాకా మాన్పుతుంది. 24 గంటల్లో పూర్తిగా నయం చేసేస్తుంది.
- వివరాలు 6లో



ఈయూ ప్రతీకార సుంకాలు..
అమెరికా నుంచి వచ్చే పారిశ్రామిక, పాడి ఉత్పత్తులపై కొత్త సుంకాలు వసూలు చేయనున్నట్లు బుధవారం ఈయూ చెప్పింది.
- వివరాలు 6లో



పాఠశాలల్లో ఎయిర్ ప్యూరిఫయర్లు
వాయు కాలుష్యం నుంచి పిల్లలను రక్షించేందుకు బడుల్లో ఎయిర్ ప్యూరిఫయర్లను పెట్టాలని సౌమ్య స్వామినాథన్ చెప్పారు.
- వివరాలు 6లో



ఆబిద్ అలీ అస్తమయం
టీమిండియాకు 34 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ క్రికెటర్. భారత్ తరఫున వన్డేల్లో తొలి బంతి వేసిన ఘనత.
- వివరాలు 16లో

దేశానికి దిక్సూచి

విశ్వాసం నిబద్ధతతో కలిసి నడుద్దాం.. రాష్ట్రాన్ని ఆదర్శంగా మారుద్దాం

బడ్జెట్ భేటీ సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

తెలంగాణ కేవలం పురోగమించడమే కాకుండా రూపాంతరం చెందుతోంది

- అన్ని వర్గాల సంక్షేమానికి, సుస్థిర పురోగతికి ప్రభుత్వం బాటలు వేస్తోంది.. రైతన్న సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉంది
- యువత, మహిళల సాధికారత కోసం పథకాలు, కార్యక్రమాలు
- 'సమగ్ర సర్వే'తో సాహసోపేత మార్పు దిశగా ప్రయాణం
- రేపటి తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవబోతోంది
- యువ, డైనమిక్ సీఎం సారథ్యంలో ప్రభుత్వానిది దృఢమైన సంకల్పమన్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్

'తెలంగాణ కేవలం పురోగమించడమే కాకుండా రూపాంతరం చెందుతోంది. సమ్మిళితత్వం, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ అనే విజన్.. సాహసోపేత సంస్కరణలు, ప్రజా కేంద్రీకృత సుపరిపాలన, నిర్ణయాత్మక నాయకత్వంతో సాకారమవుతోంది. అన్ని వర్గాల సంక్షేమానికి, సుస్థిర పురోగతికి ప్రభుత్వం బాటలు వేస్తోంది సమానత్వం, పురోగతిలో దేశానికి దిక్సూచి అయ్యే తెలంగాణ నిర్మాణానికి సంఘటితంగా, విశ్వాసంతో, స్థిరమైన నిబద్ధతతో అందరం కలిసి ముందుకు సాగుదాం..' అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో బుధవారం ఉదయం ఉభయసభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి అమలు, లక్ష్యాలు, ప్రభుత్వ విజయాలను వివరించారు. గవర్నర్ మాట్లాడుతున్నంతసేపు ప్రధాన ప్రతిపక్ష సభ్యులు నిరసన నినాదాలు చేస్తూనే ఉన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ చేయి చూపటం ద్వారా పలుమార్లు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. మరోవైపు గవర్నర్ కీలకాంశాలను ప్రస్తావించినప్పుడల్లా..అధికార పక్ష సభ్యులు బల్లలు చరుస్తూ హర్షం మిగతా 12వ పేజీలో ▶

19న రాష్ట్ర బడ్జెట్..

27 వరకు కొనసాగనున్న అసెంబ్లీ సమావేశాలు.. గురు, శనివారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ

- వివరాలు 12లో

అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్

అరగంట ముందే చేరుకున్న బీఆర్‌ఎస్ అధినేత గవర్నర్ ప్రసంగం అనంతరం నందినగర్ నివాసానికి..

- వివరాలు 12లో

సీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌గౌడ్


మాటకు మాట.. తిప్పికొట్టాలి

ప్రతిపక్షాల ఆరోపణలు, లేవనెత్తే అంశాలను దీటుగా ఎదుర్కోవాలి

సీఎల్పీ భేటీలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్

- బీఆర్‌ఎస్‌లా కుంభకోణాలు ఎవరూ చేయలేదు.. ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే వాటిని ప్రస్తావించి ఎదురుదాడి చేయాలి!
- నాకేమంటూ, అంటీముట్టనట్టు ఉండటం మీకు, పార్టీకి మంచిదికాదు
- పార్లమెంటు తరహాలోనే రోజుకు మూడుసార్లు అటెండెన్స్ తీసుకుంటాం
- జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను కలసి మాట్లాడతా..

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దూకుడుగా వ్యవహరించి.. ప్రతిపక్షాలను కకావికలం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయన్న విషయాన్ని గుర్తించాలని.. సభ లోపల వారు మాట్లాడే ప్రతి పదాన్ని మాటకు మాట తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''ఈ బడ్జెట్ సమావేశాలు కీలకమైనవి. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నాం. ఈ 15 నెలల కాలంలో ప్రజాప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ మిగతా 14వ పేజీలో ▶

అన్నీ నేనే మాట్లాడాలా..?

- ఒక్క మంత్రి, ఎమ్మెల్యే కూడా మాట్లాడరా?
- సభలో ప్రతిపక్ష సభ్యులు గొడవ చేస్తుంటే విప్‌లు ఏం చేస్తున్నారు?
- విప్‌లతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్ క్లాస్!

14లో

న్యూస్‌రీల్

ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక పాలకమండలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి ప్రత్యేక పాలకమండలిని ఏర్పాటు చేస్తూ బుధవారం జీఓ విడుదల అయ్యింది. పాలకమండలికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఉంటారు.

- వివరాలు 3లో

పావువంతు పదవీకాలం గడిచిపోయింది!



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు గడిచిందని, పావువంతు పదవీకాలం ముగిసినందున తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు.

- వివరాలు 13లో

ట్రిపుల్ ఆర్ వరకు హైదరాబాద్ విస్తరణ



హైదరాబాద్ మహానగర పరిధిని రీజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో వెలువరించింది. దీంతో ఇప్పటి వరకు 7,257 చదరపు కి.మీటర్ల వరకు ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధి 10,472.723 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది.

- వివరాలు 3లో

గవర్నర్‌ది గాంధీభవన్ ప్రసంగం

అట్టర్‌ఫ్లాప్ పాలనపై అబద్ధాలు మాట్లాడించారు

అసెంబ్లీ మీడియాపాయింట్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేసిన బడ్జెట్ ప్రసంగం.. గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ నోటి వెంట అబద్ధాలు, అసత్యాలు చెప్పించి ఆయన స్థాయిని దిగజార్చిందని ఆరోపించారు. 'బడ్జెట్ ప్రసంగంలో కొత్త విషయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలపై స్పష్టత ఇస్తారని, గత 15 నెలల పాలనపై ప్రాయశ్చిత్తం చేసుకుంటారని ఆశించాం. కానీ అలాంటిదేమీ జరగలేదుగానీ పెళ్లిలో చావుడప్పు కొట్టినట్టుగా ప్రసంగం ఉంది'అని విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం పూర్తిస్థాయిలో ప్రజలను వంచించడమేనని, ఆయన ప్రతిష్టను సైతం తగ్గించిందని మిగతా 12వ పేజీలో ▶

రైలు హైజాక్‌కు తెర: పాకిస్తాన్

- మిలిటెంట్లందరినీ హతమార్చాం
- ప్రయాణికులను విడిపించాం: సైన్యం
- 21 మంది చనిపోయినట్టు వెల్లడి



6లో

సామాన్యులకు స్టార్'లింక్' అయ్యేనా!

- మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లోనూ హైస్పీడ్ ఇంటర్నెట్
- విదేశాల్లో ఇప్పటికే అందుబాటులో.. ఖరీదూ ఎక్కువే..
- మన దేశంలో చవక ధరలో తెస్తామంటున్న టెలికం కంపెనీలు
- తొలుత వ్యాపార సంస్థలకు అందుబాటులో.. తర్వాత సాధారణ జనానికి..

3లో

గ్లోబల్ సౌత్‌కు 'మహాసాగర్'

మారిషస్ ప్రధాని రామ్‌గులాంతో మోదీ చర్చలు

- 'విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యం'గా ద్వైపాక్షిక బంధం
- ఇరు దేశాల మధ్య కుదిరిన 8 కీలక ఒప్పందాలు
- మోదీకి మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం

6లో


మారిషస్ అత్యున్నత పురస్కారం 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషియన్'ను ప్రధాని మోదీకి ప్రదానం చేస్తున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్



NECC Vencobb Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	73 kg	Dressed with Skin	138 kg
₹ 56	Retail Live Bird	95 kg	Skin Less	157 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



ఇంకా నయం! ప్రభుత్వాన్ని హైజాక్ చేస్తారేమోనని భయపడ్డా..!




A quality product from
PAN BAHAR
ACCHAI KA RANG GEHRA CHADHTA HAI
రంగుల ఉత్సవం
హార్దిక శుభాకాంక్షలు
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
MOUTH FRESHENER
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
PAN MASALA
NO TOBACCO NICOTINE
www.panbahar.in
CHEWING OF PAN MASALA IS INJURIOUS TO HEALTH. NOT FOR MINORS

జరగబోయే ప్రమాదం గురించి చర్చిద్దాం

- లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్‌పై అఖిలపక్షం పెడతాం
- హాజరుకావాలని రాజకీయపక్షాలకు భట్టి, జానారెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి పొంచి ఉన్న పెను ప్రమాదం గురించి చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలసి రావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలు కోరారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల జరగబోయే నష్టం గురించి చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు హాజరై తమ ఆలోచనలను వివరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అన్ని రాజకీయ పక్షాలకు బుధవారం భట్టి, జానారెడ్డిలు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం త్వరలోనే అఖిలపక్షం నిర్వహించే తేదీ, వేదికలను ప్రకటిస్తామని ఆ లేఖలో వెల్లడించారు.

ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబించింది: సురేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగం ప్రతిబింబించిందని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆమె బుధవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, పురోగతిపై ప్రజల నమ్మకాన్ని.. గవర్నర్ ప్రసంగం మరింత బలోపేతం చేసిందన్నారు.

సామాన్యులకు స్టార్‘లింక్’ అయ్యేనా!

- మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లోనూ హైస్పీడ్ ఇంటర్నెట్
- విదేశాల్లో ఇప్పటికే అందుబాటులో.. ఖరీదూ ఎక్కువే..
- మన దేశంలో చవక ధరలో తెస్తామంటున్న టెలికం కంపెనీలు
- తొలుత వ్యాపార సంస్థలకు అందుబాటులో.. తర్వాత సాధారణ జనానికి..

సాక్షి, హైదరాబాద్: కొండలు, గుట్టలు, అడవులతో కూడిన మారుమూల ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నేరుగా శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ అందించే అంశం ఇప్పుడు మన దేశంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడ శాటిలైట్ ఇంటర్నెట్ అందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌తో చేతులు కలిపినట్టు టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించిన మరుసటి రోజే.. అనూహ్యంగా రిలయన్స్ జియో సైతం తెరపైకి వచ్చింది. తాము కూడా స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకున్నట్టు బుధవారం ప్రకటించి ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ సేవలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి స్టార్‌లింక్ ఆమోదం పొందాల్సి ఉందని ఎయిర్‌టెల్, జియో స్పష్టం చేశాయి. భారతీ ఎయిర్‌టెల్ ఇప్పటికే గుజరాత్, తమిళనాడులలో బేస్ స్టేషన్లు ఏర్పాటు చేసి శాటిలైట్ టెలికం సేవల కోసం రెడీ అవుతోంది. అటు జియో కూడా దేశంలో రెండు ప్రాంతాల్లో బేస్ స్టేషన్స్ నెలకొల్పి పోటీకి సై అంటోంది.

మరింత సమయం తప్పదు

దేశంలో శాటిలైట్ టెలికం సేవలు అందుబాటులోకి రావడానికి మరికొంత సమయం పట్టనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇంకా నిబంధనలను ప్రకటించలేదు. పైగా టెలికం శాఖ, ట్రాయ్, కేంద్ర హోం శాఖ నుంచి స్టార్‌లింక్ అనుమతులు పొందాల్సి ఉంది. ఈ సేవలకు సంబంధించి ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను నేరుగా సంస్థలకు కేటాయించడానికి బదులుగా.. వేలం వేయాలని జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా పట్టుబడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో ఉన్నట్టుగా అడ్మినిస్ట్రేటివ్ కేటాయింపుల విధానం అమలు చేయాలని స్టార్‌లింక్, ప్రాజెక్ట్ కైపర్ వంటివి కోరుతున్నాయి. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అన్నీ అనుకూలించి శాటిలైట్ టెలికం సేవలు అందుబాటులోకి వస్తే.. ఈ విభాగంలోనూ టారిఫ్ వార్ ఖాయంగా కనిపిస్తోంది.



తొలుత వ్యాపార, వాణిజ్య కస్టమర్లకు..

భారత్‌లో శాటిలైట్ టెలికం, ఇంటర్నెట్ చార్జీలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తి రేపుతోంది. స్టార్‌లింక్ గేర్ (శాటిలైట్ ఇంటర్నెట్ అందుకోవడానికి కావాల్సిన పరికరాలు) ధర కూడా వెల్లడి కావాల్సి ఉంది. భారత్‌లో ప్రస్తుతమున్న సంప్రదాయ టెలికం చార్జీలతో పోలిస్తే ఇతర దేశాల్లో స్టార్‌లింక్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయి. కానీ భారత మార్కెట్‌కు తగ్గట్టుగా పోటీ ధరలో చార్జీలు అమలు చేసే అవకాశం ఉందని దిగ్గజ టెలికం సంస్థ అధికారి ఒకరు వెల్లడించారు. తొలుత వ్యాపార, వాణిజ్య కస్టమర్ల కోసం సేవలు ప్రారంభం అవుతాయని చెప్పారు. సాధారణ కస్టమర్లకు శాటిలైట్ టెలికం సేవలు చేరడానికి చాలా కాలం పడుతుందన్నారు.

విదేశాల్లో చార్జీలు ఇలా..

స్టార్‌లింక్ యూఎస్‌ఏలో రెసిడెన్షియల్ విభాగంలో నెలకు రూ.6,976 నుంచి ప్లాన్లు అందిస్తోంది. పరికరాల కోసం ఒకసారి చెల్లించాల్సిన సొమ్ము అదనం. స్టాండర్డ్ ఎక్విప్‌మెంట్ కిట్ ధర రూ.30,443గా ఉంది.

- ఇక మొబైల్ సేవలు కావాల్సినవారు నెలకు కనీసం రూ.4,360 చెల్లించాల్సి ఉంటుంది. డేటా అపరిమితంగా అందుకోవచ్చు. 220 ఎంబీపీఎస్ వరకు స్పీడ్ ఆఫర్ చేస్తోంది.
- రెసిడెన్షియల్ లైట్, రెసిడెన్షియల్ ప్లాన్లలో కూడా వినియోగదారులు అపరిమిత డేటాను అందుకోవచ్చు.
- రోమింగ్ ప్లాన్ తీసుకునే వినియోగదారులు దేశవ్యాప్తంగా, ప్రయాణంలో, అంతర్జాతీయ ప్రయాణ సమయంలో కూడా వినియోగం, తీర ప్రాంతాల్లో కవరేజీ పొందవచ్చు. బిజినెస్ విభాగంలో నెలకు రూ.12,208 నుంచి రూ.4,36,000 వరకు ప్లాన్స్ ఉన్నాయి.
- ఇక భూటాన్‌లో రెసిడెన్షియల్ లైట్ ప్లాన్ కింద స్టార్‌లింక్ నెలకు రూ.3,000 చార్జీ చేస్తోంది. ఈ ప్లాన్‌లో ఇంటర్నెట్ 23–100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఆఫర్ చేస్తోంది. యూరప్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ వేగం ఊక్లా నివేదిక ప్రకారం హంగరీలో అక్టోబర్–డిసెంబర్ కాలంలో గరిష్ఠంగా 135.11, కనిష్ఠంగా సైప్రస్‌లో 36.52 ఎంబీపీఎస్ నమోదైంది.

మనదగ్గర చాలా చవక..

శాటిలైట్ ఇంటర్నెట్ చార్జీలతో పోలిస్తే మన దేశంలో మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ చాలా చవక. అటూ ఇటూగా రూ.20 చెల్లిస్తే ఒక జీబీ డేటా అందుకోవచ్చు. సుమారు రూ.50 నుంచి అన్‌లిమిటెడ్ ప్యాక్స్ లభిస్తాయి. హోమ్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు నెలకు కనీసం రూ.400 నుంచి ఉన్నాయి. హై–ఎండ్ ప్లాన్ అయితే నెలకు రూ.4,000 వరకు ఉంది. దీనిలో 10 జీబీపీఎస్ వరకు వేగం, అన్ని ఓటీటీ యాప్స్ సబ్‌స్క్రిప్షన్ కూడా అందుతుంది. రూటర్‌కు అయ్యే వ్యయమూ తక్కువే. శాటిలైట్ టెలికం కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం. కాల్స్ చేయాలంటే ఓటీటీ యాప్స్‌పైన ఆధారపడాల్సిందే.

స్టార్ లింక్ ప్రత్యేకతలు ఇవీ..

కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు: సుమారు 7,000
శాటిలైట్ ఇంటర్నెట్ అందిస్తున్న దేశాలు: 100కుపైగా
వినియోగదారులు: సుమారు 50 లక్షలు (2024 డిసెంబర్ చివరినాటికి)
అమెరికాలో దిగ్గజ బ్రాండ్‌బ్యాండ్ కంపెనీలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గట్టి పోటీనిస్తోంది.

రూరల్ కనెక్టివిటీ: మారుమూల ప్రాంతాలు, పల్లెలకు వేగంగా ఇంటర్నెట్ అందిస్తోంది. విద్య, ఆరోగ్య సేవలు, ఈ–కామర్స్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

భారత్‌లో పోటీ: దేశంలో 94.5 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు ఉన్నారు. అందులో 90.4 కోట్ల మంది వైర్‌లెస్/మొబైల్ ఇంటర్నెట్‌ను వాడుతున్నారు.

యూఎస్‌లో స్టార్‌లింక్ చార్జీలు.. (రూ.లలో)

విభాగం	నెలకు
రెసిడెన్షియల్ లైట్	6,976
రెసిడెన్షియల్	10,464
రోమ్–50 జీబీ	4,360
రోమ్–అన్‌లిమిటెడ్	14,388

భూటాన్‌లో స్టార్‌లింక్ చార్జీలు (రూ.లలో)

విభాగం	నెలకు	స్పీడ్ (ఎంబీపీఎస్)
రెసిడెన్షియల్ లైట్ ప్లాన్	3,000	23-100
స్టాండర్డ్ రెసిడెన్షియల్ ప్లాన్	4,200	25-110

భారత్‌లో ఇంటర్నెట్ వేగం ఇలా..

ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్	30ఎంబీపీఎస్ - 1 జీబీపీఎస్
బ్రాడ్‌బ్యాండ్–ఫైబర్ ఆప్టిక్	100 ఎంబీపీఎస్ - 10 జీబీపీఎస్
5జీ మొబైల్ వాస్తవ వేగం	300 ఎంబీపీఎస్ - 1 జీబీపీఎస్
4జీ ఎల్‌టీఈ మొబైల్ వేగం	10-50 ఎంబీపీఎస్

ట్రిపుల్ ఆర్ వరకు హైదరాబాద్ విస్తరణ

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల
- 10,472.723 చదరపు కిలోమీటర్లకు పెరగనున్న హెచ్‌ఎండీఏ పరిధి
- ఎఫ్‌సీడీఏ పరిధిలోకి మరో 36గ్రామాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర పరిధిని రీజినల్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో వెలువరించింది. దీంతో ఇప్పటివరకు 7,257 చదరపు కిలోమీటర్ల వరకు ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధి 10,472.723 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాలతో పాటు కొత్తగా నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలతో కలుపుకొని మొత్తం 11 జిల్లాలకు విస్తరిస్తుంది. మొత్తం 1,355 గ్రామాలు, 104 మండలాలు సంస్థ పరిధిలోకి వస్తాయి. మరోవైపు ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిధిలోకి తెచ్చారు. రీజినల్ రింగ్‌రోడ్డు తరువాత 2 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా నిర్ణయించారు. హైదరాబాద్ చుట్టూ 354 కిలోమీటర్ల పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.

ప్రగతి పరుగులు!

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరం పరిధిని రీజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం వల్ల ప్రగతి పరుగులు పెడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న హైదరాబాద్ నగరాన్ని కోర్ అర్బన్ ప్రాంతంగా పరిగణిస్తూ సుమారు 2,000 చదరపు కిలోమీటర్ల వరకు జీహెచ్‌ఎంసీని విస్తరిస్తారు. ఆ తర్వాత ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్‌గా పరిగణిస్తూ శాటిలైట్ టౌన్‌షిప్పులు, ఇతర మౌలిక సదుపాయాలతో నగరాన్ని విస్తరించనున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు తరువాత ఉన్న తెలంగాణను రూరల్ తెలంగాణగా పరిగణించి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు సమగ్ర మాస్టర్ ప్లాన్ కోసం కూడా ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇందుకోసం త్వరలో అంతర్జాతీయ కన్సల్టెన్సీల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు.

ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక పాలకమండలి

చైర్మన్‌గా సీఎం, వైస్ చైర్మన్‌గా పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి

- సభ్యులుగా సీఎస్, పలు శాఖల ముఖ్య కార్యదర్శులు
- 56 రెవెన్యూ గ్రామాలు.. 765.25 చ.కి.మీ. పరిధిలో 12 జోన్లు





సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి ప్రత్యేక పాలక మండలి ఏర్పాటు చేస్తూ బుధవారం జీఓ విడుదల అయ్యింది. పాలకమండలికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆర్థిక పరిశ్రమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులు, హెచ్‌ఎండీఏ కమిషనర్, టీజీఐఐసీ వైఎస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, డీటీసీపీ హైదరాబాద్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. 56 రెవెన్యూ గ్రామాలతో పాటు 765.25 చదరపు కిలోమీటర్ల పరిధిలో 12 జోన్లుగా ఈ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను తొలగించి ఎఫ్‌సీడీఏలో విలీనం చేసింది.

ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వచ్చే గ్రామాలు ఇవే..

ఆమనగల్ మండలంలోని ఖానాపూర్, రామనూతలతో పాటు ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్, పోచారం, రామిరెడ్డిగూడ, తులేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తడ్లకాల్వ రెవెన్యూ గ్రామాలు.. కడ్తాల్ మండలం చెరికొండపట్టి కల్వకుర్తి, చెరికొండపట్టి పడకల్, ఏక్రాజ్‌గూడ, కడ్తాల్, కర్కల్ పహాడ్, ముద్విన్.. కందుకూరు మండలం దాసర్లపల్లె, అన్నోజిగూడ, దెబ్బగూడ, గూడూరు, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట్, మొహ్మద్‌నగర్, ముచ్చర్ల, పంజాగూడ, రాచలూరు, సర్వార్లపల్లి, తిమ్మాయిపల్లె, తిమ్మాపూర్.. మహేశ్వరం మండలం తుమ్మలూరు, మంచాల మండలంలోని ఆగపల్లే, నోముల, మల్లికార్జునగూడ గ్రామాలను.. యాచారం మండలం చౌదరిపల్లె, గున్‌గల్, కొత్తపల్లె, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు, నక్కర్తి, నానక్‌నగర్, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తక్కెళ్లపల్లి, తాటిపర్తి, తులేకుర్దు, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి గ్రామాలను ఈ అథారిటీలో కలిపారు. ఇటీవలి వరకు ఎకరం రూ.2 కోట్లు పలికిన భూముల ధరలు ప్రస్తుత నిర్ణయంతో రెట్టింపయ్యాయి.







యవ్వనం అంటే ఏమిటి? ఒక కల.
ప్రేమంటే ఏమిటి? ఆ కలలోని భావం.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 13 మార్చి 2025

నెత్తురోడుతున్న బలూచిస్తాన్

ఒక ప్రాంత ప్రజల ఆకాంక్షలను ఉక్కుపాదంతో అణచాలని చూస్తే... దాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి అక్కడి వనరులను పీల్చిపిప్పి చేస్తే... ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడతాయి. విభజనానంతరం పాకిస్తాన్ ఒక దేశంగా ఏర్పడినప్పుడు అందులో విలీనం కాకుండా తాము స్వతంత్రంగా ఉంటామని కలాత్ సంస్థానం ప్రకటించినప్పుడు నూతన పాలకులు ససేమిరా అంగీకరించలేదు. అక్కడి వనరులపై కన్నేసిన పాలకులు ఆ సంస్థానాన్ని నమ్మించి, స్నేహ ఒడంబడిక కుదుర్చుకుని చివరకు దాన్ని బుట్టదాఖలా చేశారు. ఈ ద్రోహం వెనక పాక్ జాతిపిత మహమ్మదాలీ జిన్నాతోసహా పలువురున్నారు. దాని పర్యవసానాలు ఈ ఏడున్నర దశాబ్దాలుగా ఆ దేశం అనుభవిస్తూనే ఉంది. క్వెట్టానుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) మిలిటెంట్లు హైజాక్ చేసి వందలమందిని అపహరించుకు పోవటం, కొందరిని హతమార్చటం ఆ వరసలో మరో చర్య. బుధవారం భద్రతా దళాలను రంగంలోకి దింపి దాదాపు 200 మంది ప్రయాణికులను విడిపించినట్టు చెబుతున్నారు. ఇందుకు ప్రతిగా 50 మంది బందీలను మిలిటెంట్లు హతమార్చగా, ఆ తర్వాత మిలిటెంట్లందరినీ పాక్ సైన్యం మట్టుబెట్టిందంటున్నారు. ఇలా నిత్యం నెత్తురోడుతున్న బలూచిస్తాన్ భౌగోళికంగా పాకిస్తాన్‌లోనే ఉన్నా, అక్కడివారు తమను తాము పాకిస్తానీలుగా పరిగణించుకోరు. ఒకనాడు సాధారణ సమస్యల కోసం ఉద్యమించినవారు ఇప్పుడు స్వాతంత్ర్యాన్ని కోరుకునేదాకా వచ్చారు. పాక్ పాలకుల నిర్వాకమే ఇందుకు కారణం.

బలూచిస్తాన్ సాధారణ ప్రాంతం కాదు. ఇక్కడి భూమిలో బంగారం, వజ్రాలు, వెండి, రాగి వనరులు నిక్షిప్తమైవున్నాయి. దేశ వర్తక, వాణిజ్యాలను అత్యున్నత స్థాయికి తీసుకుపోగల డీప్ సీ పోర్టు ఉన్న గ్వాదర్ కూడా ఇక్కడిదే. 2002లో ఈ ఓడరేవు తొలి దశలో కొంత భాగాన్ని పూర్తిచేసి ఆదరాబాదరాగా ప్రారంభించారు. కానీ ఆ తర్వాత పనులు పడకేశాయి. దీన్ని నిర్మిస్తున్న చైనా... స్థానికులకు నామమాత్రం అవకాశాలిచ్చింది. ఇది బలూచి వాసుల అసంతృప్తిని మరిన్ని రెట్లు పెంచింది. భౌగోళికంగా వైశాల్యంలో ఫ్రాన్స్‌ను పోలివుండే ఈ ప్రాంత జనాభా కేవలం 90 లక్షలు. ఇంత తక్కువ జనాభాతో, అపరిమితమైన వనరులతో ఉండే ఈ బలూచిస్తాన్ గత 77 ఏళ్లలో వాస్తవానికి అద్భుతమైన ప్రగతి సాధించివుండాలి. కానీ విషాదమేమంటే ఇక్కడున్న 70 శాతం మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతుంటారు. వారికి ఉపాధి అవకాశాలుండవు. వేరేచోటకు వెళ్లి స్థిరపడేంత చదువుసంధ్యలుండవు. సైనిక దళాల్లో సైతం బలూచిస్తాన్ వాసులకు మొండిచేయి చూపారు. వారిపై పాక్ సైన్యాధికారుల్లో వున్న అపనమ్మకమూ, భయాందోళనలే అందుకు కారణం. తెలివైన పాలకులైతే ఆ ప్రాంతానికి స్వయంప్రతిపత్తినిచ్చి, దాని అభివృద్ధికి బాటలు పరిచేవారు. కానీ పాకిస్తాన్ పాలకులు అణచివేతే పరిష్కారం అనుకున్నారు. సైనిక పదఘట్టనలతో అది పాదాక్రాంతం అవుతుందనుకున్నారు.

బలూచిస్తాన్‌లో తరచు మిలిటెంట్ దాడులకు పాల్పడే బీఎల్‌ఏ 2000 సంవత్సరంలో ఏర్పడినా అంతకు చాలాముందునుంచే ఉద్యమకారులను అపహరించి మాయం చేయటం, బూటకపు ఎన్‌కౌంటర్లలో వారిని హతమార్చటం పాక్ సైన్యం ఒక పద్ధతిగా కొనసాగించింది. 2011 నుంచి లెక్కేసినా దాదాపు 10,000 మంది అదృశ్యమయ్యారని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అంటున్నది. బీఎల్‌ఏ సైతం అదే మార్గం ఎంచుకుంది. మొదట్లో చెదురు మదురు ఘటనలకే పరిమితమైన ఆ సంస్థ ఇటీవలి కాలంలో భారీ దాడులకు పాల్పడుతోంది. బీఎల్‌ఏ కారణంగా చైనా–పాకిస్తాన్ కారిడార్ (సీపీఈసీ) అటకెక్కేలావుంది. చైనా ఖండాంతర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ)లో సీపీఈసీ కీలకమైనది. కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న జాతీయ రహదారులనూ, ఇతర మౌలిక సదుపాయాలనూ బీఎల్‌ఏ లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయటం ఇందుకే. 6,500 కోట్ల డాలర్ల విలువైన సీపీఈసీలో ఇంధనం, రవాణా, పారిశ్రామిక కారిడార్లూ, గ్వాదర్ పోర్టు వగైరాలున్నాయి. స్థానికులకు అవకాశాలీయకుండా ఇంత పెద్ద నిర్మాణాన్ని తలకెత్తుకుంటే అసంతృప్తి రాజుకుంటుందన్న ఇంగితజ్ఞానం పాలకులకు కొరవడింది.

బలూచిస్తాన్ వాసుల డిమాండ్లు ధర్మమైనవి. కానీ అందుకు హింసాత్మక మార్గాన్ని ఎంచుకోవటంవల్ల న్యాయమైన సమస్య మరుగున పడుతుంది. బలూచిస్తాన్‌లో జాతి, మత, తెగ, రాజకీయ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా మానవ హక్కుల కోసం పోరాడే బలూచ్ యక్‌జహితీ కమిటీ (బీవైసీ) 2019 నుంచీ పనిచేస్తోంది. ఆ సంస్థ నాయకురాలు డాక్టర్ మెహ్రాంగ్ బలూచ్‌కు అన్ని వర్గాల నుంచీ అపారమైన ఆదరణ వుంది. పాక్ సైన్యం ఆగడాల కారణంగా తండ్రి అదృశ్యం కావటం, చాన్నాళ్ల తర్వాత ఛిద్రమైన ఆయన మృతదేహం లభ్యం కావటం ఆమె పట్టుదలను మరింత పెంచాయి. నిరుడు ఆగస్టులో డాక్టర్ మెహ్రాంగ్ గ్వాదర్‌లో తలపెట్టిన ర్యాలీయే దీనికి రుజువు. సైన్యం ఎన్ని అడ్డంకులు కల్పించినా అది విజయవంతమైంది. శాంతియుతంగా జరిగిన ఆ ర్యాలీలో పాల్గొన్నారన్న కక్షతో డజన్లకొద్దీమందిని అరెస్టు చేస్తే దానికి నిరసనగా 12 రోజుల పాటు ధర్నా సాగించి వారిని విడిపించుకున్న చరిత్ర బీవైసీది. అణచివేత ధిక్కారానికి దారి తీస్తుంది. దాన్ని ఉపేక్షిస్తే తిరుగుబాటుకు బాటలు పరుస్తుంది. ప్రజల మౌలిక ఆకాంక్షలను బేఖాతరు చేస్తే ఎంత శక్తిమంతమైన రాజ్యానికైనా భంగపాటు తప్పదు. బలూచిస్తాన్ ప్రజలు దాన్నే చాటుతున్నారు.

మనోభావాల మందుపాతర?

విశ్లేషణ



ఎన్. వేణుగోపాల్


ఒక కార్టూన్ ప్రకటించడం రాజ్యాంగబద్ధమైన భావప్రకటనా స్వేచ్ఛలో భాగం అవునా కాదా నిర్ధారించుకోవడానికి ఒక పత్రిక ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసిన దుస్థితికి చేరింది మన సమాజం. ఇవాళ దేశంలో కార్టూన్ అనే అతి సాధారణ సృజనాత్మక ప్రక్రియ మనోభావాల మందుపాతరగా మారిపోయింది. ఒక కార్టూన్ వల్ల భారత సార్వభౌమత్వానికీ, సమగ్రతకూ, పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలకూ ముప్పు వాటిల్లుతున్నదనీ మద్రాసు హైకోర్టు ముందర కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది.

ఇంతకూ ఏమిటా కార్టూన్? అమెరికా ప్రభుత్వం తన దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించారని, లేదా చట్టవిరుద్ధంగా ఉంటున్నారని 300కు పైగా భారతీయ పౌరులను పట్టుకుని, ఫిబ్రవరిలో మూడు విడతలుగా వెనక్కి పంపించింది. ఆ దేశపు చట్టాల ప్రకారం అది సాధారణమే కావచ్చు. వారు తమ దేశంలో ప్రవేశించిన నేరం చేసినందుకు దేశం నుంచి వెళ్లగొట్టడం అనే శిక్ష వేశారు, సరిపోయింది. ఒకే నేరానికి రెండు, మూడు శిక్షలు వేయడం సహజ న్యాయానికి వ్యతిరేకం. కానీ వారికి రెండో శిక్షగా చేతులకూ కాళ్లకూ సంకెళ్లు వేశారు. మూడో శిక్షగా వారిని జంతువుల్లా, సరుకుల్లా చూసి యుద్ధవిమానాల్లో రవాణా చేశారు. ఇది తప్పనిసరిగా భారత ప్రజలకు జరిగిన అవమానం, నేరాన్ని మించి శిక్ష విధించడం. భారత ప్రభుత్వంలో అత్యున్నతాధికారం నెరపుతున్న వ్యక్తిగా ప్రధాన మంత్రి తన సాటి పౌరులకు జరిగిన ఈ అవమానం గురించి, విపరీత శిక్షల గురించి ఆ శిక్షలు విధించిన దేశాధ్యక్షుడితో సమావేశంలో కనీసం మాట మాత్రం ప్రస్తావించకపోవడం, నిరసన తెలపకపోవడం ఎవరినైనా ఆలోచింపజేస్తుంది. అలా అవతలివైపు వ్యంగ్య ఆలోచనకు చిత్రరూపమైన కార్టూన్‌ను సుప్రసిద్ధ తమిళ పత్రిక 'ఆనంద వికటన్'కు చెందిన వికటన్ ప్లస్ వెబ్‌సైట్ ఫిబ్రవరి 10 సంచిక ముఖచిత్రంగా ప్రచురించింది. అందులో అమెరికా అధ్యక్షుడి ముందు భారత ప్రధాని చేతులకూ కాళ్లకూ సంకెళ్లతో కూచుని ఉన్నట్టు చిత్రించారు. దాని మీద తమిళనాడు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకుల ఫిర్యాదు మేరకు, వెంటనే కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆనంద వికటన్ వెబ్‌సైట్‌ను మూసివేసింది.

తర్వాత 'ఆనంద వికటన్' పిటిషన్‌పై విచారణ జరుపుతున్న మద్రాసు హైకోర్టు ఇప్పటికైతే, మధ్యంతర ఉత్తర్వులలో వెబ్‌సైట్‌ను మూసివేయగూడదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తుదితీర్పు వచ్చే దాక కార్టూన్‌ను ఉపసంహరించాలని ఆనంద వికటన్‌కు సూచించింది.

ఇట్టే పడే దృష్టి!

ఏదైనా పత్రిక చూస్తున్నప్పుడు పాఠకుల దృష్టి సహజంగా కార్టూన్ మీదికి పోతుంది. మిగిలిన వార్తలన్నీ నిండా అలుక్కుపోయి ఉండగా, కార్టూన్ స్థలం సింగిల్ కాలం అయినా, రెండు కాలాలో మూడు కాలాలో అయినా, ఆ రేఖలూ, రేఖల మధ్య ఖాళీలూ, బాగా తెలిసిన ముఖాలే కాస్త వక్రంగా మారి ఉండటమూ, ఒకటో రెండో హాస్య, వ్యంగ్య, వెటకార పూరితమైన వాక్యాల వ్యాఖ్యలూ తప్పనిసరిగా పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి. కార్టూన్ ప్రక్రియ ఎంతో ఆదరణ చూరగొన్నదీ, గౌరవనీయమైనదీ మాత్రమే కాక కనీసం రెండు వందల సంవత్సరాల చరిత్ర ఉన్నది. పందొమ్మిదో శతాబ్దపు మధ్య భాగంలో 'పంచ్' పత్రికలో రాజకీయ కార్టూన్లు ప్రారంభమయ్యాయంటారు. రాజకీయ నాయకులే నిర్ణేతలుగా, ప్రముఖులుగా, అందరికీ తెలిసినవారుగా ఉన్న సమాజంలో వారే కార్టూన్‌కు ప్రధాన వస్తువు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. అలాగే రాజకీయ ఘటనల ప్రభావం సమాజంలో ప్రతి ఒక్కరి మీద ఉంటుంది గనుక, ఆ ఘటనల అవతలి కోణం మీద ప్రజలకు ఆసక్తి ఉంటుంది గనుక సహజంగానే వాటి మీద వ్యంగ్యపు, వెటకారపు వ్యాఖ్యానం బహుళ జనాదరణ పొందుతుంది.



'ఆనంద వికటన్' లోగో

'శంకర్స్ వీక్లీ' కార్టూన్ (1970 జులై 5)

◆ రాజకీయ నాయకులే నిర్ణేతలుగా, ప్రముఖులుగా, అందరికీ తెలిసినవారుగా ఉన్న సమాజంలో వారే కార్టూన్‌కు ప్రధాన వస్తువు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు.

◆ అక్రమ వలసదారులను అమెరికా సంకెళ్లతో తిప్పి పంపిన నేపథ్యంలో– తమిళ పత్రిక 'ఆనంద వికటన్'లో అమెరికా అధ్యక్షుడి ముందు భారత ప్రధాని చేతులకూ కాళ్లకూ సంకెళ్లతో కూచుని ఉన్నట్టు చిత్రించారు. తమిళనాడు బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 'ఆనంద వికటన్' వెబ్‌సైట్‌ను మూసివేసింది.

ఒక ప్రక్రియగా కార్టూన్ ఎంత విశాలమైనదీ, లోతైనదీ, ఆకర్షణీయమైనదీ, ఆమోదయోగ్యమైనదీ అంటే ఆ కార్టూన్‌లో వెటకారానికి గురైన రాజకీయ నాయకులకు కూడా అది నవ్వు పుట్టిస్తుంది. అది తమను నొప్పించిందనో, వెటకరించిందనో, తమ మీద వ్యంగ్య వ్యాఖ్య చేసిందనో నొచ్చుకునే సందర్భంలో అయినా ఆ బాధిత వ్యక్తులు కూడా నవ్వుకునే గొప్ప కళ కార్టూన్. అసలు తనమీద వచ్చిన పరిహాసాన్ని ఆమోదించడం, తన పనిమీద వ్యంగ్య వ్యాఖ్యకు అవకాశం ఇవ్వడం ఆ వ్యక్తి విశాల హృదయానికి, సౌమనస్యానికి సంకేతాలు.

వ్యంగ్యాన్ని స్వీకరించలేక...

అందువల్లనే కార్టూన్ల, హాస్య, వ్యంగ్య రచనల వారపత్రికగా వెలువడుతుండిన 'శంకర్స్ వీక్లీ'ని అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆదరించాడు. అసలు శంకర్స్ వీక్లీ పుట్టుక కథే చిత్రమైనది. అప్పటికి 'హిందుస్థాన్ టైమ్స్'లో కార్టూనిస్టుగా ఉండిన శంకర్ పిళ్లై అప్పటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి మీద విపరీతంగా కార్టూన్లు వేస్తుండగా అవి ఆపమని సంపాదకుడు దేవదాస్ గాంధీ ఆదేశించాడు. దానితో విభేదించి బైటికి వచ్చిన శంకర్ తన సొంత పత్రికగా 1948లో 'శంకర్స్ వీక్లీ' పెట్టాడు. ''మౌలికంగా వ్యవస్థా (ప్రభుత్వ) వ్యతిరేక పత్రిక'' అని శంకర్ చెప్పుకున్నప్పటికీ, పత్రికను ప్రధానమంత్రి నెహ్రూనే ఆవిష్కరించాడు. ఆ పత్రికలో తన మీద, తన మంత్రివర్గం మీద, తన ప్రభుత్వపు చర్యల మీద శంకర్, ఇతర కార్టూనిస్టులు వేసిన కార్టూన్ల లోని హాస్యాన్నీ వ్యంగ్యాన్నీ నెహ్రూ అభినందించాడు. ఇరవై ఏడు సంవత్సరాలు నిరాటంకంగా నడిచిన 'శంకర్స్ వీక్లీ' ఎమర్జెన్సీ విధించాక ఆరు వారాలకు ఆగిపోయింది. ఎమర్జెన్సీకీ పత్రిక ఆగిపోవడానికీ సంబంధం లేదని శంకర్ అన్నాడు. ఆ పత్రిక చూడటం తనకు చాలా అలవాటనీ, అది చూడకపోతే కొరతగా ఉంటుందనీ ఇందిరా గాంధీ కూడా అంది. కానీ మొత్తానికి పత్రిక ఆగిపోయింది.

తర్వాతి కాలంలో శంకర్స్ వీక్లీలా పూర్తిగా కార్టూన్లకూ, హాస్య, వ్యంగ్య రచనలకూ అంకితమైన పత్రికే లేకుండా పోయింది. బహుశా మన సమాజంలో హాస్య చతురత, హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ ఆమోదించే విశాల హృదయాలు కుంచించుకుపోవడం మొదలయిందేమో!

'శంకర్స్ వీక్లీ'లోనే ప్రారంభమైన ఆర్.కె. లక్ష్మణ్, ఒ.వి. విజయన్, ఇ.పి.ఉన్ని, రాజిందర్ పూరీ, కుట్టి, బాల్ థాకరే, యేసుదాసన్ వంటి ఎందరో రాజకీయ కార్టూనిస్టులు నాలుగు దశాబ్దాలు భారత రాజకీయ కార్టూన్ రంగాన్ని వెలిగించారు. తెలుగులో కూడా ఎందరో రాజకీయ కార్టూనిస్టులు ఎందరెందరో నాయకుల మాటలనూ, హావభావాలనూ, పనులనూ తరతరాలు నవ్వుకునేంత హాస్య, వ్యంగ్య దృష్టితో చిత్రించారు.

ఆ మహోజ్వల చరిత్ర గల కార్టూన్ కళకు ఇప్పుడు కాని కాలం దాపురించినట్టే ఉంది. పూర్తిగా కార్టూన్లకు, హాస్య, వ్యంగ్య రచనలకు అంకితమైన పత్రికలు లేవు. పత్రికల్లో ప్రతిరోజూ కార్టూన్ కనబడటం లేదు. సింగిల్ కాలం పాకెట్ కార్టూన్ మొక్కుబడి వ్యవహారమైపోయింది. కార్టూన్ స్ట్రిప్‌లు ఖాళీ నింపే ఆరో వేలు అయిపోయాయి. అన్నిటికన్నా ముఖ్యం రాజకీయ కార్టూన్ ఏ రాజకీయ నాయకుడి మనసు నొప్పిస్తుందో, ఏ నాయకుడి భక్తుల మనోభావాలను, ఏ మత, కుల, ప్రాంత, భాషా సమూహపు మనోభావాలను గాయపరుస్తుందో, ఆచితూచి అడుగువేయవలసిన మందుపాతరల క్షేత్రంగా మారిపోయింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

ప్రతీకార చర్య



అఫ్గానిస్తాన్‌లోని మా వాళ్లు చెబుతున్నదేమంటే, అఫ్గానిస్తాన్‌లోని నాయకులను లక్ష్యం చేసుకున్నందుకు ప్రతీకారమే బెలూచిస్తాన్ రైలు హైజాక్. ఎందుకంటే, చాలామంది క్షేత్ర స్థాయి బెలూచ్ నాయకులు అఫ్గానిస్తాన్‌లో ఉంటున్నారు. కొంత 'ప్రతిఘటన' ఏదో చూపాలనుకుంటున్నారు.

– అభిజిత్ అయ్యర్ మిత్ర, వ్యాఖ్యాత

రెండు దెబ్బలు



వృద్ధులకు రెండు రకాల దెబ్బ. మొదటిది – కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసినట్టుగా ఆరోగ్య బీమా మీద 18 శాతం జీఎస్టీని తొలగించలేదు. పైగా కిస్తీని ఈ ఏడాది నుంచి 10 శాతం పెంచారు.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

రిటైర్ కావాలంటే...



సొంతిల్లు, అదనంగా ఓ ఐదుకోట్ల రూపాయల విలువైన ఆస్తి లేకుండా ఇండియాలో రిటైర్ అవ్వడానికి లేదు. ఇది కేవలం మధ్యతరగతిగా బతకడానికి! అదే కొంచెం విలాసంగా జీవించాలంటే 20 కోట్లయినా ఉండాలి.

– సౌరవ్ దత్తా, ఫైనాన్షియల్ అడ్వైజర్

చెప్పేందుకు మాత్రమే...



నాకు విచిత్రంగా కనిపించేది ఏమంటే, భిన్నత్వమే మన గొప్ప బలం అని చెప్పేవాళ్లంతా, భిన్న సమూహాల మధ్య తేడాలు ఉంటాయని సూచించినప్పుడు భయంతో వెనక్కిపోతారు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

వద్దు బలవంతం



హోలీ దాదాపు దగ్గరికి వచ్చేసింది. మీ ఉద్దేశాలు ఏవైనా ఏ మహిళనూ హోలీ ఆడమని బలవంత పెట్టకండి.

– సుఖద, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఆటలు లేని బాల్యమా?

ప్రపంచీకరణతో మన దేశానికి ఏస్థాయిలో మేలు జరిగిందో అదే స్థాయిలో కీడూ జరుగుతోంది. ఇప్పటి వరకూ పాశ్చాత్యదేశాలను మాత్రమే పట్టి పీడిస్తూ వచ్చిన అధిక బరువు, ఊబకాయం లాంటి సమస్య అభివృద్ధి చెందుతున్న భారత్‌కు సైతం తలనొప్పిగా మారింది. ప్రధానంగా చిన్నారులలో అధిక బరువు, ఊబకాయాలు... ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీయడం ఆందోళన కలిగిస్తోంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనూహ్యంగా మార్పులకు లోనుకావటం, ఆడుకునే అవకాశం లేకపోవడం పిల్లల ఈ స్థితికి కారణమని నిపుణులు అంటున్నారు.

పాఠశాల స్థాయి నుంచే ఆటలకు దూరమవుతున్న చిన్నారులు టీవీలకు, సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారు. బాల్యంలో ఓ ప్రధాన భాగమైన సంప్రదాయ (కోతి కొమ్మచ్చి, తొక్కుడు బిళ్ల, కర్రాబిళ్ళా, బెచ్చాలు, గోళీ లాంటి) ఆటలకు సైతం నోచుకోలేక పోతున్నారు.



విద్యారంగంలో ప్రభుత్వ భాగస్వామ్యం తగ్గి ప్రైవేటు భాగస్వామ్యం రాను రాను పెరిగిపోవడంతో ఆటలు అటకెక్కాయి. చదువే ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. విద్య ప్రభుత్వ బాధ్యతగా ఉన్నంతకాలం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో క్రీడలకు తగిన సదుపాయాలు ఉండేవి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలకు సువిశాలమైన ఆటస్థలాలతో పాటు తగిన సంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయులు సైతం ఉండటం ఒకప్పుడు సాధారణ విషయమైతే ఇప్పుడు అసాధారణ విషయంగా మారిపోయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల లోని పలు నగరాలలో సింగిల్ బెడ్ రూమ్ పాఠశాలలు, డబుల్ బెడ్ రూమ్ కళాశాలలు మనకు ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సదుపాయాలు, మైదానాలు మచ్చుకైనా కనిపించవు. ఇలాంటి విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ఆటలంటే ఏమిటో తెలియకుండా అమూల్యమైన తమ బాల్యాన్నీ, విద్యార్థి దశనూ ముగించడాన్ని మించిన విషాదం మరొకటి లేదు.

పాఠశాల దశ నుంచే ఆటలకు, క్రీడాసంస్కృతికి దూరమైన చిన్నారులు ఆ తరువాతి కాలంలో శారీరకంగా, మానసికంగా పలు రకాల సమస్యలను ఎదుర్కొనాల్సి వస్తోంది. మన దేశంలో ఈమధ్య కాలంలో నిర్వహించిన పలు అధ్యయనాల ప్రకారం ఆటపాటలకు దూరమైన చిన్నారులు అధిక బరువుతో పాటు ఫ్యాటీ లివర్ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్) వ్యాధి బారిన పడుతున్నట్లు తేలింది. పిల్లలు బాల్యంలో ఆటలకు దూరంకావడం అంటే శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు దూరంకావటమేనని నిపుణులు చెబుతున్నారు.

దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా అధ్యయనాల ప్రకారం దేశ జనాభాలో 60 శాతం మంది అధిక బరువు సమస్య ఎదుర్కొంటుంటే... అందులో 30 శాతం మంది ఊబకాయం సమస్యతో నానాపాట్లు పడుతున్నారు. బాలల్లో 40 శాతం మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఛైర్మన్ డా॥ నాగేశ్వర రెడ్డి సైతం హెచ్చరిస్తున్నారు.

తమ పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో బాల్యంలో ఆటలూ అంతే ముఖ్యమని తల్లిదండ్రులూ... ఆరోగ్యవంతమైన, ఆహ్లాదభరితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తమపైనే ఉందని పాలకులూ, పాఠశాలల యాజమాన్యాలు గ్రహించిన రోజే బాల్యం అమూల్యంగా, అపురూపంగా మిగిలిపోగలుగుతుంది.

– కృష్ణారావు చొప్పరపు
సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ । 84668 64969

హిందీ వ్యతిరేకత ఎందుకు?

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

మత, భాష, ప్రాంతీయ ఉన్మాదాలు భారతదేశ సమగ్రతకు, సమైక్యతకు గొడ్డలి పెట్టు అనే విషయంలో దేశ హితాన్ని కోరే అందరి వ్యక్తుల అభిప్రాయం ఒకే విధంగా ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీ భాషపై అవాకులు చవాకులు పేలడం దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. 'త్రిభాషా సూత్రం' అమలులో భాగంగా హిందీనీ విద్యాలయాల్లో బోధించడాన్ని వ్యతిరేకించడం తమిళ రాజకీయాలలో ఒక భాగమే. దేశంలో తెలివైన విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి, విద్యార్థుల్లో 'ఈ దేశం నాది' అనే భావనను నిర్మాణం చేయడానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో 'నవోదయ' విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలు తమిళనాడుకు అవసరం లేదని ద్రవిడ పార్టీల నాయకులు అడ్డుకున్నారు. ఆ పాఠశాలల్లో హిందీని ఒక భాషగా బోధించడమే ఇందుకు కారణం. 'సర్వ శిక్షా అభియాన్' నిధులను తమిళనాడు రాష్ట్రానికి ఇవ్వడం విషయంలో కేంద్రానికి–రాష్ట్రానికి మధ్య చోటుచేసుకున్న వివాదం కారణంగా త్రిభాషా సూత్రం తమిళనాడు రాష్ట్రంలో అమలు చేయడం వీలు కాదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ బహిరంగ ప్రకటన చేయడంతో త్రిభాషా సూత్రం అమలు విషయంపై రాద్ధాంతం మళ్లీ తెరపైకి వచ్చింది.



దక్షిణ భారతంలో ఉన్న ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఈ విషయంపై అభ్యంతరాలు లేవు. త్రిభాషా సూత్రం అమలులో భాగంగా దక్షిణాదిలో రాష్ట్ర భాష, ఇంగ్లీషు, హిందీ బోధించేటట్లు; ఉత్తరాదిలో హిందీ, ఇంగ్లీషు, ఏదైనా దక్షిణాది రాష్ట్రాల భాష (తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం ఏదో ఒకటి) బోధించేటట్లు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఏకాభిప్రాయంతో నాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే తమిళులు దీన్ని వ్యతిరేకించారు. తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం ఈనాటిది కాదు. 1937లో 'ద్రావిడార్ కళగం' పేరుతో ఈవీ రామస్వామి తమిళ ప్రజలను రెచ్చగొట్టి, 'ఉత్తరాది వారి భాష హిందీ మనకెందు'కంటూ, తమిళ ప్రజల్లో హిందీ భాషపై ద్వేషాన్ని నూరి పోశారు. తమిళనాడులోని జస్టిస్ పార్టీ కూడా ఈ హిందీ వ్యతిరేక ఉద్యమానికి అండగా నిలిచింది. అగ్నికి ఆజ్యం పోసింది. ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో అప్పటి రాజగోపాలాచారి నేతృత్వంలోని మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వం రాజీనామా చేయడంతో ఉద్యమం చల్లారింది. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఇంగ్లీషు స్థానంలో హిందీని జాతీయ భాషగా ప్రవేశపెట్టాలని ఆలోచించడంతో 1965లో 'ద తమిళనాడు స్టూడెంట్స్ యాంటీ హిందీ యాజిటేషన్ కౌన్సిల్' పేరుతో తమిళ నాయకులు పెద్ద ఎత్తున హింసాత్మక ఉద్యమాన్ని లేవదీశారు. ఉద్యమాన్ని అణచడానికి పారా మిలటరీ దళం రంగ ప్రవేశం చేయడంతో 500 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. నాటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి బలవంతంగా హిందీని తమిళ ప్రజలపై రుద్దే అవకాశం లేదని ప్రకటించడంతో ఉద్యమం ఆగిపోయింది.


ఈ ఉద్యమ ప్రభావంతో 1967 ఎన్నికల్లో తమిళనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ఉత్తరాది ప్రజలు ఆర్య సంస్కృతికి చెందిన వారనీ, వారి భాష హిందీ అనీ, ఆ భాషను మాట్లాడటం తమిళుల ఆత్మగౌరవానికి భంగం అనే భావనను తమిళ ప్రజల మనసులో బాగా చొప్పించారు బ్రిటిష్ పాలకులు. పాశ్చాత్య కోణంలో హిందూ సంస్కృతిని దునుమాడడమే ధ్యేయంగా పెట్టుకున్న ఈవీ రామ స్వామి బ్రిటిష్ పాలకులకు ఒక పనిముట్టుగా దొరికారు. ఆయన ప్రియ శిష్యుడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శ్రీరామునిపై, రామాయణంపై దుర్వ్యాఖ్యలు చేయడం, ఆయన మనుమడు ఉదయనిధి ఒక మంత్రి హోదాలో సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా లాంటిదని మాట్లాడటం బ్రిటిష్ వాళ్ళు నూరి పోసిన ఆర్య ద్రావిడ వాద ప్రభావమే! తమిళులే హిందీని వ్యతిరేకించడం వెనుక దాగి ఉన్న రహస్యం ఇదే!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ముందే మేల్కొనాలి!

ఎవరైతే జీవిత ప్రాముఖ్యాన్నీ, దాని ప్రయోజనాన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించరో... అటువంటివారు తమ జీవితాన్ని వృథా చేసుకొంటారు. చాలామంది తాము ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, వృత్తులపైనా; బంధువులు, స్నేహితులు, విలాసాలపైనా మనసును నిమగ్నం చేసి జీవితాన్ని గడుపుతూ ఉంటారు. అటువంటివారు దురదృష్టవంతులు. ఎందుకంటే... వారు పైపై ప్రాపంచిక విషయాల వల్ల సంతోషాన్ని పొందుతూ, విషయ వాంఛల్లో మునిగిపోతూ ఉంటారు. జీవితంలో ఏ సంఘటన కూడా అటువంటి వారి హృదయాన్ని చలింపజేయదు. ఆ విధంగా ఎంత కాలం మోటుగా జీవితం సాగించగలరు?

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

పరాత్పరుడే వారిని ఏదో ఒకరోజు తన వైపు మళ్ళించుకుంటాడు. ముందుగా ప్రతికూలత, నిరాశ, నిస్పృహలు వారిని చుట్టు ముడతాయి. అందువలన వారికి అతీతమైన ఏదో ఒక శక్తి వారి ఊహలను తారుమారు చేస్తూ ఉన్నట్లు తెలుసుకుంటారు. అప్పుడు వారు నెమ్మదిగా దేవాలయాలకు, గురువు దగ్గరికి వెళ్ళడం, సంప్రదాయంగా పూజించడం ప్రారంభిస్తారు. చివరగా వారు జీవితం ఎందుకు వచ్చింది, దానికి గల ప్రయోజనం ఏమిటి అని ఆలోచిస్తారు.

దుఃఖం, నిరాశ కలిగే వరకూ వేచివుండి, దేవుని శరణు జొచ్చుట తెలివిగలవారు చేసే పనేనా? మరణం సంభవించే వరకూ నిరీక్షిస్తూ, మందబుద్ధితో ఉండటమా? దీని గురించి సుదీర్ఘంగా ఆలోచించాలి. నీకు జీవితం ఎందుకు వచ్చిందంటూ విచారిస్తూ (ఆలోచిస్తూ) కాలం వృథా చేయకూడదు. అంటే ఈ విషయాన్ని త్వరగా తెలుసుకొని, జీవితాన్ని సఫలం చేసుకోవాలి.

ఉపన్యాసాల కన్నా, రాతల కన్నా శక్తిమంతమైనది ధ్యానశక్తి. ఉపన్యాసాలు, పుస్తకాలు స్వల్ప ప్రయోజనం కలిగిస్తాయి. ప్రారంభ దశలో ఉన్నవారికి అవి మార్గాన్ని చూపించడానికి ఉపయోగపడతాయి. ఆధ్యాత్మిక విషయాలలో అవి మీ ఆసక్తిని పెంపొందించినా పెంపొందించవచ్చు. మెదడుకు మేత పెట్టవచ్చు. బుద్ధికి ప్రోత్సాహాన్ని కలిగించవచ్చు. కాని అవి 'ఆత్మజ్యోతి'ని చూపించలేవు. ఇటువంటి దర్శనానికై మనస్సు ఆత్మను అంటిపెట్టుకొని ఉండాలి. ఈ విషయంలో సద్గురువు నిర్దేశంలో ధ్యానం చేయడమే మార్గం.

నీవు దేనిని గూర్చి అన్వేషిస్తున్నావో, అది నీ లోపలే ఉంది. పుస్తకాలన్నీ బాహ్య ప్రపంచంలో ఉన్నాయి. ధ్యానంలోనే నిజమైన కార్యం జరిగిపోతుంది. 'ఆత్మపై లక్ష్యమును ఉంచి ధ్యానం చెయ్యి' అని భగవద్గీత కూడా ప్రబోధిస్తోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.10.20 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పుబ్బ తె.5.40 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.12.39 నుండి 2.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.12 నుండి 11.00 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** రా.10.56 నుండి 12.39 వరకు, హోలి పండుగ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 6.05.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

యాదగిరిగుట్టలో నిత్యకల్యాణం పునఃప్రారంభం



ఆలయంలో నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో బుధవారం సుదర్శన హోమం, నిత్యకల్యాణం, గజ వాహన సేవను ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆలయంలో శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. దీంతో 11 రోజుల పాటు సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవ పూజలను ఆలయ అధికారులు రద్దు చేశారు. మంగళవారం బ్రహ్మోత్సవాలు ముగియడంతో బుధవారం నుంచి నిత్య పూజలను ఆచార్యులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం
(బీమా వైద్య సేవలు)
మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఈఎస్ఐ ఆసుపత్రి, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా.

Rc.No. 235/ESI/HI/RCP/SRD/Referral/2025 ప్రకటన తేది: 11-03-2025

15% తగ్గింపు, ఎంత తగ్గింపు వస్తే అంత తగ్గింపుతోపాటు CGHS రేటు రాష్ట్ర ప్రభుత్వ రేటు ఆసుపత్రి రేటు ప్రకారం ఈఎస్ఐ ఆసుపత్రి, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా యొక్క ఈఎస్ఐ లబ్ధిదారులకు సూపర్ స్పెషాలిటీ వైద్య మరియు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించుటకుగాను సవరించిన రిఫరల్ పాలసీలోని పాయింట్ (17.1) ప్రకారం 1) కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ/PSU/ప్రభుత్వ రంగ ఆసుపత్రులు, 2) PMJAY ఎంప్యానల్డ్ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ/PSU/ ప్రభుత్వ రంగ ఆసుపత్రులు, 3) CGHS ఎంప్యానల్డ్ ఆసుపత్రులు/ ఇన్‌స్టిట్యూషన్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తులు ఈ కార్యాలయానికి 28-03-2025న లేదా అలోగా (సమయం-సా.5.00 గం.) చేరవిధంగా పంపాలి. చిరునామా: మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఈఎస్ఐ ఆసుపత్రి, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా, మెయిల్ అడ్రస్: medicalsuperintendentrcp@gmail.com

DIPR RO No.11381-PP/CL/Advt/1/2024-25, Dt.12-03-2025 సం/- మెడికల్ సూపరింటెండెంట్

టన్నెల్‌లో రోబోలతో రెస్క్యూ షురూ

- గంటకు వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టి, బురద తొలగింపునకు అవకాశం



సొరంగం లోపలకు వెళుతున్న ఆటోమేటెడ్ స్లడ్జ్ రిమూవల్ రోబో

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాద స్థలం వద్ద మట్టి, శిథిలాలు, బురద తొలగింపునకు రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది. బుధవారం ఉదయం అన్వి రోబోటిక్స్‌కు చెందిన నిపుణులు ఆటోమేటెడ్ స్లడ్జ్ రిమూవల్ రోబోను సొరంగం లోపలకు తీసుకెళ్లారు. రాళ్లను క్రష్ చేసి తొలగించేందుకు ఒక రోబో, మట్టిని తొలగించేందుకు మరో రోబో, బురదను తొలగించేందుకు ఒకటి చొప్పున మూడు రకాల రోబోల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. ఆటోమేటెడ్ స్లడ్జ్ రిమూవల్ రోబో సొరంగంలో పనులు మొదలుపెట్టింది. పూర్తిగా ఉక్కుతో తయారైన ఈ రోబోట్ హైడ్రాలిక్ వ్యవస్థతో పనిచేస్తుంది. ఈ రోబోకు ముందుభాగంలో ఉన్న గ్రైండర్ సహాయంతో పెద్ద రాళ్లు, శిథిలాలను కట్ చేస్తూ ముక్కలుగా చేయడంతోపాటు బురదను వ్యాక్యూమ్ సక్కర్ ద్వారా తొలగించి నేరుగా కన్వేయర్ బెల్టుపై వేస్తుంది. గంటకు వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టి, బురదను తొలగిస్తుందని చెబుతున్నారు. ప్రమాద స్థలంలో ఏఐ ఆధారిత రోబో సాయంతో తవ్వకాలు, మట్టి తొలగింపు చేపడుతుండగా, 100 మీటర్ల దూరం నుంచి రిమోట్ ఆపరేటింగ్ ద్వారా రోబోలను పర్యవేక్షించనున్నారు. సొరంగం ఇన్‌లెట్ వద్ద ఉండే మాస్టర్ రోబో మిగతా రోబోలతో కమ్యూనికేట్ చేస్తుంది. ఆల్ఇండియా రోబోటిక్ అసోసియేషన్ ఈ ఆపరేషన్‌కు సహకారం అందిస్తోంది.

చివరి 20 మీటర్ల వద్ద తవ్వకాలు

సొరంగంలో ప్రమాదం చోటుచేసుకున్న 13.85 కి.మీ. పాయింట్ వద్ద చివరి 20 మీటర్ల స్థలంలో సొరంగం పైకప్పు వదులుగా ఉండటంతో మళ్లీ కూలే అవకాశాలు ఉన్నాయని, అక్కడ పనిచేసే రెస్క్యూ బృందాలకు సైతం ప్రమాదకరమని జియోలాజికల్ సర్వే అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చివరి 20 మీటర్ల ప్రదేశంలో రోబోల ద్వారా రెస్క్యూ చేపడుతున్నారు. ప్రమాదస్థలంలో కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2, డీ1 పాయింట్ల మధ్య ట్రెంచ్ తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడే టీబీఎం మధ్య భాగంలో ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఆ స్థలంలోనే మిగతా కార్మికులు ఉంటారని భావిస్తున్నారు. ఆ ప్రాంతమంతా పూర్తిగా మట్టి, శిథిలాలతో కూరుకుపోయి ఉంది. మట్టి, బురద, శిథిలాలను తొలగిస్తేనే కార్మికుల జాడ తెలిసే అవకాశముంది.

పైకప్పు రక్షణకు టైగర్ టింబర్ కాగ్స్

టన్నెల్‌లో ప్రమాదం జరిగిన చోట చివరి 20 మీటర్ల స్థలంలో తవ్వకాలు జరిపితే మళ్లీ పైకప్పు కుప్పకూలే అవకాశముంది. దీనివల్ల రెస్క్యూ బృందాలకు కూడా ప్రమాదం పొంచి ఉంది. పై కప్పు నుంచి రక్షణకు సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో టైగర్ కాగ్స్ టింబర్ సపోర్టును వినియోగిస్తున్నారు. ఇప్పటికే ప్రమాదకర ప్రాంతంలో మూడు టింబర్ వుడెన్ కాగ్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి కనీసం 40 టన్నుల బరువును ఆపగలుగుతుందని చెబుతున్నారు. అంతకు మించి బరువు పెరుగుతూ సొరంగం పైకప్పు కుంగితే వుడెన్ కాగ్స్ వంగుతాయి. దీంతో వెంటనే రెస్క్యూ బృందాలు అప్రమత్తమై అక్కడి నుంచి దూరం వెళ్లొచ్చు.

గిరిజన వర్సిటీ వీసీకి సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీ వీసీగా నియమితులైన వైఐ శ్రీనివాస్‌కు సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఫోన్ చేసి అభినందించారు. గిరిజన విద్యార్థుల్లో విద్య, నైపుణ్యం పెంపొందించేలా వర్సిటీని తీర్చిదిద్దాలని సూచించారు. అన్ని విధాలుగా సహాయం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

హైదరాబాద్ చేరుకున్న సైబర్ కేఫే బందీలు



కుటుంబ సభ్యులతో మధుకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉపాధి కోసం విదేశాలకు పోయి, సైబర్ కేఫేలో బందీలుగా చిక్కుకుపోయిన 540 మంది భారతీయులు మంగళవారం ఢిల్లీకి చేరుకోగా, వారిలో బుధవారం రాత్రి తెలంగాణకు చెందిన 24 మంది బాధితులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వారికి సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతలను ఢిల్లీలోని తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కు అప్పగించారు. వారిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. దీంతో వారి బంధువులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే అధికారులు రెగ్యులర్ ఎగ్జిట్ నుంచి కాకుండా రహస్య ప్రాంతానికి తరలించి వారి నుంచి వివరాలు, స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు సమాచారం. దీంతో ఆందోళనకు గురైన బంధువులు పోలీసులను ఆశ్రయించగా, బాధితుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న తర్వాత పంపిస్తామని చెప్పటంతో ఊపిరి పీల్చుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు తెలంగాణకు చేరుకున్న 24 మంది బాధితుల గురించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరా తీసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల పేరిట అక్రమ రవాణా చేయడానికి కారణమైన వారిని గుర్తించడానికి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, విచారణ అనంతరం మధుకర్‌రెడ్డిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

జగిత్యాలలో వెలుగుచూసిన మరో మోసం

సైబర్ కేఫేలో చిక్కుకొని బయటపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదైంది. జగిత్యాల జిల్లా ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేశ్ విదేశాల్లో ఉద్యోగం చేసేందుకు మల్లికార్జున మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీని సంప్రదించాడు. నిర్వాహకుడు ఆల్లెపు వెంకటేశ్‌కు ఫోన్‌పే, నగదు రూపంలో 2022లో రూ.3.50 లక్షలు అప్పజెప్పాడు. 2023 ఆగస్టులో రాకేశ్‌ను ఆర్మీనియాకు పంపించాడు. కానీ అక్కడ జాబ్ చూపించకపోవడంతో ఇబ్బందులు పడి, అతి కష్టం మీద నవంబర్ 2023లో స్వదేశానికి చేరుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని వెంకటేశ్‌ను అడగ్గా 2025 జనవరి 12న రాకేశ్‌ను థాయిలాండ్‌కు పంపించాడు. అక్కడ వెంకటేశ్‌కు సంబంధించిన వ్యక్తులు ఒక సైబర్ క్రైమ్ చేసే ముఠాకు అప్పజెప్పారు. ఇతరుల సహాయంతో ఇండియన్ ఎంబసీని సంప్రదించి స్వదేశానికి రాకేశ్ తిరిగి వచ్చాడు. తనను మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఆల్లెపు వెంకటేశ్‌పై జగిత్యాలటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసుదర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ చెప్పారు.

నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంకు నార్నూర్



నార్నూర్ మండల కేంద్రం

నార్నూర్: ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2024లో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం (ఏబీపీ) కేటగిరీలో రెండో రౌండ్‌కు ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ బ్లాక్ ఈనెల 10న ఎంపికైంది. అదేరోజు ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా పాల్గొని.. బ్లాక్‌లో అమలు చేసిన ముఖ్యమైన కార్యక్రమాలను ప్యానెల్‌కు సమర్పించారు. ఈ క్రమంలో పీఎం అవార్డ్స్- 2024 కోసం 426 ఆస్పిరేషనల్ బ్లాక్స్‌లో.. టాప్ 30లో ఒకటిగా నార్నూర్‌ను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 7, 2023న నీతి ఆయోగ్ ఏబీపీ కింద నార్నూర్ ఎంపికైంది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమగ్రత వంటి కీలక రంగాల్లో పనితీరు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంది. జూన్ 2023 నాటికి దక్షిణ భారతదేశంలో డెల్టా ర్యాంకింగ్‌లో నార్నూర్ మొదటి స్థానం దక్కించుకుంది. ఈ క్రమంలో నార్నూర్ బ్లాక్‌కు రూ.కోటి ప్రోత్సాహక నిధి మంజూరైంది. తాజాగా పీఎం అవార్డ్స్-2024 కోసం ఎంపికైంది.

గోరఖ్‌పూర్‌లో జూప్ ఫుట్‌వేర్ స్టోర్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: జూప్ (జెడ్‌యూయూపీ) ఫుట్‌వేర్ స్టోర్‌ను ఈనెల 11న గోరఖ్‌పూర్ మెడికల్ రోడ్ (జైల్ రెస్టారెంట్ ఎదురుగా)లో గ్రాండ్‌గా ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 100కు పైగా జాతీయ, అంతర్జాతీయ ఫుట్‌వేర్ బ్రాండ్‌లను 3 వేలకు పైగా వెరైటీ ఫుట్‌వేర్ కలెక్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ జ్ఞాన్‌చందానీ, పార్థ్ జ్ఞాన్‌చందానీతో పాటు బాలీవుడ్ నటుడు జిమ్మీ షెర్గిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మనోజ్ జ్ఞాన్‌చందానీ మాట్లాడుతూ జూప్ స్టోర్ విజన్ గురించి తెలిపారు. అన్ని రకాల పాదరక్షలకు జూప్ వన్ స్టాప్ సొల్యూషన్ అని పేర్కొన్నారు.

'బిల్లులు చెల్లించమంటే అరెస్టులు'

సాక్షి, హైదరాబాద్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతుంటే.. అరెస్టులు చేస్తున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలున్నాయని.. అర్ధరాత్రి మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రస్తుతం నిర్బంధాలు, అణచివేతలతో పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా సర్పంచ్‌ల బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు.

మటన్ వండలేదని భార్య హత్య

- పరారీలో భర్త



కళావతి

కురవి: మటన్ వండలేదని ఆగ్రహంతో భార్యను భర్త కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు బూరుగుచెట్టు జీపీ పరిధి మాంజాతండాలో జరిగింది. ఎస్సై నగేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాంజాతండాకు చెందిన మాలోత్ బాలు తన భార్య కళావతి(38)ని మంగళవారం రాత్రి 11గంటలకు మటన్ వండలేదని విపరీతంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ క్రమంలో అదే తండాలో ఉన్న మృతురాలి తల్లి ఇస్లావత్ లక్ష్మి బిడ్డ ఇంటికి వెళ్లింది. అక్కడ కూతురు మృతిచెంది కనిపించడంతో బోరున విలపిస్తూ తండాలోని పెద్దలకు విషయం తెలిపింది. వెంటనే తండా పెద్దలు సీరోలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నగేశ్, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నగేష్ తెలిపారు. నిందితుడు బాలు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మందకృష్ణను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నాం

- ప్రకటించిన మొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): మంద కృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నామని మొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులు ప్రకటించారు. 'ఎస్సీ వర్గీకరణలో అనేకమంది నాయకులు ప్రాణత్యాగాలు చేశారు. ఎన్నో కేసుల్లో ఇరుక్కున్నారు. ఇది ఒక్క మంద కృష్ణ ఉద్య మం కాదు. తెలంగాణ, ఏపీలో మాదిగలు ఉద్యమించి సాధించుకున్నారు'అని తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయ కుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి సతీశ్ మాదిగ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగిందింది. నాయకులు మాట్లాడుతూ 'వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చు అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకముందే ప్రభుత్వం అనేక నోటిఫికేషన్లు ఇచ్చింది. వాటికి వర్గీకరణ ఎలా వర్తిస్తుంది? వర్గీకరణ చట్టం చేసిన తర్వాత వచ్చే అన్ని నోటిఫికేషన్లకు అది వర్తిస్తుంది'అని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లలో వర్గీకరణ అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చి ఉద్యోగాలు వచ్చిన వారు కూడా అవకాశాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. సీఎంపై బురద చల్లేందుకు మంద కృష్ణ రిలే నిరాహార దీక్షలతో కొత్త నాటకాలకు తెరలేపారని, ఇదంతా బీజేపీ ఆడిస్తున్న నాటకమని ఆరోపించారు.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names considering the documents and link documents. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
01	MR STANLEY JOSEPH RASHEED & MRS VIRGINIA MARY RASHEED	MR SEAN JOSEPH RASHEED S/O MR STANLEY JOSEPH RASHEED	H.NO.2-4-65/L, KUMMERGUTTA, CHANDULAL BOWLI	SETTLEMENT DEED DOC NO.209 OF 2025 DATED 03.02.2025
02	MR STANLEY JOSEPH RASHEED & MRS VIRGINIA MARY RASHEED	MR SEAN JOSEPH RASHEED S/O MR STANLEY JOSEPH RASHEED	H.NO.2-4-65/FF/SF, KUMMERGUTTA, CHANDULAL BOWLI	SETTLEMENT DEED DOC NO.209 OF 2025 DATED 03.02.2025
03	MR STANLEY JOSEPH RASHEED & MRS VIRGINIA MARY RASHEED	MR GAVIN JOSEPH RASHEED S/O MR STANELY JOSEPH RASHEED	P.NO.15/GF, R & D DEFENCE CHS, SIKH VILLAGE	SETTLEMENT DEED DOC NO.210 OF 2025 DATED 03.02.2025
04	MR STANLEY JOSEPH RASHEED & MRS VIRGINIA MARY RASHEED	MR GAVIN JOSEPH RASHEED S/O MR STANLEY JOSEPH RASHEED	P.NO.15/FF/SF, R & D DEFENCE CHS, SIKH VILLAGE	SETTLEMENT DEED DOC NO.210 OF 2025 DATED 03.02.2025
05	WG CDR H C SINGHAL	MR VENKATRAMAN DHANA SEKAR S/O VENKATRAMAN MRS ABEL LILLY MANOHARI D/O EMMANUEL ABEL	P.NO.1/GF, R & D DEFENCE CHS SIKH VILLAGE	SALE DEED DOC. NO 434/2022 DT 10.03.2022
06			P.NO.1/FF, R & D DEFENCE CHS SIKH VILLAGE	
07	SRI SAMPALLY SUDHEERA	SMT MYAKALA SRILATHA W/O MYAKALA LAXMINARAYAN	P.NO. 5 PADMANABHA CHS , HASMATHPET	SALE DEED DOC NO 1957/2024 DATED 13.11.2024
08	SMT T KALAVATHY	1.SRI T B NAGENDER S/O THAMMALA BHADRAIAH 2 T RAJU S/O THAMMALA BHADRAIAH 3.SRI T MADHU S/O THAMMALA BHADRAIAH	SYNO. 100/GF/FF/SF, BRIG SYED ROAD, BOWENPALLY	DEATH CERTIFICATE OF SMT T L KALAVATHI REGISTERED WILL DEED DOC NO 67/BK-III/2017 DATED 12.06.2017
09	SRI KOTHAWALA RAJENDRA LIGAMASHA & SMT KOTHAWALA SHOBHA RAJENDRA	SMT KANDIVEENA NAVANEETHA W/O KANDIVEENA SAMPATHI NARSIMHULU	F.NO. 303/TF, (SY.NO.129/1) VICEROY RESIDENCY APRTS, THOKATTA VILLAGE	SALE DEED DOC NO 2057/2024 DT 29.11.2024
10	SRI RAMA KANTH EMANI	SRI GANNA VARAPU KRISHNA VAMSY S/O SRI GANNA VARAPU VENKATA RAMANA MURTY	F.NO F-6, KASU APARTMENTS, MANIKESHWARI NAGAR, BOWENPALLY,	SALE DEED DOC.NO. 36/2025 DATED 08.01.2025
11	SRI INDERJIT SINGH	NAKKALA LOKESHWAR RAO S/O LATE N MALLESH	P.NO.13/GF, INDIAN AIRLINES COLONY, BALAMRAI	PARTITION DEED DOC NO 1079/2006 DATED 30.01.2006
12	SMT SAI LAXMI	MRS K SANDHYA W/O SRI K YOGANANDA RAMCHANDER RAO	P.NO.10&11/F-302, SWAMI AYAPPA COLONY	SALE DEED DOC NO 863/2017 DT 28.06.2017
13	SRI N L RUPAREL	SRI JAGGA NARENDAR RAJ S/O LATE JAGGA MUNIRAJ	F.NO. 305/SF, SAI NEELAKANTA TOWERS, RASOOLPURA	SALE DEED DOC NO 1559/2023 DATED 24.08.2023
14	SRI K P MOHAN DAS	SRI CHELLAKKAN JEBAKUMAR S/O CHELLAKKAN	F.NO. 10/GF (3-5-170) CHAITANYA TOWERS BOOSAREDDY GUDA, WEST MAREDPALLY	SALE DEED DOC NO 1982/2023 DATED 07/11.2023
15	SMT M Y YELUBAI	MUSTALA YADAGIRI GOUTHAMI D/O LATE M YADAGIRI	H.NO. 4-8-730/105, ADARSH NAGAR, KALASI GUDA	SETTLEMENT DEED DOC NO 2215/2024 DT 23.12.2024
16	SRI A V SRINIVAS RAO	MS KANDALA UMA D/O SRI K RAJU	P.NO.9/F.NO.102/FF, PRIYA CHS, KAKAGUDA	SALE DEED DOC NO 2123/2024 DATED 07.12.2024
17	SRI P MALLESHWAR RAO	SRI POTHARAJU SRINIVAS RAO S/O LATE P MALLESHWAR RAO	P.NO.28/GF, INDIAN AIRLINES COLONY, BALAMRAI	DEATH CERTIFICATE OF P MALLESHWAR RAO, RELEASE DEED DOC NO 2159/2024 DT 12.12.2024
18	SRI V ASHOK	SMT R SRAWANTHI W/O MR R NAGARAJU	F.NO 203/SF, (3-6-100), SREE BALAJI SREE VIHAR, BOOSAREDDYGUDA, WEST MAREDPALLY	SALE DEED DOC NO 313/2025 DATED 10.02.2025
19	SRI K SRINIVAS	SRI KONDURI MAHIPAL S/O KONDURI RAJAIAH	H.NO. 2-4-30/C/GF, KUMMERGUTTA, CHANDULALBOWLI	SALE DEED DOC NO 1371/2023 DATED 26.07.2023
20	SRI SADA SUDHAKAR REDDY & SADA SUNITHA	SMT ANITHA D/O SRI ANANTHAPPA W/O CHIRRA HANMANTHU	F.NO. 208/SF, SY.NO'S 5,6,7 & 23 VAMSHI KRISHNA ENCLAVE, SIKH VILLAGE	SALE DEED DOC NO. 79/2025 DATED 17.01.2025
21	MOHAMMED SULTAN	MOHAMMAD RUBEENA KHATOON W/O MOHAMMED BABA	F.NO. 103/FF(1-9-34), BABA SAI RESIDENCY, RASOOLPURA	SALE DEED DOC NO 25/2025 DATED 06.01.2025

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/Tax branch/580, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 12-03-2025

Sd/-
D. Madhukar Naik
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वी मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुड़गांव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు, ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5,
IMT మనేసర్, గుర్గావ్, హర్యానా - 122050
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన

[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప-సెక్షన్ (2) మరియు ఉప-సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]

బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-2/248(2)/2024-25/1770 తేది: 03.02.2025

నిర్దేశం:

(1) దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద తెలంగాణ రాష్ట్రంలోని (32) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AB2390711	U22210TG1990PTC010982	WALDEN BOOK LINKS PVT LTD
2	AB2365908	U74200TG2004PTC044793	CHALLA TECHNICAL SERVICES PRIVATE LIMITED
3	AB2335761	U73100TG2022PTC166758	BIOINFOMIX CUSTOM SERVICES PRIVATE LIMITED
4	AB2520759	U63011TG2006PLC051054	UBE AUTOMOTIVE LIMITED
5	AB2317788	U40108TG2009PTC064155	RVK ENERGY (RAJAHMUNDRY) PRIVATE LIMITED
6	AB2503231	U32109TG2012PTC079696	KODALI TRONICS INDIA PRIVATE LIMITED
7	AB2381830	U37200TG2012PTC082214	HYDERABAD RECLAIM PRIVATE LIMITED
8	AB2469633	U24232TG2015PTC097437	THRAIN LABS PRIVATE LIMITED
9	AB2468757	U55204TG2015PTC097247	KODALI HOTELS AND RESORTS PRIVATE LIMITED
10	AB2500334	U70102TG2016PTC102630	SHODHA DEVELOPERS PRIVATE LIMITED
11	AB2331009	U45500TG2017PTC116048	SREE VIJAYA SIMHADRI INFRASTRUCTURES PRIVATE LIMITED
12	AB2471158	U74999TG2016PTC111970	FORT MEDICAL SERVICES PRIVATE LIMITED
13	AB2394373	U52609TG2017PTC115845	SONAR & LEE KS PRIVATE LIMITED
14	AB2401404	U15115TG2017PTC119434	THREENI COOKIES PRIVATE LIMITED
15	AB2507414	U51909TG2018PTC122727	GRIDIT MERCHANDISE PRIVATE LIMITED
16	AB2452508	U45309TG2018PTC125716	CHARISHTA CONSTRUCTIONS PRIVATE LIMITED
17	AB2331321	U72501TG2018PTC127612	LABFORCE TECHNOLOGIES AND CONSULTANT PRIVATE LIMITED
18	AB2461854	U36100TG2019PTC135936	GENESIS MODULAR SOLUTIONS PRIVATE LIMITED
19	AB2481509	U72900TG2020PTC138474	EPSILON TEK SERVICES PRIVATE LIMITED
20	AB2433072	U52510TG2021PTC154395	SEVEN AM RETAIL NETWORK PRIVATE LIMITED
21	AB2478380	U51909TG2021PTC154583	VIYONA METALS INDIA PRIVATE LIMITED
22	AB2406310	U29308TG2021PTC156579	ABHYUDI INDUSTRIES PRIVATE LIMITED
23	AB2334738	U85110TG2022PTC164684	MEGSAN DIAGNOSTICS NIZAMABAD PRIVATE LIMITED
24	AB2316743	U85300TG2022PTC164513	MEGSAN ENTERPRISES PRIVATE LIMITED
25	AB2547678	U63030TG2022OPC161462	MYDKA (OPC) PRIVATE LIMITED
26	AB2379106	U26933TG2022PTC160627	AMSICON CONSTRUCTIONS PRIVATE LIMITED
27	AB2345783	U74999TG2022PTC160837	CLIMAGRIP ECO SOLUTIONS PRIVATE LIMITED
28	AB2334998	U85110TG2022PTC164143	MEGSAN DIAGNOSTICS RAJAHMUNDRY PRIVATE LIMITED
29	AB2373943	U47990TS2023PTC172800	HERITOR HI-TECH GLOBAL PRIVATE LIMITED
30	AB2551960	U82990TS2023PTC173573	BRAND WARLOCKS PRIVATE LIMITED
31	AB2546898	U20299TS2024PTC181498	FLUOROCAT FLUOROCHEMICALS PRIVATE LIMITED
32	AB2486877	U62013TS2025PTC192611	SYNCRANOVA PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారని లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఏ/లోని ఉప-సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప-సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ/ వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేరు(ల) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీల రిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.

(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.

ఇర్ఫాన్ టిర్కే,
అసిస్టెంట్ రిజిస్ట్రార్,
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0767/2425

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P.: VIJAYAWADA - 520008

NOTIFICATION

ENTRANCE TEST FOR ADMISSION INTO M.Phil.(CLINICAL PSYCHOLOGY) AND PROFESSIONAL DIPLOMA IN CLINICAL PSYCHOLOGY COURSES FOR THE YEAR 2024-25

Applications through online are invited from the eligible candidates for Entrance Test for admission into M.Phil.(Clinical Psychology) and Professional Diploma in Clinical Psychology Courses for the academic year 2024-25 for the seats in INCLAS Hospital, Vijayawada affiliated to Dr. NTR UHS from 11 AM on 17-03-2025 to 11.30 PM on 01-04-2025. The Entrance Test will be held on 20-04-2025.

For details, please refer prospectus/regulations available in the university website: http://dmtruhsap.in

Dated: 12.03.2025 VIJAYAWADA (Endorsement No.2345/MPhilCP/EA1/2025) Sd/- Dr. V. RADHIKA REDDY REGISTRAR

తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Nr No.E1/ /2025. తేది: 12-03-2025

రూ.24.00 లక్షల మొత్తముతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేయుటకు రూ.11.00 లక్షల మొత్తముతో సి.సి రోడ్డు పనులు చేయుటకు, రూ.5.00 లక్షల మొత్తముతో కంపోస్ట్ యార్డ్ షెడ్డు నిర్మాణం చేయుటకు మరియు రూ.20.00 లక్షల మొత్తముతో GI షీట్ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నవి. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది: 12-03-2025 సా.5:30 గం. నుండి 17-03-2025 సా.5:30 గం. వరకు కమిషనర్ తుక్కుగూడ మున్సిపాలిటీ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచుట తేది: 17-03-2025 సా.5:31 గం.కు కమిషనర్ తుక్కుగూడ మున్సిపాలిటీ లేదా వారి ప్రతినిధిచే తెరవబడుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్ ఫారం అనగా https://tender.telangana.gov.in చూడవచ్చు లేదా తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం. 9963613622, 8978455983

సం/- కమిషనర్ తుక్కుగూడ మున్సిపాలిటీ

DIPR RO No.11329-PP/CL/Advt/1/2024-25, Dt.12-03-2025

తెలంగాణ ప్రభుత్వం
పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్

1. టెండరు ప్రకటన: తేది: 11-03-2025

MRR, CRR, DMFT, NHM, R&R & SDF గ్రాంట్స్ క్రింద మంజూరైన అంచనా వ్యయం రూ. 148.89 కోట్లతో (169) NITs కల్గిఉన్న టెండరు ప్రకటనలో చూపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్లు SE PR వరంగల్ ద్వారా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై యాదృచ్ఛికంగా అప్‌లోడ్ చేయబడతాయి మరియు ప్రతి NIT ఆన్‌లైన్‌లో 17-03-2025 నుండి ప్రచురించబడిన తేది నుండి (14) స్పష్టమైన పనిరోజుల చెల్లుబాటు కాలవ్యవధితో అందుబాటులో ఉంటుంది. ఇతర వివరాలను ఆన్‌లైన్ https://tender.telangana.gov.in లో చూడవచ్చును మరియు SE PR రీజియన్ వరంగల్ వారి నుండి కూడా పొందవచ్చును. ఇమెయిల్ ఐడి: seprwglmrr2022@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్

DIPR RO No.11317-PP/CL/Advt/1/2024-25, Dt.12-03-2025

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(4) క్రింద బహిరంగ ప్రకటన

(G.O.Ms.No.55 MA&UD Dept., తేది: 27.02.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.33, MA, తేది: 24.01.2013 ప్రకారం ప్రభుత్వం ద్వారా ఆమోదించబడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కొరకు ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లో ఉద్దేశించిన భూమి వినియోగానికి సదరు సెక్షన్‌లోని ఉపసెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా ప్రభుత్వం ఇందుమూలంగా దిగువ తెలిపిన మార్పు చేస్తోంది. G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రభుత్వం ద్వారా ఆమోదించబడిన ప్రకటిత మాస్టర్‌ప్లాన్ MDP-2031లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్‌పేట్ (మం), కేశవరం గ్రామం వద్ద గల సర్వే నం.271/P, 272/P & 274/P లోని 19293.64 చ.మీటర్ల విస్తీర్ణం గల స్థలం ప్రస్తుతం కన్జర్వేషన్ వినియోగ జోన్ కొరకు కేటాయించబడిన దానిని ఇప్పుడు 'ఆరెంజ్' కేటగిరీ క్రింద స్వీకరించిన మినరల్ వాటర్ ప్లాంట్, కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్ మరియు క్లబ్ సోడా కొరకు యూనిట్ నెలకొల్పుట కొరకు తయారీ వినియోగ జోన్‌గా నిర్దేశించబడినది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభిస్తాయి.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్ ప్లానింగ్-I, HMDA తరఫున

DIPR RO No.11390-PP/CL/Advt/1/2024-25, Dt:12-03-2025

ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయము :: రంగారెడ్డి జిల్లా
కొటేషన్ కొరకు ప్రకటన

Lr. No. E1/AMGL/Quotations/2024-25 తేది : 12.03.2025

ఆమనగల్లు మున్సిపాలిటీలో వివిధ పనుల రేట్స్ యొక్క సరఫరా మరియు డెలివరీ కొరకు కాంట్రాక్టర్లు / కన్సల్టెంట్స్ / ఏజెన్సీ నుండి సీల్డ్ కొటేషన్లు క్రింది స్పెసిఫికేషన్లతో తేది : 19.03.2025న లేదా అలోగా మ. 3.00 గం.ల వరకు కోరబడుచున్నవి మరియు సదరు కొటేషన్లను, అదే రోజున మ. 3.30 గం.కు కొటేషనర్ల సమక్షంలో తెరువబడును. ఏ కారణం తెలుపకుండా ఏదైనా లేదా అన్ని కొటేషన్లు తిరస్కరించుటకు హక్కు కమిషనర్, ఆమనగల్లు మున్సిపాలిటీవారికి కలదు.

పేర్లు :

పని పేరు : ఆమనగల్లు మున్సిపాలిటీలో వివిధ పనుల రేట్స్ సరఫరా మరియు డెలివరీ.

క్ర. సం.	పనిపేరు
1	మెటీరియల్స్ (బ్యారికేడింగ్, లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్ మెటీరియల్, శాలువాలు, మెమెంటోలు, ఫ్లాంట్స్, రిఫ్రెష్‌మెంట్, మీల్స్, కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, స్ట్రీట్ లైట్ మెటీరియల్స్, కుర్చీలు, టేబుల్స్, అలమారాలు మరియు ఫర్నీచర్ మొ॥వి) యొక్క సరఫరా మరియు డెలివరీ.

సం/- కమిషనర్, ఆమనగల్లు మున్సిపాలిటీ

DIPR RO No. 11366-PP/CL/ADVT/1/2024-25, Dt. : 12.03.2025

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(4) క్రింద బహిరంగ ప్రకటన

(G.O.Ms.No.36 MA&UD Dept., తేది: 27.02.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.33, MA, తేది: 24.01.2013 ప్రకారం ప్రభుత్వం ద్వారా ఆమోదించబడిన MDP-2031లో ఉద్దేశించిన భూమి వినియోగానికి సదరు సెక్షన్‌లోని ఉపసెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా ప్రభుత్వం ఇందుమూలంగా దిగువ తెలిపిన మార్పు చేస్తోంది. G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత MDP-2031లో మెదక్ జిల్లా, మనోహరాబాద్ మండలం, చాట్ల గౌరారం గ్రామంలో సర్వే నం.లు 138/AA/4/1, 137/AA/4/1, 137/AA/6/1, 137/AA2/1, 138AA/5/1, 138/AA2/1, 138AA/AA/6/1, 137/AA/3/1లోని 8397.86 చ.మీటర్ల విస్తీర్ణం మరియు బఫర్ ఏరియా 986.422 చ.మీటర్లు మరియు నికర సైట్ విస్తీర్ణం 7411.44 చ.మీటర్ల స్థలం ప్రస్తుతం కన్జర్వేషన్ వినియోగ జోన్ కొరకు కేటాయించబడిన దానిని ఇప్పుడు 'గ్రీన్' కేటగిరీ క్రింద ఫిల్లర్ అండ్ మాస్టర్ బ్యాచ్ కొరకు యూనిట్ నెలకొల్పుట కొరకు తయారీ వినియోగ జోన్‌గా నిర్దేశించబడినది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభిస్తాయి.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్ ప్లానింగ్-I, HMDA తరఫున

DIPR RO No.11402-PP/CL/Advt/1/2024-25, Dt:12-03-2025

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(4) క్రింద బహిరంగ ప్రకటన

(G.O.Ms.No.52 MA&UD Dept., తేది: 27.02.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.33, MA, తేది: 24.01.2013 ప్రకారం ప్రభుత్వం ద్వారా ఆమోదించబడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కొరకు MDP-2031లో ఉద్దేశించిన భూమి వినియోగానికి సదరు సెక్షన్‌లోని ఉపసెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా ప్రభుత్వం ఇందుమూలంగా దిగువ తెలిపిన మార్పు చేస్తోంది. G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత MDP-2031లో మెదక్ జిల్లా, శివంపేట్ మండలం, చండి గ్రామంలో సర్వే నం.లు 2 వ 119/2/2/2 మరియు 2 వ 119/1/అ/2లోని 4026.79 చ.మీటర్ల విస్తీర్ణం గల స్థలం ప్రస్తుతం కన్జర్వేషన్ వినియోగ జోన్ కొరకు కేటాయించబడిన దానిని ఇప్పుడు 'వైట్' కేటగిరీ క్రింద ఆర్టిఫిషియల్ టీత్ తయారీ రంగంలో యూనిట్ నెలకొల్పుట కొరకు తయారీ వినియోగ జోన్‌గా నిర్దేశించబడినది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభిస్తాయి.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్ ప్లానింగ్-I, HMDA తరఫున

DIPR RO No.11396-PP/CL/Advt/1/2024-25, Dt:12-03-2025

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

1) పని పేరు: విద్యుత్ సౌధ, హైదరాబాద్ వద్ద 13 నం.ల ప్యాసింజర్లను తీసుకెళ్లే సామర్థ్యం గల ఎలివేటర్ సరఫరా మరియు పనిచేయించుట. పని విలువ: రూ.26,17,500.00, ఇ-టెండరు ఐడి నం.578158. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:03-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:18-03-2025. 2) పని పేరు: 1 సంవత్సర కాలవ్యవధి కొరకు విద్యుత్ సౌధ/ హైదరాబాద్ 'A' బ్లాక్ మరియు 'B'లో టాయిలెట్స్ నిర్వహణ. పని విలువ: రూ.35,46,868.00, ఇ-టెండరు ఐడి నం.579162. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:04-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:19-03-2025. 3) పని పేరు: మెట్రో జోన్‌లో 13 నం.ల సబ్ స్టేషన్ల వద్ద 50 BHP సామర్థ్యం గల డీజిల్ ఇంజిన్ పంపుల సరఫరా మరియు పనిచేయించుట. పని విలువ రూ.92,07,467.00, ఇ-టెండరు ఐడి నం.579080. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:03-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:18-03-2025. 4) పని పేరు: రూరల్ జోన్‌లో 16 నం.ల సబ్ స్టేషన్ల వద్ద 50 BHP సామర్థ్యం గల డీజిల్ ఇంజిన్ పంపుల సరఫరా మరియు పనిచేయించుట. పని విలువ: రూ.1,13,32,272.00, ఇ-టెండరు ఐడి నం.579387. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:05-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:20-03-2025. 5) పని పేరు: వరంగల్ జోన్‌లో 6 నం.ల సబ్ స్టేషన్ల వద్ద 50 BHP సామర్థ్యం గల డీజిల్ ఇంజిన్ పంపుల సరఫరా మరియు పనిచేయించుట. పని విలువ: రూ.42,49,602.00, ఇ-టెండరు ఐడి నం. 579479. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:05-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:20-03-2025. 6) పని పేరు: కరీంనగర్ జోన్‌లో 10 నం.ల సబ్ స్టేషన్ల వద్ద 50 BHP సామర్థ్యం గల డీజిల్ ఇంజిన్ పంపుల సరఫరా మరియు పనిచేయించుట. పని విలువ: రూ.70,82,667.00, ఇ-టెండరు ఐడి నం.579357. బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది:04-03-2025 & బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేది:19-03-2025. టెండరు కోరుతున్న అధికారి పేరు మరియు చిరునామా: చీఫ్ ఇంజనీర్ /సివిల్, TG ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, రూమ్ నం.105, 'A'-బ్లాక్, ఖైరతాబాద్, హైదరాబాద్. ఫోన్ నం.040-23396000, Extn No.: 3202, 3354, 3352, 3569. తదుపరి వివరాలను "ఇ-ప్రొక్యూర్‌మెంట్" మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవలెను.

DIPR RO No.11325-PP/CL/Advt/1/2024-25, Dt:12-03-2025 సం/- చీఫ్ ఇంజనీర్ / సివిల్

పురపాలక సంఘ కార్యాలయము, తూప్రాన్, జిల్లా.మెదక్(టి.జి)
తైబజారు మరియు పశువుల సంత బహిరంగ వేలము ప్రకటన

లేఖ.నెం. A1/20&21/2025 తేది:12.03.2025

ఇందుమూలముగా సమస్త పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా తేది: 19.03.2025, బుధవారం రోజున ఉదయం 11-00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో తైబజారు వేలము మరియు పశువుల సంత వేలము 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను అనగా తేది:01.04.2025 నుండి తేది: 31.03.2026 వరకు వేలము వేయబడును. వేలములో పాల్గొనువారు ఈక్రింది నిబంధనలు పాటించవలెయును. నిబంధనలు:- 1. తై బజారు వేలములో పాల్గొనువారు ముందుగా రూ.లు.1,00,000/- సెక్యూరిటీ డిపాజిట్ మరియు పశువుల సంత వేలములో పాల్గొనువారు ముందుగా రూ.లు.50,000/-- సెక్యూరిటీ డిపాజిట్ దాఖలు చేయవలెయును. 2. వేలములో ఎవరి పాట అధికముగా యున్నచో వారి పేరిట షేకార్ చేయబడును. (ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే) 3. వేలము అయిన 24 గంటలలో వేలము రకము మొత్తములో 1/2 (సగం) సెక్యూరిటీ డిపాజిట్ కలుపుకొని సగం డబ్బు చెల్లించవలెయును. మిగితా డబ్బు 6(ఆరు) కిస్తీలలో అనగా 4/2025 నుండి 3/2026 వరకు చెల్లించవలెయును. 4.WP.No.3234/2004 మరియు CDMA గారి సర్క్యులర్ నెం.4868/2015/M3-1, తేది:06.07.2015 ప్రకారం గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు తై బజారు రుసుము వసూలు చేయరాదు. 5. పురపాలక సంఘ కార్యాలయ ఉత్తర్వులు పాటించుటకు అగ్రిమెంటు వ్రాసి ఇవ్వవలెయును. 6. వేలము తరువాత 24 గంటలలో 1/2 (సగం) డబ్బు చెల్లించని యెడల వేలము రద్దుపరిచి సెక్యూరిటీ డిపాజిట్ జప్తుపరుచుకొని తిరిగి వేలము వేయబడును. వేలము మొదటి రకము కన్నా తక్కువ వచ్చినచో షేకారుదారు నుండి చట్టరీత్యా మిగిలినారకం వసూలు చేయబడును. 7.వేలము పాట యొక్క మొత్తము డబ్బును సూచించిన తేదీలలో చెల్లించకపోయినచో మున్సిపల్ చట్టం ప్రకారము చర్యలు తీసుకొనబడును. 8.వేలములో పాల్గొనువారు పురపాలక సంఘమునకు ఎలాంటి బకాయిలు ఉండరాదు. 9. వేలము దుబారాపై గానీ, షేకారు చేయుటకు మరియు రద్దుపరచుటకు కమిషనర్ గారికి అధికారము ఉండగలదు. 10.పురపాలక సంఘం నుండి నిర్ణయించిన రేట్లు మాత్రమే వసూలు చేయవలెయును. మరియు అప్పుడప్పుడు పురపాలక సంఘం నుండి వచ్చే ఉత్తర్వులు పాటించవలెయును. 11.వేలములో ఎక్కువ పాటపాడిన వారినుండి స్టాంపు చట్టం ప్రకారం 3% శాతం స్టాంపు పేపర్లపై అగ్రిమెంటు చేయవలెయును. 12. పురపాలక సంఘం ఏరియాలో వేలములో పాల్గొనదలచినవారు స్థిరాస్తి కలిగియుండవలెయును మరియు ఆస్తిపై బ్యాంకుల ఇతర సంస్థలపైన అప్పుపొంది ఉండకూడదు. అప్పు ఉన్నట్లు నిర్ధారించిన యెడల వేలములో పాల్గొనుటకు అనర్హులుగా నిర్ధారించబడును. 13.వేలము రకపు ఇద్దరు వ్యక్తులతో జమానతునామా దాఖలు చేయవలెయును. జమానతుదారులు తూప్రాన్ పురపాలక సంఘం యందు స్థిరాస్తి అనగా ఇల్లు కలిగియుండవలెయును మరియు బ్లాంక్ బ్యాంకు చెక్కులు ఇవ్వవలెయును. 14. డిపాజిట్ చెల్లించినవారు మాత్రమే వేలము పాటలో పాల్గొనుటకు అర్హులు ఎటువంటి ఆబ్జెక్షన్ చెల్లబడవు.

సం/- కమిషనర్, పురపాలక సంఘం తూప్రాన్

DIPR RO No.11360-PP/CL/Advt/1/2024-25, Dt.12-03-2025

గాయాన్ని గంటల్లో మాన్పే మాయా చర్మం

అది చర్మం కాని చర్మం. అయితే ఆలాంటిలాంటి చర్మం కాదు. గాయాలను శరవేగంగా నయం చేసే చర్మం! ఎంతటి గాయాన్నయినా నాలుగే గంటల్లో 90 శాతం దాకా మాన్పుతుంది. 24 గంటల్లో పూర్తిగా నయం చేసేస్తుంది. వినడానికి ఏదో సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమా కథలా అన్పిస్తున్నా అక్షరాలా నిజమిది. ఈ మాయా చర్మం అందుబాటులోకి వస్తే వైద్యచికిత్స కొత్తపుంతలు తొక్కడం ఖాయమని చెబుతున్నారు. అచ్చం చర్మాన్ని తలపించే కొత్త రకం హైడ్రోజెల్‌ను రూపొందించడంలో సైంటిస్టులు విజయవంతమయ్యారు. చర్మానికి ఉండే స్వీయచికిత్స సామర్థ్యాన్ని ఇది ఎన్నో రెట్లు పెంచుతుందట. ఫిన్లండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ, జర్మనీలోని బైరైట్ వర్సిటీలకు చెందిన పరిశోధకులు దీన్ని రూపొందించారు. నిజానికి ఇటువంటి విప్లవాత్మక ఆవిష్కరణ కోసం ప్రపంచవ్యాప్తంగా చాలా ఏళ్లుగా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతూనే వస్తున్నాయి. కానీ అవేవీ ఇప్పటిదాకా అంతగా విజయవంతం కాలేదు. చర్మం తాలూకు విలక్షణతే అందుకు కారణం. సాగే లక్షణం, దీర్ఘకాలిక మన్నిక, తీవ్ర ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యం వంటి ఎన్నో ప్రత్యేకతలు చర్మం సొంతం. వీటన్నింటినీ మించి గాయాలను తనకు తాను నయం చేసుకునే సాటిలేని సామర్థ్యం చర్మానికి ఉంది. ఇన్ని లక్షణాలతో కూడిన కృత్రిమ చర్మం రూపకల్పన ఇన్నేళ్లుగా సైంటిస్టులకు సవాలుగానే నిలిచింది. తాజాగా రూపొందించిన హైడ్రోజెల్ మాత్రం పూర్తిగా చర్మం లక్షణాలను కలిగి ఉంటుంది. కాలిన, తెగిన గాయాలపై ఈ జెల్‌ను అమరిస్తే వాటిని చిటికెలో నయం చేస్తుంది. తర్వాత దాన్ని తొలగించవచ్చు. లేదంటే క్రమంగా అదే కరిగిపోతుంది.

ఇలా సాధించారు...

అతి పలుచనైన నానోషీట్‌తో రూపొందించిన పాలిమర్ సాయంతో కృత్రిమ చర్మం రూపకల్పన సాధ్యపడింది. మోనోమర్ పొడిని నీటితో కూడిన నానోషీట్లతో చాకచక్యంగా కలపడం ద్వారా అధ్యయన బృందంలోని శాస్త్రవేత్త చెన్ లియాంగ్ దీన్ని సాధించారు. తర్వాత ఈ మిశ్రమాన్ని యూవీ రేడియేషన్‌కు గురిచేయడంతో అందులోని అణువుల మధ్య ఆశించిన స్థాయిలో బంధం సాధ్యపడింది. ఫలితంగా చక్కని సాగే గుణమున్న చర్మంలాంటి హైడ్రోజెల్ రూపొందించింది. ''అత్యంత హెచ్చు సామర్థ్యంతో కూడిన వ్యవస్థీకృత నిర్మాణం దీని సొంతం. హైడ్రోజెల్‌కు ఇది గట్టిదనం ఇవ్వడమే గాక గాయాల వంటివాటిని తనంత తానుగా నయం చేసుకోగల సామర్థ్యాన్ని కూడా కట్టబెట్టింది'' అని అధ్యయన బృందం పేర్కొంది. ''జీవకణాలు చూసేందుకు గట్టిగా ఉన్నా స్వీయచికిత్స సామర్థ్యంతో కూడి ఉంటాయి. సింథటిక్ హైడ్రోజెల్‌లో ఈ లక్షణాలను చొప్పించడం ఇప్పటిదాకా సవాలుగానే నిలిచింది. దాన్నిప్పుడు అధిగమించాం'' అని వివరించింది. కృత్రిమ చర్మ పరిజ్ఞానంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ''కాలిన, దీర్ఘకాలిక గాయాలను సత్వరం నయం చేయడం ఇకపై మరింత సులువు కానుంది. అంతేగాక వైద్య చికిత్సలోనే గాక ప్రోస్తటిక్స్, సాఫ్ట్ రోబోటిక్స్ తదితర రంగాల్లో కూడా ఇది ఉపయుక్తం కానుంది'' అని వివరించింది. మిల్లీమీటర్ మందంలోని జెల్‌లో దాదాపు 10 వేల నానోషీట్లుంటాయి. ఫలితంగా దానికి గట్టిదనంతో పాటు సాగే గుణం కూడా ఉంటుంది. ఈ మిరాకిల్ జెల్ ప్రస్తుతానికి ప్రయోగ దశలోనే ఉంది. వైద్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో ఐదేళ్లకు పైగా పట్టవచ్చు. అధ్యయన వివరాలు ప్రతిష్టాత్మక జర్నల్ నేచర్ మెటీరియల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

ఏమిటీ హైడ్రోజెల్

సింపుల్‌గా చెప్పాలంటే ఇది జెల్ వంటి మృదువుగా ఉండే పదార్థం. దీన్ని పాలిమర్ తదితర మెటీరియల్స్‌తో తయారు చేస్తారు. వెంట్రుకల చికిత్స మొదలుకుని ఆహారోత్పత్తుల దాకా దాదాపు అన్నింటిలోనూ వీటిని విస్తృతంగా వాడుతున్నారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

గ్లోబల్ సౌత్‌కు 'మహాసాగర్'

మారిషస్ ప్రధాని రామ్‌గులాంతో మోదీ చర్చలు

- 'విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యం'గా ద్వైపాక్షిక బంధం
- ఇరు దేశాల మధ్య కుదిరిన 8 కీలక ఒప్పందాలు
- మోదీకి మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం

పోర్ట్ లూయిస్: ద్వైపాక్షిక సంబంధాలను 'విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్య' స్థాయికి పెంపొందించుకోవాలని భారత్, మారిషస్ నిర్ణయించాయి. ఇరు దేశాల ప్రధానమంత్రుల భేటీలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. వ్యాపారం, వాణిజ్యం, సముద్రయాన రక్షణ తదితర కీలక రంగాల్లో పరస్పర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. ఇందులో భాగంగా భారత్, మారిషస్ మధ్య ఎనిమిది కీలక ఒప్పందాలు కుదిరాయి. సీమాంతర లావాదేవీల కోసం ఇరు దేశాలు ఇకపై తమ నేషనల్ కరెన్సీలు ఉపయోగించుకోవచ్చు. మారిటైమ్ డేటాను పంచుకోవచ్చు. మనీ లాండరింగ్‌ను నియంత్రించడానికి ఉమ్మడిగా కృషి చేయొచ్చు. ఎంఎస్ఎంఈ రంగంలో సహకారం పెంపొందించుకోవచ్చు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం బుధవారం సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధికి సంబంధించి 'మహాసాగర్' పేరిట నూతన దార్శనికతను ఈ సందర్భంగా మోదీ ప్రకటించారు. హిందూ మహాసముద్రంపై పట్టు కోసం డ్రాగన్ దేశం చైనా తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో 'మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్(మహాసాగర్) విజన్‌ను మోదీ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్వేచ్ఛాయుతమైన, పూర్తి భద్రతతో కూడిన హిందూ మహాసముద్రానికి ఉమ్మడిగా అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని భారత ప్రధానమంత్రి స్పష్టంచేశారు. రెండు దేశాల నడుమ వ్యూహాత్మక భాగస్వామ్యంలో రక్షణ సహకారం, మారిటైమ్ సెక్యూరిటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తాము నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు రామ్‌గులాంతో భేటీ అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలికి రక్షణ సహకారం అందిస్తామన్నారు.

భారత్ నుంచి బహుమతి

ప్రధాని మోదీ 2015లో మారిషస్‌లో పర్యటించినప్పుడు సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్) పాలసీని ప్రకటించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఇండియా ప్రాముఖ్యతను పెంచడానికి ఈ విధానం తీసుకొచ్చారు. 'సాగర్'ను మరింత ముందుకు తీసుకెళ్తూ 'మహాసాగర్'ను ఆవిష్కరించినట్లు మోదీ ఉద్ఘాటించారు. గ్లోబల్ సౌత్‌లో శాంతి, సౌభాగ్యం, సుస్థిరతను కోరుకుంటున్నట్లు వెల్లడించారు. మారిషస్‌లో నూతన పార్లమెంట్ భవన నిర్మాణానికి సహకరిస్తామని ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి లాంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక బహుమతి అవుతుందన్నారు. ఇండియాలో చార్‌ధామ్ యాత్ర, రామాయణ్ యాత్రలో పాల్గొనే మారిషస్ ప్రజలకు తగిన వసతులు కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు.



పురస్కారాన్ని అందుకున్నాక ఆ దేశ అధ్యక్షుడు ధరమ్ గోకుల్, ప్రధాని రామ్‌గులాంలతో మోదీ

మారిషస్ జాతీయ దినోత్సవంలో మోదీ

రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం మారిషస్ 57వ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారిషస్ అత్యున్నత జాతీయ పురస్కారం 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషియన్'ను మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు స్వీకరించిన మొట్టమొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారు. ఈ పురస్కారం తనకు లభించడం భారత్–మారిషస్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక, చారిత్రక సంబంధాలకు ప్రతీక అని మోదీ అభివర్ణించారు. శతాబ్దాల క్రితం భారత్ నుంచి మారిషస్‌కు చేరుకున్న భారతీయులకు, వారి వారసులకు ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. మారిషస్ నేషనల్ డే పరేడ్‌లో భారత నావికాదళం సైతం పాలుపంచుకుంది. ఈ వేడుకలకు హాజరు కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మరోవైపు మోదీ, నవీన్‌చంద్ర రామ్‌గులామ్ 'అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీసు, ఇన్నోవేషన్'ను సంయుక్తంగా ప్రారంభించారు.

స్కూళ్లల్లో ఎయిర్ ప్యూరిఫయర్లు

సౌమ్య స్వామినాథన్ సిఫార్సు

న్యూఢిల్లీ: ఢిల్లీ వంటి నగరాల్లో వాయు కాలుష్యం నుంచి పిల్లలను రక్షించేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎయిర్ ప్యూరిఫయర్లను ఏర్పాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్, శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ సూచించారు. ప్రస్తుతం ఆరోగ్యశాఖ సలహాదారుగా ఉన్న ఆమె.. వాయు కాలుష్యంపై భారత్ తగినంత డేటాను సేకరించిందని, చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 'పెద్దలకంటే పిల్లలు వేగంగా శ్వాస తీసుకుంటారు. అలాగే వారు చిన్నగా ఉండటం వల్ల నేలకు దగ్గరగా ఉండటంతో గాలిలోని దుమ్ము, ధూళి, కాలుష్యం వారిని తొందరగా చేరుతుంది. తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇంటి తరువాత పిల్లలు ఎక్కువసేపు గడిపేది పాఠశాలల్లోనే. కాబట్టి కచ్చితంగా ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాల్లో ప్యూరిఫయర్లను ఏర్పాటు చేసి గాలి నాణ్యతను మెరుగుపరచాలి' అని ఆమె సూచించారు. అయితే బయోమాస్ స్థానంలో ఎల్పీజీని తీసుకొచ్చి, ఇప్పటికే ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు కొంత మేర ప్రయోజనం చేకూరుస్తున్నాయని స్వామినాథన్ తెలిపారు. నగరాల్లో ప్రజారవాణాను విస్తరించాలని, మితిమీరిన కార్ల వినియోగంపై జరిమానాలు విధించాలని, పారిశ్రామిక కాలుష్య చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆమె పేర్కొన్నారు. చట్టాలు, నిబంధనలు తీసుకొస్తే సరిపోదని, వాటిని కఠినంగా అమలు చేయాలన్నారు.



డబ్ల్యూహెచ్ఓ పరిమితుల కంటే అధికం..

ఢిల్లీలో గాలి నాణ్యత తరచూ దెబ్బతింటోంది. శీతాకాలంలో ఇది మరింత ప్రమాదకర స్థాయిలను చేరుతుంది. గాలి కాలుష్యం పిల్లల్లో అభ్యాస నైపుణ్యాన్ని ప్రభావితం చేస్తోంది, తద్వారా విద్యా వ్యవస్థకు నష్టం వాటిల్లుతోంది. దీనిపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఇక స్విస్‌ఎయిర్ టెక్నాలజీ సంస్థ ఐక్యూఎయిర్ మంగళవారం ప్రకటించిన నివేదిక ప్రకారం.. ప్రపంచంలోని 10 అత్యంత కాలుష్య నగరాల్లో ఆరు భారత్‌లోనే ఉన్నాయి. ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరమని, భారత్‌ఐదో అత్యంత కాలుష్య దేశమని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ -2024 తెలిపింది. 2023తో పోలిస్తే ఢిల్లీలో వాయుకాలుష్యం 2024లో బాగా పెరిగింది. ఒక్క ఢిల్లీనే కాదు.. భారత్‌లోని 35 శాతం నగరాల్లో కాలుష్యం డబ్ల్యూహెచ్‌ఓ పరిమితుల కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంది.

ఉక్రెయిన్‌కు మళ్లీ అమెరికా ఆయుధాలు

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడులు.. ఐదుగురి మృతి

కీవ్: ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై సస్పెన్షన్‌ను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఎత్తివేయడంతో ఆయుధాల సరఫరా బుధవారం నుంచి మళ్లీ ప్రారంభమైంది. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. పోలాండ్ లాజిస్టిక్ సెంటర్ నుంచి ఈ ఆయుధాలు వచ్చినట్లు వెల్లడించాయి. మరోవైపు రష్యాతో 30 రోజులపాటు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధికారులు సంకేతాలిచ్చారు. కాల్పుల విరమణపై అమెరికా నుంచి సమాచారం కోసం ఎదురు చూస్తున్నామని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు. ఒకవైపు శాంతి కోసం ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడిలో ఐదుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు.

కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరించాలి: ట్రంప్

న్యూయార్క్: ఉక్రెయిన్‌తో 30 రోజుల కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తుందని తాను ఆశిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం చెప్పారు. ఉక్రెయిన్ ముందుకొచ్చింది కాబట్టి ఇక రష్యా అధినేత పుతిన్ చొరవ తీసు కోవాలని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రంప్ ఒక వీడియో పోస్టు చేశారు. కాల్పులు ఆగకపోతే జనం మరణిస్తూనే ఉంటారని, ఇది తెలివైన పని కాదని చెప్పారు. కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తే అది చాలా గొప్ప విషయం అవుతుందన్నారు. మరోవైపు ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ సైతం స్పందించారు. 30 రోజుల కాల్పుల విరమణ అనేది సానుకూలమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ ప్రతిపాదనను అంగీకరించేలా రష్యాను ఒప్పించాల్సిన బాధ్యత అమెరికాపై ఉందన్నారు.

నెలాఖరులో భారత్‌కు జేడీ వాన్స్

న్యూయార్క్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌కు రానున్నారు. సెకండ్‌లేడీ ఉషా వాన్స్‌తో కలిసి ఆయన ఈ నెలాఖరులో మనదేశంలో పర్యటించనున్నారు. గత నెలలో ఫ్రాన్స్, జర్మనీల్లో ప్రపంచ వేదికలపై మాట్లాడిన వాన్స్‌కు ఇది రెండో విదేశీ పర్యటన. జేడీ వాన్స్ భార్య చిలుకూరి ఉషా వాన్స్ తల్లిదండ్రులు తెలుగువారు. ఉష తల్లిదండ్రులు లక్ష్మీ చిలుకూరి, క్రిష్ చిలుకూరి 1970 దశకంలో అమెరికాకు వలస వెళ్లారు. అక్కడే జన్మించిన ఉషా వాన్స్.. యేల్ లా స్కూల్లో చదువుకున్నారు. అక్కడే జేడీ వాన్స్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. రెండో మహిళగా వాన్స్ తన తల్లిదండ్రుల స్వదేశానికి రావడం ఇదే మొదటిసారి.

రైలు హైజాక్‌కు తెర: పాక్

- మిలిటెంట్లందరినీ హతమార్చాం
- ప్రయాణికులను విడిపించాం: సైన్యం
- 21 మంది చనిపోయినట్టు వెల్లడి

కరాచీ/ఇస్లామాబాద్/క్వెట్టా: సంచలనం సృష్టించిన రైలు హైజాక్ ఉదంతానికి తెర దించినట్టు పాకిస్తాన్ బుధవారం ప్రకటించింది. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) చెరబట్టడం, పలువురు ప్రయాణికులను కాల్చి చంపి 215 మందిని బందీలను చేసుకోవడం తెలిసిందే. జైళ్లలో ఉన్న తమ నేతలను 48 గంటల్లోగా వదిలేయకపోతే బందీలందరినీ చంపేస్తామని అల్టిమేటం కూడా జారీ చేసింది. ప్రయాణికులందరినీ సైనిక ఆపరేషన్ ద్వారా బుధవారం సాయంత్రానికల్లా బీఎల్ఏ చెర నుంచి విడిపించినట్టు ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ ప్రకటించారు. ''ఘటనా స్థలిలో ఉన్న 33 మంది మిలిటెంట్లను ఆర్మీ స్నైపర్లు హతమార్చారు. ఆ క్రమంలో నలుగురు సైనికులను కోల్పోయాం. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మిలిటెంట్లు రైలును హైజాక్ చేశారు. ఆ క్రమంలో 21 మంది ప్రయాణికులను పొట్టన పెట్టుకున్నారు'' అని చెప్పారు. ట్రెన్‌తో పాటు ఘటనా స్థలిని బాంబ్ డిస్పోజల్ బృందాలు జాగ్రత్తగా జల్లెడ పడుతున్నాయన్నారు. దాడికి కారకులను, వారిని పెంచి పోషిస్తున్న వారిని వెంటాడి వేటాడతామని ప్రకటించారు.

భిన్న వాదనలు

ఆపరేషన్ విజయవంతమైందన్న ప్రకటనపై భిన్న వాదనలు విన్పిస్తున్నాయి. వేర్పాటువాదులు ఆత్మాహుతి బాంబులుగా ఇప్పటికీ ప్రయాణికుల మధ్య నక్కారని చెబుతున్నారు. మహిళలు, చిన్నారులను మానవ కవచాలుగా వాడుకున్నట్టు మీడియా పేర్కొంది. 50 మంది వేర్పాటువాదులను హతమార్చి 190 మంది ప్రయాణికులను కాపాడినట్టు పాక్ సర్కారు కూడా బుధవారం సాయంత్రం పేర్కొంది. ఇందుకు ప్రతీకారంగా 50 మందికి పైగా బందీలను చంపేసినట్టు బీఎల్ఏ ప్రకటించింది. ''ఇప్పటిదాకా 100 మందికి పైగా బందీలను కాల్చేశాం. ఇంకో 150 మంది బందీలుగానే ఉన్నారు. డెడ్‌లైన్లో కొన్ని గంటల్లో ముగియనుంది. ఆలోపు మా నేతలందరినీ వదిలేయకుంటే గంటకు కొందరు చొప్పున బందీలను చంపేస్తాం'' అని ఒక ప్రకటనలో హెచ్చరించింది.



రైలు నుంచి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తెస్తున్న ఆర్మీ జవాను

ప్రత్యక్ష నరకమే | మా కళ్లముందే కాల్చేశారు | ప్రత్యక్ష సాక్షుల భయానక అనుభవాలు

హైజాక్ నుంచి క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు తాము అనుభవించిన నరకాన్ని తలచుకుంటూ ఇప్పటికీ వణికిపోతున్నారు. వేర్పాటువాదుల చెరనుంచి బయటపడ్డాక వారంతా రాత్రిపూట వణికించే చలిలో 4 గంటల పాటు నడిచి సమీపంలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వృద్ధులు, పిల్లలు, రోగులను మిగతావారు భుజాలపై మోసుకెళ్లారు. సెలవుపై ఇళ్లకు వెళ్తున్న సైనికులను తమ కళ్లముందే కాల్చి పొట్టన పెట్టుకున్నారని హమీద్ అనే ప్రయాణికుడు బీబీసీకి వెల్లడించాడు. ''బోగీల్లోకి చొరబడటంతోనే ప్రయాణికుల గుర్తింపు కార్డులను చెక్ చేశారు. పిల్లలు, మహిళలు, పౌరులను వేరు చేశారు. సైనికులందరినీ మరోవైపు తరలించారు. ఆ క్రమంలో ముగ్గురు సైనికులను మేం చూస్తుండగానే కాల్చేసి బిగ్గరగా నినాదాలు చేశారు. నేను హ్యాడ్రోగినని వేడుకోవడంతో వదిలేశారు'' అని చెప్పాడు. ''భారీ బాంబు పేలుళ్లు, కాల్పుల మోతలను జీవితంలో మర్చిపోలేను. ఏం జరుగుతుందోనని 50 నిమిషాలకు పైగా ఊపిరి బిగబట్టుకుని గడిపాం'' ఇషాక్ నూర్ చెప్పుకొచ్చాడు.

అమెరికా ఉత్పత్తులపై ఈయూ ప్రతీకార సుంకాలు

కొత్త టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటన



బ్రస్సెల్స్: అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య టారిఫ్‌ల యుద్ధం జరుగుతోంది. ఈయూకు సంబంధించిన స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పెంచిన 25 శాతం టారిఫ్‌లు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. అందుకు ప్రతీకారంగా ఈయూ సైతం గంటల వ్యవధిలోనే అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు ప్రకటించింది. అమెరికా నుంచి వచ్చే పారిశ్రామిక, పాడి ఉత్పత్తులపై కొత్త సుంకాలు వసూలు చేయనున్నట్లు బుధవారం ఈయూ తేల్చిచెప్పింది. 28 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై సుంకాలు అతిత్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెంచడంలో భాగంగానే ఈయూ సైతం టారిఫ్‌లు విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ట్రంప్ వెనక్కి తగ్గితే ఈయూ దేశాలు సైతం వెనక్కి తగ్గే అవకాశం ఉంది. టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెవెన్ చెప్పారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఆర్థికవ్యవస్థలపై టారిఫ్‌ల పేరిట పెనుభారం మోపడం తమకు ఇష్టం లేదన్నారు. అయితే, అమెరికా చర్యలకు ప్రతిచర్యగా తాము సైతం టారిఫ్‌లు విధించాలని నిర్ణయించినట్లు తేల్చిచెప్పారు.

హరియాణా కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ హవా

పదింట తొమ్మిది కైవసం

చండీగఢ్: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించిన ఆరు నెలల లోపే.. బీజేపీ మళ్లీ సత్తా చాటింది. కార్పొరేషన్ ఎన్నికల్లో 10 నగరాలకు గాను తొమ్మిదింటిలో బీజేపీ గెలుపొందింది. ఈ పది స్థానాల్లో ఏడు బీజేపీ సిట్టింగ్ స్థానాలు కావడం గమనార్హం. విపక్ష కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేకపోయింది. సిట్టింగ్ స్థానమైన సోనిపట్‌ను కోల్పోయింది. అలాగే మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ఇలాఖాలోని రోహ్‌తక్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసింది. పది కార్పొరేషన్‌లలో ఏడుగురు మహిళలు మేయర్లుగా గెలిచారు. ఇందులో ఆరుగురు బీజేపీకి చెందిన వారు. మానేసర్ నుంచి స్వతంత్ర అభ్యర్థి ఇందర్‌జిత్ యాదవ్ మేయర్‌గా గెలుపొందారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు ఉంచిన అచంచల విశ్వాసానికి ఈ గెలుపు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. అంకితభావం కలిగిన బీజేపీ కార్యకర్తల కృషి ఫలితమే కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ఘన విజయమని మోదీ అభివర్ణించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు ప్రజలు ఆమోదముద్ర వేశారని ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ అన్నారు. ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంతో హరియాణా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని హామీ ఇచ్చారు.

ఆస్త్రా మిస్సైల్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ ఆస్త్రాను భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. గగనతలంలో కదులుతున్న లక్ష్యాన్ని తేజస్ యుద్ధ విమానం నుంచి ఆస్త్రా క్షిపణి నేరుగా ఛేదించింది. ఈ మిస్సైల్ పరీక్షలో అన్ని వ్యవస్థలు నిర్దేశిత పరామితులను అందుకున్నాయని రక్షణ శాఖ బుధవారం తెలిపింది. ఈ ఆస్త్రా క్షిపణిని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసింది. 100 కిలోమీటర్లకు పైగా దూరంలోని లక్ష్యాలను ఆస్త్రా ఛేదించగలదు. కచ్చితంగా లక్ష్యాన్ని ఛేదించేందుకు ఇందులో అధునాతన నావిగేషన్ సిస్టమ్ ఉంది.

విద్యా విధానం కాదు.. బీజేపీ విధానం

మరోసారి కేంద్రంపై విరుచుకుపడిన ఎంకే స్టాలిన్



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) జాతీయ విద్యా విధానం కాదని, బీజేపీ పార్టీ కాషాయ విధానమని ఆరోపించారు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి కాకుండా.. హిందీని అభివృద్ధి చేయడానికి రూపొందించిందన్నారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేయడమంటే దేశంలో విద్యను కాషాయీకరించడమేనన్నారు. ఎన్ఈపీ తమ రాష్ట్ర విద్యావిధానాన్ని సమూలంగా నాశనం చేస్తుందని చెప్పారు. ఎన్ఈపీ రిజర్వేషన్లకు అంగీకరించదని, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల ప్రజలు అభివృద్ధిని ఎన్ఈపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. వృత్తి విద్య పేరుతో ఆరో తరగతి నుంచే కుల ఆధారిత వృత్తులను అమలు చేస్తారని ఆరోపించారు. అలాంటి విధానాన్ని తమ రాష్ట్రంపై రుద్దేందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రయత్ని స్తున్నారని, కేంద్రం రూ.10వేల కోట్లు ఇచ్చినా అంగీకరించబోమని స్పష్టం చేశారు. హిందీపై దృష్టి పెట్టడం కంటే.. దేశాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తే మంచిదని హితవు పలికారు. విద్యావిధానానికి ముడిపెట్టి.. రాష్ట్రంలోని పాఠశాలలకు రావాల్సిన నిధులను నిలిపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వేల కోట్లు పెట్టినా సంస్కృతాన్ని అభివృద్ధి చేయలేం. ప్రజలు మాట్లాడని భాషను అభివృద్ధి చేయడానికి కోట్లు ఖర్చు చేస్తున్నారు. అత్యధిక ప్రజలు మాట్లాడుతున్న, అనేక దేశాల్లో గుర్తింపు పొందిన తమిళ భాషకు ద్రోహం చేయాలని చూస్తున్నారు. దీన్ని సహించబోం' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఏనాడైనా రాష్ట్రంలో సమస్యలపై చర్చించని కేంద్ర ప్రభుత్వం.. రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

అనుమానాస్పద మరణవాంగ్మూలంతో... నేర నిర్ధారణ తగదు: సుప్రీం

న్యూఢిల్లీ: అనుమానాస్పద మరణవాంగ్మూలం ఆధారంగా నేర నిర్ధారణ సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇతరత్రా గట్టి సాక్ష్యాధారాలు లేనప్పుడు కేవలం అలాంటి వాంగ్మూలాన్ని ఆధారంగా తీసుకోజాలమని స్పష్టం చేసింది. భార్యకు నిప్పంటించి హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తిని నిరపరాధిగా తేలుస్తూ న్యాయమూర్తులు సుధాన్షు ధూలియా, ఎ.అమానతుల్లా ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. అతనికి దిగువ కోర్టు విధించిన జీవితఖైదును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ''మరణ వాంగ్మూలం కీలక సాక్ష్యమన్నది నిస్సందేహం. దాని ఆధారంగా నేర నిర్ధారణ చేయడమూ సబబే. కానీ ఆ వాంగ్మూలమే అనుమానాస్పదమైన సందర్భాల్లో దాని ఆధారంగా నిందితున్ని దోషిగా నిర్ధారించడం సరికాదు. ప్రస్తుత కేసులో భార్య పరస్పరం పూర్తి విరుద్ధమైన వాంగ్మూలాలిచ్చింది. పైగా వరకట్న వేధింపులు జరగలేదని దర్యాప్తులో స్పష్టంగా తేలింది. ఇలాంటి సందర్భాల్లో కోర్టులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతర సాక్ష్యాలనూ పరిగణనలోకి తీసుకున్నాకే నిర్ణయానికి రావాలి'' అని సూచించింది.

ఎయిమ్స్ నుంచి ధన్‌ఖడ్ డిశ్చార్జి

న్యూఢిల్లీ: అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ బుధవారం డిశ్చార్జి అయ్యారు. గుండె సంబంధిత సమస్యతో ఈనెల 9న ఆయన ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే. 'వైద్య బృందం నుంచి అవసరమైన చికిత్సను అందుకున్న ధన్‌ఖడ్ సంతృప్తకరమైన స్థాయిలో కోలుకున్నారు. డిశ్చార్జి అయ్యారు' అని ఎయిమ్స్ తెలిపింది. కొద్ది రోజులు సంపూర్ణ విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.



మంచినీటి ట్యాంకర్లకు మహా డిమాండ్

మహా నగర పరిధిలో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. గత ఐదేళ్లలో ట్యాంకర్ల బుకింగ్ సుమారు 50 శాతానికి పైగా పెరిగింది. -8లో



హోలీ.. జోష్ హైలీ

హోలీ వస్తోందంటే నగరంలో సందడే సందడి. కుర్రకారును ఆకట్టుకునేందుకు ఈవెంట్ నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తుంటారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0/23.0

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
సా. 6.31 గం.	ఉ. 5.03 గం.

ఓయూలో ఉమెన్స్ డే వేడుకలు

పాల్గొన్న మంత్రి సీతక్క



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో బుధవారం జరిగిన మహిళా దినోత్సవంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీలో ప్రమోటింగ్ ఉమెన్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, ఫాస్టరింగ్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి సెక్రటరీ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, వీసీ ప్రొ.కుమార్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్ రెడ్డి, యూజీసీ డీన్ ప్రొ.లావణ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాగా.. ఓయూ ఆర్ట్స్ కాలేజీ కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్కకు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు వర్సిటీ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు.

గుర్తు తెలియని వాహనాలపై సమాచారం ఇవ్వండి

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని ప్రధాన రహదారులతో పాటు ఇతర మార్గాలు, కాలనీల్లోనూ అనేక ప్రాంతాల్లో గుర్తు తెలియని వాహనాలు కనిపిస్తుంటాయి. వీటిలో కొన్ని నెలలు, ఏళ్ల తరబడి అక్కడే ఉండిపోతాయి. వీటివల్ల స్థానికంగా ట్రాఫిక్ ఇబ్బందులు, క్యారేజ్ వేలు కుచించుకుపోవడం పరిపాటి. కొన్ని సందర్భాల్లో ఇలాంటివే అసాంఘిక శక్తులకు కలిసి వచ్చే అంశాలుగా మారతాయి. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న ఇలాంటి వాహనాలను తొలగించాలని ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ డి.జోయల్ డెవిస్ నిర్ణయించారు. సాధారణంగా ఈ వాహనాల్లో అత్యధికం ఏదో ఒక ప్రాంతంలో చోరీ అయినవే అయి ఉంటాయి. జాయ్‌రైడర్స్‌గా పిలిచే చోరులు వాహనాలను చోరీ చేసి, వాటిలో ఇంధనం అయిపోయే వరకు తిరిగి వదిలేస్తుంటారు. వీళ్లు వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవడం వంటివి చేయరు. కొందరు చోరులు కూడా మార్గమధ్యంలో చోరీ వాహనాలు ఆగిపోతే అక్కడే వదిలేసి వెళ్లిపోతుంది. ప్రాంతాల వారీగా రోడ్లపై కనిపించే వాహనాల సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. దీనికోసం ఇప్పటి ఉన్న ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 90102 03626తో పాటు ప్రత్యేకంగా 87126 60600ను కేటాయించారు. ఇలాంటి వాహనాలను చూసిన నగరవాసులు దాని ఫొటో లేదా వీడియోతో పాటు లొకేషన్ సైతం వాట్సాప్ ద్వారా షేర్ చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.

లైంగిక దాడి చేయించి.. మర్డర్ చేయిస్తా..

ఓ యువతిపై మరో యువతి వేధింపులు
అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

ఫిలింనగర్: ఒకే గదిలో అద్దెకు ఉంటున్న ఇద్దరు ప్రైవేటు ఉద్యోగినుల మధ్య స్వల్ప వాగ్వాదం అట్రాసిటీ కేసుకు దారి తీసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. టోలిచౌకి డీ-మార్ట్ వెనుక ఉన్న అల్-అమ్రా కాలనీలో కాకినాడకు చెందిన యువతి (24) డిజైనర్‌గా పని చేస్తూ మరో ఇద్దరు యువతులతో కలిసి షేరింగ్ రూమ్‌లో గత 10 నెలలుగా ఉంటోంది. అదే గదిలో ఉంటున్న మరో యువతి (27) అకారణంగా గొడవకు దిగుతూ మానసిక వేదనకు గురి చేయసాగింది. గదిలో తనను తీవ్ర ఇబ్బందులకు, న్యూసెన్స్‌కు గురి చేస్తోందని బాధితురాలు సదరు యువతిని తరచూ నిలదీసేది. కాగా.. ఇటీవల నిందితురాలు మరో యువతిని గదికి తీసుకువచ్చింది. వాట్సాప్‌లో అనవసర మెసేజ్‌లు పెడుతూ బాధితురాలిని మానసిక వేదనకు గురి చేసేది. ఏదైనా విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తే యువకులను తీసుకువచ్చి మరింత ఇబ్బందులకు గురి చేయసాగింది. ఇటీవల బాధితురాలికి తెలియకుండానే ఆమె ఫోన్ తీసుకుని ఓ యువకుడికి మెసేజ్ పంపింది. ఆమె వ్యక్తిగత ఖాతాను కూడా సేకరించి దుర్వినియోగపర్చింది. బాధితురాలిని మరింత ఇబ్బందులకు గురిచేసే క్రమంలో 'నిన్ను రేప్ చేయించి.. మర్డర్ చేయిస్తా'నంటూ హెచ్చరించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తానంటూ భయపెట్టింది. దీంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహా నగరంలో మరిన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు

ఖాజాగూడ, ట్రిపుల్ ఐటీ జంక్షన్ల వద్ద..

- రెండు రహదారుల విస్తరణ సైతం..
- రూ.650 కోట్లతో టెండర్లు పిలిచిన జీహెచ్ఎంసీ
- ట్రాఫిక్ సమస్య పరిష్కారమే ప్రధాన లక్ష్యం



హై.. హై సిటీ!



సాక్షి, సిటీబ్యూరో:

హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల్లో భాగంగా రెండు జంక్షన్ల వద్ద నాలుగు ఫ్లై ఓవర్లు.. రెండు అండర్‌పాస్‌లు.. రెండు రహదారుల విస్తరణ, అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ జాతీయ స్థాయి టెండర్లను పిలిచింది. ఈ పనుల నిర్మాణ వ్యయం దాదాపు రూ. 650 కోట్లు. టెండర్ల దాఖలుకు చివరి తేదీ వచ్చే నెల 9. గ్రేటర్ నగరంలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం ఇప్పటికే ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర వసతులు అందుబాటులోకి వచ్చాయి. పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మరిన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు సిద్ధమైన ప్రభుత్వం దాదాపు రూ.2,400 కోట్ల మేర పనులు చేపట్టాల్సిందిగా ఇటీవల జీహెచ్ఎంసీని ఆదేశించింది. అందుకనుగుణంగా ఇప్పటికే కేబీఆర్ పార్కు పరిసరాల్లో కొన్ని స్టీల్ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, ఫాక్స్ సాగర్ నాలా వద్ద ఫ్లై ఓవర్ పనులకు టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ.. తాజాగా ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్ల వద్ద మరికొన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లకు టెండర్లు ఆహ్వానించింది. వీటితో పాటు సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ, అంజయ్య నగర్ నుంచి రాంకీ టవర్ రోడ్ వరకు 150 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు ఆహ్వానించింది. జీహెచ్ఎంసీ నుంచి కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ నిధులు చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ పనుల్ని రెండేళ్లలో పూర్తి చేయాల్సిందిగా టెండరు నిబంధనల్లో పేర్కొంది. పనులు పూర్తయ్యాక రెండేళ్లపాటు అవసరాన్ని బట్టి మరమ్మతులు వంటివి చేయాల్సి ఉంటుంది.

తాజాగా టెండర్లు పిలిచిన పనులు

ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద..

- ఐఎస్‌బీ నుంచి డీఎల్ఎఫ్ రోడ్ వరకు రెండు వైపులా ప్రయాణానికి మొదటి వరుస ఫ్లై ఓవర్. నాలుగు లేన్లు. క్యారేజ్ వే వెడల్పు 7.5 మీటర్లు.
- ఐఎస్‌బీ నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు రెండో వరుసలో మరో ఫ్లై ఓవర్. మూడు లేన్లుగా ప్రయాణం. క్యారేజ్‌వే వెడల్పు 11 మీటర్లు.
- డీఎల్ఎఫ్ నుంచి బీహెచ్ఈఎల్ రోడ్ వైపు వెళ్లేందుకు రెండో వరుసలో మూడు లేన్ల ఫ్లై ఓవర్. క్యారేజ్‌వే వెడల్పు 11 మీటర్లు.
- గచ్చిబౌలి నుంచి బీహెచ్ఈఎల్ వరకు రెండు వైపులా ప్రయాణానికి ఆరు లేన్లతో అండర్‌పాస్. 11 మీటర్ల క్యారేజ్‌వే. వరద నీరు పోయే మార్గాలతో పాటు 2 లక్షల నీటి సామర్థ్యంతో సంప్ నిర్మాణం.

ఖాజాగూడ జంక్షన్ వద్ద..

- నానక్‌రామ్‌గూడ - టోలిచౌకి రోడ్ వరకు మూడు లేన్లతో ఫ్లై ఓవర్. క్యారేజ్‌వే 9.5 మీటర్లు.
- టోలిచౌకి రోడ్- బయోడైవర్సిటీ వరకు మూడు లేన్లతో అండర్‌పాస్. క్యారేజ్‌వే 11 మీటర్లు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లతో పాటు వాటి కింద డక్ట్ నిర్మాణం. వరదనీరు పోయే మార్గాలతో పాటు సంప్ నిర్మాణం.
- ఈ పనులతో పాటు ఆయా జంక్షన్ల వద్ద రోడ్ల పునరుద్ధరణ, ఫుట్‌పాత్‌లు, లైటింగ్, ఇతరత్రా సదుపాయాలతో ఆధునికీకరణ. సైబరాబాద్ సీపీ కార్యాలయం - గచ్చిబౌలి జంక్షన్ వరకు, అంజయ్యనగర్ -రాంకీ టవర్ రోడ్ వరకు రోడ్లను వెడల్పు చేసి సాఫీగా ప్రయాణం సాగేలా ఆధునికీకరించాలి.

ఇదివరకే టెండర్లు పిలిచిన పనులు

ప్యాకేజీ - 1 కింద రూ. 580 కోట్ల అంచనా వ్యయంతో..

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36 నుంచి కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ వరకు మొదటి వరుస ఫ్లై ఓవర్.
- యూసుఫ్‌గూడ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు రెండో వరుస ఫ్లై ఓవర్.
- కేబీఆర్ పార్కు ఎంట్రన్స్ జంక్షన్ వద్ద జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి క్యాన్సర్ హాస్పిటల్ రోడ్ వరకు అండర్‌పాస్.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు ఫ్లై ఓవర్.
- ముగ్ధ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రన్స్ రోడ్ నుంచి పంజగుట్ట రోడ్ వరకు అండర్‌పాస్.

ప్యాకేజీ-2 కింద .. రూ. 510 కోట్ల అంచనా వ్యయంతో..

- రోడ్ నంబర్-45 జంక్షన్ వద్ద ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 వరకు ఫ్లై ఓవర్.
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ వద్ద మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ నుంచి రోడ్ నంబర్ 45 జంక్షన్ వరకు అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు ఫ్లై ఓవర్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ వద్ద కేన్సర్ హాస్పిటల్ రోడ్ నుంచి ఫిల్మ్ నగర్ రోడ్ వరకు అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 వరకు ఫ్లై ఓవర్.
- కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు అండర్‌పాస్.
- మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 వరకు ఫ్లై ఓవర్.

ఆయా ఫ్లై ఓవర్ల నిర్మాణాలు పూర్తయితే కోర్ సిటీలోని వివిధ ప్రాంతాల నుంచి పశ్చిమం వైపు.. ఐటీ కారిడార్లకు రాకపోకలు చేసేవారికి సమయం, వ్యయ ప్రయాసలు తప్పుతాయని అధికారులు పేర్కొన్నారు.

వడివడిగా అడుగులు..



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌సీడీఏ)ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు భూ సేకరణ ప్రక్రియ మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా 625 ఎకరాలను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. వేర్వేరు చోట్ల గుర్తించిన భూముల్లో ఒకచోట ఏఐ సిటీని ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరో చోట ఇతర ఐటీ కంపెనీల హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రతిపాదనలు తయారు చేసింది. ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్న పట్టణాభివృద్ధి సంస్థ.. ఫార్మా, ఐటీ, లైఫ్ సైన్సెస్, స్పోర్ట్స్ హబ్‌లకు స్థలాలను నిర్దేశించింది. ఇటీవల నాగిరెడ్డి పల్లిలో భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం తాజాగా మహేశ్వరం, కందుకూరు మండలాల్లోనూ మరికొంత భూమిని సమీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారికి శరవేగంగా భూ సేకరణ జరుపుతున్న సర్కారు.. ప్రస్తుతం నయా నగరిలో ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూ సేకరణ చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో భూ లభ్యతపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం.. అసైన్డ్ భూముల వివరాలను సేకరిస్తోంది.

కొంగర కుర్దులో ఏఐ సిటీ..

- తిమ్మాయిపల్లిలో ఐటీ పార్కు
- 625 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- టెక్నికల్ బిడ్‌లకు ఆహ్వానం
- ఫోర్త్‌సిటీ అభివృద్ధి పనులు చకచకా

ఐటీ, పారిశ్రామిక పార్కుల కోసం..

మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామ పరిధిలోని కొంగరకుర్దు సర్వే నంబర్ 289లోని 94 మంది రైతుల నుంచి 275.12 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూముల్లో ఐటీ, ఇండస్ట్రీయల్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు అందులో పేర్కొంది. అయితే.. ప్రతిపాదిత భూములను ఏఐ సిటీకి కేటాయించనున్నట్లు తెలిసింది. 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సిటీని అభివృద్ధి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిపాదిత రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సమీపంలో ఉన్న అసైన్డ్ భూములను సేకరించి.. ఏఐ సిటీ కోసం కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అలాగే.. కందుకూరు మండలం తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లోని 439 మంది రైతుల నుంచి 350.22 ఎకరాల భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం కూడా చెల్లించనున్నట్లు పేర్కొంది.

రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లు..

మీర్‌ఖాన్‌పేట వద్ద యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులను మేఘా సంస్థకు అప్పగించింది. పనులు కూడా చకచకా సాగుతున్నాయి. మరో వైపు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్ పేట మీదుగా ఆర్ఆర్ఆర్ వరకు 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేపట్టింది. దారి పొడవునా.. రోడ్డుకు ఇరువైపులా హద్దురాళ్లను కూడా పాతే పనిలో నిమగ్నమైంది. మొదటి దశలో రావిరాల నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 19.2 కిలోమీటర్లకు రూ.1,665 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా మీర్‌ఖాన్‌పేటు నుంచి ఆర్ఆర్ఆర్ వరకు 22.30 కిలోమీటర్లకు రూ.2365 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఆ మేరకు టెక్నికల్ బిడ్‌లను ఆహ్వానించింది.

నకిలీ కస్టమర్ కేర్ నంబర్‌తో మోసం

ఏపీకే ఫైల్ పంపి రూ.1.9 లక్షలు స్వాహా



సాక్షి, సిటీబ్యూరో: గూగుల్‌లో కనిపించిన నకిలీ కస్టమర్ కేర్ నంబర్‌ను నమ్మి నష్టపోయిన ఉదంతం ఇది. సంస్థ ప్రతినిధులుగా మాట్లాడిన అవతలి వాళ్లు ఏపీకే ఫైల్ పంపి రూ.1.9 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి.. ఎండల తీవ్రత పెరగటంతో తన ఏసీకి మరమ్మతులు చేయించాలని భావించారు. దీంతో ఓ కంపెనీ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశారు. అందులో లభించిన ఓ నకిలీ నంబర్‌ను అసలైనదిగా భావించి ఫోన్ చేశారు. దీంతో ఆ కాల్ నంబర్ పొందుపరిచిన సైబర్ నేరగాళ్లకు చేరింది. ఆయనతో సంప్రదింపులు జరిపిన కేటుగాళ్లు.. మరమ్మతు కోసం ఎగ్జిక్యూటివ్‌ను పంపుతామని అంగీకరించారు. దానికోసం కొన్ని వివరాలు పొందుపరచాలంటూ లింకు పంపారు. ఆ లింకులో సైబర్ నేరగాడు ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్ నిక్షిప్తం చేశారు. బాధితుడు పొరపాటున లింక్ క్లిక్ చేశాడు. అందులో వ్యక్తిగత వివరాలు పొందుపరిచి, రూ.10 చెల్లించాలని ఉండటంతో అనుమానం వచ్చి ఆ పని చేయలేదు.

అయితే.. ఏపీకే ఫైల్స్‌లో నిక్షిప్తం చేసిన మాల్‌వేర్ అప్పటికే ఆయన ఫోన్‌లో నిక్షిప్తమైంది. అది ఇన్‌స్టాల్ కావడంతోనే ఆ ఫోన్ మొత్తం నేరగాళ్ల అధీనంలోకి వెళ్లింది. ఇలా ఫోన్ ద్వారా జరిగే లావాదేవీలతో పాటు వచ్చే ఎస్సెమ్మెస్‌లు సైతం యాక్సెస్ చేయగలిగిన సైబర్ నేరగాళ్లు బాధితుడి నెట్ బ్యాంకింగ్ నుంచి ఆర్థిక లావాదేవీలు చేస్తూ, ఓటీపీలను వినియోగించి రూ.1.9 లక్షలు కాజేశారు. మరుసటి రోజు తన సెంట్రల్ బ్యాంక్ ఖాతాను పరిశీలించిన బాధితుడికి ఈ విషయం తెలిసింది. దీంతో సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు లింకులు, సందేశాలు సహా వివిధ రూపాల్లో పంపిస్తారని, వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. ఏదైనా సందేశం, లింకు వచ్చినప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలని దాని చివరలో.. ఏపీకే అనే అక్షరాలతో ఉన్న ఫైల్ కనిపిస్తే ఇన్‌స్టల్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వెంటనే డిలీట్ చేయాలని సూచిస్తున్నారు. కస్టమర్ కేర్ నంబర్ల కోసం ఆయా కంపెనీల అధికారిక వెబ్‌సైట్ల పైనే ఆధారపడాలని, గూగుల్‌లో కనిపించే అన్ని నంబర్లను గుడ్డిగా నమ్మవద్దని సూచిస్తున్నారు.

ప్లాట్‌ఫాంపైనే ప్రసవం

అండగా నిలిచిన ఆర్‌పీఎఫ్ మహిళా పోలీసులు



తల్లీబిడ్డలను గాంధీ ఆసుపత్రికి తరలిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: ప్లాట్‌ఫాంపై ప్రసవ వేదనకు గురవుతున్న ఓ మహిళకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అండగా నిలిచారు. అంబులెన్స్‌ను రప్పించారు. అప్పటికే సమయం మించిపోవడంతో మహిళా కానిస్టేబుళ్ల సహాయంతో అవసరమైన ఏర్పాట్లు చేయించి సదరు మహిళ సుఖ ప్రసవం వరకు అండగా నిలిచి తమ ఉదారత్వాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దుండిగల్‌లో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన ఇటుక బట్టీ కార్మికురాలు తబ్బా మహాజీ (21) నిండు గర్భిణి. భర్తతో కలిసి జనరల్ టికెట్‌తో విశాఖపట్నం వెళ్లేందుకు మంగళవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఆరో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగి ఉన్న విశాఖపట్నం రైలు ఎక్కేందుకు సమాయత్తమవుతున్న సమయంలో మహాజీకి పురిటి నొప్పులు వచ్చాయి. ప్రసవ వేదనకు గురవుతున్న సదరు మహిళ పరిస్థితిని అక్కడే ఉన్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మహేక్ గుర్తించారు. సమీపంలో బందోబస్తు విధుల్లో ఉన్న ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లను రప్పించి మహాజీకి అండగా ఉంచి అంబులెన్స్‌ను రప్పించారు. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోవడంతో రైల్వేస్టేషన్‌కు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది మహాజీకి ప్రసవం చేశారు. తబ్బా మహాజీ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం తల్లీబిడ్డలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

7 సబ్జెక్టుల్లో హెచ్‌సీయూ అదుర్స్



రాయదుర్గం: ప్రపంచంలోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) అత్యుత్తమ వర్సిటీగా గుర్తింపు దక్కించుకుంది. లండన్‌కు చెందిన క్వాక్వరెల్లి సైమండ్స్ (క్యూఎస్) సంస్థ బుధవారం వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025ను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 100 ప్రాంతాల్లో కొనసాగుతున్న 1,700 కంటే ఎక్కువ విశ్వవిద్యాలయాలలో పని తీరు ఆధారంగా సర్వే చేసి ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. 2025 సంవత్సరానికి గాను మన హెచ్‌సీయూ ఏడు సబ్జెక్టుల్లో మంచి ర్యాంకింగ్ సాధించినట్లు అందులో పేర్కొంది. సబ్జెక్టుల వారీగా.. ఇంగ్లిష్ లాంగ్వేజ్- లిటరేచర్‌లో 251- 300 ర్యాంకింగ్, లింగ్విస్టిక్స్‌లో 301-350, సోషియాలజీలో 310-375, కెమిస్ట్రీలో 451-500, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్‌లో 501-550, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీలో 601-675, బయాలాజికల్ సైన్సెస్‌లో 651-700 ర్యాంకింగ్‌లను హెచ్‌సీయూ సాధించింది. ఈ సందర్భంగా మరింతగా శ్రమించి హెచ్‌సీయూ ఉనికిని విస్తరిస్తామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు స్పష్టం చేశారు. భవిష్యత్తులో అన్ని సబ్జెక్టులలో మెరుగైన ప్రతిభ చాటేందుకు కృషి చేస్తామన్నారు.



హోలీ సందర్భంగా సిటీలో ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: హోలీ నేపథ్యంలో నగరంలో ఆంక్షలు విధిస్తూ నగర సీపీ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 6 నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ఇవి అమలులో ఉంటాయి. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు మీద వెళ్లేవారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాగే రోడ్లపై గుంపులుగా తిరగ వద్దని స్పష్టంచేశారు. వీటిని అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచ్-2, హైదరాబాద్
ఇం.నం.1-8-563/1, 1వ అంతస్తు, సంధ్య థియేటర్ ఎదుట, RTC క్రాస్ రోడ్స్, చిక్కడపల్లి, హైదరాబాద్ -500020. ఫోన్: 040-23461610, ఇమెయిల్: sbi.20945@sbi.co.in

1) శ్రీ పడిగెల సచిన్ కుమార్ తండ్రి పి.దత్తాత్రేయ (గణేష్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో రుణగ్రహీత కమ్ తనఖాదారు), ఇం.నం.5-1-34, వాసవి నిలయం, రాణి సతీజీ రోడ్, ఆదిలాబాద్ 504001. 2) M/s. గణేష్ జిన్నింగ్ ఫ్యాక్టరీ, (ప్రాతినిధ్యం వహిస్తున్న దాని ప్రొప్రయిటర్ శ్రీ పి.సచిన్ కుమార్ తండ్రి పి.దత్తాత్రేయ (లేటు)), 3-1-264/1B, రాంపూర్ రోడ్, ఆదిలాబాద్ -504001. 3) శ్రీ పడిగెల సచిన్ కుమార్ తండ్రి పి.దత్తాత్రేయ ఫ్లాట్ నం.506, 5వ అంతస్తు, బ్లాక్ B, SVSS సంకల్ప్, ఇం.నం. 1-2-597/36 నుండి 41 మరియు 42/2, సర్వే నం. 52-A & 53-A (పాత సర్వే నం.లు 84,85,86 మరియు 87), లోయర్ ట్యాంక్ బండ్ రోడ్ వెనుక, ఇందిరా పార్క్ ప్రక్కన, దయారా (దహుల్‌పూర్) గ్రామం, Ex తాలూకా వెస్ట్ అర్బన్, దోమలగూడ, గగన్‌మహల్ గ్రామం, హిమాయత్‌నగర్ మండలం, హైదరాబాద్
డియర్ సర్/మేడమ్,
శ్రీ పడిగెల సచిన్ కుమార్ తండ్రి పి.దత్తాత్రేయ (లేటు)కు చెంది ఉండి, ఫ్లాట్ నం.506, 5వ అంతస్తు, బ్లాక్ B, SVSS సంకల్ప్, ఇం.నం. 1-2-597/36 నుండి 41 మరియు 42/2, సర్వే నం. 52-A & 53-A (పాత సర్వే నం.లు 84,85,86 మరియు 87), లోయర్ ట్యాంక్ బండ్ రోడ్ వెనుక, ఇందిరాపార్క్ ప్రక్కన, దయారా (దహుల్‌పూర్) గ్రామం, Ex తాలూకా వెస్ట్ అర్బన్, దోమలగూడ, గగన్‌మహల్ గ్రామం, హిమాయత్‌నగర్ మండలం, హైదరాబాద్ లోగల హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ స్వాధీనత - ఆవరణ నుండి ఆర్టికల్స్ తొలగింపు.
18-12-2023న Crl.M.P.No. 2194 ఆఫ్ 2023 ప్రకారం అడ్వకేట్ కమిషనర్ ద్వారా జప్తు చేయబడిన ఫ్లాట్ నం.506, 5వ అంతస్తు, బ్లాక్ B, SVSS సంకల్ప్, ఇం.నం. 1-2-597/36 నుండి 41 మరియు 42/2, సర్వే నం. 52-A & 53-A (పాత సర్వే నం.లు 84,85,86 మరియు 87), లోయర్ ట్యాంక్ బండ్ రోడ్ వెనుక, ఇందిరాపార్క్ ప్రక్కన, దయారా (దహుల్‌పూర్) గ్రామం, Ex తాలూకా వెస్ట్ అర్బన్, దోమలగూడ, గగన్‌మహల్ గ్రామం, హిమాయత్‌నగర్ మండలం, హైదరాబాద్ లోగల హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్‌ను స్వాధీనం చేసుకోవలసిందిగా కోరడమైనది. హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ తొలగింపు కొరకు నోటీసులు 02-09-2024, 08-01-2025, 11-02-2025 & 10-03-2025 తేదీలలో రిజిస్టర్ పోస్టుల ద్వారా మీకు పంపబడినవి.
మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ ఆవరణ నుండి హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్‌ను ఇప్పటికీ తొలగించలేదు. అందువలన మీరు, ఈ నోటీసు నుండి 7 రోజులలోగా సదరు ఆవరణలోగల హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ తొలగించవలసిందిగా కోరబడుచున్నారు. లేనిచో బ్యాంక్ క్లెయిమ్ చేయని హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్‌ను వేలం వేస్తుంది మరియు సదరు మొత్తాలు సేఫ్ కీపింగ్ ఛార్జీల నిమిత్తం ఉపయోగించబడతాయి. సేఫ్ కీపింగ్ ఛార్జీలకు ఉపయోగించిన తరువాత ఏదైనా మిలిగిన మొత్తం శ్రీ పడిగెల సచిన్ కుమార్ తండ్రి పి.దత్తాత్రేయ (లేటు) పేరున పే ఆర్డరుగా ఉంచబడుతుంది.
తేది: 12.03.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ SBI, SARB-2, హైదరాబాద్

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
మీ ఆప్తులకై ప్రేమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, విషాదాలు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సాక్షిలో ప్రకటనల ద్వారా తెలియజేసే అవకాశం.
ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, D-ఫార్మసీ, B-ఫార్మసీ, GNM నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, MCA, PhD. (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO సర్టిఫైడ్) 8866977112 [HA-15117]

Real Estate
HOUSE FOR SALE
■ 3 BHK House Balapur for Sale for 1.60 Crores. Contact : Malleswara : 9676924785 [HA-57179]

PLOT FOR SALE
■ DTCP TS RERA Approved New Launching Premium Villa Plots Meerkhanpet & Kadthal @ Sri-sailam Highway. Call: 9553147826 [SCA25002055]

Services
BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800526]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, K Haritha Reddy W/o, K Sunil Kumar Reddy R/o Plot No. 146 Manchenpally Enclave Bandlaguda Jagir Hyderabad-500086, have changed my name to Gurram Haritha Rani. [DA-41832]
■ I, NEERUDU SHRIKANTH S/o. NEERUDU CHANDRAIAH, R/o. 8-2-601/G/212, Road No.10, Gowri Shankar Colony, Near Ramalayam, Banjara Hills, Hyderabad -500034, TS, shall henceforth be known as NEERUDU SRIKANTH. [HA-4374]
■ I, Magapu Srinivas S/o Magapu Sheshagiri R/o: H.no 4-32/1561-3/A Phase-II, Allwyn Colony Kukatpally. Wrongly Enter My Son Name As Magapu Durga Sathya Venkata Sairam to Magapu Durga Satya Venkatasairam S/o Magapu Srinivas (New Name) [SCA25002119]
■ I, Puram Vimala, W/o. Puram Bhupal Reddy. R/o. H.No.17-1-382/K/ SB/42 Sri Balaji Nagar, Saidabad, Hyd. Change My Name as Vimalamma Vadyala to PURAM VIMALA. [SCA25002125]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]

Wanted
■ నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలం 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి ఎర్న్ 3K - 30K. రోజా 9948828641 [SCA25002106]
■ ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్, క్యాషియర్స్, డిస్పాచర్స్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 15000 - 21000. అడ్రస్: పిల్లర్ నెం.ఎ119, నిమ్స్ హాస్పిటల్ ఎదురుగా, ఎల్‌జి షోరూం పైన 2వ ఫ్లోర్. Contact / Whatsapp: 8977514045 [SCA25002104]
■ హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్: 8019373131 [H-800524]
■ ఇంట్లోనే ఉండి పనిచేయుటకు ఇంటి, వంటపనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్ళు కావలెను. జీ: 18k-25k, ఫోన్: 8919080878 [SCA25002043]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

మంచినీటి ట్యాంకర్లకు
మహా డిమాండ్!



సాక్షి, సిటీబ్యూరో: నలు దిశలా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగర పరిధిలో వాటర్ ట్యాంకర్లకు యేటా డిమాండ్ పెరుగుతోంది. గత ఐదేళ్లలో ట్యాంకర్ల బుకింగ్ తీరును పరిశీలిస్తే సుమారు 50 శాతం పైగా పెరిగినట్లు జలమండలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా ఏర్పాటవుతున్న బహుళ అంతస్తుల భవనాలతో విచ్చలవిడిగా..అత్యంత లోతుగా బోర్ల తవ్వకాలు జరిగి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వేసవి వచ్చిందంటే నీటి వినియోగం మరింత పెరిగి ట్యాంకర్లకు డిమాండ్ రెట్టింపు అవుతోంది. మొత్తం మీద సుమారు 42 వేల బహుళ అంతస్తుల భవన సముదాయాల నుంచి అత్యధికంగా వాటర్ ట్యాంకర్ల బుకింగ్ జరుగుతున్నట్లు ఇటీవల జలమండలి గుర్తించింది. హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి, ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, మణికొండ, నిజాంపేట్ డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ల పరిధిలో సుమారు 500 నుంచి 10 వేలవరకు ట్యాంకర్ల బుకింగ్ జరుగుతున్నట్లు సమాచారం.

గత ఐదేళ్లలో ఇలా..

మహానగర పరిధిలో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ పరిశీలిస్తే.. జనవరి నుంచి జూన్ రెండో వారం వరకు ట్యాంకర్లకు తాకిడి అధికంగానే ఉంటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి యేటా ట్యాంకర్ల డిమాండ్ కనీసం 10 నుంచి 15 శాతం పెరుగుతూ వస్తోంది. గత ఐదేళ్లలో డిమాండ్ పరిశీలిస్తే ఈ ఏడాది జనవరి నుంచే తాకిడి పెరిగింది. గతేడాదితో పోల్చితే అదనంగా సుమారు 46 శాతం ఎగబాకింది. అదేవిధంగా ఫిబ్రవరి నెలలో సైతం అదే విధంగా నమోదైంది. సాధారణంగా మార్చి నెలలో ట్యాంకర్లకు డిమాండ్ కనీసం 30 నుంచి 50 శాతం వరకు అదనంగా ఉంటుంది. అయితే ఈ సారి మార్చి నుంచి మూడు నెలల పాటు ఉష్ణోగ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ట్యాంకర్లకు డిమాండ్ కూడా ఈసారి అదనంగా 60 నుంచి70 శాతం ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ట్యాంకర్లు, ఫిల్లింగ్‌స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లను పెంచి నీటిని సరఫరా చేసేవిధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు.

- మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఆరు ఫిల్లింగ్ పాయింట్స్, 80 ట్యాంకర్లు ఉన్నాయి. రోజుకి 600 ట్రిప్పులు డెలివరీ జరుగుతోంది. 80 శాతం బుకింగ్స్‌ను 6 నుంచి 12 గంటల్లో డెలివరీ చేస్తుండగా..మిగిలిన 20 శాతం 24 గంటల్లో డెలివరీ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో 1200 బుకింగ్స్ వచ్చినా డెలివరీ చేసే సామర్థ్యం ఉందని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.
- బంజారాహిల్స్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 8 ఫిల్లింగ్ పాయింట్స్, 44 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 300 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. ఎర్రగడ్డ ఫిల్లింగ్ స్టేషన్‌లో 4 ఫిల్లింగ్ పాయింట్స్, 29 ట్యాంకర్లు ఉండగా రోజుకి 150 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు.

నాలుగేళ్లలో ట్యాంకర్ల డిమాండ్ ఇలా..	సంవత్సరం	2021	2022	2023	2024	2025
	జనవరి	55,175	62,600	74,870	81,821	1,19,752
	ఫిబ్రవరి	75,782	72,480	86,492	1,12,921	150,152

ప్రస్తుతం ట్యాంకర్లు..	
ఫిల్లింగ్ స్టేషన్లు	: 79
ఫిల్లింగ్ పాయింట్లు	: 123
ట్యాంకర్లు	: 907

తాగునీటి వృథాపై మరొకరికి జరిమానా!

- వారం వ్యవధిలో రెండో ఘటన
- తాగు నీటి సరఫరా సమయంలో పరిశీలన
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించే వారిపై జలమండలి కొరఢా ఝులిపిస్తోంది. వారం రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లో తన ఇంటి ముందు తాగునీటితో బైక్ వాష్ చేసిన వ్యక్తికి ఫైన్ వేయగా.. తాజాగా ఇలాంటి పనే చేసిన మరో వ్యక్తికీ అధికారులు జరిమానా విధించారు. జూబ్లీహిల్స్ ఘటన తర్వాత..జలమండలికి తాగునీటి వృథాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడంతో పాటు ఆయా ప్రాంతాల అధికారులకు నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో జీఎంలు తమ పరిధిలో.. తాగునీరు సరఫరా చేసే సమయంలో తమ సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా తాగునీరు వృథా చేసినట్లు గమనిస్తే.. వెంటనే నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. అందులో భాగంగా నే..డివిజన్-6 జీఎం హరిశంకర్..తమ మేనేజర్‌తో కలిసి తనిఖీలు చేస్తుండగా.. జర్నలిస్టు కాలనీలో ఒక మహిళ తాగునీటితో వాహనం శుభ్రం చేయడం గుర్తించారు. జలమండలి నిబంధనలు ఉల్లంఘించినందుకు వారికి రూ.1000 ఫైన్ వేశారు. ఎవరైనా తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి అధికారులు హెచ్చరించారు.

బై బ్యాక్ పేరుతో బురిడీ

అక్రమంగా రూ.12 కోట్లు డిపాజిట్ల సేకరణ
ఇద్దరు నేరస్తుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: బై బ్యాక్ స్కీమ్ పేరుతో అమాయకులను బురిడీ కొట్టించిన ఆర్థిక నేరస్తులను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కర్రి సురేష్, ఎ.వెంకటేష్, బాపట్లకు చెందిన ఎం. వంశీకృష్ణ కూకట్‌పల్లిలో 'వీ ఓన్ ఇన్‌ఫ్రా' పేరుతో కంపెనీ ప్రారంభించారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే ప్రతీ నెలా అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ పెట్టారు. కస్టమర్ల నుంచి డిపాజిట్లు సేకరించేందుకు ఆకర్షణీయమైన స్కీమ్‌లను ప్రకటించారు. రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తే 25 నెలల పాటు నెలకు రూ.20 వేల చొప్పున రీఫండ్ అందించడంతో పాటు 25 నెలల తర్వాత కట్టిన రూ.5 లక్షల డిపాజిట్ కూడా తిరిగి ఇస్తామని ఆశ పెట్టారు. అంతేకాకుండా డిపాజిట్ చేసే కస్టమర్‌కు ఒక గుంట వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. మరో స్కీమ్‌లో రూ.లక్ష డిపాజిట్ చేసే కస్టమర్లకు 36 నెలల పాటు నెలకు రూ.6 వేల చొప్పున వడ్డీ చెల్లించడంతో పాటు 36 నెలల తర్వాత డిపాజిట్ సొమ్ము రూ.లక్ష కూడా వాపస్ ఇస్తామని తెలిపారు. దీంతో వడ్డీలకు ఆశ పడిన సుమారు వంద మంది కస్టమర్లు దాదాపు రూ.12 కోట్లు డిపాజిట్ చేశారు. కస్టమర్లను నమ్మించేందుకు కొన్ని నెలల పాటు వడ్డీలు చెల్లించిన కంపెనీ ప్రతినిధులు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కంపెనీ బోర్డు తిప్పేశారు. దీంతో 25 మంది బాధితులు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు..వెంకటేష్, వంశీకృష్ణలను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సురేష్ కోసం గాలిస్తున్నారు.

హీరో నాగార్జున పరువునష్టం కేసులో విచారణ వాయిదా


సిటీకోర్టులు: తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్) లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లను దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను మార్చి 28కు వాయిదా వేసింది. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కేసు నమోదైన సంగతి విదితమే.

పరువు నష్టం కేసులో విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ కేసు విచారణకు ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కాగా ఫిర్యాదుదారుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ఫిర్యాదుదారుడిని ఎగ్జామిన్ చేసింది. వచ్చే వాయిదాలో ఫిర్యాదుదారుడిని క్రాస్ ఎగ్జామిన్ చేయాలని సీఎం రేవంత్ తరుపు న్యాయవాదులకు కోర్టు సూచించింది. అనంతరం విచారణను మార్చి 20కి వాయిదా వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి తరుపు న్యాయవాదులు విశ్వేశ్వర్‌రావు, కుర్మ నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీపై అసత్య ఆరోపణలు చేశారని కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం కేసు వేసిన విషయం విదితమే.

దైవ ఉద్యమానికి సహకరించండి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరిన రంగరాజన్



వెంకయ్యనాయుడుతో అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: దైవానికి రాజ్యాంగ బద్ధమైన అధికారాల కోసం చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి జరుగుతున్న ఉద్యమానికి సహకరించాలని అర్చకుడు రంగరాజన్.. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని వెంకయ్యనాయుడు నివాసంలో ఆయనను కలిసి విన్నవించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. దేశంలో రామరాజ్య పునఃస్థాపన రాజ్యాంగబద్ధంగా జరగాలని.. సుప్రీం కోర్టుకు తన పరిధి గురించి తెలిపేవిధంగా పిటిషన్స్ కమిటీ రఘురామకృష్ణకు సమర్పించిన లేఖ గురించి వెంకయ్యనాయుడుకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని రంగరాజన్ తెలిపారు.

చికెన్ సెంటర్‌లో గంజాయి

2.5 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మొయినాబాద్: చికెన్ సెంటర్‌లో గంజాయి విక్రయం కలకలం రేపింది. పోలీసుల తనిఖీలో 2.5 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి తీసుకొచ్చిన వ్యక్తి పరారు కాగా విక్రయించే యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మహబూబ్ అనే యువకుడు అజీజ్‌నగర్‌లో ఓ గదిలో అద్దెకు ఉంటూ అదే ప్రాంతంలోని ఏజీఆర్ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. చికెన్ సెంటర్‌లో పనిచేస్తూనే అదనపు సంపాదన కోసం తాను అద్దెకు ఉండే గదిలో గంజాయి విక్రయిస్తున్నాడు. కాగా బుధవారం నగరంలోని ధూల్‌పేట్ నుంచి ఓ వ్యక్తి రూ.20 వేలు విలువ చేసే 2.5 కిలోల గంజాయి తీసుకొచ్చి చికెన్ సెంటర్‌లో మహబూబ్‌కు విక్రయించాడు. ముందుగానే పసిగట్టిన పోలీసులు చికెన్ సెంటర్ వద్దకు రాగానే గంజాయి తీసుకొచ్చిన వ్యక్తి పారిపోయాడు. పోలీసులు చికెన్ సెంటర్‌లో తనిఖీ చేయగా 2.5 కిలోల గంజాయి లభించింది. అక్కడే ఉన్న మహబూబ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ధూల్‌పేట్ నుంచి తెచ్చే గంజాయిని తాను గదిలో పెట్టి అవసరమైనవారికి విక్రయిస్తానని అంగీకరించాడు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైకులు దొంగిలిస్తున్న మైనర్ అరెస్ట్

- 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో హుస్సేనీ ఆలం పోలీసులు

చార్మినార్: గుట్టు చప్పుడు కాకుండా ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న మైనర్ నిందితున్ని అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించినట్లు చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. నిందితుని వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మరో మైనర్ నిందితుని కోసం వెతుకుతున్నామన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని పంచమహల్లాలో నివాసముంటున్న మహమ్మద్ ఎజాజ్ ఈ నెల 5వ తేదీన రంజాన్ ప్రార్థనలు ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు పరిశీలించగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. వెంటనే పరిసర వీధుల్లో వెతికినా.. ప్రయోజనం కనిపించకపోవడంతో.. ఈ నెల 6న హుస్సేనీ ఆలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 11న దొంగిలించిన వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ మైనర్ హుస్సేనీ ఆలం పోలీసులకు చిక్కాడు. వెంటనే విచారణ కొనసాగించిన పోలీసులకు ద్విచక్ర వాహనాల దొంగతనాలు వెలుగు చూశాయి. తన స్నేహితుడైన మైనర్ నిందితునితో కలిసి వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, మీర్‌పేట పరిధిలో ఒకటి, మొగల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి.. చొప్పున 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మైనర్‌ను జ్యువైనల్ హోంకు తరలించారు. వీటి విలువ దాదాపు రూ.2.30 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

'ఈఎన్‌టీ'లో సిబ్బంది కొరతను పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్ల కొరత ఉందని, ఈ సమస్యను పరిష్కరించేవిధంగా కృషి చేయాలని టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనికి ఈఎన్‌టీ టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు తూంకుంట రాజు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎన్‌టీ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్ల ఉద్యోగుల కొరత ఉన్నందున రోజు 1,500 నుంచి రెండు వేలమంది రోగులకు మందులు అందించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. తద్వారా మెడికల్ స్టోర్స్, సబ్‌స్టోర్స్ నిర్వహించడంలో సిబ్బందికి పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలకు కావాల్సిన మిషనరీలను నిర్వహించేందుకు సైతం ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనిలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రవి, సునీల్, సురేందర్ రెడ్డి, అర్షద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనిలకు వినతి పత్రం సమర్పిస్తున్న తూంకుంట రాజు తదితరులు

15 రోజులు.. 4 చోరీలు

- కరడుగట్టిన దొంగ శంకర్‌నాయక్ అరెస్టు
- ఇప్పటికే వందకుపైగా దొంగతనాలు.. పలుమార్లు జైలుకు సైతం..



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి

లాలాపేట: బీఫార్మసీ పూర్తి చేసినా..జల్సాల కోసం చోరీలకు తెగబడుతున్న కరడుగట్టిన దొంగ శంకర్‌నాయక్‌ను మరోసారి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అతన్ని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. అనంతరం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి తదితరులు మాట్లాడుతూ శంకర్ నాయక్ దొంగతనాల చిట్టా విప్పారు. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలపై అందిన పలువురి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా విశ్వసనీయ సమాచారంతో శంకర్ నాయక్‌తో పాటు మరో దొంగను ఎల్బీనగర్‌లో అరెస్ట్ చేసి రూ.9 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే వందకు పైగా దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి..ఈ మధ్యనే బెయిల్‌పై బయటకు వచ్చిన శంకర్‌నాయక్..15 రోజుల వ్యవధిలోనే 4 చోరీలకు పాల్పడిన్నట్లు పోలీసులు వివరించారు. ఓయూ పీఎస్‌తో పాటు పటాన్‌చెరు, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. శంకర్‌నాయక్ నుంచి 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దొంగిలించిన వస్తువుల వివరాలను పేపర్‌పై రాసి గోడకు అతికించడంతో పాటు..ఏ ఇంట్లో ఎలా..ఏమేం చోరీ చేశాడో కూడా శంకర్ నాయక్ తన డైరీలో రాసుకుంటాడని పోలీసులు వివరించారు.

కులగణనతో అభివృద్ధి సాధ్యం: ప్రొఫెసర్ కంచ ఐలయ్య

సాక్షి, సిటీబ్యూరో: కుల గణనతోనే ఆయా సామాజిక వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'కుల గణన ఆవశ్యకత-ఆదివాసీల బాధ్యత-వివిధ రాజకీయ పార్టీల కుట్రలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత దేశంలో కుల అణిచివేత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ప్రాతిపదికపై ప్రజల మధ్యన తేడాలున్న మాట వాస్తవమేనన్నారు. ఏ కులం జనాభా ఎంత, ఆర్థిక వనరుల పంపిణీ ఎలా ఉంది, ఏ ఏ రంగాలలో ఏ కులాల స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం ద్వారా వాటిని పరిష్కరించడం కోసం, కావలసిన కొత్త ప్రణాళికలు తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే మొదటిసారిగా శాస్త్రీయంగా కులగణన చేశారని, దీన్ని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్రపన్నుతుందని ఆరోపించారు. దేశమంతా కులగణనపై పెద్ద ఎత్తున డిమాండ్ వ్యక్తమయ్యే అవకాశాలుండటంతో తెలంగాణలోని దాని విశ్వసనీయతను దెబ్బతీసే కుట్ర జరుగుతుందని, కొన్ని బీసీ సంఘాలు కూడా వారి ట్రాప్‌లో పడుతున్నాయని ఐలయ్య ఆరోపించారు. ఈ సదస్సులో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 17, 18, 19 తేదీల్లో వికారాబాద్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ట్రిబల్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

సిటీకోర్టులు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ కేసుల విచారణకు ఆయన వ్యక్తిగతంగా హాజరయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు రాజాసింగ్‌తోపాటు పలువురు సాక్షులను రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ ఆధ్వర్యంలో ఎగ్జామిన్ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. గత ఎన్నికల్లో చేపట్టిన ప్రచార ర్యాలీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారని ఆయనపై కేసులు నమోదైన సంగతి విదితమే.

హెబ్రోను చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్ కన్నుమూత



బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్ (ఫైల్)

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్(82) బుధవారం కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ముషీరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందారు. గాంధీనగర్‌లో నివసించే పీటర్‌కు భార్య రాజేశ్వరి, కుమారుడు ఇమ్మాన్యుయెల్ పీటర్, కుమార్తె ఎస్తేరు ఉన్నారు. పలు ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు ఆయన భౌతిక కాయన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: పుర ప్రజలు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. బుధవారం పుర కార్యాలయంలో ఆమె మాట్లాడారు. నీటి వృథాను అరికట్టాలన్నారు. పుర పరిధి పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యల పరిష్కారం కోసం సీడీఎంఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయంలో సహాయ కేంద్రం(కంట్రోల్ రూమ్)ను ఏర్పాటు చేశామని తెలిపారు. సహాయం కొరకు మున్సిపల్ ఇంజనీర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎన్.ధనవర్ష సెల్ నంబర్ 8790766243ను సంప్రదించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాలు 35 విద్యార్థులు 8112

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలు

రెండు ఠాణాల్లో ప్రశ్నా పత్రాల భద్రత

పటిష్ట ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం



పరీక్షలు రాస్తున్న టెన్త్ విద్యార్థులు (ఫైల్)

బంజారాహిల్స్: పదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం విద్యాశాఖాధికారులు, పరీక్షా కేంద్రాల యాజమాన్యాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయి.

- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావు నగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, రెండు ఎయిడెడ్, నాలుగు మైనార్టీ రెసిడెన్షియల్, నాలుగు గురుకులాలు, మూడు రెసిడెన్షియల్, 144 ప్రైవేట్ హైస్కూళ్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో మొత్తం 8112 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రాసేందుకు ఖైరతాబాద్ జోన్ పరిధిలో 35 కేంద్రాలు గుర్తించారు. 25 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఇన్విజిలేటర్లను నియమించారు.
- ప్రశ్నా పత్రాలను భద్రపరిచేందుకు పంజగుట్ట, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లను గుర్తించడమే కాకుండా 35 మంది సర్కిల్ సిబ్బందిని, ఇద్దరు రూట్ అధికారులను, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.
- ప్రశ్నా పత్రాలను రోజూ సీసీ కెమెరాల నిఘాలో ఉంచనున్నారు.
- ఇందుకోసం ప్రశ్నాపత్రాలు భద్రపరిచే పోలీస్ స్టేషన్లతో పాటు పరీక్షా కేంద్రాలను నిఘా నేత్రలను ఏర్పాటు చేశారు.
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

పాఠశాలలు..	విద్యార్థులు..
ప్రభుత్వ పాఠశాలలు 17:	1295 మంది విద్యార్థులు
రెండు ఎయిడెడ్ స్కూల్స్:	37 మంది విద్యార్థులు
4 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్:	203 మంది విద్యార్థులు
4 మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ స్కూళ్లు:	244 మంది విద్యార్థులు
3 ప్రభుత్వ గురుకులాలు :	203 మంది విద్యార్థులు
144 ప్రైవేట్ పాఠశాలలు :	6130 మంది విద్యార్థులు
మొత్తం :	8112

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఖైరతాబాద్ జోన్ పరిధిలో గతేడాది పది పరీక్షల్లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా అటు ఉపాధ్యాయులు, ఇటు అధికార యంత్రాంగం కృషి చేస్తున్నది. ఇప్పటికే రెండు గ్రాండ్ టెస్టులు, సన్నాహక పరీక్ష, ప్రస్తుతం ప్రీ ఫైనల్ నిర్వహిస్తున్నారు. గతేడాది వార్షిక పరీక్షల కోసం తయారు చేసిన రెండో సెట్‌తో సన్నాహక పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులకు పూర్తి అవగాహన వచ్చిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం: 12 ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రం

ముందుగానే కేంద్రాలను చూసుకోవాలి



పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యార్థులను ఆరు నెలల నుంచి సన్నద్ధం చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. తమకు కేటాయించిన కేంద్రాన్ని ఒకరోజు ముందుగానే చూసుకోవాలి. గంట ముందేగానే కేంద్రానికి చేరుకునేలా ప్రణాళికలు వేసుకోవాలి. ప్రశ్నా పత్రాను చూసి ఆందోళన చెందకుండా వచ్చినవి ముందుగా రాసి కఠినమైనవి తర్వాత రాయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లవద్దు. ఆందోళన చెందితే కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. ముందుగా పరీక్షలంటే భయం వీడితే ప్రశ్నలకు తేలికగా జవాబులు దొరుకుతాయి.

– డాక్టర్ అస్మతున్నీసా, ప్రిన్సిపాల్, లిటిల్ స్టార్ హైస్కూల్, గాయత్రీహిల్స్

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఫిలింనగర్: నిరుద్యోగ యువతకు భారతీయ విద్యాభవన్ హైదరాబాద్ కేంద్రంలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిర్రిస్ట్రార్ టి.ఎస్.కృష్ణ తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు, అకౌంట్స్ అసిస్టెంట్ కోర్సు, ట్యాలీ ప్రైమ్, డీటీపీల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 14 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. యువత వయస్సు 17 సంవత్సరాల తొమ్మిది నెలల నుంచి 34 సంవత్సరాల 9 నెలల మధ్య ఉండాలని, కనీస ఇంటర్మీడియెట్ విద్యార్హత ఉండాలన్నారు. వివరాలకు కింగ్ కోఠి రోడ్డులోని బషీర్ బాగ్ కులపతి మున్షీ సదన్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు. అలాగే ఫోన్: 040 2324 1629లో సంప్రదించాలన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

వెంగళరావునగర్: వేసవి ప్రారంభంలోనే తమ కాలనీలో నీటి సమస్య నెలకొందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని వెంగళరావునగర్ కాలనీ నేతలు జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డితో కలిసి కాలనీ నేతలు వెంగళరావునగర్ జలమండలి కార్యాలయానికి వెళ్లారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ సూర్యప్రకాశ్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. వెంగళరావునగర్ కాలనీ నేతలు, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు రంగారావు, సారంగరావు, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, గౌస్‌ఖాన్, నాగరాజు, సాంబయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లతో మతసామరస్యం



కార్పొరేటర్‌తో కలిసి భోజనం వడ్డిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

రహమత్‌నగర్: ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించే రంజాన్ మాసంలో చేపట్టే ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని చాటుతున్నాయి. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం నుంచి తన నివాసం వద్ద ముస్లింలకు సహర్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన సహర్ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు వనజ లక్ష్మణ్‌గౌడ్, వినాయకరావునగర్ బస్తీ అధ్యక్షుడు ఆనంద్ తన అనుచరులతో కలిసి పాల్గొని భోజనం వడ్డించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ... మతం కన్నా మానవత్వం గొప్పదని స్పష్టం చేశారు. సహర్‌లో సేవలందించిన నాయకులను ఆయన అభినందించారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి



కార్పొరేటర్‌కు వినతి పత్రం ఇస్తున్న నేతలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలిలో వాహనాల పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డిని పలువురు స్థానిక బస్తీ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీ నేతలు మాట్లాడుతూ... కూడలిలో ఉన్న వైన్స్ షాపు వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో తరుచూ ట్రాఫిక్ జాం అవుతోందన్నారు. స్పందించిన కార్పొరేటర్ ట్రాఫిక్ ఏసీపీకు సమస్యను వివరించి, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరారు.

అగ్నిప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఫిలింనగర్: ప్రమాదవశాత్తూ గ్యాస్ స్టౌ మంటలు అంటుకుని సంభవించిన అగ్ని ప్రమాంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలకు గురైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఆదిలాబాద్‌కు చెందిన కృష్ణ (27) బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చాడు. భార్య జననితో కలిసి షేక్‌పేట అపర్ణ వన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న భోజనం చేయడం కోసం గ్యాస్ స్టౌ ఆన్ చేస్తుండగా అకస్మాత్తుగా స్టౌ నుంచి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కృష్ణ రెండు చేతులు, ఛాతి, పొత్తి కడుపుకు గాయలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. భార్య జనని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

సర్కిల్–19 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రసీద



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

వెంగళరావునగర్: అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా సహించేది లేదని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఎన్.ప్రసీద హెచ్చరించారు. ఎర్రగడ్డ డివిజన్‌లో అనుమతి లేకుండా నిర్మించిన ఆరు అంతస్తుల భవన నిర్మాణాన్ని బోరబండ పోలీసుల సహకారంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దగ్గరుండి ఆమె కూల్చివేతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ మాట్లాడుతూ... తన పరిధిలోని ఏ డివిజన్‌లో ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా తప్పనిసరిగా టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు తీసుకోవాల్సిదేనని అన్నారు. మీకు ఉన్న స్థలాన్ని బట్టి ఎన్ని అంతస్తులు నిర్మించుకోవాలన్నది టౌన్‌ప్లానింగ్ శాఖ నిర్ణయిస్తుందని, అంతేగాని 100, 120, 200 గజాలు స్థలంలో ఐదారు అంతస్తులతో కూడిన భవనాలు నిర్మిస్తామని అనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. పర్మిషన్ లేకుండా సెల్లార్స్‌ను తవ్వినా, లిఫ్టులు ఏర్పాటు చేసినా తక్షణమే అలాంటి వారిపై చర్యలు తీసుకుని కోర్టులకు హాజరు పరచాల్సి వస్తుందన్నారు. టీపీఎస్‌ఓ నరేష్, న్యాక్ ఇంజనీర్లు మౌనిక శర్మ, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

మత్తులో కారు నడిపిన యువకుడిపై కేసు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేస్తూ కరెంటు స్తంభాన్ని, డివైడర్‌ను ఢీకొట్టి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ఘటనలో యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... యూసుఫ్‌గూడ సమీపంలోని కృష్ణానగర్‌లో నివసించే ఈడుపుగంటి శ్రీచరణ్(26) మెడికల్ బయో కంపెనీలో సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. తన కారులో అర్ధరాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని కమలాపురికాలనీ టాస్ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో మద్యం మత్తులో అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తూ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడమే కాకుండా డివైడర్‌ను కూడా ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీచరణ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శ్రీచరణ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 200 బీఏసీగా తేలింది. పీకలదాకా మద్యం సేవించి మద్యం మత్తులో కారు నడుపుతున్నట్లుగా గుర్తించారు. నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 110, 185, 184 ఎంవీయాక్ట్, పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలున్న కవర్ మాయం

వెంగళరావునగర్: భర్తతో కలిసి పెళ్లికి వస్తున్న మహిళ చేతిలో నుంచి బంగారు ఆభరణాలు ఉన్న కవర్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సికింద్రాబాద్ మెట్టుగూడ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్, మాధవి దంపతులు ఎల్లారెడ్డిగూడకు ద్విచక్ర వాహనంపై బుధవారం బయలుదేరారు. ఎల్లారెడ్డిగూడకు వచ్చి చూడగా ఆమె చేతిలో ఉండాల్సిన కవర్ మాయం అయింది. అందులో గోల్డ్‌చైన్, మూడు ఉంగరాలు (మొత్తం 9 తులాలు) ఉన్నాయి. వాటి కోసం అనేక ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

వెంగళరావునగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. ఏపీలోని బాపట్ల జిల్లాకు చెందిన యువతి రెండేళ్లుగా మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ పంజగుట్టలో ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఆమెకు బాపట్ల కాలేజీలో చదువుకున్న హరిత అనే స్నేహితురాలు నగరంలో కలిసింది. ఇద్దరూ ఒకే హాస్టల్‌లో ఉంటున్నారు. ఆమె ద్వారా దాదాపు రెండేళ్ల కిందట శ్రీహరి అనే యువకుడు పరిచయం అయ్యాడు. పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడు. దాంతో అనేక మార్లు ఇద్దరూ ఓయో రూంలో కలుసుకున్నారు. గత నెలలో ఆఫీసు పని మీద వైజాగ్ వెళుతున్నానని చెప్పి వెళ్లి వచ్చిన శ్రీహరి వేరే అమ్మాయి ఫొటో చూపించి తనను పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు చెబుతున్నారని అన్నాడు. తన పేరెంట్స్ మాట కాదనలేనని, ఇద్దరం విడిపోదామన్నాడు. తనను పెళ్లి చేసుకుంటానని అనేకమార్లు శారీరకంగా కలిసి మోసం చేసిన శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 28, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 17, దొండ 45, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 21, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 20, చామగడ్డ 50, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆక్రమణలపై అధికారుల దృష్టి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ మోతీలాల్‌నెహ్రూనగర్‌లో రోడ్డు పక్కన ఆక్రమణలపై అధికారులు దృష్టిసారించారు. ఇక్కడి ఆక్రమణలపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని స్థానికులు పలువురు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఈ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియజేశారు. బుధవారం డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ) సుష్మిత సిబ్బందితో కలిసి ఆ కాలనీలో పర్యటించారు. రోడ్లన్నీ పరిశీలించిన మీదట వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్న కొన్ని ఆక్రమణలను గుర్తించారు. గురువారం వాటిని తొలగించనున్నట్లు చెప్పారు. టౌన్‌ప్లానింగ్ డీసీపీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం, నాయకులు చిరంజీవి, కృష్ణ, గోపి, సురేష్ తదితరులు ఉన్నారు.

వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



ముషీరాబాద్: మధుమేహం, రక్తపోటు, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం పొందాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం బాకారంలో సాంక్రామికేతర జబ్బులు(ఎన్‌సీడీ–నాన్ కమ్యూనికబుల్ డిజీజెస్) నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్య శిభిరాన్ని డాక్టర్ మనోజ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, స్ట్రోక్, కేన్సర్ వంటివి రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ వ్యాధులకు ప్రధాన కారణం మద్యం, పొగాకు, అనారోగ్యకరమైన ఆహారం, తగిన శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ఊబకాయం, రక్తంలో చెక్కర, కొలస్ట్రాల్ పెరగడం వల్ల వస్తాయని తెలిపారు. మధుమేహం, రక్తపోటు లాంటి జబ్బులు 30 – 40 ఏళ్ల వారిలో సర్వసాధారణం అయిపోయాయని పేర్కొన్నారు. ప్రజలు ఆహార నియమాలు పాటిస్తూనే ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు.

సర్కిల్-18 ఇన్‌చార్జి ఏఎంఓహెచ్‌గా రవి

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ్‌ను మాతృ సంస్థ అయిన వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సర్కిల్–18 ఇన్‌చార్జి ఏఎంఓహెచ్‌గా చందానగర్ సర్కిల్ ఏఎంఓహెచ్‌గా పనిచేస్తున్న కేఎస్ రవిని నియమించారు. కొంతకాలంగా సర్కిల్–18లో పనిచేస్తున్న భార్గవ్ నారాయణ్‌ను పంపించడం, ఆయన స్థానంలో ఇన్‌చార్జిని నియమించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. భార్గవ్ నారాయణ్‌ను ఇక్కడి నుంచి ఎందుకు బదిలీ చేశారనే దానిపై స్పష్టత రాలేదు. సర్కిల్–18 పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు వస్తాయి. ఇందులో బంజారాహిల్స్ డివిజన్ కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మీ గ్రేటర్ మేయర్‌గా ఉన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉంటున్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లో స్పీకర్‌తో పాటు మంత్రులు ఉంటున్నారు. ఇంతటి కీలకమైన సర్కిల్‌కు పారిశుద్ధ్య విభాగం నిర్వహణ కోసం ఇన్‌చార్జిని నియమించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. వీవీఐపీలు నివాసం ఉండే ఈ సర్కిల్‌లో నిత్యం పారిశుద్ధ్యంపై ప్రత్యేక నిఘా ఉంచాల్సి ఉంటుంది. దీనికి తోడు త్వరలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు కూడా సర్వే కోసం రానున్నాయి. ఎస్‌ఎఫ్‌ఏల మీద నియంత్రణ, స్వీపర్ల మీద నిఘా, చెత్త తరలింపుపై ప్రత్యేక దృష్టి, పరిశుభ్రత మెరుగుపడాలంటే పూర్తిస్థాయి ఏఎంఓహెచ్ ఉండాల్సి ఉంది. మరి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చందానగర్ సర్కిల్ ఏఎంఓహెచ్‌ను జూబ్లీహిల్స్ సర్కిల్‌కు ఇన్‌చార్జిగా ఎలా నియమించారనే దానిపై చర్చ సాగుతోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి కీలకమైన సర్కిల్–18కు సమర్థుడైన, అంకితభావంతో పనిచేసే అవినీతికి ఆస్కారం లేని నిజాయితీపరుడైన ఏఎంఓహెచ్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నయన మనోహరం

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో మయూరాలు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా పురివిప్పిన నెమళ్ల సందడి సందర్శకులను వాకర్లను విశేషంగా ఆకట్టుకుంటుంది. పార్కులో 635 నెమళ్లు ఉన్నాయి. – బంజారాహిల్స్

రాజ్యాంగ విలువలపై దక్షిణాదిలో రథయాత్ర

పంజగుట్ట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశానికి ప్రసాదించిన రాజ్యాంగ విలువలు బడుగు, బలహీన వర్గీలత పాటు ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్‌లకు తెలియచేసేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్ డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దక్షిణ భారత రథయాత్ర చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్ర అంబేడ్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14వ తేదీన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం నుంచి ప్రారంభిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాత్ర పోస్టర్‌ను ఆయా సంఘాల ప్రతినిధులు ఎమ్.నర్సింగ్ రావు, జాన్ పాల్, జి.శంకర్, మణి కుమార్, టి.రాజలింగం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని కాన్యకుమారి నుంచి కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న దీక్షాభూమి వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్ సనావుల్లా ఖాన్, రవి, కన్నయ్య, విజయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

'కొత్త వాహనాలకు అనుమతివ్వొద్దు'



వాటర్‌వర్క్స్ జీఎంకు వినతి పత్రమిస్తున్న అసోషియేషన్ సభ్యులు

శ్రీనగర్‌కాలనీ: వాటర్‌వర్క్స్ కార్యాలయాల వద్ద కొత్త వాహనాలకు పర్మిషన్ ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్స్ ఓనర్లు, డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఆర్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం హరీష్‌శంకర్‌ను గ్రేటర్ హైదరాబాద్ వాటర్ ట్యాంకర్స్ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు జీవీజీ నాయుడు, సభ్యులు కలిసి వినతిని సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏ వాటర్‌వర్క్స్ కార్యాలయాల వద్ద అధిక మొత్తంలో పెండింగ్ ట్రిప్స్ ఉన్నాయో అక్కడ కొత్త వాటికి పర్మిషన్ ఇవ్వాలన్నారు. సెక్షన్ మేనేజర్‌కు తెలియకుండా డైరెక్ట్‌గా బోర్డ్ ఆఫీస్ నుండి పర్మిషన్ తీసుకువచ్చే వాటికి ట్రిప్స్ అనుమతి నిరాకరించాలని కోరారు. వాహన యజమాని పాత అనుమతి ఉందో వారికి కొత్త అనుమతి ఇవ్వాలని, నూతనంగా వచ్చే వాహనాలకు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. డ్రైవర్లుగా ఉండే తమకు వేసవిలో పలు విషయాల్లో వెసలుబాటు కల్పించాలని కోరారు. అసోషియేషన్ సభ్యులు భవ్య చందు, మాధవరావు, ఆసిఫ్, కిరణ్, సాయి, ప్రశాంత్, భగవాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేన్సర్‌ను ముందే గుర్తిస్తే నిర్మూలించవచ్చు



ముషీరాబాద్‌లో బ్రెస్ట్ కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: కేన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందితే పూర్తిగా నిర్మూలించవచ్చని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని బ్లూబర్డ్స్ హై స్కూల్‌లో ఎంఎన్‌జేఆర్ కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెస్ట్ సర్వైకల్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ... మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు కేన్సర్ వ్యాధిపట్ల ఆందోళన చెందకుండా సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మనోజ్‌కుమార్, డాక్టర్ యోక్షిత, ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, దీన్‌దయాల్‌రెడ్డి, సత్యనారాయణబాబు, రాజేందర్, శ్రీకాంత్‌యాదవ్, టీఆర్ గోవింద్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, ఎంఎన్‌జేఆర్ కేన్సర్ స్క్రీనింగ్ రీజినల్ సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్మిత్ జాగీ, సవితాప్రేమ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లు.. ఆగని బస్సులు!

ప్రకటనల బోర్డులకే పరిమితమైన బస్టాప్‌లు



బస్సులు ఆగని చోట నిర్మించిన బస్ షెల్టర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని కేబీఆర్ పార్కును ఆనుకుని రెండు రోజుల క్రితం బస్ షెల్టర్ నిర్మించారు. అయితే ఇక్కడ బస్సులు మాత్రం ఆగవు. కేవలం ప్రకటన బోర్డుల కోసమే ఈ షెల్టర్‌ను కొత్తగా నిర్మించారు. ఈ ఫుట్‌పాత్‌పై నిర్మాణంతో పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాకర్లు కూడా ఇబ్బందులు పడుతూ వాకింగ్ చేస్తున్నారు. ఇక్కడ బస్టాప్‌ను అనవసరంగా నిర్మించారని వాకర్లతో సహా పాదచారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్టాప్ ఎవరి కోసం నిర్మించారంటూ నిలదీస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించే రోడ్డులో కేబీఆర్ పార్కును ఆనుకుని నిర్మించిన ఈ బస్టాప్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకోవైపు ఈ బస్టాప్ నిర్మాణం కోసం ఇక్కడ ఉన్న రెండు చెట్లను కూడా కొట్టేశారు. దీనిపై కూడా పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరం లేనిచరోట బస్టాప్ నిర్మించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఎవరి కోసం ఈ బస్టాప్‌లంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా బస్సులు ఆగని చోట నిర్మించిన ఈ బస్టాప్‌ను వెంటనే తొలగించాలని, ఫుట్‌పాత్‌ను విశాలం చేయాలని, రాకపోకలకు అడ్డంకులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. చెట్లు కొట్టేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో పోలీసు,యూనిఫామ్ సర్వీస్ పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 50 ఎకరాలకుపైగా స్థలంలో క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. గత రెండు నెలలుగా పర్మిషన్లు, లీజ్ డీడ్‌లు, ఒప్పందాలు, సిబ్బంది నియామకం, ఇతర మౌలిక వసతుల కల్పనలను అధికారులు పూర్తిచేశారు. ఈ నెల 25 నుంచి పాఠశాల ప్రారంభమవుతుంది. ఈ స్కూల్‌లో 50 శాతం అడ్మిషన్లు యూనిఫామ్ సర్వీస్‌కు చెందిన వారి పిల్లలకు కేటాయిస్తారు. మిగిలిన 50 శాతం సాధారణ ప్రజల పిల్లల కోసం కేటాయిస్తారు. ర్యాంక్ ఆధారంగా ఫీజు ఉంటుంది.

ఎల్‌ఆర్‌ఎస్‌తో పెరగనున్న దస్తావేజు విలువ



సమావేశంలో ప్రశ్నలకు సమాధానమిస్తున్న డీఐజీ మధుసూదన్‌రెడ్డి


మేడ్చల్: పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు కట్టడం వల్ల సమస్యలు తీరడంతోపాటు దస్తావేజు విలువ పెరుగుతుందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2020 కంటే ముందు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకున్నవారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చిందని, దీనిని వినియోగించుకోవాలని అన్నారు. లేఅవుట్‌లలో ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోకుండా అమ్మకుండా మిగిలిపోయిన ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ కడితే వాటి విలువ పెరుగుతుందని, వాటికి మంచి ధర వస్తుందని అన్నారు. అవగాహన సదస్సులో డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్, పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి: మంత్రి సురేఖ



సాక్షి, సిటీబ్యూరో: మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అది వారి సామర్థ్యాన్ని పెంచుతుందని రాష్ట్రమంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన 25 మంది మహిళలకు గోల్డెన్ ఉమెన్ ఎక్స్‌లెన్సీ అవార్డులను గోల్డెన్ ఉమెన్ క్లబ్ అందించింది. నగరంలోని యూసుఫ్‌గూడలో ఉన్న ఎన్‌ఐఎంఎస్‌ఎంఇ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సాధికారత దిశగా వేసే ప్రతి అడుగు కీలకమని, కుటుంబాల ప్రాధాన్యం కూడా విస్మరించలేమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా 'హి పర్ షీ'పేరిట ఓ వేదికను ప్రారంభించడంతోపాటు సైబర్ సెక్యూరిటీపై చర్చలు, నెట్ వర్కింగ్, బిజినెస్ సమ్మిట్ వంటి కార్యక్రమాలు జరిగాయి. గోల్డెన్ ఉమెన్ క్లబ్ వ్యవస్థాపకురాలు ఉమా పేరి మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు.

ఓయూలో మాదిగ విద్యార్థుల అరెస్ట్



ఓయూలో మాదిగ విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మాదిగ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరుగుతున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయవద్దంటూ మాదిగ స్టూడెంట్ ఫోరం(ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రెండో రోజు శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులను ఓయూ పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. మాదిగలను నమ్మించి మోసగించిన సీఎం రేవంత్ రెడ్డిని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని మాదిగ విద్యార్థులు హెచ్చరించారు. దీక్షలో ఎంఎస్ఎఫ్ నేతలు కొమ్ము శేఖర్‌మాదిగ, డా.పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నేత వీరపాకుల పరశురాం మాదిగ, విద్యార్థి నేతలు మహేష్ మాదిగ, అనిల్‌మాదిగ, నరేష్‌మాదిగ, సతీష్ మాదిగ, విజయ్‌మాదిగ, రవీందర్‌మాదిగ, శ్రీకాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి లీగల్ నోటీసు

సాక్షి,సిటీబ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానంలో దేశీ ఆవు నెయ్యి వినియోగించే విషయమై తాత్సారం చేస్తున్నందుకు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్ బుధవారం ఆ సంస్థకు లీగల్ నోటీసు పంపారు. దేశీ జాతి ఆవుల సంరక్షణ కోసం తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే విషయమై నిపుణులతో రూపొందించిన నివేదికను టీటీడీకి అందచేశామని, అయితే తమ నివేదికను తొక్కిపెట్టిన కారణంగా లీగల్ నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

సైబర్ భద్రతపై హ్యాకథాన్-ఎక్స్

- ఓయూ కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎన్సీఎస్సార్సీ
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో మూడు అంశాలపై పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా యూనివర్సిటీలో కోలాహలం నెలకొంది. విద్యార్థులు హ్యాకథాన్ ఎక్స్ కార్యక్రమంలో సందడి చేశారు. నేషనల్ సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ కౌన్సిల్(ఎన్సీఎస్సార్సీ) ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం హ్యాకథాన్-ఎక్స్ కార్యక్రమం నిర్వహించింది. కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ కేంద్రంగా జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు చెందిన 400 మంది విద్యార్థినీ విద్యార్థులు 80 బృందాలుగా పాల్గొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హ్యాకథాన్ పూర్తి కాగా, తెలంగాణలో గెలుపొందిన వారితో కలిపి సెమీఫైనల్స్ ఏర్పాటు చేయనున్నారు. సాధారణంగా ఒక్కో హ్యాకథాన్ నుంచి గరిష్టంగా పది గ్రూపుల్ని మాత్రమే సెమీ ఫైనల్స్‌కు ఎంపిక చేస్తుంటారు. అయితే ఇలా ఎంపికైనవారిలో కొందరు అనివార్య కారణాలతో ఆ పోటీలకు హాజరుకాలేకపోతున్నారు. ఈ కారణంగా హ్యాకథాన్ నిర్వహణ స్ఫూర్తి దెబ్బతింటోంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్సీఎస్సార్సీ డైరెక్టర్ 25 గ్రూపులుగా వంద మందిని సెమీఫైనల్స్‌కు ఎంపిక చేస్తున్నారు. దీని వల్ల ఎక్కువ మందిలో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందని ఆ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, అవేర్‌నెస్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ హ్యాకథాన్ ఎక్స్ కొనసాగింది. ఉదయం 9 గంటలకు మొదలైన ఈ పోటీలు సాయంత్రం 4 గంటల వరకు సాగాయి. మొత్తం మూడు రౌండ్లుగా ఈ హ్యాకథాన్ ఎక్స్‌ను ఎన్సీఎస్సార్సీ నిర్వహించింది. హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. తొలిరౌండ్‌లో మల్టీపుల్ చాయిస్ క్వశ్చన్స్, రెండో రౌండ్‌లో కోడింగ్ చాలెంజ్, మూడో రౌండ్‌లో క్యాప్చర్ ద ఫ్లాగ్(సీటీఎఫ్) అంశాల్లో పోటీ జరిగింది. రెండు, మూడు రోజుల్లో విజేతలను ప్రకటించనున్నారు. ఎన్సీఎస్సార్సీ డైరెక్టర్ ఇ.కాశిరాజ్ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమం ఎన్సీఎస్సార్సీ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రీజినల్ డైరెక్టర్ పెనుమర్తి హరికృష్ణ (పీహెచ్‌కే) నేతృత్వంలో జరిగింది.

ఆ మూడింటికి భిన్నంగా...



నేను ఇప్పటి వరకు మూడు హ్యాకథాన్స్‌లో పాల్గొని రన్నరప్‌గా నిలిచా. అవన్నీ కేవలం వెబ్, యాప్ డిజైనింగ్ కేంద్రంగా సాగినవే. అయితే ఎన్సీఎస్సార్సీ నిర్వహించిన ఈ హ్యాకథాన్ ఎక్స్ వాటికి పూర్తి భిన్నంగా ఉంది. సైబర్ సెక్యూరిటీపై విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే కోణంలో దీన్ని నిర్వహించారు. క్యాప్చర్ ద ఫ్లాగ్ (సీటీఎఫ్) కేటగిరీలో పాల్గొన్నా. నిర్వాహకులు అడిగిన ప్రశ్నలన్నీ చాలెంజింగ్‌గా ఉన్నాయి. – సాదియా మహీన్ సిద్దిఖీ, సెకండ్ ఇయర్ బీటెక్ (సీఎస్ఈ), ఓయూ

ఈవెంట్ అదుర్స్..



ఇలాంటి హ్యాకథాన్లలో పాల్గొనడం ఇదే తొలిసారి. ఎన్సీఎస్సార్సీ ఈ కార్యక్రమానికి హైదరాబాద్ వేదికగా అద్భుతంగా నిర్వహించింది. క్యాప్చర్ ద ఫ్లాగ్ (సీటీఎఫ్) విభాగంలో పోటీపడ్డాను. ఇలాంటి వాటిలో పాల్గొంటే సైబర్ సెక్యూరిటీ కోణంలో విద్యార్థుల నాలెడ్జ్ బాగా పెరిగుతుంది. – ఐ.రాకేష్‌కుమార్ రెడ్డి, సెకండ్ ఇయర్ (సైబర్ సెక్యూరిటీ), సీఎమ్మార్ కాలేజీ

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు డిమాండ్

పంజగుట్ట: వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడేమో సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. గత బడ్జెట్‌లో కేవలం ఏడు శాతం నిధులే కేటాయించిందని, వాటిని కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని విచారం వ్యక్తం చేశారు. రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, అన్ని విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కామన్ మెను కార్యక్రమం అటకెక్కిందని, రోజుకో చోట ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో కళ్యాణి, శ్రీరామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి అన్నివిధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ నీళ్ల, నిధులు, నియామకాల కోసం ఉద్యమించి సాధించుకున్న తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్, ఆయన బంధుమిత్రుల పొలాలకు మాత్రమే నీళ్లు అందాయని, కేసీఆర్ కుటుంబసభ్యులకే నిధులు వెళ్లాయని, వారి కుటుంబంలోనే అందరికీ ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. ఉద్యమకారులు, అమర వీరులు, వారి కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సోమన్న, చంద్రన్న ప్రసాద్, కోఠి మాధవిరెడ్డి, వేముల యాదగిరి, డోలక్ యాదగిరి, రాజేంద్రప్రసాద్, సునీత, సృజన, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

లైఫ్ సైన్సెస్‌లో నగరం గ్లోబల్ లీడర్



- టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ ప్రారంభం
- పాల్గొన్న జయేష్ రంజన్, స్విట్జర్లాండ్ టెన్త్‌పిన్ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో/చందానగర్: రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రెండు వారాల్లో అధునాతన ప్రణాళికలతో లైఫ్ సైన్సెస్ విధానాన్ని ప్రారంభించనుందని, ఈ వినూత్న విధానం ఈ రంగానికి కొత్త వృద్ధి పథాన్ని రూపొందిస్తుందని ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఇందులో భాగంగా సెల్- జీన్ థెరపీ, జెనోమిక్స్, బయోలాజిక్స్, ప్రెసిషన్ మెడిసిన్, పెప్టైడ్స్, డిజిటల్ ఇన్నోవేషన్, అడ్వాన్స్‌డ్ ఆర్ అండ్ డీ వంటి కొత్త డొమైన్‌లలో అవకాశాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. లైఫ్‌సైన్సెస్ విభాగంలో గ్లోబల్ కన్సల్టింగ్ లీడర్‌గా గుర్తింపు పొందిన టెన్త్‌పిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్(స్విట్జర్లాండ్) ఆధ్వర్యంలో నగరం వేదికగా టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ (టీఏఐఎల్)ను ప్రారంభించింది. జయేష్ రంజన్ మాట్లాడుతూ ఇతర ప్రపంచ నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రపంచంలోని టాప్ 10 లైఫ్ సైన్సెస్ కంపెనీలలో ఏడు హైదరాబాద్‌లో ఉండటం విశేషమన్నారు. భారతీయ లైఫ్ సైన్సెస్ కంపెనీలు గ్లోబల్ ఇన్నోవేషన్ లీడర్లుగా మారడానికి సహాయం చేయడమే తమ లక్ష్యమని టెన్త్‌పిన్ భాగస్వామి, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రఘురామ్ జనపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టెన్త్‌పిన్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ థామస్ వెబర్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సైన్సెస్ కంపెనీల విస్తరణ కోసం..

లైఫ్ సైన్సెస్ కంపెనీల విస్తరణకు, పరిశోధనల రుజువును త్వరగా సృష్టించడానికి టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ వేదికగా నిపుణులతో కలిసి పనిచేయడానికి ఇంక్యుబేషన్ అవకాశాన్ని కల్పిస్తాం. ఫార్మాస్యూటికల్, మెడ్‌టెక్, బయోటెక్, పరిశోధనా సంస్థలు కృత్రిమ మేధను వినియోగిస్తూ.. పరిశోధనల విలువను గుర్తించడం, వాటి ఫలితాల మధ్య తేడాను గుర్తించడంలో సహాయపడుతుంది. లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్ స్థానాన్ని పెంచడంలో భాగంగా కృత్రిమ మేధ స్వీకరణను వేగవంతం చేయడంలో కంపెనీలకు టెన్త్‌పిన్ మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుంది. –టెన్త్‌పిన్ డైరెక్టర్ బార్ట్ రీక్స్

మహిళా సమస్యలపై బలమైన ఉద్యమం

– ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి సాధనే తమ లక్ష్యమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని వీరనారి ఐలమ్మ భవన్‌లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981లో ఏర్పడినప్పటి నుంచి దేశవ్యాప్తంగా మహిళలను సమీకరించి అనేక పోరాటాలు చేసిందన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించడమే కర్తవ్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన విధానాలు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం. వినోద, వై.వరలక్ష్మి, ఎం. స్వర్ణలత, షబానా బేగం, లక్ష్మి, గాయత్రి, మాధవి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న మల్లు లక్ష్మి

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సద్గుణ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు దుస్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బైరామల్‌గూడలోని గ్లెనిగల్ అవేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు 5కే వాక్‌థాన్ కార్యక్రమం జరుగుతుంది.
- ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుంది. ఫాక్స్‌కాన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులు.
- జూబ్లీహిల్స్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని ఉయ్ హబ్ ఫౌండేషన్‌లో మధ్యాహ్నం 2 నుంచి ఉయ్ హబ్, సస్టైనబులిటి సంయుక్త ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇన్‌క్లూజివ్ కార్యక్రమం జరుగుతుంది.
- రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఉదయం 10 నుంచి ఫ్రీ పీడియాట్రిక్ కార్డియాలజీ క్యాంపు జరుగుతుంది.
- జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-69, నందగిరిహిల్స్‌లోని అన్ని హస్త కళాకృతులపై డిస్కౌంట్ కల్పిస్తున్న లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బాధ్యతలు స్వీకరించిన భానుక నర్మద



బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేస్తున్న భానుక నర్మద

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా బీజేపీ నాయకురాలు భానుక నర్మదామల్లికార్జున్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వేరీడ్ బోర్డులో నూతన గెజిట్ ప్రకారం నామినేటెడ్ సభ్యురాలిగా నర్మద నియమితులయ్యారని, 2026 ఫిబ్రవరి వరకు పదవిలో ఉంటారని సీఈవో అన్నారు. బోర్డు కార్యాలయంలో బ్రిగేడియర్ ఎస్.వి.నంజుడేశ్వర అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో సీఈవో మధుకర్ నాయక్ ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ్‌వంశీ, బోర్డు కన్సల్టెంట్ అధికారి విజయ్‌కుమార్ నాయర్ హాజరయ్యారు. అనంతరం జరిగిన బోర్డు సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. బోర్డు అధీనంలో ఉన్న బోయిన్‌పల్లిలోని నేతాజీ ఎయిడెడ్ పాఠశాల ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు కోరారని సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. అయితే ఆ స్థలాన్ని పరిశీలిస్తానని, అనంతరం నిర్ణయం తీసుకుందామని ఈటల చెప్పారు. సాయిబాబా హట్స్, 108 బజార్ చిన్న కమేళా, సెంట్రల్ బట్రి ప్రాంతాల్లో పవర్ బోర్‌వెల్స్ లేవని, కనీసం మరుగుదొడ్ల సౌకర్యంలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కేంద్రం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన 900 కోట్ల రూపాయల సర్వీస్ చార్జ్‌లో కనీసం వంద కోట్లు విడుదల చేయించాలని కోరారు. సమావేశంలో బోర్డు వాటర్‌వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, హెల్త్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బోర్డు సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, బ్రిగేడియర్, సీఈవో

దక్షిణాది రాష్ట్రాలను విస్మరిస్తే సహించం

– ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పార్లమెంటు సీట్లు పెంచేటప్పుడు అన్ని పార్టీలతో చర్చించాలని, పార్లమెంటు ఎవ్వరి జాగీర్ కాదని, దక్షిణాది రాష్ట్రాలను విస్మరిస్తే సహించబోమని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విముక్తి చిరుతల కచ్చి (వీసీకే) పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశం ద్రావిడదేశమా, ఆర్య దేశమా అనేదానిపై చర్చించాలని, ఆర్యదేశం అయితే చరిత్ర చూపించాలన్నారు. ద్రావిడ దేశం అని రుజువు చేయడానికి అన్ని ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ వల్ల దక్షిణాదికి పార్లమెంటు స్థానాల పెంపులో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. దక్షిణాదికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ 1971 జనాభా ప్రకారం యథాస్థితిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికల పేరుతో పార్లమెంటు సీట్లను ఉత్తరాదిలో పెంచుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. బీఎల్‌పీ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ దక్షిణాది ఉనికికి ముప్పు పొంచి ఉందని అన్నారు. కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చా దేవేందర్, ప్రధాన కార్యదర్శి చెరిపెల్లి ఆనంద్, రచయిత సైకిబాబా, నల్లా రమేష్, కోయెడ కిరణ్, దానబోయిన రవి, ఎంసీపీఐ కార్యదర్శి గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిలకర శ్రీనివాస్

హైదరాబాద్‌ను ఏఐ నగరంగా మారుస్తున్నాం

– రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



చందానగర్: హైదరాబాద్ నగరాన్ని ఏఐ నగరంగా మారుస్తున్నామని, అందుకు అవసరమైన వసతులు, సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సైనరిక్ గ్లోబల్ సంస్థ నానక్‌రాంగూడలో ఏర్పాటు చేసిన ఏఐ-ఫస్ట్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏఐ రంగంలో అగ్రగామిగా ఉండాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సైనరిక్ గ్లోబల్ సంస్థ వ్యవస్థాపకుడు సుధాకర్ పెన్నం మాట్లాడుతూ తెలంగాణ ప్రగతిశీల విధానాలు ఏఐ రంగ అభివృద్ధిని వేగంగా నడిపిస్తుందన్నారు. మోర్గెన్ గ్లోబల్ సీఈఓ మహంత మల్లికార్జున్ ప్రసంగించారు. కార్యక్రమంలో తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ శక్తి ఎం.నాగప్పన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ తోడ్పాటు భేష్

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముక లాంటిదని, సేవాదళ్ సేవలు ప్రశంసనీయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కార్యనిర్వాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు అయూబ్‌ఖాన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సేవాదళ్‌ను రాష్ట్రంలో విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సేవాదళ్ కర్తవ్యం కాంగ్రెస్ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకోవడమేనని పేర్కొన్నారు. సేవాదళ్ కార్యకర్తలు 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ని అవమానిస్తూ చేస్తున్న కుట్రలను సేవాదళ్ కార్యకర్తలు ఎండగట్టాలన్నారు.

నీరా కేఫ్ బదిలీపై హర్షం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరా కేఫ్‌ను బీసీ సంక్షేమ శాఖలోని కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీ చేయడం హర్షణీయమని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ల చొరవ మేరకు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పలుమార్లు చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబాల నారాయణగౌడ్, గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, బాలగోని వెంకటేష్ గౌడ్, పోతగాని అయిలన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలగౌని బాలరాజు గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్‌లు

మౌస్‌డీర్ ఎన్‌క్లోజర్ ప్రారంభం

చార్మినార్: నెహ్రూ జూలాజికల్ పార్కును తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ బుధవారం సందర్శించారు. మౌస్ డీర్ బ్రీడింగ్ సెంటర్లలో పునరుద్ధరించిన ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారు. గత ఏడాదికాలంగా జూ పార్కులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. డోబ్రియల్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా జూపార్కులో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. జూపార్కు సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని జంతువుల ఎన్‌క్లోజర్లను పరిశీలించిన ఆయన జంతువుల పెంపకంలో అధికారులు, సిబ్బంది తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా డోబ్రియల్‌కు జూపార్కు జంతువులతో కూడిన చిత్రపటాన్ని సిబ్బంది బహూకరించారు. నెహ్రూ జూ పార్క్ క్యూరేటర్ వసంత, డిప్యూటీ బర్నోబా, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ ఎం.ఎ.హకీం, పీఆర్వో హనీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 13, మార్చి, 2025





హోలీ వస్తోందంటే నగరంలో వారం పది రోజుల ముందే సందడి మొదలవుతుంది. అన్ని ప్రాంతాల్లో ఎవరికి తగ్గట్లు వారు ఏర్పాట్లు చేసుకుంటారు. సిటీ వాసులు మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి గ్రూప్‌గా నగరానికి వచ్చి ఈవెంట్స్‌లో ఎంజాయ్ చేస్తుంటారు. అందరినీ ఆకట్టుకునేలా ఈవెంట్ నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తుంటారు. ఇందులో భాగంగా దాదాపు పది, పదిహేను వేల మందితో హోలీ వేడుకలను నిర్వహించేందుకు వేదికలను సిద్ధం చేశారు. రంగులతో పాటు లైవ్ మ్యూజిక్ సెషన్స్, లైవ్ డ్యాన్సింగ్ ఈవెంట్స్ యువతను ఉర్రూతలూగించనున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

హోలీ.. జోష్ హైలీ

హోలీతో ఇంద్ర ధనుస్సును తలపించే నగరం

10 వేలకుపైగా మందితో వేదికల ఏర్పాటు

హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలతో పాటు గేటెడ్ కమ్యూనిటీల్లో ఈవెంట్స్

ఈసారి అత్యధికంగా పబ్లిక్ ఈవెంట్స్‌కు ప్లాన్

హోలీ సంబరాల్లో మెరవనున్న సెలబ్రిటీలు

హోలీ సంబరాలకు హైటెక్ సిటీ, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, నానక్‌రామ్‌గూడ, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో విశాలమైన వేదికలను ఏర్పాటు చేశారు. కొన్ని ఈవెంట్లలో చర్మానికి హాని చేయకుండా ఉండే రసాయనాలు లేని ఆర్గానిక్ రంగులను మాత్రమే అనుమతిస్తుండటం విశేషం. ఈ హోలీని మరింత సంబురంగా మార్చడానికి ముంబై, బెంగళూరు, ఢిల్లీ వంటి వివిధ నగరాల నుంచి ప్రముఖ డీజేలు నగరానికి చేరుకున్నారు. మరి కొందరు నిర్వాహకులు.. ఈ వేడుకల్లో వినూత్నంగా సాంస్కృతిక సంబరాలను నిర్వహించనున్నారు. దీని కోసం బ్యాండ్ బాజా, డోల్ దరువు, జానపద హొయలు పలికే డప్పులను నగరానికి ఆహ్వానించారు.

వందకు పైగా ఈవెంట్స్‌కు ఏర్పాట్లు

రిసార్టులు, క్లబ్స్, పబ్లిక్ గ్రౌండ్స్‌లో భారీస్థాయిలో హోలీ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ భారీ వేదికల్లో 5 వేల నుంచి 15 వేల మందికి సరిపడా సౌకర్యాలు, విశాల ప్రాంగణాలు సిద్ధం చేశారు. ఇలాంటి భారీ హోలీ ఫెస్టివల్స్ సుమారు 30 నుంచి 40 వరకు నిర్వహిస్తుండగా.. మొత్తం నగరంలో వందకు పైగా హోలీ పబ్లిక్ ఈవెంట్స్‌కు ఏర్పాట్లు చేశారు. ఇందులో పాల్గొనడానికి ఎంట్రీ పాస్ కోసం రూ.500 నుంచి రూ.5,000 వేలకు పైగా వసూలు చేసే ఈవెంట్స్ ఉన్నాయి. కొందరు నిర్వాహకులు రంగులను ఉచితంగా అందిస్తుంటే మరికొందరు రంగులతో పాటు ఫుడ్ – డ్రింక్స్ కూడా అందిస్తున్నారు. ముఖ్యంగా ఈవెంట్ ఆర్గనైజర్లు హోలీ లవర్స్‌ను ఆకర్షించడానికి పలువురు సినీతారలను, సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, స్పోర్ట్స్ సెలబ్రిటీలను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తున్నారు.



60 ఫీట్ల ఎత్తయిన భారీ బ్యాక్‌గ్రౌండ్ స్టేజ్‌తో..

లాత్‌మర్ హోలీ మీట్స్ టాలీవుడ్ పేరుతో నగరంలో అతిపెద్ద హోలీ సంబరాలను హైటెక్ ఎరీనాలో నిర్వహించనున్నారు. 60 ఫీట్ల ఎత్తయిన భారీ బ్యాక్‌గ్రౌండ్ స్టేజ్‌తో నగరంలో మొదటిసారి నిర్వహిస్తున్నారు. ఇందులో రంగుల సోయగాలతో పాటు సంగీతం, సెలబ్రిటీలతో అలరించనున్నారు. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అంథమ్ వేదికగా నియాన్ హోలీ పార్టీ 2025కి ఘనంగా ఏర్పాట్లు చేశారు. బాలీవుడ్ బీట్స్‌తో లైవ్ మ్యూజిక్ ఉంటుంది. సుచిర్ ఇండియా ఆధ్వర్యంలో నగర శివార్లలోని హనీ బర్గ్ రిసార్ట్స్ వేదికగా హోలీ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.





పదేళ్లుగా రంగ్ బర్సే..

పదేళ్లుగా నగరంలో హోలీ సంబరాలను వినూత్నంగా నిర్వహిస్తున్నాం. ఈ సారి సిటీలోని యోలో ఎరీనాలో రంగ్ బర్సే 9.0 పేరుతో భారీ స్థాయిలో హోలీ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. ఇందులో మ్యూజిక్‌తో పాటు రెయిన్ డ్యాన్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. హోలీ థీం టీ షర్ట్‌తో పాటు స్పెషల్ డ్రింక్స్, మీల్ బాక్స్ అందిస్తున్నాం. మా ఫెస్టివల్‌లో కార్పొరేట్ ఉద్యోగులు, యూత్‌తో పాటు కుటుంబ సమేతంగా పాల్గొనే వారు ఎక్కువగా ఉన్నారు. సిటీలో హోలీ అంటే ట్రెండీ కల్చర్‌గా మారింది. దీనికి అనుగుణంగానే అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. 4 వేల మంది వరకు మా వేడుకల్లో పాల్గొంటారని అంచనా.

– శరత్, రంగ్ బర్సే 9.0 నిర్వాహకులు

- మ్యూజిక్, డ్యాన్సింగ్‌తో పాటు బ్రుక్ ది పాట్ వంటి విభిన్న కార్యక్రమాలతో ఈ సంబరాలను ఏర్పాటు చేస్తున్నారు. సిటీలోని శ్రీపలాని కన్వెన్షన్ వేదికగా హోలీ మహోత్సవ్ 2.0 పేరుతో అతిపెద్ద ఓపెన్ ఎయిర్ ఫెస్టివల్ జరుపుతున్నారు. ఇందులో డీజే, లైవ్ డోల్, ఓపెన్ స్కై ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ వేడుకల్లో బిగ్ బాస్ ఫేం అశ్వినీశ్రీ, శుభశ్రీ కలర్‌ఫుల్ గెస్టులుగా సందడి చేయనున్నారు.
- గచ్చిబౌలిలోని సంధ్య పార్కింగ్ గ్రౌండ్ వేదికగా టోస్ట్ టానిక్ ఆధ్వర్యంలో హోలీ కార్నివాల్ 2.0ను ఏర్పాటు చేస్తున్నారు. వేడుకల్లో అర్జున్ విజయ్, డీజే ఆకాశ్, డీజే మణి, డీజే రిష్, బీజే రుమీ వంటి వారు లైవ్ డీజేతో ఉర్రూతలూగించనున్నారు. బేగంపేట్ హాకీ స్టేడియం వేదికగా రంగ్ బసంత్ 2025 సంబరాలను, ఫ్లిప్ సైడ్ అడ్వెంచర్ పార్క్ గచ్చిబౌలిలో హోలీ కలర్ ల్యాండ్ ఓపెన్ ఎయిర్ ఫెస్టివల్‌తో పాటు నగరంలోని వివిధ వేదికల్లో హోలీ సంబరాలను నిర్వహిస్తున్నారు.



ఫ్యూచర్ లైఫ్‌స్టైల్.. ఫుల్ టెక్నికల్..



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల జీవన శైలుల్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పునర్నిర్వచిస్తోందని భవిష్యత్ ఇంటీరియర్‌ను మనం చేసే పని వృత్తి వ్యాపకాలు నిర్దేశించనున్నాయని డిజైనర్లు, సాంకేతిక నిపుణులు అభిప్రాయపడ్డారు. నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ఆర్కిటెక్చరల్ డిజైన్స్ బ్రాండ్ జేకే ఆర్ట్‌క్రాఫ్ట్‌కి చెందిన 'డోర్మకాబా లైఫ్‌స్టైల్ షోరూమ్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఇంటీరియర్ డిజైన్లను ప్రదర్శించారు. నగర జీవనశైలిని పనితీరు ప్రభావితం చేస్తోన్న నేపథ్యంలో యాక్సెస్ సొల్యూషన్స్‌కు డిమాండ్ పెరుగుతోందని డిజైనర్లు స్పష్టం చేశారు. డోర్మకాబా ఇండియా ఎండీ నటేష్, జేకే గ్రూప్ ఇండియా ఛైర్మన్ నేమ్‌చంద్ గాలా, ఐఐఐడీ ఛైర్మన్ ఆర్కిటెక్ట్ నిరూప్‌రెడ్డి, పల్లవి అంచూరి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ప్రతిభను పెంపొందించడం లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: 'భవిష్యత్తు క్రీడాకారులను వెలుగులోకి తేవడంలో వర్సిటీల పాత్ర కీలకమని, గవాస్కర్, రవిశాస్త్రి వంటి ప్రతిభావంతులను అందించాయని' రిటైర్డ్ భారత క్రికెటర్, మాజీ బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. నగర శివార్లలోని సదాశివపేట్‌లో ఉన్న వోక్సెన్ విశ్వవిద్యాలయంలోని క్రీడా శిక్షణ సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ క్రికెట్ స్టార్లను రూపొందించడంలో నిర్మాణాత్మక శిక్షణ అవసరమని, విజి ట్రోఫీ వంటి విశ్వవిద్యాలయ స్థాయి లీగ్‌లు అద్భుతమైన ఆటగాళ్లను తయారు చేశాయన్నారు. వోక్సెన్ విశ్వవిద్యాలయంతో ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ సిక్స్‌ఎస్ స్పోర్ట్స్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఔత్సాహిక ఆటగాళ్లకు నిర్మాణాత్మక శిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యం, అంతర్జాతీయ–ప్రామాణిక సౌకర్యాలను అందించడం ద్వారా క్రికెట్ ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరిందని వెల్లడించారు.



సామాజిక సేవలో.. కేఎల్‌హెచ్‌కు పురస్కారం..

సాక్షి, సిటీబ్యూరో: కమ్యూనిటీ సేవా విభాగంలో ప్రతిష్టాత్మక ఏసీఎమ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ అవార్డును బాచుపల్లిలోని కేఎల్‌హెచ్ వర్సిటీకి చెందిన విద్యార్థి విభాగం అందుకుంది. కోయంబత్తూరులో నిర్వహించిన ఏసీఎమ్ ఇండియా వార్షిక ఈవెంట్‌లో ఈ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా వర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ మునిరాజు నాయుడు, స్టూడెంట్ చాప్టర్ ప్రెసిడెంట్ బొబ్బా తంబి ఆశిష్‌లను ప్రిన్సిపాల్ డా.ఎల్.కోటేశ్వరరావు అభినందించారు. సైబర్ సెక్యూరిటీ క్లౌడ్ కంప్యూటింగ్‌పై నిపుణుల వర్క్‌షాప్స్, హ్యాకథాన్‌లు, అలాగే ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తూ మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.



రెయిన్ థీమ్‌తో రంగోలిక్

లక్డీకాపూల్: హోలీని రెయిన్ థీమ్‌తో జరుపుకుందాం.. మీ కుటుంబంతో కలిసి వస్తే రెయిన్ డ్యాన్స్‌తో సందండి చేద్దాం అంటూ మిస్ ఇండియా పీపుల్ ఛాయిస్ అవార్డ్ విన్నర్ మేరీ సింథియా నగరవాసులకు పిలుపునిచ్చారు. మాదాపూర్ వాకిన్ స్ట్రీట్ డ్రైవ్‌లో జేఎస్ క్రియేషన్స్ బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె సినీ తారలు కీర్తి క్వీన్, మేఘనా చౌదరి, సూరజ్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేరీ సింథియా మాట్లాడుతూ.. రంగోలిక్ పేరిట శుక్రవారం నిర్వహించే హోలీ వేడుకల్లో భాగంగా పిల్లల కోసం ప్రత్యేక వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. సినీ నటులు మేఘనా చౌదరి, సూరజ్, నిర్వాహకులు శరత్ తెలిపారు.

యమ్మీ బీ.. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అగ్రగామి కేఫ్ గ్రూప్‌లలో ఒకటైన వ్లాగ్స్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సిటీలో తమ యమ్మీ బీ కేఫ్‌ను కొండాపూర్‌లో మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు సందీప్ జంగాలా మాట్లాడుతూ మిల్లెట్-క్రస్ట్ పిజ్జాలతో పాటు చక్కెర, మైదా, గ్లూటెన్ రహితంగా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అందించడం తమ ప్రత్యేకతగా తెలిపారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, మణికొండ, కోకాపేట్, కూకట్‌పల్లిలలో ఉన్నవాటితో పాటు ఈ ఏడాది చివరి నాటికి సిటీలో తమ కేఫ్స్ సంఖ్యను 12కు విస్తరిస్తున్నట్లు చెప్పారు.

హోలీ అంటే.. రంగుల రాజ్యం. ఆద్యంతం హుషారుగా సాగే ఏకైక పండుగ ఇదేనేమో.. డ్యాన్స్, మ్యూజిక్, విందు వినోదాల కలయికగా సాగే ఈ పండుగ సందర్భంగా అనుసరించే ఫ్యాషన్ కూడా కలర్‌ఫుల్‌గా ఉండాలి కదా.. కాబట్టి కలర్ ఫెస్ట్‌లో ప్రత్యేకంగా కనబడేందుకు తాను చెప్పే స్టైల్స్‌తో లుక్‌ని కొత్త లెవల్‌కి తీసుకెళ్లండి అని సూచిస్తున్నారు నగరానికి చెందిన ఫ్యాషన్ కన్సల్టెంట్ సుమన్ కృష్ణ. ఈ ఏడాది ఆరంభం నుంచి ట్రెండింగ్‌లో ఉన్న కలర్.. బ్లాక్‌ని సెంటరాఫ్ ఫ్యాషన్‌గా చేసి హోలీ వేడుకలో త'లుక్'మన వచ్చని అంటున్నారామె. ఆమె అందిస్తున్న విశేషాలు, సూచనలివీ..

– సాక్షి, సిటీబ్యూరో

హోలీకి బెస్ట్.. రంగుల ట్విస్ట్..





కలర్ బ్లాకింగ్ అంటే..?

ఇది విభిన్న, కాంట్రాస్ట్ కలర్ కాంబినేషన్ స్టైల్. మామూలు వైట్ కుర్తా బోరింగ్‌గా ఉంటుంది. సో.. ట్రెండీ కలర్ కాంబినేషన్‌లతో లుక్‌కి ఎక్స్‌ట్రా గ్లామర్ వస్తుంది.. ఒకే షేడ్‌లో ఉండే డ్రెస్సింగ్ కంటే, రెండు లేదా మూడింటికి పైగా బ్రైట్ కలర్స్ మిక్స్ చేసి ధరించడం ద్వారా మరింత స్టైలిష్‌గా కనిపిస్తారు.

కొన్ని కలర్ కాంబినేషన్స్..

ధరించే దుస్తుల మధ్య సరైన కలర్ కాంబినేషన్ చాలా కీలకం. పింక్–ఆరెంజ్ హోలీకి చాలా ఎనర్జిటిక్ కలర్ కాంబినేషన్ అని చెప్పొచ్చు. అలాగే.. ఎల్లో–పర్పుల్ వంటి బ్రైట్ షేడ్స్ ట్రెడిషనల్ హోలీ లుక్‌కి సరైన ఎంపిక. అంతేకాకుండా బ్లూ–రెడ్ కూడా ట్రెండీ లుక్ అందిస్తాయి. వైట్–రేసింగ్ గ్రీన్‌లు క్లాసిక్‌గా కనపడాలంటే బెస్ట్. పీచ్‌లను సున్నితమైన, పండుగ కళ తెచ్చే కలర్స్‌గా పేర్కొనవచ్చు.

స్టైల్ టిప్స్..

స్టైల్–కంఫర్ట్ రెండింటి మేళవింపులా ఇంపుగా అనిపించాలంటే, కాటన్ లేదా లినెన్ ఫ్యాబ్రిక్స్ ఎంచుకోవడం మంచిది.

- బ్రైట్ టాప్ + లైట్ బాటమ్ – లేదా ఆపోజిట్ కలర్ బ్లాక్ డ్రెస్సింగ్ ట్రై చేయవచ్చు. బాగీ/లూజ్ కుర్తాస్, ఫ్యూజన్ ధోతి ప్యాంట్స్ హోలీ మూడ్‌కి సరిగ్గా సరిపోతాయి.
- హోలీ డాన్స్‌లో ఫుల్ ఫన్ కోసం బెస్ట్ ఆప్షన్‌గా పాదాలకు స్నీకర్స్ బెస్ట్.
- సన్‌గ్లాసెస్, వాటర్ ప్రూఫ్ మేకప్ – హోలీ ఎఫెక్ట్స్ స్టైలిష్‌గా హ్యాండిల్ చేయండి



ఇలా చేయొద్దు..

- పూర్తిగా వైట్ డ్రెస్సింగ్ వద్దు. దీనివల్ల రంగుల మిక్స్ తక్కువగా కనిపిస్తుంది.
- హెవీ మెటీరియల్స్, సిల్క్ ధరిస్తే అన్ ఈజీగా అసౌకర్యంగా ఉంటుంది. అలాగే కాళ్లకు హీల్స్ ధరిస్తే జారిపడే చాన్స్ ఎక్కువ. మేకప్, హెయిర్ ప్రొటెక్షన్ లేకుండా వెళ్లడం పెద్ద పొరపాటు అవుతుంది.


సుమన్ కృష్ణ

ఫైనల్ టచ్..

ఈ హోలీలో బ్లాక్ కలర్‌తో మ్యాజిక్ ట్రై చేయవచ్చు. ఫొటోలు మరింత ట్రెండీగా ఉండేలా ప్లాన్ చేసుకుంటే ఈ హోలీ జ్ఞాపకాలతో ఆనందాన్ని ఏడాది పాటు కొనసాగించవచ్చు.

గవర్నర్‌కు విపక్ష నేత ఆహ్వానం, వీడ్కోలు సంప్రదాయం లేదు

శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలప్పుడు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సందర్భంగా స్పీకర్, తదితరులతో కలిసి ఆయనకు విపక్ష నేత ఆహ్వానం, వీడ్కోలు పలికే సంప్రదాయం ఏదీ లేదని శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా కూడా అలాంటి సంప్రదాయాన్ని ఏదీ పాటించలేదని, తమను ఏనాడూ ఆహ్వానించలేదన్నారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు ఇష్టాగోష్టిగా మాట్లాడిన సందర్భంగా ఓ విలేకరి ఈ అంశాన్ని ప్రస్తావించారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంప్రదాయం లేదని కొత్తగా ఏవేవో విషయాలను లేవనెత్తవద్దంటూ మంత్రి సమాధానమిచ్చారు. గత జూలైలో బడ్జెట్ సమావేశాలకు మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యారని, ఇప్పుడు ఏడెనిమిది నెలల తర్వాత సభకు వచ్చినందున సమావేశాల్లో పాల్గొన్నట్టేనా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు శాసనసభా వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు స్పష్టమైన సమాధానాలివ్వలేదు. గవర్నర్ ప్రసంగంలోని అంశాలను ప్రభుత్వం క్లుప్తంగా తయారుచేసినట్టు ఉందన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము మాటల కంటే చేతలకే అధిక ప్రాధాన్యం ఇస్తామంటూ మంత్రి నవ్వుతూ వ్యాఖ్యానించారు.

గవర్నర్ ప్రసంగం డొల్ల

బీజేఎల్పీ నేత 'ఏలేటి'



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం డొల్ల అని, ఎలాంటి విజనరీ లేకుండా చేశారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన బుధవారం తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. రైతు రుణమాఫీ, మహిళలను కోటీశ్వరులను చేశామని అబద్ధాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం బడ్జెట్ ఆమోదం కోసం అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఉందని ఆరోపించారు. ఏప్రిల్ 20 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశామన్నారు. బడ్జెట్‌పై చర్చకు ఐదు రోజులే కేటాయిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు, కృష్ణా జలాల వివాదం, ఆరు గ్యారంటీల అమలుపై చర్చించాలంటే.. కనీసం 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు.

గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు

తులం బంగారం, స్కూటీలు, ఉద్యోగాలు ఎక్కడ?: బీజేపీ ఎమ్మెల్యేల ధ్వజం



మాట్లాడుతున్న పాయల్ శంకర్. చిత్రంలో సూర్యనారాయణ, రామారావు పటేల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పథకాల అమలుపై అసెంబ్లీలో ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో అబద్ధాలు చెప్పించిందని, దీనిపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఈ అంశంపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ మాట్లాడారు. చేయని రుణమాఫీ, మహిళలను కోటీశ్వరులను చేశామని, ఉద్యోగాలు భర్తీ చేశామని అబద్ధాలు చెప్పించారని వారు ధ్వజమెత్తారు. అదే విధంగా తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగ భృతి ఎక్కడ ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేసి.. మిగతా అన్ని పథకాలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. 317 జీవోతో ఉద్యోగులు బాధపడుతున్నారని వారు పేర్కొన్నారు.

న్యూడ్‌కాల్స్‌పై 'చర్చ'!

తమకంటే తమకు వచ్చాయని చెప్పుకున్న ఎమ్మెల్యేలు

నేహాశర్మ పేరుతో కాల్స్ వస్తున్నాయంటూ గుసగుసలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కలకలం సృష్టించిన న్యూడ్ కాల్స్ వ్యవహారం అసెంబ్లీ వరకు వచ్చింది. ఇటీవల నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ కాల్ రావడం, ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీంతో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ అంశంపై బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. తమకు కూడా న్యూడ్ కాల్స్ వచ్చాయని, అయితే తాము బయటకు చెప్పలేదని, నేహాశర్మ పేరుతో తమకు ఆ కాల్స్ వచ్చాయని కొందరు ఎమ్మెల్యేలు గుసగుసలాడుకున్నట్టు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాకే చెందిన మరో ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ, వరంగల్ జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్సీ, మెదక్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు ఇలాంటి కాల్స్ వచ్చాయని చర్చించుకున్నట్టు తెలిసింది.

19న రాష్ట్ర బడ్జెట్

ఈ నెల 27 వరకు కొనసాగనున్న అసెంబ్లీ సమావేశాలు

- గురు, శనివారాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ
- 17, 18 తేదీల్లో ప్రభుత్వ బిజినెస్.. ఎస్సీ, బీసీ రిజర్వేషన్లపై చర్చ.. బీఏసీలో నిర్ణయాలు



బీఏసీ సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, భట్టి, శ్రీధర్‌బాబు, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఏలేటి, కూనంనేని, అక్బరుద్దీన్, ఐలయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రభుత్వం 19వ తేదీన (బుధవారం) ఉభయ సభల్లో రాష్ట్ర బడ్జెట్ 2025–26ను ప్రవేశపెట్టనుంది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బుధవారం స్పీకర్ చాంబర్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరిగింది. ఇందులో ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీఆర్‌ఎస్ తరఫున మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ తరఫున కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. సుమారు గంట పాటు సాగిన ఈ భేటీలో.. తాము ప్రతిపాదించిన అంశాలను సభా వ్యవహారాల్లో చేర్చాలని బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. సభను కనీసం 20 రోజుల పాటు నిర్వహించాలని బీఆర్‌ఎస్ కోరింది. మరోవైపు బీఏసీ సమావేశంలో ఖరారు కావాల్సిన ఎజెండాను ముందుగానే బయటికి లీక్ చేశారంటూ హరీశ్‌రావు వాట్సాప్ సందేశాలను చూపించారు. చివరికి పది రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే సమావేశాలను పొడిగిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు.

విడివిడిగా మూడు రోజుల విరామంతో..

బీఏసీ నిర్ణయం ప్రకారం.. గురువారం (13న) గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపడతారు. 14న హోలీ పండుగ సందర్భంగా విరామం ప్రకటించి, 15న చర్చను కొనసాగిస్తారు. 16న ఆదివారం విరామం. 17న ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై చర్చ జరుగుతుంది. అదే రోజున బీసీ రిజర్వేషన్లు, 18న ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించిన తీర్మానాలపై చర్చ జరిగే అవకాశముంది. 19న రాష్ట్ర బడ్జెట్ 2025–26ను ప్రవేశపెడతారు. సభ్యులు బడ్జెట్‌ను అధ్యయనం చేసేందుకు 20న విరామం ప్రకటించారు. తిరిగి 21 నుంచి 26వ తేదీ వరకు బడ్జెట్ ప్రతిపాదనలు, పద్దులపై చర్చ జరుగుతుంది. 27న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించి, ఆమోదించిన తర్వాత సమావేశాలు నిరవధికంగా వాయిదా పడనున్నాయి. శాసనసభ తరహాలోనే శాసనమండలి సమావేశాల షెడ్యూల్‌ను కూడా ఖరారు చేయగా.. అందులో ఈ నెల 22 నుంచి 26 వరకు విరామం ప్రకటించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్

శాసనసభ, శాసన మండలి సంయుక్త సమావేశంలో ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్‌ను ఉభయ సభల అధిపతులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సభలోకి తోడ్కొని వెళ్లారు. గవర్నర్ ప్రసంగం అనంతరం తిరిగి ఆయనకు స్పీకర్, మండలి చైర్మన్ వీడ్కోలు పలికారు.

దేశానికి దిక్సూచి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. ఆయన 35 నిమిషాల పాటు ఆంగ్లంలో ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్రానికి రైతాంగమే ప్రాణం

'రాష్ట్రంలోని ప్రతి పౌరుడు కలలుగన్న దిశలో పురోగమించేందుకు అవసరమైన అవకాశాలను కల్పించే నిబద్ధతకు అద్దం పట్టేదిగా ఈ బడ్జెట్ సమావేశం ఉండనుంది. తెలంగాణ రాష్ట్రానికి రైతాంగమే ప్రాణం. అలాంటి రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. తొలుత హామీ ఇచ్చినట్టుగా రూ.2 లక్షలు చొప్పున పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రూ.20,616.89 కోట్ల మొత్తంతో 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. రైతు భరోసా కింద ఆర్థిక సహాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఎన్నడూ లేనట్టు సహాయం చేస్తూ ఏడాదికి రూ.12 వేలను సమకూరుస్తోంది. 566 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. 260 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తిదారుగా తెలంగాణ ఆవిర్భవించింది. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం రూ.1,206.44 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. వ్యవసాయ రంగాన్ని మరింత పటిష్ట పరిచేందుకు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేసింది..' అని గవర్నర్ చెప్పారు.



గేమ్ ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం

'బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన మహాలక్ష్మి పథకం గేమ్ ఛేంజర్‌గా మారింది. ఇప్పటివరకు మహిళలకు రూ.5,005.95 కోట్లు ఆదా చేసింది. ఇటీవలే ఆమోదించిన ఇందిరా మహిళాశక్తి మిషన్ పాలసీ ద్వారా రూ.లక్ష కోట్ల ఆర్థిక సాయ లక్ష్యంతో లక్షమంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తయారు చేస్తోంది. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందిస్తోంది. 43 లక్షల కుటుంబాలకు రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తోంది. మహిళా సంఘాలకు 1000 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్రాజెక్టులను కేటాయించింది. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాదిలో 55 వేల మంది ప్రభుత్వోద్యోగాలు పొందారు. ఇది ఎన్నడూ సాధించని విజయం. ప్రపంచ స్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సమీకృత గురుకులాల ప్రారంభంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధమవుతోంది. పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి రంగారెడ్డి జిల్లాలో యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ఏర్పాటు చేస్తోంది..' అని గవర్నర్ తెలిపారు.

బీసీలకు 42% రిజర్వేషన్లకు, ఎస్సీ వర్గీకరణకు బిల్లులు

'సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వం సాహసోపేత మార్పు దిశగా ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. సామాజిక న్యాయాన్ని అందించేందుకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక బిల్లును ప్రతిపాదించింది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కోసం ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టనుంది. అత్యంత అణగారిన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ ఎస్సీ కులాలకు రిజర్వేషన్ ప్రయోజనాలను మరింత న్యాయోచితంగా, సమతుల్యంగా అందించడమే దీని ఉద్దేశం..' అని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు.

ప్రతి కేటాయింపు వెనుక ప్రజల ఆకాంక్షలు

'బడ్జెట్ కేవలం అంకెల కూర్పు కాదు. ప్రభుత్వ భవిష్యత్తు ప్రాధాన్యతలు, విజన్‌కు ప్రతిబింబం. మన పాలసీలను, కార్యక్రమాలను, సంక్షేమ చర్యలను తెలియజేసే ఒక ఆర్థిక నమూనా. కొన్నిసార్లు అంకెలు భయపెట్టినప్పటికీ, ప్రతి కేటాయింపు వెనుక ప్రజల ఆకాంక్షలు ఉంటాయని గుర్తించాలి. యువ, డైనమిక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వ సంకల్పం దృఢమైంది. ప్రవేశపెట్టిన ప్రతి పాలసీ, ప్రతి కార్యక్రమం, ప్రతి సంస్కరణ ప్రజల సాధికారతకు, సమ్మిళిత వృద్ధి కోసం ఉద్దేశించిందే. ప్రస్తుత తెలంగాణ అవకాశాలు, అభివృద్ధి, సాధికారతగల రాష్ట్రంగా ఉంది. రేపటి తెలంగాణ మరింత ఉజ్వలంగా, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ పరిపుష్టి, సాంకేతిక విజ్ఞాన వినూత్నత, సామాజిక న్యాయంలో అగ్రగామిగా నిలవబోతోంది. డాక్టర్ అబ్దుల్ కలామ్ అన్నట్లు ''కలలు కనండి, కలలు ఆలోచనలుగా మారుతాయి, ఆ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి''. ప్రజల కలలను ఈ ప్రభుత్వం విశ్వసిస్తుంది. విజన్, సంకల్పం, కార్యాచరణ ద్వారా వాటిని వాస్తవాలుగా మారుస్తుంది..' అని గవర్నర్ చెప్పారు. జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఏర్పాటు చేయడాన్ని, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు తదితర అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు.

దావోస్‌లో 'తెలంగాణ రైజింగ్'

'దావోస్‌లో తెలంగాణ రైజింగ్ డెలిగేషన్ 49,500 మందికి ఉద్యోగాలను కల్పించేలా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. తెలంగాణకు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగేలా పర్యాటక రంగాన్ని ప్రభుత్వం సమగ్రంగా అభివృద్ధి చేయనుంది. ఇందుకు ప్రత్యేక పర్యాటక విధానాన్ని సిద్ధం చేసింది. భూ పరిపాలనను క్రమబద్ధీకరించడానికి, పౌరులందరికీ భూ భద్రతను కల్పించడానికి, భూ వివాదాలను తగ్గించడానికి, భూ రికార్డులలో పారదర్శకతను పెంపొందించడానికి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టింది. సుస్థిర ప్రపంచ శ్రేణి నగర నిర్మాణం కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయబోతోంది..' అని గవర్నర్ చెప్పారు.

అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సభకు హాజరు

గవర్నర్ ప్రసంగం అనంతరం నందినగర్ నివాసానికి..



సభకు హాజరైన కేసీఆర్. చిత్రంలో బండ ప్రకాశ్, మధుసూదనాచారి, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు నందినగర్‌లోని నివాసం నుంచి కేసీఆర్ అసెంబ్లీకి బయలుదేరారు. ఆయన వెంట పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి రాగా, ఇంటి వద్ద కార్యకర్తలు కొబ్బరికాయలు కొట్టి వాహనంపై గులాబీ పూలు చల్లారు. సభ ప్రారంభానికి అరగంట ముందే అసెంబ్లీకి చేరుకున్న కేసీఆర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలిలో ప్రతిపక్ష నేత ఎస్. మధుసూదనాచారి, హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు. గంగుల కమలాకర్, కేపీ వివేకానంద్, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాసనసభ లాబీలో తనకు కేటాయించిన చాంబర్‌లో అరగంట పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన తమ్ముడి కుమారుడి వివాహానికి రావాల్సిందిగా కేసీఆర్‌ను ఆహ్వానిస్తూ శుభలేఖ అందజేశారు. అశ్వారావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కూడా కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాలు ఉదయం 11కి ప్రారంభం కాగా, 5 నిమిషాల ముందే పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేసీఆర్ సభలోకి వెళ్లారు. గవర్నర్ ప్రసంగం ముగిశాక సభ వాయిదా పడగానే అసెంబ్లీ నుంచి కేసీఆర్ తిరిగి నందినగర్ నివాసానికి వెళ్లిపోయారు.

కేసీఆర్‌ను కలిసిన మంత్రి తుమ్మల

శాసనసభకు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఆయన యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. కేసీఆర్ కూడా మంత్రి తుమ్మల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గవర్నర్‌ది గాంధీభవన్ ప్రసంగం

▶ మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యంతో రైతులు అరిగోసలు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా, గవర్నర్ ప్రసంగంలో ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చే ఒక్కమాట కూడా లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 నుంచి 30 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, గవర్నర్ నోటి ద్వారా మాత్రం రుణమాఫీ పూర్తయిందని అబద్ధాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందక ఆగమాగమవుతుంటే, రైతుబంధు అందిందని, అసత్యాలు వల్లించారని విమర్శించారు. సాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, గోదావరి పరీవాహకంలో పంటలు ఎండిపోతున్నాయని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 83 మంది విద్యార్థుల మరణాలపై గవర్నర్ ప్రసంగంలో ఒక్క సానుభూతి మాట కూడా లేదని విచారం వ్యక్తం చేశారు.

బీసీలకు సామాజిక న్యాయమా?

కులగణన పేరుతో బీసీల సంఖ్య తగ్గించి, వారిని మోసం చేసి.. ఏదో ఉద్ధరించినట్టు సోషల్‌జస్టిస్ అని గవర్నర్ నోటివెంట అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అవమానించిందని తాము అనడం లేదని, అధికార కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఒకరు గళం విప్పితే, ఆయన్ను సస్పెండ్ చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క బీసీ సంక్షేమ సంఘమైనా కులగణన లెక్కలు సరైనవని అంటుందా? ఒక్క బీసీ బిడ్డ మీ లెక్కతో ఏకీభవిస్తున్నడా? మీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలైనా ఏకీభవించే పరిస్థితి ఉందా అంటూ ప్రశ్నించారు.

నో విజన్.. ఓన్లీ కమీషన్

భారతదేశంలో ఏ రాష్ట్ర సచివాలయంలోనూ జరగని ఘోర సంఘటన తెలంగాణ సచివాలయంలో జరిగిందని కేటీఆర్ దుయ్యబట్టారు. 20 శాతం కమీషన్ ఇవ్వకపోతే బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ధర్నా చేసిన సంఘటనే దీనికి నిదర్శనమని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదు.. కేవలం 20 శాతం కమీషన్ కక్కుర్తి మాత్రమే ఉందని మండిపడ్డారు. కమీషన్ నుంచి వచ్చిన డబ్బులను ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో రూ. 4.17 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే రూ.1.62 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. దావోస్‌లో రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ ద్వారా అబద్ధాలు చెప్పించారని, గత ఏడాది చెప్పిన రూ.40,000 కోట్లలో ఒక్క పైసా కూడా రాలేదని, దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నమని, తెలంగాణ ప్రజలు సమయం వచ్చినప్పుడు సమాధానం చెప్పడం ఖాయమన్నారు.

పిచ్చికుక్క హద్దులన్నీ దాటేసింది

'మర్యాదకు ఉండే హద్దులన్నింటినీ పిచ్చి కుక్కదాటేసింది. అతడిని వెంటనే ఏదైనా పిచ్చాస్పత్రికి వీలైనంత త్వరగా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులను కోరుతున్నారు. అసహనంతో ఉన్న అతను.. తన చుట్టూ ఉన్నవారిని కరవడం మొదలుపెడతాడేమో. త్వరగా కోలుకో 'చీఫ్ మినిస్టర్'అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గవర్నర్ ప్రసంగంలోని డొల్లతనాన్ని ఎండగడదాం

బీజేఎల్పీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ఆరు గ్యారంటీలు, 421 హామీల అమల్లో సర్కారు చేతులెత్తేయడాన్ని నిలదీయాలని బీజేఎల్పీ సమావేశం తీర్మానించింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్టీ సభ్యులు మాట్లాడే సమయంలో కూడా ఆ ప్రసంగంలోని డొల్లతనాన్ని, అవాస్తవాలను ప్రస్తావిస్తూ గట్టి విమర్శలు సంధించాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాలను కనీసం వచ్చేనెల 20వ తేదీ వరకైనా నిర్వహించాలనే డిమాండ్‌ను సభలో చేయాలని నిర్ణయించింది. రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళలను కోటీశ్వరులను చేస్తామనే ప్రణాళిక, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ఊసు లేకపోవడం.. తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశం తీర్మానించింది. కృష్ణాజలాల వివాదంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులు, సాగునీళ్లు అందక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఎదురుకావడం వంటి విషయాలను ప్రస్తావించాలని నాయకులు నిర్ణయించారు. ఏయే అంశంపై ఎవరు మాట్లాడాలనే దానిపై అందరి అభిప్రాయాలు తీసుకుని ఆయా సబ్జెక్టులు కేటాయించాలని భావిస్తున్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగిశాక బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

ఫాంహౌస్‌లో పడుకుంటే అభివృద్ధి ఎలా కనిపిస్తుంది

కుల సర్వేలో పాల్గొనని కేటీఆర్‌కు సర్వేపై మాట్లాడే అర్హత లేదు

మేడిగడ్డతో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుంది: మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగంపై మాజీ మంత్రి కేటీఆర్ ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్యతో కలిసి మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి కేటీఆర్ ఓర్వలేక దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఫాంహౌస్‌లో పడుకుంటే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఎలా కనిపిస్తుందని, కేటీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ప్రభుత్వ పనితీరు తెలుస్తుందని అన్నారు. యువతను మత్తుకు బానిసలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని మహేశ్‌గౌడ్ విమర్శించారు. చరిత్రాత్మక కుల సర్వేలో పాల్గొనని కేటీఆర్‌కు సర్వేపై మాట్లాడే అర్హత లేదన్నారు. 15 ఏళ్ల తర్వాత తెలంగాణలో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని చెప్పారు. కేసీఆర్ ఇప్పటికైనా ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

విగ్రహాలను టచ్ చేసి చూడు...: 'కేటీఆర్... తెలంగాణ తల్లి, రాజీవ్ గాంధీ విగ్రహాలను టచ్ చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారు. అధికారం పోయినా ఆయనలో అహంకారం తగ్గలేదు. మేడిగడ్డ పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుంది' అని మహేశ్‌గౌడ్ ఆరోపించారు.

గవర్నర్ మారినా ప్రసంగం మారలేదు

అన్నీ అబద్ధాలు, అవాస్తవాలే: మాజీమంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గవర్నర్ మారినా ప్రసంగం మారలేదని, గతేడాది ప్రసంగానికి, ప్రస్తుతానికి తేడా ఏమీ లేదని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగంపై హరీశ్‌రావు స్పందించారు. గవర్నర్ ప్రసంగమంతా అబద్ధాలు, అవాస్తవాలతో సాగిందని, ఏడాదిన్నర రేవంత్ ప్రభుత్వ పాలన వైఫల్యానికి ఇది అద్దం పట్టిందన్నారు. రేవంత్ తన అబద్ధాల ప్రచారాన్ని నమ్మించేందుకు గవర్నర్ ప్రసంగాన్ని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీ, చంద్రబాబు సేవలో రేవంత్ నిమగ్నమయ్యాడని, మార్పు పేరిట రైతులు, నిరుద్యోగులను అరెస్టు చేయిస్తున్నారన్నారు. ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించడాన్ని కూడా గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు.

సంఖ్యా బలాన్ని బట్టి సమయం కోరాం

అసెంబ్లీలో తమ పార్టీ సంఖ్యాబలానికి అనుగుణంగా సభ్యులకు మాట్లాడే సమయమివ్వాలని కోరామని, స్పీకర్ కూడా తమ విజ్ఞప్తికి అంగీకరించారని హరీశ్‌రావు వెల్లడించారు. స్పీకర్ అధ్యక్షతన బుధవారం బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీ సమావేశాలు 20 రోజులు జరపాలని కోరాం. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ముందే లీక్ కావడంపై అభ్యంతరం తెలిపాం. రైతాంగం, తాగు, సాగు నీటి సమస్యలు, సుంకిశాల, పెద్దవాగు, వట్టి పంప్‌హౌస్, ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై అసెంబ్లీలో చర్చించాలని కోరాం. కృష్ణా నదీ జలాల వినియోగంలో ప్రభుత్వ వైఫల్యం, ఏపీ అక్రమ నీటి తరలింపుపై చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని కోరాం' అని హరీశ్ వెల్లడించారు.

మెచ్యూరిటీ లేకనే మార్చురీ వ్యాఖ్యలు: పొలిటికల్ మెచూరిటీ లేనందునే సీఎం రేవంత్ మార్చురీ వ్యాఖ్యలు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రతిపక్ష నేతల మరణాన్ని కోరుకుంటున్న నీచబుద్ధి రేవంత్‌ది అని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు మండిపడ్డారు. 'రాష్ట్రానికి కేన్సర్ సోకిందంటున్న రేవంత్ తన చేతకానితనాన్ని ప్రజలకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

వ్యవసాయాభివృద్ధికి గవర్నర్ ప్రసంగం రోడ్ మ్యాప్

దేశంలో అతిపెద్ద వరి ఉత్పత్తిదారు తెలంగాణే: మంత్రి ఉత్తమ్ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో గవర్నర్ ప్రసంగం వ్యవసాయాభివృద్ధికి రోడ్‌మ్యాప్‌లా సాగిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అతి పెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించిందని చెప్పారు. రికార్డు స్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన విషయాన్ని గవర్నర్ తన ప్రసంగంలో చెప్పడం ద్వారా జాతీయస్థాయిని ఆకర్షించిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరుగైన నీటి వనరుల వినియోగం, రైతుల కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రభుత్వం తన ఎన్నికల హామీలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసిందని, ఇందుకోసం 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616.89 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా రైతులకు ఎకరానికి రూ. 12 వేల చొప్పున, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు 566 రైతు వేదికలను ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయడంతో పాటు, రైతు నేస్తం డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రాష్ట్రంలోని 532 మండలాలను వీడియో కాన్ఫరెన్స్‌కు అనుసంధానం చేసినట్లు వివరించారు. సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ కింద రూ.1,206.44 కోట్లు రైతులకు అందించిందని చెప్పారు. భవిష్యత్తులో నీటి సంరక్షణ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతులను వ్యవసాయంలో వినియోగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

రెండేళ్లలో వరంగల్ నుంచి విమాన సర్వీసులు

కేసీఆర్ అసెంబ్లీకి వస్తే హడావుడి ఎందుకు?

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వచ్చే రెండేళ్లలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల గురించి కూడా పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించినట్టు ఆయన చెప్పారు. రాబోయే ఎనిమిది నెలల్లో ఉప్పల్ – నారపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేస్తామన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏముంది. ఆయన పాస్‌పోర్ట్ గజదొంగ. ఆయన అసెంబ్లీకి వస్తే హడావుడి ఎందుకు అని'వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ప్రదేశంలో భావోద్వేగ పరిస్థితులు ఉన్నాయన్నారు. తాను ఏదో సందర్భంలో ఒక మాట అంటే దాన్ని కూడా కొందరు చెత్త గాళ్లు ట్రోల్ చేశారన్నారు. అయినా ఆ చెత్తగాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్మును బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో కుమ్మరిస్తోందని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉండి కూడా రాష్ట్ర కార్యవర్గాన్ని వేసుకోలేని అసమర్థ పార్టీ బీఆర్‌ఎస్ అని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాలను కవర్ చేసేందుకు వచ్చే మీడియా ప్రతినిధులకు ఇంకా కొత్త పాస్‌లు జారీ చేయకపోవడం పట్ల మంత్రి పొన్నం.. అసెంబ్లీ కార్యదర్శిపై అసహనం వ్యక్తంచేశారు. ఇద్దరు మంత్రులు విలేకరులతో మాట్లాడుతున్న సందర్భంగా.. కొందరు మీడియా ప్రతినిధులు గులాబీరంగుతో ఉన్న పాత కార్డులను చూపుతూ, కనీసం వీటినైనా మార్చి కొత్తవి ఇవ్వలేరా? అని పొన్నం దృష్టికి తెచ్చారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా ఇంకా పాత కార్డులనే ఎందుకు కొనసాగిస్తున్నారు? అంటూ మంత్రి అసెంబ్లీ సెక్రటరీని ప్రశ్నించారు.



- సైబర్ భద్రత సాంకేతికతతో ముడిపడిన అంశం
- పోలీసులు, ఏజెన్సీలు మాత్రమే ఈ నేరాలను కట్టడి చేయలేవు
- యువతలో నైపుణ్యాలు వెలికితీయడానికే హ్యాకథాన్లు
- ప్రజల్లో అవగాహన కల్పించడానికి పెద్దపీట వేస్తున్నాం
- 'సాక్షి'తో ఎన్సీఎస్సార్సీ డైరెక్టర్ ఇ.కాళిరాజ్ నాయుడు

సైబర్ నేరాలకు సమష్టిగా చెక్



సాక్షి, హైదరాబాద్: 'సైబర్ నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ-కేటుగాళ్లు కనీసం బాధితుల కంటికి కూడా కనిపించకుండా రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. సైబర్ భద్రత, ఈ నేరాల దర్యాప్తు సాంకేతికతతో ముడిపడిన అంశాలు. పోలీసు విభాగాలు, ప్రత్యేక ఏజెన్సీలు మాత్రమే వీటిని కట్టడి చేయలేవు'అని నేషనల్ సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ కౌన్సిల్ (ఎన్సీఎస్సార్సీ) డైరెక్టర్ డాక్టర్ ఇ.కాళిరాజ్ నాయుడు అన్నారు. జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న ఎన్సీఎస్సార్సీ.. ఉస్మానియా యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్లో బుధవారం హ్యాకథాన్-ఎక్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాళిరాజ్ నాయుడు 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సైబర్ నేరాలు, భద్రతపై ఆయన చెప్పిన అంశాలివి...

ఎన్సీఎస్సార్సీ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల్లోనూ హ్యాకథాన్-ఎక్స్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో నిర్వహించాం. తెలంగాణలో ఓయూ వేదికగా ఏర్పాటు చేశాం. కంప్యూటర్ ఇంజనీరింగ్లోని అన్ని విభాగాలకు చెందినవాళ్లు ఇందులో పాల్గొంటున్నారు. యువకులతో పాటు యువతులూ పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఆంధ్రప్రదేశ్లో నిర్వహించిన హ్యాకథాన్కు 300 మంది హాజరుకాగా.. తెలంగాణలో 400 మంది పోటీపడ్డారు. వీటి నుంచి ఎంపికైన 50 బృందాలకు (దాదాపు 200 మంది) వచ్చే నెల (ఏప్రిల్) రెండో వారంలో ఆంధ్రప్రదేశ్లో సెమీఫైనల్స్ నిర్వహిస్తాం. ఇందులో విజయం సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందిస్తాం. ఇలా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, విభాగాల్లో సెమీ ఫైనల్స్ను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నాం. వీటి తర్వాత ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ రీజియన్లలో ఫైనల్స్ ఉంటాయి. గెలుపొందే వారికి మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష ఇవ్వనున్నాం. ఆపై ఢిల్లీలో సూపర్ ఫైనల్స్ జరుగుతాయి.

దేశవ్యాప్తంగా హ్యాకథాన్లు

యువతలోని నైపుణ్యాలను వెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దీనికోసం సర్కారు కూడా హ్యాకథాన్లు నిర్వహిస్తోంది. అయితే అవి ప్రధాన నగరాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. రెండు, మూడో శ్రేణి నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ఎన్సీఎస్సార్సీ పని చేస్తోంది. దీనికోసమే ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో హ్యాకథాన్-ఎక్స్లు నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా నిపుణులను వెలికితీసి జాతికి అంకితం చేయాలన్నదే మా ధ్యేయం. వీళ్లు పోలీసులు, ఏజెన్సీలకు సహకరిస్తారు. ఎన్సీఎస్సార్సీ నిర్వహించే హ్యాకథాన్లలో సత్తా చాటుతున్న యువతీయువకులకు ఉద్యోగాలు ఇవ్వడానికి అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఈ మేరకు ఎన్సీఎస్సార్సీకి విజ్ఞప్తులు కూడా వస్తున్నాయి. హ్యాకథాన్లలో పాల్గొన్న వారిలో ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఉద్యోగాలిచ్చేందుకు ముందుకొస్తున్న కంపెనీలు

నేరాలపై అవగాహనకు పెద్దపీట

సైబర్ నేరాల బారినపడిన వారికి సహాయం చేయడం కన్నా.. అసలు ఎవరూ ఆ నేరాలకు బలి కాకుండా చూసుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇందులో భాగంగా దర్యాప్తు, సైబర్ సెక్యూరిటీ పైనే కాకుండా అవగాహన కల్పించడానికీ పెద్దపీట వేస్తున్నాం. దీనికోసం ఎన్సీఎస్సార్సీ హ్యాకథాన్ల ద్వారా ప్రత్యేక సమూహాన్ని ఏర్పాటు చేయనున్నాం. ఇందులోని సభ్యులు అన్ని రంగాలకు చెందిన వారికి సైబర్ నేరాలు, భద్రతపై అవగాహన కల్పిస్తుంటారు. వీరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వ ఏజెన్సీల్లోనూ పని చేసే అవకాశం వస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్సీఎస్సార్సీ ప్లానింగ్, టెక్నికల్, అవేర్నెస్ కోణాలను స్పృశిస్తూ హ్యాకథాన్లను నిర్వహిస్తోంది. మా హ్యాకథాన్లలో పాల్గొంటున్న అభ్యర్థులు తమ రాష్ట్రాలకే సేవలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ కోణంలో ముందుకు రావాలి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్సీఎస్సార్సీతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. మిగిలిన రాష్ట్రాలు సైతం ఇలా ముందుకు రావాలి అని కాళిరాజ్ నాయుడు కోరారు.

క్లుప్తంగా...

ఇంటర్ ప్రశ్నపత్రాల్లో తప్పులు

సరిచేసిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మ్యాథ్స్లో కొన్ని సంకేతాలు తప్పుగా వచ్చాయి. బాటనీ ప్రశ్నపత్రంలోనూ అచ్చు తప్పులు చోటుచేసుకున్నాయి. అయితే, వీటిని ఇంటర్ బోర్డు గుర్తించి విద్యార్థులను అప్రమత్తం చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రంలో ఉండాల్సినవేంటో వెంటనే పరీక్ష కేంద్రాలకు సమాచారం ఇచ్చినట్టు ఇంటర్ బోర్డు అధికారులు వెల్లడించారు. వీటిని పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లు వివరించారని, దీంతో ఎక్కడా ఇబ్బంది జరగలేదన్నారు. కొన్ని కేంద్రాల్లో ఈ ప్రయత్నంలో ఇన్విజిలేటర్లు విఫలమవడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. కాగా, నిజామాబాద్లో ఇద్దరు, సిద్దిపేటలో ఒకరు కాపీ కొడుతూ పట్టుబడినట్టు బోర్డు వెల్లడించింది.

టీచర్ నియామకాల్లో వాస్తవాలు వెల్లడించండి

డీఎస్సీ బాధిత అభ్యర్థుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామకాల్లో క్రీడాకారుల కోటాలో జరిగిన అక్రమాలపై వాస్తవాలు వెల్లడించాలని ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసిన అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. 2024లో చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో 2 శాతం క్రీడా కోటాను కూడా చేర్చారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు అంతర్జాతీయ, ఎస్జీటీ పోస్టుల్లో జాతీయస్థాయి క్రీడాకారులు అర్హులని తెలిపింది. అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు లేకపోవడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎవరూ దరఖాస్తు చేయలేదు. ఎస్జీటీ పోస్టుల కోసం 1,000 మంది దరఖాస్తు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను కాకుండా రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్న అభ్యర్థులను నియమించినట్టు ఆరోపణలొచ్చాయి. కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీనిపై రీ వెరిఫికేషన్ చేస్తామని డీఎస్సీ అధికారులు కోర్టుకు తెలిపారు. దీనికోసం గత నవంబర్లో కమిటీని వేశారు. అయితే ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఏంటో బయటపెట్టకపోవడంతో అభ్యర్థులు సందేహిస్తున్నారు. నివేదికను హైపవర్ కమిటీకి పంపుతున్నట్లు అధికారులు చెప్పడం దాటవేసే ధోరణిగా భావిస్తున్నారు.

33 అదనపు కలెక్టర్ పోస్టుల అప్గ్రేడేషన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ
- జీఏడీ నుంచి రెవెన్యూకు పోస్టుల బదలాయింపు

సాక్షి, హైదరాబాద్: అదనపు కలెక్టర్ల పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రాష్ట్రంలో 33 అదనపు కలెక్టర్ పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సాధారణ పరిపాలన శాఖ పరిధిలో ఉన్న ఈ పోస్టులను రెవెన్యూ శాఖకు బదలాయిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన జీవో నం.29లో పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడి విజ్ఞప్తి మేరకు ఈ పోస్టులను అప్గ్రేడ్ చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు రెవెన్యూ శాఖలో ఉన్నత స్థాయిలో ఉన్న స్పెషల్గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల స్థానే కొత్తగా ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన అదనపు కలెక్టర్ (సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్) పోస్టులు చేరినట్టయింది. కాగా, తమ విజ్ఞప్తి మేరకు అదనపు కలెక్టర్ పోస్టులను అప్గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణలు ధన్యవాదాలు తెలిపారు.

పదోన్నతులివ్వండి: రెవెన్యూ ముఖ్య కార్యదర్శికి వినతి

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల హోదాలో అదనపు కలెక్టర్లుగా పనిచేస్తున్న 68 మందికి పదోన్నతులివ్వాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. లచ్చిరెడ్డి, కె.రామకృష్ణలు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ను కలసి వినతిపత్రం అందజేశారు. వివిధ శాఖల్లో డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న అందరికీ పదోన్నతులు కల్పించాలని వారు కోరారు.

ఆదాయం పెరిగితేనే పథకాలు నడపగలం

ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి

- రాష్ట్రానికి నెలకు రూ.22 వేల కోట్ల ఆదాయం కావాలి
- కానీ రూ.18,500 కోట్ల వరకు మాత్రమే వస్తోంది
- ఇందులో రూ.6,500 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే పోతున్నాయ్
- మరో రూ.6,500 కోట్లు అప్పుల రీపేమెంట్కు కడుతున్నాం
- మిగిలిన రూ.5,500 కోట్లతోనే సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- ఇబ్బంది ఉంది కాబట్టే ఒక్కో నెల ఒక్కో పథకానికి కోత తప్పడం లేదన్న సీఎం
- స్టేచర్ ఉందనుకునే నాయకులు స్ట్రెచర్ మీదకు వెళ్లారని వ్యాఖ్య
- 1,692 మంది అధ్యాపకులకు నియామక పత్రాల అందజేత



బుధవారం రవీంద్రభారతిలో నియామకపత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ప్రతినెలా రూ.22 వేల కోట్ల ఆదాయం అవసరమని, అంత ఉంటేనే సంక్షేమ పథకాలను ఓ మోస్తరుగా నడపగలమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చెప్పారు. ఇప్పుడొస్తున్న ఆదాయంలో ఉద్యోగుల వేతనాలు, అప్పులకే రూ.13 వేల కోట్లు పోతున్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి క్యాన్సర్లా మారిందని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో ఏం చేయాలో ఉద్యోగులు చెప్పాలని కోరారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 1,292 మంది జూనియర్ కాలేజీ లెక్చరర్లు, 400 మంది పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులకు బుధవారం రవీంద్రభారతి వేదికగా ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

ప్రభుత్వం రొటేషన్ మాత్రమే చేస్తోంది..

'ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.18 వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో రూ.6,500 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సి వస్తోంది. రూ.6,500 కోట్లు అప్పులు తిరిగి చెల్లించేందుకు కడుతున్నాం. మిగిలిన రూ.5 వేల కోట్ల నుంచి రూ.5.5 వేల కోట్లల్లోనే 25 నుంచి 30 సంక్షేమ పథకాలకు చెల్లించాలి. ఏ ప్రాజెక్టులు కట్టాలన్నా, ఏ అభివృద్ధి చేయాలన్నా ఈ నిధులే వాడుకోవాలి. ఈ ఇబ్బంది ఉంది కాబట్టే ఒక్కో నెలలో ఒక్కో పథకానికి చెల్లింపు పెండింగ్లో పెడుతున్నాం. మా ప్రభుత్వం రొటేషన్ చేసే పని మాత్రమే చేస్తోంది.

గత సీఎం క్యాన్సర్ ఇచ్చిపోయాడు

గత ముఖ్యమంత్రి రాష్ట్రానికి క్యాన్సర్ ఇచ్చి పోయాడు. దీన్ని నయం చేసే ప్రయత్నం చేస్తుంటే పది నెలలకే దిగిపొమ్మంటున్నారు. తల తాకట్టు పెట్టి ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి రోజు వేతనాలు ఇస్తున్నాం. ఉద్యోగులు విపక్షాల మాటలకు ప్రభావితం కావొద్దు. స్టేచర్ ఉందనుకునే నాయకులు స్ట్రెచ్చర్ మీదకు వెళ్లారు. అక్కడి నుంచి మార్చురీకి కూడా నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఇంటికి తీసుకెళ్లను. నా కాళ్లు, చేతులు బాగానే ఉన్నాయి. పని చేసి జీవిస్తా..'అని సీఎం అన్నారు.

అధ్యాపకులు భవిష్యత్తుకు బాటలు వేయాలి

'ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందుకున్న వారిలో భావోద్వేగం కన్పిస్తోంది. పరీక్షలు రాసి 12 ఏళ్ళు నిరీక్షించారు. గత ప్రభుత్వంలో చిత్తశుద్ధి లేమి కాలయాపనకు కారణం. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంపై నేను ప్రత్యేక శ్రద్ధ చూపా. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 57,946 ప్రభుత్వ నియామకాలు చేపట్టాం. దేశ చరిత్రలోనే ఇది ఎక్కడా లేదు. గత పాలకుల ఉద్యోగాలు తీసి వేయడం వల్లే ఇన్ని ఉద్యోగాలొచ్చాయి. తెలంగాణ భవిష్యత్తుకు అధ్యాపకులు బాటలు వేయాలి. అంకిత భావంతో పనిచేయాలి.

ఒక్కో విద్యార్థికి ఏటా రూ.80 వేలు ఖర్చు చేస్తున్నాం..

రాష్ట్ర విద్యారంగంలో ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రభుత్వ స్కూళ్ళల్లో ప్రవేశాలు ప్రతి ఏటా తగ్గుతున్నాయి. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.80 వేలకు పైగా ఖర్చు చేస్తున్నాం. విద్యార్థులు ఎక్కువగా ప్రైవేటు స్కూళ్ళల్లో ఎందుకు చేరుతున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిజానికి ప్రైవేటు కన్నా ప్రభుత్వ స్కూళ్ళలోనే నాణ్యమైన టీచర్లు ఉన్నారు. అయినా ప్రజలు ఎందుకు నమ్మడం లేదు? సర్కారీ స్కూళ్ళల్లో పోటీతత్వం పెరగాలి. ఇందుకు తగ్గ ప్రణాళికలు రూపొందిస్తాం ..'అని రేవంత్ చెప్పారు.

ఇంజనీరింగ్లో నాణ్యత ఉండటం లేదు..

'రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నారు. ఇందులో 10 శాతం మందికి కూడా ఉద్యోగాలు రావడం లేదు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ కోర్సు కోసం ఆరాటపడుతున్నా, వారికి బేసిక్స్ కూడా ఉండటం లేదు. ఈ నేపథ్యంలో విద్యతో పాటు నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. క్రీడా రంగంలో వెనుకబాటును అధిగమించడమే లక్ష్యంగా క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేశాం..'అని సీఎం వివరించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభవన్లో జరిగిన ప్రీబడ్జెట్ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు, జయేశ్ రంజన్ తదితరులు

రాష్ట్ర ప్రతిష్ట పెంచిన ఐటీ, పరిశ్రమ శాఖలు

- ఈ శాఖలు భారీగా పెట్టుబడులు తెచ్చాయి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రతిష్టను పెంచడంలో ఐటీ, పరిశ్రమల శాఖలు కీలక పాత్ర పోషించాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సంవత్సర కాలంగా వివిధ సదస్సుల ఏర్పాటుతో ఈ శాఖలు భారీగా పెట్టుబడులను ఆకర్షించాయని ప్రశంసించారు. బుధవారం ప్రజాభవన్లో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమల శాఖ సమావేశంలో భట్టి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు కార్పొరేట్ సంస్థలు తీసుకొనేలా చర్యలు చేపట్టాలని అధికారులను భట్టి ఆదేశించారు. భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాకాలను దశలవారీగా విడుదల చేస్తామని తెలిపారు. లెదర్ పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని ఆదేశించారు. మూడో శ్రేణి పట్టణాలకు ఐటీ టవర్స్ విస్తరణను వేగవంతం చేయాలని సూచించారు.

హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు

హైదరాబాద్ నగరం తెలంగాణకు తలమానికమని, అందుకు అనుగుణంగా నగరం అభివృద్ధికి ప్రణాళికలు వేసి, వేగంగా పనులు పూర్తిచేయాలని భట్టి విక్రమార్క, శ్రీధర్బాబు ఆదేశించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి ప్రజలు పెద్ద ఎత్తున వలస వస్తున్నారని, వారందరికీ సరిపడా రహదారులు, విద్యుత్తు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. విద్యుత్తు సరఫరా వ్యయాన్ని తగ్గించుకోవాలని, రెప్పపాటు కూడా కరెంటు పోకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో పంటలు ఎండిపోకుండా విద్యుత్తు శాఖ ఉన్నత అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశాల్లో వివిధ శాఖల ఉన్నతాధికారులు రామకృష్ణారావు, జయేష్ రంజన్, దాన కిషోర్, సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ బృందానికి 'భట్టి'విందు

రాష్ట్ర ఆర్థిక శాఖాధికారులు, సిబ్బందికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విందు ఏర్పాటు చేశారు. వార్షిక బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బందికి బుధవారం సాయంత్రం ప్రజాభవన్లో ఈ విందును భట్టి ఏర్పాటు చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిప్యూటీ సీఎంవో ఎస్డీ కృష్ణ భాస్కర్లు విందుకు హాజరయ్యారు.

మీరే ఉమ్మడిగా నిర్ణయం తీసుకోండి

- సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల కోరిన ఏపీ
- దీనిపై ఇరు రాష్ట్రాల అధికారులే నిర్ణయించాలని కృష్ణా బోర్డు సూచన

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ఎడమగట్టు కాల్వ కింద ఏపీలోని పంటలకు నీళ్ల విడుదల చేసే అంశంపై రెండు రాష్ట్రాలు చర్చించి నిర్ణయం తీసుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. ఎడమ కాల్వ కింద ఏపీలో సాగుచేస్తున్న పంటల కోసం 3,530 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా తెలంగాణ అధికారులకు సూచించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేఆర్ఎంబీని కోరిన విషయం తెలిసిందే. జోన్-3 పరిధిలోని 21వ ప్రధాన బ్రాంచి కాల్వ 101.36 కి.మీ. వద్ద 2,160 క్యూసెక్కులు, జోన్-2 పరిధిలో 2,160 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా చూడాలని బోర్డుకు రాసిన లేఖలో ఏపీ కోరింది. దీనిపై స్పందించిన బోర్డు.. ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్సీలు సమావేశమై దీనిపై ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లలో మిగిలి ఉన్న నీటి నిల్వల వినియోగం విషయంలో రెండు రాష్ట్రాల ఈఎన్సీలు నిర్ణయం తీసుకోవాలని గత నెల 27న నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేసింది.

మూడో విడత టెలిమెట్రీపై స్పందించాలి

కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వాడుకుంటున్న జలాలను కచ్చితంగా లెక్కించడానికి మూడో విడత టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై చర్చించి నిర్ణయించడానికి రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసే అంశంపై స్పందించాలని రెండు రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. గత నెల 17న జరిగిన బోర్డు సమావేశంలో ఏపీలోని పలు ప్రాజెక్టులపై మూడో విడత కింద టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రతిపాదించగా, దీనిపై చర్చించడానికి రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఏపీ సూచించింది. కమిటీ ఏర్పాటుకు అధికారుల పేర్లను రెండు రాష్ట్రాలు ఇంకా సూచించకపోవడంతో తక్షణమే స్పందించాలని తాజాగా బోర్డు లేఖలు రాసింది.

సీఎస్ వైద్యనాథన్ బృందం సేవల కొనసాగింపు..

సుప్రీంకోర్టు, కృష్ణా ట్రిబ్యునల్-1 ఎదుట వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాదులు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టుతో పాటు కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాదులు సీఎస్ వైద్యనాథన్, హరీశ్ వైద్యనాథన్, నిఖిల్ స్వామి, కుశ్విందర్ వొహ్రా సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ వైద్యనాథన్ నేతృత్వంలోని న్యాయవాదుల బృందం కృష్ణా జలవివాదాల విషయంలో కృష్ణా ట్రిబ్యునల్-2, సుప్రీంకోర్టు ఎదుట రాష్ట్రం తరఫున వాదనలు వినిపిస్తోంది.

కల్లుగీత సహకార సంస్థలో నీరాకేఫ్ విలీనం

ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరుశాఖల మంత్రులు

సాక్షి, హైదరాబాద్: నెక్లెస్రోడ్డు సమీపంలోని నీరాకేఫ్.. తెలంగాణ కల్లుగీత ఆర్థిక సహకార సంస్థలో విలీనమైంది. ఇప్పటివరకు నీరాకేఫ్ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కొనసాగేది. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన నీరాకేఫ్ నిర్వహణలో శాఖాపరమైన ఇబ్బందులు లేకుండా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ విలీన ప్రతిపాదనను ఆమోదించింది. ఇందులో భాగంగా నీరాకేఫ్ భవనం.. దాని పరిధిలోని ఆస్తులను తెలంగాణ కల్లు గీత ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేస్తూ బుధవారం ఇరు శాఖల మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. కల్లు గీత కార్మికులకు అండగా ఉంటూ.. వారి ఆందోళనలను తొలగించేందుకు కృషి చేశారని కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పావువంతు పదవీకాలం గడిచిపోయింది!

ఇప్పటికైనా ఉద్యోగులు, టీచర్ల సమస్యలు పరిష్కరించండి

- తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్
- అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సీఎం కొంత సమయం ఇవ్వమన్నారు
- ఇప్పుడు మంత్రులు, అధికారులు పట్టించుకోవడం లేదు
- తక్షణమే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు
- మేలో పూర్తిస్థాయి కార్యాచరణ ఖరారు: జేఏసీ నేతల వెల్లడి



బుధవారం టీఎన్జీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు గడిచిందని, పావువంతు పదవీకాలం ముగిసినందున తక్షణమే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం నాంపల్లిలోని టీఎన్జీఓ కార్యాలయంలో టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం జేఏసీ సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ఇతర సభ్యులతో కలిసి జగదీశ్వర్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లకు సంబంధించి 57 రకాల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నాయని ఆయన చెప్పారు. వీటిలో 45 సమస్యలు ఆర్థికపరమైనవి కావన్నారు. పాలనాపరంగా నిర్ణయం తీసుకుంటే తక్షణ ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కొంత సమయం కావాలని సీఎం అన్నందున ఉద్యోగులంతా ఓపికతో ఎదురుచూశారని..ఇప్పుడు తమ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు సచివాలయంలోని ఉన్నతాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తే కనీసం సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే గంటల తరబడి వెయిటింగ్లో ఉంచి చివరకు సమయం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు మంత్రులు కూడా ఉద్యోగులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఐదు డీఏలు తక్షణమే ఇవ్వాలని, పీఆర్సీని వెంటనే ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉద్యోగులు సహనంతో వేచిచూశారని, ఇకపై వేగవంతంగా నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏప్రిల్ 1 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లేఖలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని, మేలో జరిగే రాష్ట్రస్థాయి జేఏసీ సమావేశంలో పూర్తిస్థాయి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

ప్రజా ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి

ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నా, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు. ప్రస్తుతం కొందరు మంత్రులు, అధికారుల తీరు గత ప్రభుత్వం మాదిరిగానే ఉందని, ఎన్నో ఆశలతో తెచ్చుకున్న ప్రజాప్రభుత్వంపై ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. ప్రస్తుత సమావేశంలో పది అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తీర్మానించామని తెలిపారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, మంత్రివర్గ ఉపసంఘంతో ఉద్యోగ సంఘాల సమావేశం నిర్వహణ, ఆర్థికేతర డిమాండ్ల తక్షణ పరిష్కారం, ప్రభుత్వ ఉద్యోగులందరికీ 010 పద్దు కింద వేతన చెల్లింపులు, ఐదు డీఏల చెల్లింపు, మే, జూన్ నెలల్లో సాధారణ బదిలీలు, పీఆర్సీ సిఫారసుల అమలు, జీఓ 317 బాధితులకు ఉపశమనం తదితరాలపై తక్షణమే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జేఏసీ ఉద్యమ కార్యాచరణ

- ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాల సమర్పణ
- మే 4వ తేదీన ఉద్యోగ జేఏసీ రాష్ట్రస్థాయి సదస్సు
- మే 15న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- జూన్ 9న జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహా ధర్నా

కేంద్ర గెజిట్ను సమర్పించండి

- కేటీఆర్పై మేడిగడ్డ పర్యటన కేసులో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ నిషేధిత ప్రాంతం కిందకు వస్తుందని కేంద్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే, సాక్షుల వాంగ్మూలం కాపీలను అందజేయాలని కోరింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్పూర్ పోలీస్స్టేషన్లో తమపై దాఖలైన ఎఫ్ఐఆర్ను కొట్టివేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఆ పార్టీ నాయకులు దాఖలు చేసిన పిటిషన్పై విచారణ సందర్భంగా జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం ఈ ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు కేటీఆర్ సహా ఇతర పిటిషనర్లను అరెస్టు చేయవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. 2024, జూలై 26న మేడిగడ్డ బరాజ్ను కేటీఆర్తోపాటు బీఆర్ఎస్ నేతలు వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్ సందర్శించారు. ఆ సమయంలో అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారని మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో బీఆర్ఎస్ నేతలపై మహదేవ్పూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ను కొట్టివేయాలని కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం విచారణ సందర్భంగా అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 2(8) ప్రకారం మేడిగడ్డ నిషేధిత ప్రాంతం కిందకు వస్తుందని ప్రభుత్వ న్యాయవాది పల్లె నాగేశ్వర్రావు తెలిపారు. తన వాదనను నిరూపించడానికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ కాపీని సమర్పిస్తానని చెప్పారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు డ్రోన్ను ఎగురవేసినట్లు అధికారులు తప్ప వేరే ఎవరైనా చెప్పారా? అన్నది కేసులో ప్రస్తావించలేదని తెలిపారు. కేసు నమోదులోనూ విపరీత జాప్యం జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్రం గెజిట్ కాపీతోపాటు సాక్షుల వాంగ్మూలాలు అందజేయాలని ఆదేశించారు.

కేటీఆర్పై 'ఎన్నికల'పిటిషన్ కొట్టివేత: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్పై ముషీరాబాద్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. 2023, నవంబర్ 27న ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా బాణసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారని అప్పటి ముషీరాబాద్ ఏఎస్ఐ ఆర్.ప్రేమ్కుమార్ ఫిర్యాదు చేయటంతో వీరిపై కేసు నమోదుచేశారు. ఈ పిటిషన్లను బుధవారం విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాబు నయవంచనపై తిరుగుబాటు

యువత హోరు

వైఎస్ జగన్ పిలుపుతో కదంతొక్కిన విద్యార్థులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్



అనంతపురంలో జరిగిన 'యువత పోరు' ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, యువత

సాక్షి, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా తమను చదువులకు దూరం చేస్తున్న చంద్రబాబు సర్కారు కుట్రలపై విద్యార్థులు తిరగబడ్డారు. తమ బిడ్డల భవిష్యత్ కోసం తల్లితండ్రులు గర్జించారు. 20 లక్షల ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామని నమ్మించి నట్టేట ముంచడంపై యువత పిడికిలి బిగించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'యువత పోరు'కు మండుటెండలోనూ వెల్లువలా తరలివచ్చారు. విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులను రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డగించి బెదిరింపులకు దిగినా వెరవలేదు. అన్ని జిల్లా కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'యువత పోరు' గ్రాండ్ సక్సెస్ అయ్యింది. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల వరకు చేపట్టిన ప్రదర్శనలు, బైక్ ర్యాలీల్లో వేలాదిగా విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు కదం తొక్కారు. తక్షణమే గతేడాదికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద గతేడాదికి సంబంధించి కూటమి ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.3,200 కోట్లు.. ఈ ఏడాది ఇవ్వాల్సిన రూ.3,900 కలిపి మొత్తం రూ.7,100 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లే కేటాయించడంపై మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తీసుకొచ్చిన కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ.. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందకుండా చేయడమే కాకుండా వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేయడంపై విద్యార్థులు, తల్లితండ్రులు మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక డీఎస్సీపై చేసిన తొలి సంతకమే మోసంగా మారిందని.. జాబ్ క్యాలెండర్ విడుదల లేదు.. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనే ఊడబెరుకుతున్నారంటూ ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి కోసం గతేడాది బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేని.. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు ర్యాలీల్లో నినదించారు. ఈమేరకు డిమాండ్లతో కూడిన పత్రాలను విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులతో కలిసి వైఎస్సార్‌సీపీ నేతలు కలెక్టర్లకు అందజేశారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా వేలాదిగా విద్యార్థులు, తల్లితండ్రులు, నిరుద్యోగులు 'యువత పోరు'లో కదం తొక్కడం పది నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వం పాలనపై పెల్లుబుకుతున్న ప్రజావ్యతిరేకతకు అద్దం పట్టిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మసిపూసి మారేడుకాయ మాటలు

మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగంలో మసిపూసి మారేడుగాయ మాటలను కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పించిందని బీఆర్‌ఎస్ శాసనమండలి పక్ష నాయకుడు ఎస్.మధుసూదనాచారి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగమంతా కాంగ్రెస్ కరపత్రంలా ఉందని ధ్వజమెత్తారు. బుధవారం మండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ మహమూద్ అలీతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై శాసనసభ, శాసనమండలిలో నిలదీస్తామన్నారు. గవర్నర్ ప్రసంగం అంటే ప్రజల జీవితాల్లో దశ దిశ అని భావించిన వారందరికీ నిరాశ ఎదురవు తుందని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలి: కవిత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలని, హామీల అమలుపై బాధ్యత తీసుకొని సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అని ప్రశ్నించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంపై స్పందించారు. 'గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారంటీలను చూసే ప్రజలు ఓట్లేశారు. కాబట్టి గాంధీ కుటుంబమే తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలి'అని డిమాండ్ చేశారు.

కేబినెట్‌లో అవకాశం దక్కుతుంది : మల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తనకు స్థానం దక్కుతుందనే ధీమాను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యక్తం చేశారు. 'నన్ను కేబినెట్‌లోకి తీసుకోవడానికి సీఎం ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయం'అని చెప్పారు. బుధవారం అసెంబ్లీ లాబీలో విలేకరులతో మాట్లాడారు. పది ఉమ్మడి జిల్లాల పరిధిలో మంత్రి పదవులు ఇచ్చాకే, ఇతరులకు ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో తానొక్కడినే సీనియర్ అని ఈసారి విస్తరణలో చోటు లభిస్తుందన్నారు.



నిరంతరం ప్రజలతోనే..

'వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్'గా వైఎస్సార్ సీపీ: వైఎస్ జగన్ ● కేంద్ర కార్యాలయంలో ఘనంగా పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ.. వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్ (నోరు లేని ప్రజల గొంతుక)గా ఉంటుందని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

ప్రజల కష్టాల్లో నుంచి పుట్టింది..

వైఎస్సార్ సీపీని స్థాపించి 15 ఏళ్లు అవుతోంది. పార్టీ పుట్టింది కష్టాల్లో నుంచి.. ఈ ప్రయాణంలో ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వారి తరఫున వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్‌గా ప్రతి అడుగులోనూ పోరాటం చేస్తూ వస్తోంది. మనం ప్రతిపక్షంలో కూర్చోవడం కొత్త కాదు. ఈ 15 ఏళ్ల ప్రయాణంలో పదేళ్లు మనం ప్రతిపక్షంలోనే ఉన్నాం. అధికార పక్షానికి ధీటైన సమాధానం ఇస్తూ వస్తున్నాం. మరో మూడు నాలుగు సంవత్సరాల్లో జరిగే ఎన్నికల్లో మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీనే.

పిల్లల ఫీజుల కష్టాలు... 'యువత పోరు'

ఈరోజు విద్యాదీవెన, వసతి దీవెనకు సంబంధించి, పిల్లలకు జరుగుతున్న అన్యాయంపై నిరసన కార్యక్రమం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలు అవుతోంది. ఎన్నికల వేళ వాళ్లు చెప్పిన సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ గాలికెగిరిపోయాయి. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు, వసతి దీవెన కింద గతేడాది మొత్తం రూ.3,900 కోట్లు కేటాయించాల్సిన పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్న పరిస్థితి కనిపిస్తోంది. 2025–26కి సంబంధించి విద్యాదీవెన కింద రూ.2,800 కోట్లు, వసతి దీవెన కింద మరో రూ.1,100 కోట్లు కలిపి మొత్తం మరో రూ.3,900 కోట్లు ఇవ్వాలి. అంటే గతేడాది పెట్టిన రూ.3,200 కోట్ల బకాయిలతో కలిపి మొత్తం దాదాపు రూ.7,100 కోట్లు కేటాయించి, పిల్లలను ఆదుకోవాల్సింది పోయి కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించి పిల్లల చదువులతో ఆడుకుంటున్నారు.

నిరంతరం ప్రజలతోనే..

వైఎస్సార్‌సీపీ ఎప్పుడు ప్రజలకు తోడుగా, వారికి అండగా నిలబడుతుంది. ప్రజల తరఫున వారి గొంతుకై నిలుస్తుంది. ''యువత పోరు''నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

ఇద్దరు యూట్యూబ్ మహిళా జర్నలిస్టుల అరెస్టు

సీఎంపై అనుచిత వ్యాఖ్యలతో వీడియోలు చేశారని కేసు



సాక్షి, న్యూఢిల్లీ/కాచిగూడ: సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబ్ మహిళా జర్నలిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సైబర్ క్రైమ్ అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ వివరాలను వెల్లడించారు. 'నిప్పు కోడి'అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కై లాశ్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఒక పొలిటికల్ పార్టీతో కుమ్మక్కై ఈ వ్యాఖ్యలు చేయించిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తుతెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేస్తుండగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. బీఆర్‌ఎస్ పల్స్ టీవీకి ఆర్థిక సహాయం చేస్తున్నట్టు దర్యాప్తులో తేలిందన్నారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. కేసు దర్యాప్తు చేసి నానక్‌రామ్‌గూడకు చెందిన ఆ టీవీ చానల్ సీఈవో, జర్నలిస్ట్ పొగడదండ రేవతితో పాటు మహబూబ్‌నగర్ కొత్తూరుకు చెందిన పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశారు. రేవతిపై గతంలో బంజారాహిల్స్, ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్నాయన్నారు.

26 వరకు రిమాండ్ : ఇద్దరు మహిళా జర్నలిస్టులను పోలీసులు నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. సీఎంను అసభ్య పదజాలంతో దూషిస్తున్న వీడియోలను ఉద్దేశపూర్వకంగానే సోషల్ మీడియాలో వైరల్ చేశారంటూ న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు మహిళా జర్నలిస్టులకు ఈనెల 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పోలీసులు వారిని చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు.

ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన : జర్నలిస్ట్ రేవతిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేయడంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అదే సమయంలో జర్నలిస్టులు వార్తా ప్రసారాల్లో బాధ్యత కలిగి ఉండాలని సూచించింది.

అసెంబ్లీ, సీఎంపై కేటీఆర్ అగౌరవ వ్యాఖ్యలు

- కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- ఢిల్లీలో మీడియాతో కాంగ్రెస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీని, ముఖ్యమంత్రిని అగౌరవ పరిచేలా, కించపరిచేలా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ ఎంపీలు హితవుపలికారు. కేటీఆర్‌ను అసెంబ్లీ సమావేశాలకు రాకుండా అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, ఆర్.రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... గవర్నర్ ప్రసంగాన్ని అవమానించేలా కేటీఆర్ మాట్లాడడాన్ని తప్పుపట్టారు. పదేళ్లుగా తెలంగాణను మేసిన బీఆర్‌ఎస్ నేతలకు, రాష్ట్రాన్ని కాంగ్రెస్ గాడిలో పెట్టడం నచ్చడం లేదని విమర్శించారు.

కిషన్‌రెడ్డి నిజబుద్ధికి నిదర్శనం

తెలంగాణను అప్పులకుప్పగా చేసినందుకు కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు అసెంబ్లీ వేదికగా క్షమాపణలు చెప్పాలని ఎంపీ చామల డిమాండ్ చేశారు. తాము నిధులడిగితే, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నవ్వురావడం ఆయన నిజబుద్ధికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఓట్లతోనే కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ దోచుకుంటుంటే కిషన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఆర్థికసాయం చేయాలని సీఎం నిర్ణయించడం హర్షణీయమని ఎంపీ రఘురాంరెడ్డి అన్నారు. తెలంగాణతో కేంద్రం రాజకీయాలు చేస్తోందని, దీనిని ప్రజలు గమనించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

అన్నీ నేనే మాట్లాడాలా?

- ఒక్క మంత్రి, ఎమ్మెల్యే కూడా మాట్లాడరా?
- విప్‌లతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ క్లాస్!
- సభలో ప్రతిపక్ష సభ్యులు గొడవ చేస్తుంటే విప్‌లు ఏం చేస్తున్నారు?
- ఫ్లోర్ మేనేజ్‌మెంట్ వ్యూహం పట్టించుకోకపోతే ఎలా?
- మాట్లాడితే మీరే నాయకులవుతారు.. మాట్లాడకపోతే ఎలాగని నిలదీత
- బీఏసీ భేటీ జరుగుతున్న సమయంలో తన చాంబర్‌లో ఎమ్మెల్యేలతో సీఎం భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిపక్షాల విమర్శలకు, మాట్లాడే ప్రతి మాటకు తానే కౌంటర్ ఇవ్వాల్సి వస్తోందని.. అసెంబ్లీలో, బయట కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్షాల వ్యాఖ్యలను తిప్పికొట్టకపోతే ఎలాగని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలను నిలదీసినట్టు తెలిసింది. ''అన్నీ నేనే మాట్లాడాలా? ఒక్క మంత్రి, ఎమ్మెల్యే కూడా మాట్లాడరా? మీరు మాట్లాడితే నేనెందుకు మాట్లాడాల్సి వస్తుంది? ప్రతిపక్షాలకు దీటుగా మాట్లాడితే మీరే నాయకులు అవుతారు. మాట్లాడకపోతే నాయకులెలా అవుతారు?''అంటూ క్లాస్ తీసుకున్నట్టు సమాచారం. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అనంతరం బీఏసీ సమావేశం జరుగుతున్న సమయంలో.. ఇన్నర్ లాబీల్లోని తన చాంబర్‌లో అసెంబ్లీ విప్‌లు, పార్టీ ఎమ్మెల్యేలు కొందరితో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. విప్‌లు బీర్ల అయిలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామచంద్రు నాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, యశస్విని రెడ్డి, పర్ణికారెడ్డి, జారె ఆదినారాయణ, రాందాస్ నాయక్ తదితరులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా వారితో చాలా సేపు మాట్లాడిన ఆయన.. సభలో, బయట ఎలా వ్యవహరించాలన్న దానిపై దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది.

మీరెందుకు కౌంటర్ చేయలేదు..

బుధవారం సభలో గవర్నర్ మాట్లాడుతున్నప్పుడు ప్రతిపక్ష సభ్యులు అరుస్తుంటే మీరేం చేస్తున్నారని విప్‌లను సీఎం రేవంత్ ప్రశ్నించినట్టు తెలిసింది. ''ఫ్లోర్ మేనేజ్‌మెంట్ వ్యూహం పట్టించుకోకపోతే ఎలా? మీరెందుకు కౌంటర్ చేయలేదు? అవతలి పక్షం రకరకాల మాటలు మాట్లాడుతుంటే, అరుస్తుంటే మీరు కూడా స్పందించాలి కదా? పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అధికార కాంక్షతో ఏదైనా చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాంటి తరుణంలో అందరూ స్పందించాలి. ప్రతిసారీ నేనే లేచి మాట్లాడితే బాగుండదు. ఆ స్థాయికి మీరు ఎదగాలి''అని పేర్కొన్నట్టు సమాచారం. రాజకీయంగా మనల్ని మనమే కాపాడుకోవాలని, ప్రతిపక్షంపై పైచేయి సాధించాలని.. నియోజకవర్గ సమస్యలను, జిల్లా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సూచించినట్టు తెలిసింది. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పుల గురించి ఎమ్మెల్యేలంతా మాట్లాడాలని స్పష్టం చేసినట్టు సమాచారం.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీ వెళ్లారు. గురువారం ఆయన ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశం అవుతారని సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ శామ్ పిట్రోడాతో కలిసి విదేశాంగ మంత్రితో భేటీకానున్నట్టు తెలిసింది. గురువారం సీఎం తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు.

జాతి ఉద్యమం కోసం పోరాడాలి

ఎంపీలు వద్దిరాజు, కృష్ణయ్య, మస్తాన్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతీ ఒక్క బీసీ పౌరుడు జాతి ఉద్యమం కోసం పోరాడాలని పలువురు ఎంపీలు పిలుపునిచ్చారు. ఓబీసీల డిమాండ్ల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందని సూచించారు. బుధవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓబీసీ డిమాండ్లపై బీసీ మేధావుల సదస్సు జరిగింది. రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఓబీసీ డిమాండ్ సాధనకు దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్క ఓబీసీ సోదరుడు తన ఆత్మగౌరవం, జాతి కోసం ఉద్యమించాలని, కేంద్ర ప్రభుత్వం ఓబీసీల మీద దృష్టి సారించిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీల పక్షపాతని కొనియాడారు. ఓబీసీ బిల్లుకు ఇది అనువైన సమయమని తమ పార్టీ బీసీ వాదానికి కట్టుబడి ఉందని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బీసీల ఆకాంక్షలు నెరవేరడానికి తాము ఎల్లప్పుడూ చట్టసభల్లో పోరాడుతూనే ఉంటామని ఎంపీలు బీద మస్తాన్‌రావు, నాగరాజు, అప్పలనాయుడు, అంబికా లక్ష్మీనారాయణ చెప్పారు. ఆంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మారేశ్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, పీతాని ప్రసాద్, ఆగురు నగరాజు, శశిభార్గవి తదితరులు పాల్గొన్నారు.

మాటకు మాట.. తిప్పికొట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

పథకాలపై చర్చించేందుకు బడ్జెట్ సమావేశాలను వేదికగా చేసుకోవాలి..'' అని సూచించారు. గత పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ కంటే ఎక్కువ కుంభకోణాలు చేసినవారెవరూ లేరని, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తే ఆ కుంభకోణాలను ప్రస్తావించి తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

మొక్కుబడిగా హాజరవడం కాదు..

కాంగ్రెస్ సభ్యుల్లో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సమావేశాలకు హాజరుకావాలని, అంటే వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోవడం కాదని, సభను సీరియస్‌గా ఫాలో కావాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు సభ ప్రొసీడింగ్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకుని వాటిపై అధ్యయనం చేసి సభలో మాట్లాడే ప్రయత్నం చేయాలని.. ఆయా సబ్జెక్టులపై ప్రతిపక్షాలు చెప్పే అంశాలను తిప్పికొట్టే స్థాయికి అవగాహన పెరగాలని చెప్పారు. సభ్యుల మధ్య సమన్వయం ఉండాలని, ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలు కలిసి ఓ మంత్రి సహకారంతో తమకు ఇష్టమైన సబ్జెక్టుల గురించి నేర్చుకోవాలని సూచించారు.

నాకేమిటనే నిర్లక్ష్యం వద్దు

''ప్రతిపక్షాల విమర్శలను అటు సభలో, ఇటు బయట కూడా సమర్థంగా ఎదుర్కోవాలి. బీఆర్‌ఎస్ ఏం చేసినా చూసీ చూడనట్టు ఉంటే వచ్చే ఎన్నికల్లో మీపై అభ్యర్థిని నిలబెట్టరని ఏమైనా అనుకుంటున్నారా? ప్రతిపక్షాలు మాట్లాడే అంశాల గురించి నాకేమిటి, నా గురించి కాదు కదా? అని వదిలేయకుండా సమష్టి బాధ్యతగా తీసుకుని తిప్పికొట్టాలి..'' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో కూడా చురుకుగా ఉండాలని సూచించారు. సభకు ఎవరు వస్తున్నారో, లేదో చూసుకోవాల్సిన బాధ్యత విప్‌లదేనని చెప్పారు. పార్లమెంటు తరహాలోనే ప్రతి రోజు మూడు సార్లు ఎమ్మెల్యేల అటెండెన్స్ తీసుకోవాలని విప్‌లను ఆదేశించారు.

జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను కలుస్తా..

త్వరలోనే జిల్లాల వారీగా పార్టీ ఎమ్మెల్యేలను కలుస్తానని, అందరితో కలసి భోజనం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పా రు. జిల్లాల వారీ అభివృద్ధిపై సమీక్షలు జరుపుతామని, అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి మేలు చేసే కార్యక్రమాల గురించి చర్చిద్దామని తెలిపారు. అలాగే ప్రతి ఎమ్మెల్యేతో కూడా తా ను వ్యక్తిగతంగా మాట్లాడుతానని.. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమా చారం.

చెప్పేది సీరియస్‌గా తీసుకోండి..

సీఎల్పీ సమావేశంలో సభ్యుల అటెండెన్స్ గురించి రేవంత్ మాట్లాడుతున్న సమయంలోనే నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అసెంబ్లీ కమిటీ హాల్ నుంచి బయటికి వెళ్లారు. ఆ సమయంలోనే సీఎం పలు వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ''సభ్యులందరూ కచ్చితంగా సభకు రావాలని నేను చెబుతుంటే కొందరు ఫోన్ చూసుకుంటూ బయటికి వెళుతున్నారు. సీఎల్పీ సమావేశంలో కూర్చునే ఓపిక కూడా ఉండదా? రాజకీయాలంటే పిల్లాలట కాదు. ఒక్కసారి గెలవగానే సరిపోదు. వచ్చే ఎన్నికల్లో కూడా గెలవడానికి సీరియస్‌గా ప్రయత్నించాలి. నాన్‌సీరియస్‌గా ఉంటే ఎలా?'' అని పేర్కొన్నట్టు సమాచారం.

పార్లమెంట్ వార్తలు..

'పీఎం కుసుమ్, సూర్యఘర్' వినియోగంలో తెలంగాణ విఫలం

- అందుకే 3 వేల మెగావాట్ల ఒప్పందం ఉపసంహరించుకున్నాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ : పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ వంటి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను వాడుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. తెలంగాణ సర్కారు వైఫల్యం వల్ల 3 వేల మెగావాట్ల ఒప్పందం ఉపసంహరించుకోవాల్సి వచ్చిందన్నారు. తెలంగాణలో ప్రభుత్వ భూముల్లో సోలార్ విద్యుత్‌తోపాటు ఇతర సహజ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై వివరణ ఇవ్వడంతోపాటు కేంద్రం ఇస్తున్న రాయితీల వివరాలు తెలపాలని కోరుతూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణాత్మక సమాధానం ఇచ్చారు.

ఏజెన్సీని మారుస్తామంటే కేంద్రం ఒప్పుకుంది

2023 సెప్టెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏజెన్సీని మారుస్తామని చెబితే కేంద్రం ఒప్పుకుందని, అయితే 2024 అక్టోబర్‌లో పెండింగ్ పీపీఏలను 2024 డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని తెలంగాణ రెడ్కోను కోరినా, ఎలాంటి ఫలితం లేదని చెప్పారు. 500 మెగావాట్ల కోసం 2021 జనవరిలో కేటాయించినా ఎలాంటి పురోగతి లేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. 2024 జూన్‌లో 4 వేల మెగావాట్ల కోసం కేంద్రం ఆమోదం తెలిపినా, రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి ఆరు నెలల తర్వాత కూడా ఎలాంటి పురోగతి లేకపోవడంతో 3వేల మెగావాట్లు రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి పేర్కొన్నారు.

బొగ్గు అక్రమ తవ్వకాలను రాష్ట్రాలు అరికట్టాల్సిందే

లోక్‌సభలో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : బొగ్గు అక్రమ తవ్వకాలను నివారించేందుకు రాష్ట్రాలు చొరవ చూపాల్సిన అవసరముందని, రాష్ట్రాల సహకారం లేకుండా అక్రమాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. బుధవారం లోక్‌సభలో అస్సాం, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న బొగ్గు అక్రమ తవ్వకాలు, గనుల్లో జరుగుతున్న ప్రమాదాలపై వివిధ పార్టీల ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. 2014లో విద్యుత్‌రంగం లోటులో ఉండేదని, తర్వాత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలతో దేశంలో ప్రస్తుతం 72–74 శాతం థర్మల్ పవర్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. మైనింగ్ బ్లాక్స్ వేలం, రాయల్టీ, డీఎంఎఫ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రూ.6 లక్షల కోట్లు రెవెన్యూ పొందాయని చెప్పారు. బొగ్గు, గనుల రంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో కేవీలను ఏర్పాటు చేయాలి

కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ డీకే అరుణ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కేంద్రీయ విద్యాలయాలను (కేవీ) ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా కేంద్రీయ విద్యాలయాల అంశాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే కేవీల ఏర్పాటుకు అవసరమైన వనరులు, భూమి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అందుబాటులో ఉందన్నారు. చాలామంది కేవీల్లో తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ఈ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలని అరుణ కోరారు.

విభజన హామీలను నెరవేర్చండి

రాజ్యసభలో కేంద్రాన్ని కోరిన కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం తెలంగాణకు రైల్వేలకు సంబంధించి అనేక వాగ్దానాలిచ్చినా అమలు మాత్రం జరగట్లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందట్లేదని, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేదని చెప్పారు. సికింద్రాబాద్–మచిలీపట్నం పోర్టు వరకు ఒక ప్రత్యేక రైల్వే లైన్ వేయాలని కోరినా ఎలాంటి పురోగతి లేదన్నారు. తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి కోసం కోస్తా ప్రాంతానికి రాష్ట్రంలోని డ్రైపోర్టుల నుంచి కనెక్టివిటీ అంశం కూడా పెండింగ్‌లో ఉందని తెలిపారు. బుధవారం రాజ్యసభలో రైల్వే మంత్రిత్వ శాఖకు సంబంధించి జరిగిన చర్చలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మోహన్‌రావు తదితరులు

ఏఐతో వైద్యంలో విప్లవం

- అయితే డేటా భద్రతపై భయాలూ ఉన్నాయి
- ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య సేవలను వేగంగా, సమర్థవంతంగా అందించటంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక భూమిక పోషిస్తోందని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో జరిగిన డాక్టర్ మనోహర్ వీఎస్ శిరోద్కర్ మెమోరియల్ లెక్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్య సేవలు, వ్యాధి నిర్ధారణ, ఆస్పత్రి నిర్వహణలో ఏఐ ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఏఐజీ హాస్పిటల్ అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత మెడికల్ ఇన్ఫర్మేషన్ రోబో 'మీరా'ను పరిచయం చేశారు. 'రోగులు నాతో కంటే మీరాతో మాట్లాడటానికే ఇష్టపడతారు. ఎందుకంటే అది మరింత వేగంగా, సమర్థంగా స్పందిస్తుంది'అని ఆయన చెప్పారు.

ఏఐతో సమయం ఆదా: :గతంలో ఔషధ అభివృద్ధికి ఏళ్ల సమయం పట్టేదని, నేడు ఏఐ టెక్నాలజీతో కొన్ని నెలల్లో సాధ్యమవుతోందని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. రక్త పరీక్ష ద్వారా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధిని ముందుగానే గుర్తించగల టెక్నాలజీ అభివృద్ధి దశలో ఉందన్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఏఐ సహాయపడుతోందని వివరించారు. ఆరోగ్య పరికరాలు, మొబైల్ యాప్‌లు, కాంటాక్ట్‌లెస్ హాస్పిటల్ బెడ్స్ వంటి నూతన పరిజ్ఞానాన్ని ఏఐ ముందుకు తీసుకువస్తోందని చెప్పారు. అయితే ఈ టెక్నాలజీని వాడటంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా రోగుల వ్యక్తిగత డేటా భద్రతపై ఆందోళనలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఢిల్లీ ఎయిమ్స్‌పై జరిగిన సైబర్ దాడిని గుర్తుచేసిన ఆయన.. ఇటువంటి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు మరింత జాగ్రత్త అవసరమని తెలిపారు. ఏఐ వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం, యువ వైద్యులు సాంకేతికతపై అధికంగా ఆధారపడటం వంటి ప్రమాదాలు కూడా ఉన్నాయని హెచ్చరించారు. ఏఐని నైతికంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ఎంతో కీలకమని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అధ్యక్షుడు డా. మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఐఎన్ డైరెక్టర్ బి.శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణి

పట్టు నాడి పట్టుకోవడం కష్టం.
తాకితే... మృదువుగా ఉంటుంది.
పట్టుకుంటే మెత్తగా జారిపోతుంది.
అసలు పట్టును తెలుసుకోవడం ఓ పరీక్ష.
నకిలీని 'పట్టు' కోవడానికీ ఉందో పరీక్ష.

● సిల్క్ మార్క్

పట్టుకు పట్టం

మన అమ్మమ్మలు, నానమ్మలు పట్టుచీరలు కట్టుకున్నారు. పట్టుదారం మృదుత్వాన్ని ఆస్వాదించారు. పట్టు చీర కొనేటప్పుడు ఇది అసలుదా నకిలీదా అని తెలుసుకోవాల్సిన అవసరం ఆ తరానికి రాలేదు. ఎందుకంటే అప్పుడు పట్టుచీరలన్నీ అసలువే. అందుకే ప్రభుత్వం నియమాలు, నిబంధనల పట్టికలేవీ జారీ చేయలేదు. 'ఇది అసలైన పట్టు' అని ఒక గుర్తింపునిచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. నకిలీలు మార్కెట్‌లో రాజ్యమేలుతున్న తరుణంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా 2004, జూన్ 17వ తేదీన 'సిల్క్ మార్క్ లేబిల్' పేరుతో ఒక లోగోను ఆవిష్కరించింది. బంగారు ఆభరణాల స్వచ్ఛతను, కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి నిర్దేశించిన 'బిఐఎస్ హాల్‌మార్క్' వంటిదే ఇది కూడా. సిల్క్‌మార్క్ లేబిల్ అంటే... సదరు పట్టు వస్త్రం అసలైన పట్టుదారంతో తయారైనదే అని నిర్ధారించే లేబిల్ అన్న మాట.

పట్టులు నాలుగే!

పట్టు పేరుతో మార్కెట్‌లో దొరికే వస్త్రాల్లో సగం అసలైన పట్టు వస్త్రాలు కాదు. అలాగే నేత విధానాలను కూడా పట్టులో రకాలుగానే వ్యవహరించడంలో నెలకొన్న అయోమయం అది. మనదేశంలో లభించే పట్టు రకాలు మల్బరీ, టస్సర్, ముగా, ఎరీ అనే నాలుగు. ఎనభై శాతం వస్త్రాలు మల్బరీ పట్టు ఆధారంగా తయారయ్యేవే. అన్నింటిలోకి మృదువైన పట్టు దారం కూడా మల్బరీదే. ఇక కంచిపట్టు, ధర్మవరం పట్టు, గద్వాల పట్టు, పోచంపల్లి పట్టు, పైథానీ, బెనారస్ సిల్క్ అని పిలుచుకునే వన్నీ పట్టులో రకాలు కాదు. నేత విధానంలో రకాలు. ప్రపంచంలో ముప్పెక్కి పైగా దేశాల్లో పట్టు ఉత్పత్తి అవుతోంది. పట్టు ఉత్పత్తిలో చైనా తొలిస్థానంలో ఉంటే మనదేశం రెండవస్థానంలో ఉంది.

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు

పట్టుచీర మీద ఉన్న సిల్క్ మార్క్ లేబిల్ క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ చీరను తయారు చేసిన వీవర్ వివరాలతోపాటు షోరూమ్ వివరాలు కూడా తెలుస్తాయి. నకిలీ కోడ్‌లను గుర్తించడం ఎలాగో కూడా తెలుసుకోవాలి. ఇలాంటి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. కానీ వినియోగదారుల్లో చైతన్యమే అసలైన నియంత్రణ.

పదివేల పురుగుల శ్రమ

ఒక పట్టుచీర తయారు కావాలంటే పదివేల పట్టుగూళ్లు కావాలి. పట్టు పురుగుల పెంపకం అంటే పసిపిల్లలను పెంచినట్లే. ఆ రైతు శ్రమ ఉంటుంది. ఆ తర్వాత పట్టుగూడు నుంచి దారం తీసే వాళ్ల శ్రమ. ఆ దారంతో మగ్గం మీద చీరను నేసే చేనేతకారుల శ్రమ. ఒక పట్టుచీర ధరలో పట్టు రైతుకు దక్కేది, దారం తీసిన వాళ్లకు దక్కేది, చేనేతకారులకు దక్కేది స్వల్పమే. శ్రమించకుండా భారీ ఆదాయం తీసుకునే వాళ్లు పట్టుదారం కొనే ట్రేడర్, పట్టుచీరను అమ్మే దుకాణదారులు మాత్రమే. చేనేతకారులు, దారం తయారు చేసే వాళ్లు మధ్య దళారుల దోపిడీకి గురవుతున్నారు.

బంగారు జరీ

ప్యూర్ బై ప్యూర్ పట్టు చీర అంటే సహజమైన పట్టు దారాన్ని వెండి లేదా బంగారు ద్రవంలో ముంచి తయారు చేసిన జరీతో నేసినది. ఒకప్పుడు అన్నీ ప్యూర్ బై ప్యూర్ పట్టుచీరలే. ఇప్పుడు హాఫ్‌ఫైన్ వస్తున్నాయి... అంటే పాలియెస్టర్‌ని వెండి లేదా కాపర్‌లో అద్దిన జరీతో తయారు చేసినవి. ఇక టెస్టెడ్ జరీ అంటే విస్కోస్‌ని కాపర్‌తో కోట్ చేస్తారు. గోల్డ్ జరీ పట్టుచీర కావాలంటే వీవర్‌కి డిజైన్‌ను బట్టి రెండు లేదా మూడు గ్రాముల బంగారం ఇచ్చి చేయించుకోవాలి.

నిప్పులాంటి పరీక్ష!

ఇక చీరను నేసిన దారం స్వచ్ఛమైన పట్టుదారమేనా లేక పట్టును పోలిన సింథటిక్ దారమా అనేది తెలుసుకోవడానికి ఫ్లేమ్ టెస్ట్ చేయాలి. చీరలో ఒక చివర నుంచి రెండు దారాలను కత్తిరించి తీసుకుని వాటిని వెలిగించాలి. దారం మెల్లగా కాలుతూ, కొంతకాలి ఆగిపోతూ, వెంట్రుక కాలిన వాసన వస్తూ, బూడిద మెత్తటి పొడిలా రాలితే అది స్వచ్ఛమైన పట్టుదారం. దారం వేగంగా కాలిపోతూ, పేపర్ కాలిన వాసనతో గరుకు బూడిద రాలితే అది నకిలీ పట్టు. కొన్నింటికి నకిలీ పట్టు దారాలను కాల్చినప్పుడు వ్యర్థం జిగురుగా ముద్దలా వస్తుంది. మరో విషయం ఏమిటంటే అసలైన పట్టుదారంతో నేసిన పవర్‌లూమ్ చీరకు సిల్క్ మార్క్ ఉంటుంది, ఉండాలి కూడా. ఎందుకంటే సిల్క్‌మార్క్ అనేది పట్టుకు కొలమానమే కానీ చేతితో నేసిన వాటిని పవర్ మగ్గం మీద నేసిన వాటినీ వర్గీకరించే వ్యవస్థ కాదు. సిల్క్‌మార్క్ ఉన్న చీరల్లో కూడా ఏది చేతితో నేసిన నేత, ఏది పవర్ లూమ్ మీద నేసిన చీర అనేది తెలుసుకోవడం కూడా ఓ కళ. సిల్క్‌మార్క్ ఉన్న పవర్‌లూమ్ చీర ధర సిల్క్‌మార్క్ ఉన్న చేనేత చీర ధరలో దాదాపు సగమే ఉండాలి. ఆ తేడాను గుర్తించాలి, గౌరవించాలి. అప్పుడే చేనేత కళ కొనసాగుతుంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో : ఎస్. ఎస్. ఠాకూర్

వ్యవస్థ ఉంది కానీ... అవగాహన లేదు!

నకిలీ పట్టు చీరలను అసలైన పట్టుచీరలుగా నమ్మిస్తున్న మోసాన్ని నివారించడం కోసం ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి సిల్క్ మార్క్ లేబిల్‌ని తయారు చేసింది. ఇది జరిగి పదేళ్లయినా ఈ విషయం తెలిసిన వాళ్లు ఒక్క శాతం కూడా లేరు. వినియోగదారులు చైతన్యం అయినప్పుడే ఈ మోసానికి అడ్డుకట్ట పడుతుంది. సిల్క్‌మార్క్ పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సిల్క్ మార్క్ లేబిల్‌నే నా బిజినెస్‌కి లోగోగా పెట్టుకున్నాను. ప్రతి ఒక్కరూ అసలైన పట్టుచీరలే కొనాలని చెప్పను. అసలైన పట్టుచీరకు అంత ధర పెట్టడం ఇష్టం లేని వాళ్లు పట్టును పోలిన సింథటిక్ చీర కొనుక్కోవడం తప్పుకాదు. అయితే ఆ విషయం తెలిసి చేయాలి తప్ప, అసలైన పట్టుచీరనే కొనుక్కున్నామనే భ్రమలో నకిలీ పట్టు చీరలను కొని మోసపోకూడదు. రెండేళ్లపాటు కంచి, వెంకటగిరి, ధర్మవరం, బనారస్, గద్వాల్‌వంటి చేనేతకారుల గ్రామాల్లో పర్యటించిన తర్వాత నాకు తెలిసిన విషయాలివి.

– కల్యాణి, రామి సిల్క్స్, హైదరాబాద్

న్యూస్ అలెర్ట్

ఉదయాన్నే రాగి సంగటి తినమంటారొకరు. తింటే డేంజరంటారొకరు. వేపాకులను తినేయండి అని ఒకరు. రావి ఆకుల జ్యూస్ అని ఒకరు. ఇటీవల ఆరోగ్యం మీద అందరికీ ఆసక్తి పెరిగింది. దానికి తగ్గట్టు యూట్యూబ్‌లో చిట్కాల వీడియోలు పెరిగాయి. అర్హతలు ఉన్నవారూ లేనివారూ చెప్పేది వింటే ప్రాణం మీదకు రావచ్చు. కేరళలోని కన్నూరులో ఓ 18 ఏళ్ల యువతి బరువు తగ్గడానికి కేవలం వేడినీళ్లు తాగుతూ అవయవాలు దెబ్బ తిని మరణించింది. పిల్లలను హెచ్చరించే మనం జాగ్రత్త పడాల్సిన సమయం ఇది.

యూట్యూబ్ సలహా ప్రమాదం కావచ్చు...



శ్రీనంద

ఆరోగ్య ప్రచారం మంచికోసం కాకుండా సబ్‌స్క్రయిబర్ల కోసం, వ్యూస్ కోసం సాగడం నేటి విషాదం. ఎలాంటి టిప్స్ చెప్పిస్తే వీడియోలు వైరల్ అవుతాయో చూస్తున్నారో తప్పితే చెబుతున్న విషయాలు ఎవరికి, ఎంతవరకు అవసరమో ఎవరికి కీడు చేస్తాయో చెప్పడం లేదు. ఆహార విధానాలు కూడా ఎప్పటికప్పుడు కొత్త సిద్ధాంతాలు లేవనెత్తుతూ అయోమయానికి గురి చేయడం నేడు చూస్తున్నాం. కోడిగుడ్డు పచ్చసొన కొందరు వద్దు అంటే కొందరు అదే మంచిది అంటారు. ఇలాంటి అయోమయం మధ్యలో ప్రత్యామ్నాయ ఆహార ప్రచారకర్తలు ముందుకు వచ్చి తాము నమ్మిన విధానాలను ప్రచారం చేస్తున్నారు. వీరు చేస్తున్న వీడియోలకు శాస్త్రీయ నిర్ధారణ ఏమిటి అన్నది ఎవరూ చూడటం లేదు. అలాగే చురుగ్గా, ఆరోగ్యంగా ఉండటమే కాకుండా 'సన్నగా' కనిపించడం అవసరం అనుకుంటున్నారు చాలామంది. సన్నగా అవడం అందరి శరీరతత్వాలకు సరిపడుతుందో లేదో వైద్య సలహా తీసుకోవడం లేదు. వీడియోలు చూసి బరువు తగ్గేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కేరళలో జరిగిన ఉదంతం ఈ విషయంలో హెచ్చరిక చేస్తోంది.

50 కిలోల నుంచి 24 కిలోలకు

కన్నూరు జిల్లా కలూరుపరయకు చెందిన 18 ఏళ్ల ఫస్ట్ ఇయర్ డిగ్రీ అమ్మాయి శ్రీనంద బరువు తగ్గిపోయి మాట్లాడలేని స్థితికి చేరుకోగా తల్లిదండ్రులు ఆమెను తలస్సెరి కోఆపరేటివ్ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. ఆమెకు వైద్యం చేసిన డాక్టర్ ప్రభు మాట్లాడుతూ 'ఆమె బరువు 24 కేజీలు ఉంది. బి.పి. 70, ఆక్సిజన్ లెవల్ 70, బ్లడ్‌షుగర్ 45.. సోడియం, పొటాషియం లెవల్స్ పూర్తిగా పడిపోయాయి. ఆమె ఆరు నెలలుగా ఆహారం తినకుండా దాచేస్తోంది. మూడునెలలుగా యూట్యూబర్‌ను నమ్మి హాట్ వాటర్ మాత్రమే తీసుకుంటోంది. 50 కిలోల నుంచి మూడునెలల్లో 24 కిలోలకు వచ్చేసింది. ఇది ఆహారాన్ని నిరాకరించే 'అనొరెక్సియా' అనే మానసిక స్థితి. తల్లిదండ్రులు ఆ విషయాన్ని కనిపెట్టలేకపోయారు. ఇలాంటి వారిని ముందే గుర్తించి మానసిక వైద్యం చేయించాలి' అన్నారు. 'రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్ల ఆమె అంతర్గత అవయవాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వెంటిలేటర్ మీద ఉంచి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు' అని ఆయన తెలిపారు.

బాడీ షేమింగ్, వీడియోలు

ఇటీవల కాలంలో బాడీ షేమింగ్ వల్ల టీనేజర్లు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు దేశప్రధాని మన దేశంలో ఊబకాయం పెరిగిపోతోందని ఆందోళన చెందుతోంటే, అందుకు కారణాలను అర్థం చేసుకోకుండా ఊబకాయులను బాడీ షేమింగ్ చేస్తున్నారు కొందరు. టీనేజ్‌లో ఉన్న పిల్లలు సన్నబడాలని హటాత్తుగా బరువు తగ్గితే అది అవయవాల మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి వారిని ఆకర్షించేలా యూట్యూబ్‌లో బోలెడన్ని వీడియోలు ఉంటున్నాయి. 'ఇలా చేస్తే వెంటనే బరువు తగ్గుతారు' అనే వీడియోలు నమ్మవద్దని పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది.

గుడ్డిగా నమ్మవద్దు

అలోపతిలోగాని ఆయుర్వేదంలోగాని లేదా ప్రత్యామ్నాయ వైద్య విధానాల్లోగాని కచ్చితమైన నిపుణులను కలిసి పూర్తిగా కేస్ హిస్టరీ చెప్పి సన్నబడటానికి లేదా బరువు తగ్గడానికి ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పచ్చి ఆకుకూరల, కాయగూరల జ్యూసులు తాగేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

నిపుణుల సలహా తప్పనిసరి



బరువు తగ్గడం అనేది మానసిక వైకల్యంగా మారే స్థితికి కొంతమంది చేరుకోవడం బాధాకరం. ఇలాంటి వారు యూట్యూబ్, ఇన్‌స్టా తదితర ప్లాట్‌ఫామ్స్‌లో తెలిసీ తెలియక చెప్పే సలహాలు నమ్మి నష్టపోతున్నారు. కేరళలో చనిపోయిన అమ్మాయి ఆరు నెలలు 'హాట్‌వాటర్' థెరపీ చేసింది. తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే ఏ ఇద్దరూ ఒకే విధంగా బరువు తగ్గరు. అందుకు వయసు, శరీర తత్వం, జన్యుపద్ధతి, జీవన విధానం... ప్రభావం చూపుతాయి. బరువు తగ్గించాలంటే ఎక్స్‌పర్ట్‌లు వ్యక్తిగతంగా వివరాలు తీసుకుని, మెడికల్ హిస్టరీ తెలుసుకొని, ఎటువంటి ఆహారం తీసుకోవాలో, వద్దో సూచిస్తారు. క్వాలిఫైడ్ డైటీషియన్స్‌ను వ్యక్తిగతంగా కలిసి డైట్ పాటించాలి తప్ప ఎవరూ ఇన్‌ఫ్లుయెన్సర్లు చెప్పే విధానాలకు దిగవద్దు.

– డా.వాణి కత్తి, ఫుడ్‌సైన్స్ ఎక్స్‌పర్ట్

కిచెన్ టిప్స్

పెరుగు మిగిలిపోయిందా?



మిగిలిపోయిన పెరుగును తినడానికి ఇష్టపడని వారు.. దాన్ని పండ్ల రసాలు, స్మూతీస్ తయారీలోనూ వాడుకోవచ్చు. స్మూతీస్ చేసే క్రమంలోనే బ్లెండర్‌లో పండ్లు, తేనె, కొన్ని ఐస్‌ముక్కలతో పాటు కొద్దిగా పెరుగు వేసి బ్లెండ్ చేస్తే దాని రుచి పెరుగుతుంది.

- మటన్, చికెన్ వండే ముందు చాలా మంది మ్యారినేట్ చేస్తుంటారు. అయితే ఈ క్రమంలో పెరుగును కూడా కలిపితే మాంసం ముక్కలు మరింత మృదువుగా మారి త్వరగా ఉడకటమే కాదు, కూర రుచి మరింత పెరుగుతుంది.
- సలాడ్ గార్నిష్/డ్రస్సింగ్ కోసం కొత్తమీర/పుదీనా వంటి ఆకులు, వెల్లుల్లి ముక్కలు, నిమ్మరసం, ఆలివ్ నూనె వంటివి వాడుతుంటారు. అయితే క్రీమీగా చిలికిన పెరుగును వాటి పైనుంచి సన్నటి తీగలాగా పోస్తే సలాడ్ నోరూరిస్తుంది. ఇంకా తింటుంటే మధ్యమధ్యలో పుల్లపుల్లగా నోటికి తగులి టేస్టీగా ఉంటుందని అంటున్నారు.
- చిప్స్, క్రాకర్స్, కాల్చిన కాయగూర ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రై స్ వంటి వాటిని వివిధ రకాల పదార్థాలతో తయారుచేసిన డిప్పింగ్ సాస్‌లో ముంచుకొని తింటుంటారు. అయితే ఈ డిప్స్ తయారీలో కొద్దిగా పెరుగును ఉపయోగిస్తే వాటి రుచి, చిక్కదనం పెరుగుతాయి.
- పెరుగుతో రుచికరమైన డిప్ తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం పెరుగును ఒక క్లాత్‌లో వేసి అందులోని నీటిని తీసేయాలి. ఆ తర్వాత దీన్ని బాగా చిలికితే క్రీమీగా తయారవుతుంది. ఇప్పుడు మీ రుచికి తగినట్లుగా చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి కలుపుకోవాలి. ఇష్టం ఉంటే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, స్వీట్‌కార్న్ వంటివి జత చేసుకుంటే మరింత టేస్టీగా ఉంటుంది.

● మన(సు)లో మాట

ఎరక్కపోయి ఇరుక్కుపోయాను!

డాక్టర్ గారూ, నేను డిగ్రీ చదివి కానిస్టేబుల్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాను. నాకు బాడీ బిల్డింగ్ అంటే చాలా ఇష్టం. ఒక సంవత్సరం క్రితం మా ఊర్లో ఉన్న ఒక ఫేమస్ జిమ్‌లో చేరాను. తొందరగా బాడీ పెరగడం కోసం 'టెర్మిన్' అనే ఇంజక్షన్ ఉంటుంది అని, అక్కడ పని చేసే ట్రెయినర్ ఒకతను చెబితే అది తీసుకోవడం మొదలు పెట్టాను. మొదట్లో చాలా బాగా అనిపించింది. జిమ్‌లో ఎంతసేపు వర్కవుట్స్ చేసినా అలసట వచ్చేది కాదు. నిద్రలేకపోయినా చాలా హుషారుగా ఉండేవాణ్ణి. కొన్నాళ్లకు ఇక ఇంజక్షన్ సరిపోయేది కాదు. రెండు నుంచి మూడు ఇంజక్షన్స్ తీసుకోవడం మొదలు పెట్టాను. దానివల్లేనేమో, ఆకలి బాగా తగ్గిపోయింది. బరువు తగ్గాను. బాగా చికాకుగా ఉంటోంది. ఇంజక్షన్ తీసుకోకపోతే పిచ్చెక్కినట్టు అనిపిస్తుంది. చెవిలో వింతవింత శబ్దాలు కూడా వినపడుతున్నాయి. ఎవరో నన్ను గమనిస్తున్నట్లు, నన్ను చంపడం కోసం వెంబడిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆ భయంతో ఇంట్లో నుంచి బయటకు కూడా రాలేకపోతున్నాను. నా జీవితాన్ని నేను చేతులారా నాశనం చేసుకున్నానేమో అనిపిస్తుంది. దయచేసి నన్ను ఈ సమస్య నుంచి ఎలాగైనా బయట పడెయ్యండి.

– రమేష్, విశాఖపట్నం

ముందుగా మీ తప్పు మీరు తెలుసుకుని మారాలి అని అనుకుంటున్నందుకు మీకు నా అభినందనలు. మీరు పంచుకున్న ఈ సమస్య మీ ఒక్కరిదే కాదు. మన దేశంలో ఇటీవల చాలామంది యువత ఇలాంటి ఇంజెక్షన్స్‌కి అడిక్ట్ అయి బాధపడుతున్నారు. తమ అభిమాన నటుడు ఎవరో సిక్స్ ప్యాక్ శరీరం పెంచారని, తాము కూడా అలా పెంచుకోవాలిఅనే యావలో లేదా ఎవరినయినా ఇంప్రెస్ చేయాలనే ఉద్దేశ్యంతో జిమ్‌లలో చేరడం తొందరగా బాడీ పెంచాలనే ఉద్దేశ్యంతో అడ్డదారులైన ఇలాంటి ఇంజెక్షన్లను ఎంచుకుంటున్నారు. మీరు తీసుకున్న టెర్మిన్ ఇంజక్షన్ సైకోస్టిమ్యులెంట్ డ్రగ్ కిందకు వస్తుంది.

ఈ మందు మెదడులో సెరటోనిన్, డోపమైన్, నార్ అడ్రినలిన్ అనే రసాయనాలను ఎక్కువ మోతాదులో విడుదల అయ్యేలా చేస్తుంది. దానివల్ల వారికి అమితమైన బలం వచ్చినట్లు అనిపిస్తుంది. ఎంత పని చేసినా అలసట రాదు. దాంతో గంటలు గంటలు జిమ్‌లో వర్కవుట్స్ చేయగలుగుతారు. అయితే క్రమేణా కొంతకాలానికి శరీరం చల్లబడటం, బీపీ తగ్గిపోవడం, బాగా అలసటగా అనిపించడం జరుగుతుంది. బీపీ విపరీతంగా పెరగడం, ఆకలి మందగించటం, బరువు తగ్గిపోవడం, వెంట్రుకలు ఊడిపోవడం లాంటి దుష్ప్రభావాలు కనపడతాయి. ఒక్కోసారి గుండెలయలో మార్పులు వచ్చి ప్రాణం మీదికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. కొంతమందిలో చెవిలో మాటలు వినపడటం, విపరీతమైన మూడ్ స్వింగ్స్ రావడం చూస్తుంటాము. దీనినే సైకోసిస్ అంటారు. మీరు వీలైనంత తొందరగా ఒకసారి మానసిక వైద్యుడిని సంప్రదిస్తే ఈ సైకోసిస్ లక్షణాలను తగ్గించేలా సరైన వైద్యం చేసి తర్వాత అవసరమైతే కొంతకాలం పాటు మిమ్మల్ని రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచి కౌన్సెలింగ్, యోగ, ఇతరత్రా వైద్యవిధానాల ద్వారా పూర్తిగా ఈ అడిక్షన్ సమస్య నుంచి బయటకి తీసుకు రావచ్చు. ఆలస్యం చేయకుండా సైకియాట్రిస్టులను సంప్రదిస్తే మీ సమస్య పూర్తిగా తగ్గిపోతుంది. గుడ్‌లక్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

సిస్టర్ లైబ్రరీ





మహిళా రచయితల పుస్తకాలతో మహిళల కోసం మహిళలే నడుపుతున్న గ్రంథాలయం ఒకటి ఉంది తెలుసా? ఇది ముంబై లోని వెస్ట్ బాంద్రాలో ఉంది. అదే సిస్టర్ లైబ్రరీ. దీన్ని దేశంలోనే తొలి ఫెమినిస్ట్ లైబ్రరీగా చెప్పుకోవచ్చు. 2019లో ప్రారంభమైంది ఇది.

ఎలా?

ముంబైలో 'బాంబే అండర్ గ్రౌండ్' పేరుతో ఆర్టిస్ట్ కలెక్టివ్ గ్రూప్ ఒకటుంది. నగరంలోని పలుచోట్ల తాత్కాలిక రీడింగ్ స్పేస్‌ని ఏర్పాటు చేసి.. పుస్తకాలతోపాటు తోటివాళ్లతో జనాలు సమయం వెచ్చించేలా చూడ్డం ఈ గ్రూప్ విధుల్లో ఒకటి. ఆ పనిలోనే ఉన్నప్పుడు ఈ గ్రూప్ సభ్యురాలైన ఎక్వీ థామీకి రీడింగ్ స్పేస్‌లో సమావేశమైన వారెవ్వరూ మహిళా రచయితల పుస్తకాలు చదువుతున్నట్టు కనిపించలేదు. అసలు తానెన్ని చదువుతుందో తేల్చుకోవాలనుకుంది ముందు. ఇంటికెళ్లి తన బుక్ ర్యాక్‌లో చూసుకుంటే మహిళా రచయితల పుస్తకాలు కనీసం 20 శాతం కూడా లేవు. అప్పుడు డిసైడ్ చేసుకుంది ఎక్వీ మహిళా రచయితల పుస్తకాలు చదవాలని. దేశంలోనే కాదు ప్రపంచ సాహిత్యంలో మహిళా రచయితల రాసిన పుస్తకాలన్నిటినీ సేకరించడం మొదలుపెట్టింది. అలా కేవలం మహిళా రచయితల పుస్తకాలతోనే నిండిపోయిన తన పర్సనల్ లైబ్రరీలోంచి స్నేహితులూ పుస్తకాలు అరువు తీసుకోసాగారు. ఆ డిమాండ్ చూసి నిశ్చయించుకుంది ఫెమినిస్ట్ లైబ్రరీ స్టార్ట్ చేయాలని. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. 2018లో ఆమెకు ఫైన్ ఆర్ట్ అవార్డ్ వచ్చింది. దానికింద అందిన రొక్కంతో దేశంలోని ప్రముఖ నగరాలను పర్యటించి మహిళా రచయితలు రాసిన నవలలు, వ్యాస సంపుటాలు, ఉద్యమ రచనలు, ఆర్ట్ పుస్తకాలు, మహిళాపత్రికలు వంటి వెయ్యి పుస్తకాలను సేకరించింది. వాటితోనే 'సిస్టర్ లైబ్రరీ'ని ప్రారంభించింది. 'సాహిత్య, కళా రంగాల్లో మహిళల కృషిని తెలియజేయడానికే ఈ లైబ్రరీని స్థాపించినా.. ఈ ప్రయాణ క్రమంలో అనిపించింది అసలు సృజన రంగంలో మహిళలు పంచిన జ్ఞానాన్ని, వాళ్లు సాధించిన స్థానాన్నీ ప్రపంచం గ్రహించేలా చేయాలని! ఇప్పుడా లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నాను' అని చెబుతుంది ఎక్వీ. ఈ లైబ్రరీకి దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లోని మహిళలంతా తమ వంతు సాయం చేస్తున్నారు. విరాళాల నుంచి క్రౌడ్‌ఫండింగ్ దాకా ఇందులో పుస్తకాల కోసం ధన సహాయమూ అందుతోంది. ఫెమినిస్ట్ లైబ్రరీ ఆవశ్యకతను చాటడానికి, స్ఫూర్తి పంచడానికి సిస్టర్ లైబ్రరీ సభ్యులు దేశ, విదేశీ పర్యటనలూ చేస్తున్నారు.

దీంతోపాటు దేశంలో మహిళలే నిర్వహిస్తున్న చంపక బుక్‌స్టోర్ (బెంగళూరు), వాకింగ్ బుక్ ఫెయిర్స్ బుక్‌స్టోర్ అండ్ మొబైల్ లైబ్రరీ (భువనేశ్వర్), ట్రిలాజీ క్యురేటెడ్ బుక్ షాప్ అండ్ లైబ్రరీ (ముంబై)

స్టోరీటెల్లర్ బుక్‌స్టోర్ (కోల్‌కత్తా), వన్ అప్ లైబ్రరీ, బుక్‌స్టోర్ స్టూడియో అండ్ లర్నింగ్ ల్యాబ్(ఢిల్లీ), సిస్టర్స్ ఆఫ్ ద పీపుల్ (ఢిల్లీలోని చారిటీ బుక్ స్టోర్) లాంటి బుక్ స్టోర్స్, లైబ్రరీలు ఉన్నాయి.


ఎక్వీ థామీ

రెండో సీడ్ జోడీకి యూకీ బాంబ్రీ ద్వయం షాక్



కాలిఫోర్నియా: తన కెరీర్‌లో ఆడుతున్న తొలి మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ జోరు కొనసాగుతోంది. ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 సిరీస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఆండ్రీ గొరాన్సన్ (స్వీడన్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ-గొరాన్సన్ జంట 6-2, 5-7, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్ ప్రపంచ మూడో, నాలుగో ర్యాంకుల్లో ఉన్న హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్)-హెలియోవారా (ఫిన్‌లాండ్)లను బోల్తా కొట్టించింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గొరాన్సన్ ఒక ఏస్ సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. వాస్తవానికి ఈ టోర్నీలో తమ ర్యాంకింగ్ ప్రకారం యూకీ-గొరాన్సన్‌లకు క్వాలిఫయింగ్‌తోపాటు మెయిన్ 'డ్రా'లోనూ చోటు దక్కలేదు. అయితే మెయిన్ 'డ్రా'లో ఉన్న మార్కోస్ గిరోన్-లెర్నర్ టియెన్ (అమెరికా) చివరి నిమిషంలో వైదొలగడంతో 'రిజర్వ్' పూల్‌లో ఉన్న యూకీ-గొరాన్సన్‌లకు ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించింది. క్వార్టర్ ఫైనల్ చేరడంతో యూకీ బాంబ్రీ -గొరాన్సన్‌లకు 65 వేల డాలర్ల (రూ. 56 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు ఖరారయ్యాయి.

ఆబిద్ అలీ అస్తమయం



టీమిండియాకు 34 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం ● భారత్ తరఫున వన్డేల్లో తొలి బంతి వేసిన ఘనత

సాక్షి, హైదరాబాద్: భారత మాజీ క్రికెటర్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఆబిద్ అలీ (83) కన్నుమూశారు. సుదీర్ఘ కాలంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఆయన అక్కడే తుది శ్వాస విడిచారు. 1960వ, 1970వ దశకాల్లో భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా ఆయన తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ఆబిద్ అలీ అంతర్జాతీయ కెరీర్ ఎనిమిదేళ్ల పాటు సాగింది. 1967-1975 మధ్య కాలంలో భారత్ తరఫున 29 టెస్టుల్లో ఆయన 20.36 సగటుతో 1018 పరుగులు చేశారు. ఇందులో 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. మీడియం పేసర్ అయిన అలీ 42.12 సగటుతో 47 వికెట్లు కూడా పడగొట్టారు. ఆయన వన్డే కెరీర్ 5 మ్యాచ్‌లకే పరిమితమైంది. 5 వన్డేలు కలిపి ఆయన 93 పరుగులు చేయడంతోపాటు 7 వికెట్లు తీసుకున్నారు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆబిద్ అలీకి ఘనమైన రికార్డు ఉంది. ఏకంగా 212 మ్యాచ్‌లు ఆడిన ఆయన 8732 పరుగులు చేయడంతో పాటు 397 వికెట్లు తీశారు. రిటైర్మెంట్ తర్వాత ఆబిద్ అలీ కొన్నేళ్ల పాటు విరామం తీసుకున్నారు. ఆ తర్వాత కోచింగ్ వైపు మళ్లారు. ఆంధ్ర రంజీ టీమ్‌తో పాటు యూఏఈ, మాల్దీవ్స్ జట్లకు ఆబిద్ అలీ కోచ్‌గా వ్యవహరించి మంచి ఫలితాలు సాధించారు. అమెరికాలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న తర్వాత అక్కడి నార్త్ అమెరికా క్రికెట్ లీగ్‌లో ఆటను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు.



> చాలా విషాదకర వార్త. ఆబిద్ అలీ జట్టు కోసం ఏదైనా చేయడానికి సిద్ధపడే దమ్మున్న క్రికెటర్. మిడిలార్డర్‌లో ఆడుతున్నప్పుడు కూడా జట్టు అవసరం కోసం ఓపెనింగ్‌కు కూడా సిద్ధమయ్యాడు. భారత స్పిన్నర్ల బౌలింగ్‌లో లెగ్ సైడ్‌లో అతను అందుకున్న చురుకైన క్యాచ్‌ల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. టెస్టుల్లో తొలి బంతికే అతను వికెట్ తీసిన రెండు సందర్భాలు నాకు గుర్తున్నాయి. నా తొలి టెస్టులో వికెట్ల మధ్య అతను చురుగ్గా పరుగెత్తిన తీరు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచడం నాకు బాగా గుర్తుంది. వ్యక్తిగతంగా కూడా చాలా మంచి మనిషి.
>
> – సునీల్ గావస్కర్


హైదరాబాదీ ఆల్‌రౌండర్

'ఆబిద్ అలీ తరహా ఆటకు వన్డే క్రికెట్ సరిగ్గా సరిపోయింది. ఈ ఫార్మాట్‌లో అతను అత్యుత్తమ ఆటగాడిగా నిలిచేవాడు. కానీ దురదృష్టవశాత్తూ 20 ఏళ్లు ముందుగా అతను పుట్టాడు'... ఆబిద్ అలీ గురించి, ఆయన ఆట గురించి బాగా తెలిసిన సన్నిహితులు చెప్పే మాట ఇది. స్ప్రింటర్‌లో ఉండే చురుకుదనం, మారథాన్ రన్నర్ తరహాలో శ్రమించే తత్వం, డెకాథ్లెట్ తరహాలో పట్టుదల ఆయనలో కనిపించేది. ఆటపరంగా చూస్తే మీడియం పేస్ బౌలింగ్, లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేయగల సామర్థ్యం, అద్భుత ఫీల్డింగ్‌తో ఒక వన్డే క్రికెటర్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఆబిద్‌లో ఉండేవి. వికెట్ల మధ్య పరుగెత్తే చురుకుదనం గురించి ప్రత్యేక ప్రశంస వినిపించేది. అవతలి ఎండ్‌లో ఆబిద్ ఉంటే సహచర బ్యాటర్ కూడా ఆయనతో పోటీ పడి పరుగెత్తలేక జాగ్రత్త పడేవాడు. సౌత్‌జోన్ తరఫున ఆడుతున్నప్పుడు దిగ్గజం గుండప్ప విశ్వనాథ్‌కు కూడా ఇదే అనుభవం ఎదురై రనౌట్ కావాల్సి వచ్చింది. అయితే ఆబిద్ వన్డే కెరీర్ వేర్వేరు కారణాలతో 5 మ్యాచ్‌లకే పరిమితమైంది. భారత జట్టు తొలి వన్డే మ్యాచ్ (1974 జూలై 13న, ఇంగ్లండ్‌తో లీడ్స్‌లో) ఆడిన జట్టులో భాగంగా ఉన్న ఆయన తొలి బంతిని బౌల్ చేసిన చిరస్మరణీయ ఘనతను సొంతం చేసుకున్నారు. తొలి వన్డే వరల్డ్‌కప్‌లో (1975) భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 98 బంతుల్లో 70 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచినా... అనూహ్యంగా అదే ఆఖరి వన్డే కూడా అయింది. ఇవన్నీ కూడా భారత జట్టుకు తొలి ఐదు వన్డేలే కావడం గమనార్హం.

మరచిపోలేని ప్రదర్శనలు...

1971లో ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గింది. తొలి రెండు మ్యాచ్‌లు 'డ్రా'గా ముగియగా, ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో గెలిచి భారత్ సిరీస్ సొంతం చేసుకుంది. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌లో చివరి రోజు 'విన్నింగ్ షాట్' బౌండరీ కొట్టిన బ్యాటర్‌గా ఆబిద్ అలీ అందరికీ గుర్తుండిపోయారు. 1971లో వెస్టిండీస్‌పై పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో భారత్ గెలిచి ఆపై తొలిసారి సిరీస్ సొంతం చేసుకున్న చిరస్మరణీయ టెస్టులో వరుస బంతుల్లో రోహన్ కన్హాయ్, క్లయివ్ లాయిడ్‌లను అవుట్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అదే సిరీస్‌లో జార్జ్‌టౌన్ టెస్టులో చేసిన అజేయ అర్ధ సెంచరీ కూడా ఆయన బ్యాటింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆడిన 29 టెస్టుల్లో 7 టెస్టుల్లో ఓపెనర్‌గా బ్యాటింగ్ చేయడంతో పాటు ఓపెనింగ్ బౌలర్‌గా కూడా ఆడిన ఘనత ఆబిద్ అలీ సొంతం.

1971లో ఇంగ్లండ్‌పై విన్నింగ్ షాట్ అనంతరం...





1971లో ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ నెగ్గిన భారత జట్టు సభ్యుడిగా ఆబిద్ అలీ (సర్కిల్ చేసిన వ్యక్తి)

అరంగేట్రంలోనే సత్తా చాటి...

హైదరాబాద్‌లో స్కూల్ క్రికెట్ ద్వారా వెలుగులోకి వచ్చిన గత తరం క్రికెటర్లలో ఆబిద్ అలీ ఒకరు. స్కూల్ టోర్నీల్లో ప్రదర్శన ద్వారా హైదరాబాద్ జూనియర్ జట్టులోకి, ఆపై ఉద్యోగరీత్యా స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ తరఫున ప్రదర్శనతో హైదరాబాద్ సీనియర్ టీమ్‌లోకి ఆయన ఎంపిక అయ్యారు. దేశవాళీలో నిలకడైన ప్రదర్శన ఆబిద్ అలీకి భారత జట్టులో చోటు దక్కేలా చేసింది. 1967లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో టెస్టుతో ఆయన కెరీర్ మొదలైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి అత్యుత్తమ ప్రదర్శనతో ఆయన అరంగేట్రం చేశారు. ఇదే సిరీస్‌లో సిడ్నీ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో 78, 81 స్కోర్లతో టాప్ స్కోరర్‌గా తన ముద్ర వేస్తూ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటారు. ఆ తర్వాత వరుసగా ఏడేళ్ల పాటు ఆబిద్ కెరీర్ నిరాటంకంగా సాగింది. తన మీడియం పేస్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న ఆబిద్‌కు అప్పటి పరిస్థితుల్లో పెద్దగా బౌలింగ్ చేసే అవకాశాలు రాలేదు. ప్రఖ్యాత భారత స్పిన్ చతుష్టయం శాసిస్తున్న ఆ రోజుల్లో మీడియం పేసర్లు ఆరంభంలో కొన్ని ఓవర్లు బౌలింగ్ వేసి బంతిని కాస్త పాతబడేలా చేయడమే ఉండేది. అక్కడితోనే వారి పని ముగిసేది. అయితే బ్యాటింగ్‌లో మాత్రం చాలా సందర్భాల్లో ఆబిద్ తన ముద్ర వేశారు. ముఖ్యంగా జట్టు అవసరాల కోసం 1 నుంచి 9 వరకు (నాలుగో స్థానం మినహా) అన్ని స్థానాల్లో ఆయన బ్యాటింగ్ చేశారు.

సింధు ఆరో 'సారీ'

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో మళ్లీ తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్



బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు మళ్లీ నిరాశపరిచింది. ఈ మెగా టోర్నీలో ఆమె ఆరోసారి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 61 నిమిషాల్లో 21-19, 13-21, 13-21తో ప్రపంచ 21వ ర్యాంకర్ కిమ్ గా యున్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. తొలి గేమ్ నెగ్గిన సింధు, ఆ తర్వాత తడబడి వరుసగా రెండు గేమ్‌లను చేజార్చుకుంది. 13వసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఆడిన సింధు 2012, 2014, 2016, 2019, 2023లలో కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. 2017, 2020లలో క్వార్టర్ ఫైనల్ చేరిన సింధు... 2018, 2021లలో సెమీఫైనల్లో... 2013, 2022, 2024లలో రెండో రౌండ్‌లో పరాజయం పాలైంది.

రుత్విక-రోహన్ జోడీ గెలుపు



మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక-రోహన్ కపూర్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో రుత్విక-రోహన్ ద్వయం 21-10, 17-21, 24-22తో ప్రపంచ 41వ ర్యాంక్ జోడీ యె హోంగ్ వె-నికోల్ గొంజాలెజ్ చాన్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. మరోవైపు మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్న గాయత్రి-ట్రెసా జాలీ 21-17, 21-13తో సుంగ్ షువో యున్-యు చియెన్ హుయ్ (చైనీస్ తైపీ)లపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

యుద్ధం ఆరంభం



● కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా, విజయశాంతి మరో ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో అర్జున్ పాత్రలో కల్యాణ్ రామ్, వైజయంతి పాత్రలో విజయశాంతి నటిస్తున్నారని తెలుస్తోంది. కాగా 'అర్జున్ బ్యాటిల్ బిగిన్స్' అంటూ ఈ నెల 14న ఈ సినిమా ప్రీ టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్లుగా మేకర్స్ ప్రకటించి, కల్యాణ్‌రామ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''టాకీ పార్టు పూర్తయింది. మిగిలిన షూట్ కూడా పూర్తయ్యాక రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా ఇది తల్లీకొడుకుల బలమైన భావోద్వేగాల నేపథ్యంలో సాగే యాక్షన్ ఫిల్మ్ అని తెలుస్తోంది. సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్, 'యానిమల్' ఫేమ్ పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

లెనిన్ లవ్‌స్టోరీ



● అఖిల్

'ఏజెంట్' మూవీ తర్వాత అఖిల్ కొత్త చిత్రానికి సంబంధించిన సమాచారం ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ కిరణ్ మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో అఖిల్ హీరోగా 'లెనిన్' అనే చిత్రం రూపొందుతోందనే ప్రచారం జరుగుతోంది. ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారట. ఇది చిత్తూరు నేపథ్యంలో సాగే గ్రామీణ యాక్షన్ లవ్‌స్టోరీ ఫిల్మ్ అని, ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైందని సమాచారం. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 14న హైదరాబాద్‌లో ప్రారంభం అవుతుందని, దాదాపు ఇరవై రోజులు పాటు షూటింగ్ కొనసాగుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.



● విశ్వ కరుణ్, రుక్సార్, కిరణ్ అబ్బవరం, ఖ్యాతీ డేవిసన్

కొత్త కిరణ్‌ని చూస్తారు

– దర్శకుడు విశ్వ కరుణ్

''సినిమా ఇండస్ట్రీపై ఓ నమ్మకంతో ఇక్కడికి వచ్చి... కష్టాలు పడలేక ఎంతో మంది తిరిగి వెళ్లిపోవడం చూశాను. మీరు ధైర్యంగా ఉండండి... తప్పకుండా నాలా మీరు కూడా సంతోషంగా ఉండే రోజు వస్తుంది. సినిమా మీద ప్యాషన్‌తో పల్లెల నుంచి హైదరాబాద్‌కి వచ్చేవారిలో ఓ పదిమందికి ఏటా సాయం చేస్తాను... అది వసతి అయినా సరే లేకుంటే భోజనం కానీ, అవకాశాలు కానీ... నా చేతనైన సాయం వారికి చేస్తాను'' అని కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, రుక్సార్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''నా ప్రతి సినిమాలో 40 నుంచి 50 మంది కొత్తవాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నాను. ఇకపైనా చాన్స్ ఇస్తాను'' అన్నారు. విశ్వ కరుణ్ మాట్లాడుతూ– ''దిల్ రుబా'లో కొత్త కిరణ్‌ని చూస్తారు'' అని పేర్కొన్నారు. ''ఎంతోమంది మా 'దిల్ రూబా'ని రిలీజ్ చేస్తామని అడిగినా మూవీపై నమ్మకంతో సొంతంగా మేమే విడుదల చేస్తున్నాం'' అని రవి తెలిపారు. ''ఈ మూవీతో కిరణ్‌గారికి, మా టీమ్‌కి మంచి విజయం దక్కుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు రాకేశ్ రెడ్డి.

ఏప్రిల్‌లో అంగరంగ వైభవంగా గద్దర్ అవార్డులు

- 2014 నుంచి 2023 వరకూ బెస్ట్ ఫిల్మ్‌కి అవార్డు ప్రదానం
- ఉర్దూ సినిమానీ ప్రోత్సహిస్తాం

– తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజు



''తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లో 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' (టీఎఫ్‌ఏ) అందించనుంది. ఈ అవార్డుల కోసం ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. నర్సింగరావుగారు చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా నేను ఉన్నాను. అవార్డులు ఎలా ఇవ్వాలి? ఏం చేయాలి? అని పలుమార్లు సమావేశమై విధివిధానాలు తయారు చేశాం'' అని తెలంగాణ చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ (టీఎఫ్‌డీసీ), నిర్మాత 'దిల్' రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని టీఎఫ్‌డీసీ కార్యాలయంలో 'దిల్' రాజు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ– ''2024లో సినిమాలు నిర్మించిన నిర్మాతలకి గైడ్‌లైన్స్ అందించేందుకు ఎఫ్‌డీసీ ద్వారా వివరాలు చెబుతున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఎలాంటి అవార్డులు ఉన్నాయో వాటిని అలాగే ఉంచుతూ ఒకటి రెండు మార్పులు చేయడం జరిగింది. మెజారిటీ అన్నీ అలాగే ఉన్నాయి. దాంతో పాటు పైడి జయరాజ్, కాంతారావుగార్ల పేరుతో గౌరవ పురస్కారాలు అందిస్తాం. అంతే కాకుండా ఉర్దూ సినిమాలను కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఒక బెస్ట్ ఫిల్మ్ అవార్డు ఇవ్వనున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో మనకు నంది అవార్డులున్నాయి. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకూ విడుదలైన చిత్రాల్లో ప్రతి ఏడాది ఒక ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మన తెలుగు సినిమాకి అవార్డులు మిస్ అవకుండా ఉండాలని ప్రతి ఏడాదికి ఒక బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ ఇచ్చేలా నిర్ణయించాం. 2024కు సంబంధించి కొన్ని మార్పులు చేర్పులతో పాత రోజుల్లోని అవార్డుల ప్రక్రియనే కొనసాగిస్తాం. దరఖాస్తులను వెంటనే స్వీకరించి, స్క్రూటినీ చేసి, జ్యూరీని కూడా ఫైనలైజ్ చేసి ఏప్రిల్‌లో ఈ అవార్డుల పంపిణీని అంగరంగ వైభవంగా చేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. అందుకు ఎఫ్‌డీసీ తరఫున ఇండస్ట్రీ నుంచి చాలా మందిని జ్యూరీలాగా తీసుకుని బెస్ట్ ఈవెంట్ చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. దాన్ని మేం పూర్తి చేయాలని ఈ రోజు నుంచే కంకణం కట్టుకున్నాం. అలాగే 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సింహా అవార్డుల కోసం కొంతమంది ఎఫ్‌డీసీకి దరఖాస్తులతో పాటు కొంత డబ్బు చెల్లించారు... ఆ డబ్బును వారికి తిరిగి ఇచ్చేస్తాం. ఎందుకంటే 2024కి మనం పూర్తి స్థాయిలో అన్ని రకాల అవార్డులను ప్రదానం చేయనున్నాం కాబట్టి వారి డబ్బులు ఇచ్చేస్తాం. డబ్బులు చెల్లించిన వారు అవార్డుల విషయాన్ని ఎలాంటి వివాదం చేయకూడదని కోరుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్రం నుంచి మళ్లీ అవార్డులు వస్తున్నాయి కాబట్టి అందరూ పాజిటివ్‌గా అనుకుని ఈ వేడుకని విజయవంతం చేస్తే... ప్రతి ఏడాది ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో అద్భుతంగా జరుగుతుంది. వారంలో అన్ని జ్యూరీలు ఫైనలైజ్ అవుతాయి, వారంలో దరఖాస్తులు స్వీకరించడం కూడా పూర్తవుతుంది. ఇది పూర్తవగానే జ్యూరీ సభ్యులు వారి పని మొదలుపెడతారు. ఏప్రిల్‌లో అవార్డుల పంపిణీ ఉంటుంది. అవార్డుల విషయంలో ఇది కేవలం ఆరంభం మాత్రమే. నెక్ట్స్ అప్‌డేట్స్ గురించి మళ్లీ మళ్లీ మాట్లాడుకుందాం. మొదటి అడుగులోనే రకరకాల ఆలోచనలు ఎందుకు? తొలిసారి అవార్డు వేడుక చేస్తున్నాం... సక్సెస్ అయిందంటే ప్రతి ఏడాది దాన్ని ఎలా చేయాలని ఆలోచించి, బాగా చేయాలి. ఏప్రిల్‌లో నిర్వహించబోయే వేడుక అద్భుతంగా ఉంటుంది. 'సినిమాకి సంబంధించి హైదరాబాద్‌ని ఇంటర్నేషనల్ హబ్ చేయాలంటే ఏం చేయాలి?' అని ఒక ప్రపోజల్ ఇవ్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు నాకు చెప్పారు... దీనిపై ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. గద్దర్ అవార్డుల పంపిణీ పూర్తవగానే ఆ కార్యక్రమంపై దృష్టి సారిస్తాం. గద్దర్ అవార్డు నమూనా సిద్ధమవుతోంది. అవార్డులనేవి ఎవరైనా ఇవ్వొచ్చు... ఫిల్మ్ ఛాంబర్ కూడా ఇస్తుంది. దాన్ని ప్రభుత్వానికి పోటీ అనడం తప్పు. ప్రభుత్వం అనేది అవార్డులు ఇస్తున్నప్పుడు ఎవరైనా వస్తారు... స్వీకరిస్తారు. ఎందుకంటే అది ప్రత్యేకమైన అవార్డు. మనం ఏ పని చేసినా 51 శాతం పాజిటివ్‌గా ఉంటే చాలు. 49 శాతం నెగటివ్‌గా మాట్లాడేవాళ్లు ఎలాగూ ఉంటారు'' అన్నారు.

మనం తెలుసుకోవాల్సిన నిజమే కోర్ట్



– రామ్ జగదీశ్

''కోర్ట్' కథని నానిగారు దాదాపు రెండున్నర గంటలు సింగిల్ సిట్టింగ్‌లో విన్నారు. కథ విన్నాక నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి... 'వెల్‌కమ్ టు వాల్ పోస్టర్ సినిమా' అన్నారు. అది నా జీవితంలో హై మూమెంట్'' అని డైరెక్టర్ రామ్ జగదీశ్ చెప్పారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. హీరో నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న రామ్ జగదీశ్ విలేకరులతో మాట్లాడుతూ– ''గతంలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో పూరి జగన్నాథ్ గారు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన పది షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డ్ అందుకోవడం చాలా సంతోషంగా, ప్రోత్సాహకరంగా అనిపించింది. ఇక 'కోర్ట్' కథ పోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. ఇలాంటి కేసులు ఏపీ, తెలంగాణల్లోనూ ఎన్నో ఉన్నాయి. వాటి ఆధారంగా రాసుకున్న ఫిక్షనల్ కథ ఇది. ఈ మూవీలో లవ్ స్టోరీ, కోర్ట్ రూమ్ డ్రామా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ప్రియదర్శి, నేను చాలా స్నేహంగా ఉంటాం. అందుకే తనతో పని చేయడం సులభంగా అనిపించింది. చందు పాత్ర కోసం రోషన్ చాలా తపన పడ్డాడు. జాబిల్లి పాత్ర కోసం శ్రీదేవిని ఆడిషన్ చేసి ఎంచుకున్నాం. శివాజీగారి మంగపతి పాత్ర ఆకట్టుకుంటుంది. దీప్తిగారు సినిమాకి కావాల్సిన ప్రతిదీ సమకూర్చారు. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక నానిగారు.. 'గర్వంగా ఉంది జగదీశ్' అన్నారు... అది నాకు వచ్చిన గొప్ప ప్రశంస. 'కోర్ట్' గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మనందరి జీవితం. మనం తెలుసుకోవాల్సిన నిజం. స్క్రీన్ మీద మన జీవితమే ఉంటుంది. నా తర్వాతి సినిమా కూడా నానిగారి వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌లోనే ఉంటుంది'' అన్నారు.

సస్పెన్స్... థ్రిల్



● శ్వేత, రుషి కిరణ్

రుషి కిరణ్, శ్వేత, రూప, శివ యాదవ్, రజిత, ఏకెఎస్ ప్రసాద్, మృణాల్ ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ది సస్పెక్ట్'. రాధాకృష్ణ దర్శకత్వంలో కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఎస్‌కేఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర, తెలంగాణ ఏరియాల్లో ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ– ''పెద్ద సినిమాలు జీరో కలెక్షన్స్ చేసినవీ ఉన్నాయి. అద్భుతంగా ఆదరణ పొందిన చిన్న చిత్రాలూ ఉన్నాయి. 'ది సస్పెక్ట్' చిన్న చిత్రాల్లో పెద్ద విజయం సాధించాలి. కిరణ్‌గారు ఈ సినిమాను నిర్మించడంతో పాటు ఓ మంచి పాత్ర కూడా చేశారు'' అన్నారు. ''ఒక అమ్మాయి హత్యకు కారకులైన వారిని పట్టుకునే క్రమంలో జరిగే వివిధ సంఘటనల సమాహారమే ఈ చిత్రం'' అని తెలిపారు రాధాకృష్ణ. ''సినిమా ఇండస్ట్రీలోకి రావాలన్న నా కల 'ది సస్పెక్ట్'తో నెరవేరింది'' అన్నారు కిరణ్ కుమార్.

జాక్‌కి ఆర్‌ఆర్



● సామ్ సీఎస్

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. ఈ చిత్రంలో వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా మొదలయ్యాయి. కాగా 'జాక్' సినిమాకు సామ్ సీఎస్ ఆర్ఆర్ (రీ రికార్డింగ్) అందించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. కాగా ఈ సినిమాకు అచ్చు రాజమణి పాటలు అందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	73	74,030
నిఫ్టీ ▽	27	22,470

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	17,696	▽	264
డోజోన్స్	4,523	△	89
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,541	△	45
డాక్స్	22,676	△	348
షాంఘై	3,372	▽	8
నికాయ్	36,819	△	26

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	86,143	△	119
బంగారం (99.5 స్వచ్ఛత)	85,798	△	118
వెండి (కిలో)	98,100	△	1,474

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.85	87.87
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	111.50	114.41
€	యూరో	ఒకటి	93.86	96.55
¥	జపాన్ ఎన్ (100)	ఖాయమవుతుంది	47.81	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఖాయమవుతుంది	53.82	56.03
S$	సింగపూర్ డాలర్	ఖాయమవుతుంది	63.19	67.74
SAR	సౌదీ రియాల్	ఖాయమవుతుంది	22.35	23.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమవుతుంది	22.85	24.64
¥	చైనా యువాన్	ఖాయమవుతుంది	11.17	12.99

ఫండ్ రివర్స్..!

ఫండ్స్‌లోకి భారీగా తగ్గిన పెట్టుబడులు

- ఫిబ్రవరిలో 26 శాతం డౌన్
- నికరంగా రూ.29,303 కోట్లు రాక
- జనవరిలో వచ్చింది రూ.39,688 కోట్లు
- స్మాల్, మిడ్‌క్యాప్‌లో గణనీయంగా తగ్గుదల
- మూడు నెలల కనిష్టానికి సిప్ పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఫిబ్రవరి నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయి. రూ.29,303 కోట్ల పెట్టుబడులు ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చాయి. ఈ ఏడాది జనవరిలో వచ్చిన రూ.39,688 కోట్లతో పోల్చి చూస్తే 26 శాతం తగ్గిపోయాయి. 2024 డిసెంబర్‌లో ఈక్విటీ పథకాల్లోకి రూ.41,156 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం. ఇలా చూస్తే వరుసగా రెండో నెలలోనూ ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక తగ్గినట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. ముఖ్యంగా స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడుల విలువ క్షీణించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది. అటు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో వచ్చిన పెట్టుబడులు సైతం మూడు నెలల కనిష్టానికి చేరాయి. గత డిసెంబర్‌లో సిప్ ద్వారా ఈక్విటీల్లోకి రూ.26,459 కోట్లు రాగా, జనవరిలో రూ.26,400 కోట్లకు, ఫిబ్రవరిలో రూ.25,999 కోట్లకు క్షీణించాయి. మార్కెట్లలో కరెక్షన్ నేపథ్యంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి లమ్సమ్ రూపంలో పెట్టుబడులు గణనీయంగా తగ్గినప్పటికీ, సిప్ పెట్టుబడుల విషయంలో ఇన్వెస్టర్లు స్థిరత్వాన్ని చూపిస్తున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. "సిప్ పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. కానీ, పెద్ద మొత్తమేమీ కాదు. పైగా జనవరితో పోల్చితే ఫిబ్రవరి నెలలో తక్కువ రోజులు ఉంటాయి" అని మిరే అస్సెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఇండియా డిస్ట్రిబ్యూషన్ హెడ్ సురంజన తెలిపారు. మార్కెట్లలో కరెక్షన్ కొనసాగడం ఫిబ్రవరిలో అమ్మకాలపై ప్రభావం చూపించినట్టు మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ ఈడీ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు. దీర్ఘకాలానికి సెంటిమెంట్ సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు.

స్మాల్, మిడ్‌క్యాప్‌పై ప్రభావం ఎక్కువ

- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి ఫిబ్రవరిలో రూ.3,722 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జనవరిలో వచ్చిన రూ.5,721 కోట్లతో పోల్చితే గణనీయంగా తగ్గాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.5,148 కోట్ల నుంచి రూ.3,407 కోట్లకు క్షీణించాయి.
- గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)లోకి సైతం పెట్టుబడులు ఫిబ్రవరిలో రూ.1,980 కోట్లకు పరిమితమయ్యాయి. జనవరిలో రూ.3,751 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- అన్ని రకాల పథకాల్లోకి ఫిబ్రవరిలో రూ.40,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- సిప్ ఖాతాలు 10.16 కోట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరిలో కొత్తగా 44.56 లక్షల సిప్ ఖాతాలు ప్రారంభం కాగా, 54.70 లక్షల ఖాతాలను ఇన్వెస్టర్లు నిలిపివేశారు.

ఇన్వెస్టర్ల విశ్వాసం బలంగానే..



స్వల్పకాల ప్రతికూలతలు పెట్టుబడులపై ప్రభావం చూపించి ఉండొచ్చు. అయినప్పటికీ ఇన్వెస్టర్ల విశ్వాసం బలంగానే ఉంది. ఇప్పటికీ పెట్టుబడులు సానుకూలంగా ఉండడం దీన్నే సూచిస్తోంది. ఇన్వెస్టర్లు కాస్త అప్రమత్త ధోరణిని అనుసరిస్తూ, తమ దీర్ఘకాల పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోని తిరిగి పరిశీలించుకుంటున్నట్టు కనిపిస్తోంది.

– నేహల్ మెష్రామ్
సీనియర్ అనలిస్ట్, మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్

నెలవారీ పెట్టుబడుల ప్రవాహం ఇలా..

విభాగం	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)		
	2025 ఫిబ్రవరి	2025 జనవరి	2024 డిసెంబర్
మల్టీక్యాప్	2,518	3,567	3,075
లార్జ్‌క్యాప్	2,866	3,063	2,011
లార్జ్‌అండ్‌మిడ్	2,656	4,123	3,812
మిడ్‌క్యాప్	3,407	5,148	5,093
స్మాల్‌క్యాప్	3,722	5,721	4,688
వ్యాల్యూఫండ్	1,347	1,556	1,514
ఫోకస్డ్ ఫండ్స్	1,288	783	456
సెక్టోరల్/థీమ్యాటిక్	5,712	9,017	15,332
ఈఎల్ఎస్ఎస్	615	797	188
ఫ్లెక్సీక్యాప్	5,104	5,698	4,731

ఫండ్స్ ఏయూఎంలో కుదుపు

మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ ఫిబ్రవరి నెలలో 4% పతనమైంది. జనవరి చివరికి ఉన్న రూ.67.25 లక్షల కోట్ల నుంచి ఫిబ్రవరి చివరికి రూ.64.53 లక్షల కోట్లకు తగ్గింది. తాజా నిధుల సమీకరణ తక్కువగా ఉండడం, అదే సమయంలో స్టాక్స్ విలువలు పతనం కావడం ఫండ్స్ ఏయూఎం నికరంగా రూ.2.72 లక్షల కోట్ల మేర ఆవిరైంది. 2022 జూన్ తర్వాత నెలవారీ ఏయూఎం(శాతంలో) ఇంత అధికంగా క్షీణించడం ఇదే తొలి సారి. విలువ క్షీణత పరంగా చూస్తే 2020 మార్చి నెల తర్వాత గరిష్టం కావడం గమనార్హం. మార్కెట్లో దిద్దుబాటు ప్రభావం పరిశ్రమపై ఏ మేరకు ఉందో ఈ గణాంకాలు చెబుతున్నాయి.

ఐటీ షేర్లలో అమ్మకాలు

- అమెరికా ఆర్థిక వృద్ధిపై ఆందోళన ఎఫెక్ట్
- సెన్సెక్స్ నాలుగో రోజూ నేలచూపులు

ముంబై: అమెరికా ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు రేకెత్తడంతో ఐటీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ వాణిజ్య సుంకాల అనిశ్చితి కూడా సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 73 పాయింట్లు నష్టపోయి 74,030 వద్ద స్థిరపడింది. వరుసగా నాలుగో రోజూ నష్టాల ముగింపు ఇది. నిఫ్టీ 27 పాయింట్లు పతనమై 22,470 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్లు క్షీణించి 73,598 వద్ద, నిఫ్టీ 168 పాయింట్లు పతనమై 22,330 వద్ద కనిష్టాన్ని తాకాయి. మిడ్‌సెషన్ నుంచి ఇంధన, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు తగ్గాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ షేర్లు మిశ్రమంగా స్పందించాయి. రెండు షేర్లూ ట్రేడింగ్ ప్రారంభంలో ఆర్జించిన లాభాలు కోల్పోయాయి. ఎయిర్‌టెల్ షేరు తొలుత 3.50% పెరిగి రూ.1,717 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 1% నష్టంతో రూ.1,643 వద్ద స్థిరపడింది. రిలయన్స్ షేరు ఇంట్రాడేలో 1% పెరిగి రూ.1,262 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ఆఖరికి 0.75% లాభంతో రూ.1,257 వద్ద ముగిసింది.

స్టార్‌లింక్‌తో జియో జోడీ



న్యూఢిల్లీ: స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు టెలికం సంస్థ రిలయన్స్ జియో బుధవారం ప్రకటించింది. భారతీ ఎయిర్‌టెల్ ఇటువంటి ఒప్పందం చేసుకున్న మరుసటి రోజే జియో ప్రకటన వెలువడడం గమనార్హం. స్టార్‌లింక్ సేవలకు ప్రభుత్వం నుంచి ఆమోదానికి లోబడే ఈ ఒప్పందం ఉంటుందని జియో ప్లాట్‌ఫామ్స్ తెలిపింది. జియో తన రిటైల్ ఔట్‌లెట్స్, ఆన్‌లైన్ ద్వారా స్టార్‌లింక్ సేవలను అందుబాటులోకి తెస్తుంది. స్టార్‌లింక్ పరికరాలను విక్రయించడంతోపాటు కస్టమర్ సర్వీస్, ఇన్‌స్టాలేషన్, యాక్టివేషన్ సేవలు అందిస్తామని జియో వివరించింది.

ఏడు నెలల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

- ఫిబ్రవరిలో 3.61 శాతానికి డౌన్
- ఆర్‌బీఐ రేట్ల కోతకు అవకాశం



న్యూఢిల్లీ: కూరగాయలు, గుడ్లు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఇతరత్రా పదార్థాల రేట్లు నెమ్మదించడంతో ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్టమైన 3.61 శాతానికి దిగి వచ్చింది. ఇది గతేడాది జూలై తర్వాత కనిష్ట స్థాయి. తాజా పరిణామం నేపథ్యంలో వచ్చే నెలలో రిజర్వ్ బ్యాంక్ మరోసారి కీలక వడ్డీ రేట్ల కోతపై దృష్టి పెట్టడానికి కాస్త అవకాశం లభించినట్లవుతుందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ 7–9 మధ్య ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష చేపట్టనుంది. రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో 4.26 శాతంగా, గతేడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం 222 బేసిస్ పాయింట్ల మేర తగ్గినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించింది. 2023 మే తర్వాత ఇదే కనిష్టమని పేర్కొంది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పు ధాన్యాలు మొదలైన వాటి ధరల పెరుగుదల తగ్గడమే రిటైల్, ఆహార ద్రవ్యోల్బణాలు దిగి రావడానికి కారణమని వివరించింది.

పారిశ్రామికోత్పత్తికి తయారీ దన్ను

జనవరిలో ఐఐపీ 5 శాతం అప్



న్యూఢిల్లీ: తయారీ కార్యకలాపాలు పుంజుకోవడంతో దేశీయంగా పారిశ్రామికోత్పత్తి జనవరిలో మెరుగుపడింది. దీనికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి 5%గా నమోదైంది. ఇది 2024 నవంబర్‌లో 5 శాతంగా ఉంది. 2024 డిసెంబర్ గణాంకాలను ప్రభుత్వం 3.2% నుంచి 3.5%కి సవరించింది. ఇక, గతేడాది జనవరిలో 3.6%గా ఉన్న తయారీ రంగ ఉత్పత్తి ఈ ఏడాది జనవరిలో 5.5%కి పెరిగింది. మరోవైపు, 2024–25 ఏప్రిల్–జనవరి మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 6 శాతం నుంచి 4.2 శాతానికి నెమ్మదించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
అంకురాల్లోకి 600 బిలియన్ డాలర్లు	క్విక్ కామర్స్‌లో.. 5.5 లక్షలకు కొలువులు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబైలో 180 పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 180.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.01.2025 నాటికి 23 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు ఎంఎంజీఎస్-2కు రూ.64,820 నుంచి రూ.93,960,ఎంఎంజీఎస్-3కు రూ. 85,920 నుంచి రూ.1,05,280, ఎంఎంజీఎస్-4కు రూ.1,02,300 నుంచి రూ.1,20,940.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.03.2025
» వెబ్‌సైట్: https://bankofindia.co.in

ఐటీఐ లిమిటెడ్, బెంగళూరులో 41 పోస్టులు

బెంగళూరులోని ఐటీఐ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 41.
» పోస్టుల వివరాలు: అడిషనల్ జనరల్ మేనేజర్-11, డిప్యూటీ జనరల్ మేనేజర్-04, చీఫ్ మేనేజర్-12, మేనేజర్-03, డిప్యూటీ మేనేజర్-01, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-10.
» విభాగాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, ఎస్టేట్ మేనేజ్‌మెంట్, సివిల్,లీగల్,ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్,నెట్‌వర్క్ సెక్యూరిటీ,డేటా సెంటర్, ఐటీ.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, పీజీడీఎం, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 28 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 38 ఏళ్లు, మేనేజర్‌కు 42 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 46 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50ఏళ్లు,అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 54ఏళ్లు నిండి ఉండాలి.
నెలకు అడిషనల్ జనరల్ మేనేజర్‌కు రూ.18,500 నుంచి రూ.23,900, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.17,500 నుంచి రూ.22,300, చీఫ్ మేనేజర్‌కు రూ.16,000 నుంచి రూ.20,800, మేనేజర్‌కు రూ.14,500 నుంచి రూ.18,700, డిప్యూటీ మేనేజర్‌కు రూ.13,000 నుంచి రూ.18,250, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు రూ.8,600 నుంచి రూ.14,600.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 16.03.2025.
» వెబ్‌సైట్: https://itiltd.in

ఎస్‌బీఐలో మేనేజర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్(రీటైల్ ప్రొడక్ట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, పీజీడీఎం, పీజీపీఎం, ఎంఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 31.12.2024 నాటికి 28 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280, డిప్యూటీ మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.93,960.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.03.2025
» వెబ్‌సైట్: https://sbi.co.in

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్‌లో 75 పోస్టులు

నాగ్‌పూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(ఎంవోఐఎల్)లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 75.
» పోస్టుల వివరాలు: మైన్ ఫోర్‌మెన్1-12, సెలెక్ట్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్-05,మైన్ మేట్ గ్రేడ్1-20, బ్లాస్టర్ గ్రేడ్2-14,వైండింగ్ ఇంజన్ డ్రైవర్2-24
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్, మైన్ ఫోర్‌మెన్‌కు 45 ఏళ్లు, వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్‌మేట్ గ్రేడ్-1కు 40 ఏళ్లు, బ్లాస్టర్ గ్రేడ్ 2కు 35 ఏళ్లు నిండి ఉండాలి.
» వేతనం: నెలకు వైండింగ్ ఇంజన్ డ్రైవర్, మైన్ మేట్ గ్రేడ్ 1కు రూ.24,800 నుంచి రూ.44,960, బ్లాస్టర్‌కు రూ.24,100 నుంచి రూ.43,690, సెలెక్టెడ్ గ్రేడ్ మైన్ ఫోర్‌మెన్‌కు రూ.27,600 నుంచి రూ.50,040, మైన్ ఫోర్‌మెన్‌కు రూ.26,900 నుంచి రూ.48,770.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ట్రేడ్ టెస్ట్ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:25.03.2025
» వెబ్‌సైట్: https://moil.nic.in

ఐఐఎం రాయ్‌పూర్‌లో 17 పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ రాయ్‌పూర్(ఐఐఎం రాయ్‌పూర్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17.
» పోస్టుల వివరాలు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-03, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్-01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-05, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-04, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-04.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, మాస్టర్ డిగ్రీ, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు.
» వేతనం:నెలకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీనియర్ స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్‌కు రూ.56,100,అసి స్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.47,600, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.35,400, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.25,000.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.03.2025
» వెబ్‌సైట్: https://iimraipur.ac.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

టీజీపీఎస్సీ గ్రూప్స్ టాపర్స్

సివిల్స్, గ్రూప్స్‌కు ఇంట్లోనే ప్రిపేర్ కావొచ్చు

'సాక్షి'తో గ్రూప్-2 రెండో ర్యాంకర్ సచిన్‌రెడ్డి



సాక్షి, సిద్దిపేట: సివిల్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఐఏఎస్ కావాలనేది తన లక్ష్యం అని గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించిన వడ్లకొండ సచిన్‌రెడ్డి అన్నారు. సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలేసి సివిల్స్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అవడం పూర్తి స్థాయిలో ప్రారంభించానని తెలిపారు. ఇటీవల గ్రూప్-2 ఫలితాలు విడుదలైన సందర్భంగా 'సాక్షి' ఆయన్ను పలకరించింది. ఆయన మాటల్లో..

సిద్దిపేటలోనే విద్యాభ్యాసం ప్రారంభం..

7వ తరగతి వరకు సిద్దిపేటలోని గ్రేస్ గ్రామర్ స్కూల్, 8 నుంచి 10వ తరగతి వరకు కేకేఆర్, హైదరాబాద్‌లో, ఇంటర్ నారాయణ కాలేజీ, బీటెక్ ఢిల్లీలోని ముంజాల్ యూనివర్సిటీలో పూర్తి చేశాను. 2019-2021 వరకు స్ట్రింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసి 2021లో సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రిజైన్ చేశాను. 2021, 2022లో రెండు సార్లు సివిల్స్ రాసినా క్వాలిఫై కాలేదు.

పరీక్షల వాయిదాతో

2022లో గ్రూప్-2కు దరఖాస్తు చేశాను. కానీ పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. అలాగే గ్రూప్-1 కూడా పోస్ట్‌పోన్ అవుతుంటే డిస్టర్బ్ అయ్యాను. మళ్లీ సాఫ్ట్‌వేర్ సైడ్ పోదామా అనిపించింది. అప్పుడు అమ్మానాన్న సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, అన్నయ్య నితిన్ రెడ్డి, తాతయ్య వెంకట్ రెడ్డి ఎంతో ఎంకరేజ్ చేశారు.

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా

గ్రూప్-2లో 444.754 మార్కులు అలాగే గ్రూప్-1లో 461.5 మార్కులు సాధించాను. ఉద్యోగంలో జాయిన్ అయ్యాక కూడా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ప్రిపరేషన్‌కు రోజుకు 8 నుంచి 10 గంటలు, అదే పరీక్షలు 2 నెలలు ఉన్న సమయంలో 10 నుంచి 12 గంటలు చదివాను. ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటూ, టెస్ట్‌లు రాస్తూ నేను ఎక్కడ వీక్ ఉన్నానో తెలుసుకుని దాన్ని ఎక్కువగా ప్రిపేర్ అయ్యాను. సివిల్స్, గ్రూప్స్‌కు ఇంట్లో ఉండి ప్రిపేర్ కావచ్చు. సిలబస్ తెలుసుకుని, వాటికి సంబంధించిన స్టాండర్డ్ బుక్స్‌ను ఎంపిక చేసుకుని చదవవచ్చు. నేను ఇంట్లో ఉండి ప్రిపేర్ అయ్యాను. గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే వారికి హార్డ్ వర్క్ ఎంతో ముఖ్యం. ఇది షార్ట్‌కట్‌ల ద్వారా, రోజుకో గంట చదివితే రాదు. కంటిన్యూగా ఎఫర్ట్ పెట్టాలి.

ఐఏఎస్ కావాలన్న ఆశయంతో చదివా



గ్రూప్-1 టాపర్ వెంకటరమణ

నల్లగొండ: గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో నల్లగొండకు చెందిన దాది వెంకటరమణ టాపర్‌గా నిలిచారు. 900 మార్కులకు గాను 535.50 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు దాది రమాదేవి ప్రధానోపాధ్యాయురాలు, తండ్రి శ్రీనివాసరావు కాంట్రాక్టు ఏఈగా ఈడబ్ల్యూఐడీసీలో పనిచేస్తున్నారు. వీరి స్వస్థలం సూర్యాపేట కాగా.. ఉద్యోగ రీత్యా నల్లగొండలోని బృందావన్ కాలనీలో స్థిరపడ్డారు. వెంకటరమణ ఒకపక్క గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిపేరవుతూనే మరోపక్క జూనియర్ లెక్చరర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు.

ఐఏఎస్ కావాలన్నదే ఆశయం..

చిన్న నాటి నుంచే అమ్మానాన్న ప్రోత్సాహంతో ఐఏఎస్ కావాలన్న ఆశయంతో చదువుతూ వచ్చాను. ఎన్ ఐటీ వరంగల్‌లో ఈసీఈ పూర్తి చేశాను. 2020, 2021, 2022లో వరుసగా మూడు సార్లు యూపీఎస్సీ పరీక్ష రాశాను. కానీ ఎంపికకాలేదు. ఆ తర్వాత గ్రూప్-1పై దష్టి సారించాను. ప్రస్తుతం ప్రకటించిన ఫలితాల్లో టాపర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది.

పట్టుదలతో చదివేవాడు

వెంకటరమణ చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి చూపేవాడు. ఐఏఎస్ కావాలన్న ఆలోచనతో చదువుతూ వచ్చాడు. ఇప్పుడు గ్రూప్-1 ఫలితాల్లో టాపర్‌గా నిలిచాడు. డిప్యూటీ కలెక్టర్ పోస్టు వస్తుంది. దీంతో ఐఏఎస్ కావాలన్న కోరిక ప్రస్తుతం కాకున్నా భవిష్యత్‌లో నెరవేరే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. **– రమాదేవి, శ్రీనివాసరావు, వెంకటరమణ తల్లిదండ్రులు.**

సబ్జెక్టును అర్థం చేసుకుంటే.. ప్రభుత్వోద్యోగం సాధించడం సులువే

గ్రూప్-2 ర్యాంకర్ వినీషారెడ్డి



త్రిపురారం: గ్రూప్-2 ఫలితాల్లో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన లక్కిరెడ్డి (చామల) వినీషారెడ్డి 408.7 మార్కులతో 32వ ర్యాంక్ సాధించి మహిళల్లో మొదటి ర్యాంకర్‌గా నిలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన లక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆరెనా దంపతుల కూతురు వినీషారెడ్డి. ఆమె సక్సెస్ స్పీక్స్..

మొదటి ప్రయత్నంలోనే

10వ తరగతిలో 9.8 జీపీఏ, ఇంటర్మీడియట్ బైపీసీలో 960 మార్కులు సాధించాను. బీహెచ్ఎమ్ఎస్ పూర్తి చేశా. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-2 ఉద్యోగం సాధించా.

ఇంట్లోనే ప్రిపరేషన్

బీహెచ్ఎమ్ఎస్ పూర్తికాగానే పోటీ పరీక్షలపై దృష్టి సారించాను. అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఇంట్లోనే యూట్యూబ్‌లో పాఠాలు వింటూ రోజుకు 14 గంటలు ప్రిపేర్ అయ్యాను. సీడీపీఓ పరీక్షల్లో కూడా టాపర్‌గా నిలిచాను. గ్రూప్-1లో కూడా మంచి మార్కులు సాధించాను.

సంతోషంగా ఉంది

తొలి ప్రయత్నంలో గ్రూప్-2లో మహిళల్లో మొదటి ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాను. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సబ్జెక్ట్‌ను అర్థం చేసుకొని చదువుకుంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం చాలా సులువు.

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఇంగ్లిష్ మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

క్లుప్తంగా...

అగ్నివీరులకు దరఖాస్తు

జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మన్ విభాగంలో పోస్టుల భర్తీ

సాక్షి, హైదరాబాద్: భారత సైన్యంలో 2025–26 సంవత్సరానికి అగ్నివీర్ విభాగంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. అగ్నివీర్ విభాగంలో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మన్ విభాగంలో పోస్టులు భర్తీ చేయనున్నట్లు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 10 మధ్య ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. దరఖాస్తుదారులు తమ అర్హతలను బట్టి ఏవైనా రెండు కేటగిరీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. 2004 అక్టోబర్ 1 నుంచి 2008 ఏప్రిల్ 1న మధ్య జన్మించిన పెళ్లికాని పురుషులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. నియామక ప్రక్రియ పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

క్యూఎస్ సబ్జెక్ట్ ర్యాంకింగ్స్‌లో విట్ ఘనత

సాక్షి, హైదరాబాద్: క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సబ్జెక్ట్ ర్యాంకింగ్స్‌లో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) సత్తా చాటింది. ఉన్నత విద్యలో సబ్జెక్టులవారీగా 2025 సంవత్సరానికి గాను క్యూఎస్ క్వాక్వారెల్లీ సైమండ్స్ ప్రకటించిన ర్యాంకుల్లో 14 విభాగాల్లో విట్ ఉత్తమ ర్యాంకులు సొంతం చేసుకుంది. 4 సబ్జెక్టుల్లో తన పాత ర్యాంకులను మెరుగుపర్చుకోవటమే కాకుండా, 8 సబ్జెక్టుల్లో గత ర్యాంకులను నిలబెట్టుకుంది. కొత్తగా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సబ్జెక్టుల్లో కూడా విట్‌కు ర్యాంకులు దక్కాయి. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో విట్‌కు ప్రపంచంలో 110వ ర్యాంకు దక్కింది. ఇంజనీరింగ్, టెక్నాలజీలో తన ర్యాంకును 212 నుంచి 142కు మెరుగుపర్చుకుంది. సబ్జెక్టుల బోధనలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించే సంస్థలకు ఈ ర్యాంకులు ప్రకటిస్తారు.

ఫీజు బకాయిలపై విద్యార్థి ఫిర్యాదు

- నెలరోజుల్లో వివరాలు సమర్పించాలని ఎన్‌సీఎస్సీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపుల్లో జాప్యంపై జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఒక విద్యార్థి ఆశ్రయించాడు. దాదాపు నాలుగేళ్లుగా నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడంతో.. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయని తెలిపాడు. విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో అప్పులు చేయడం, లేకుంటే చదువును మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థి కోట శివశంకర్ జాతీయ ఎస్సీ కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన జాతీయ ఎస్సీ కమిషన్.. రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది. నెలరోజుల్లోగా ఫీజు బకాయిల వాస్తవ సమాచారాన్ని సమర్పించాలని ఆదేశించింది. గడువులోగా సమాచారం ఇవ్వకుంటే కమిషన్ విచారణకు ఆదేశిస్తుందని స్పష్టం చేసింది.

మీ స్మార్ట్ వాచ్ మీకు నిజమే చెబుతోందా?

..: సాక్షి, సెంట్రల్ డెస్క్ :..

స్మార్ట్ వాచ్‌లు.. ఇప్పుడు చాలామంది వీటిపైనే ఆధారపడుతున్నారు. తామెంత నడిచాం.. ఎంత సేపు పరిగెత్తాం.. ఎంత సేపు స్విమ్ చేశాం.. పడుకున్నాం.. ఎన్ని కాలరీలు బర్న్ చేశాం.. ఇవన్నీ ఉదయాన్నే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ.. స్టేటస్‌లు పెడుతున్న వాళ్లూ ఎక్కువయ్యారు. ఇదంతా నాణానికి ఓవైపు.. మరోవైపు చూస్తే.. నిజానికి ఇదో వ్యసనంలా మారుతోందా? స్మార్ట్ వాచ్‌లపై మనం అతిగా ఆధారపడుతున్నామా?

అసలు మన స్మార్ట్ వాచ్ నిజమే చెబుతోందా?

స్మార్ట్ వాచ్‌కు సంబంధించి ముఖ్యంగా వైద్యపరమైన అంశాల్లో గుడ్డిగా నమ్మడం మంచిది కాదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 'యువకులు వీటిపై అతిగా ఆధారపడుతున్నారు. హార్ట్ రేట్ బాగా పెరిగిందనో.. లేదా బాగా తగ్గిందనో భయంతో మా వద్దకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది' అని పుణేకు చెందిన కార్డియాలజిస్ట్ అభిజిత్ వైద్య తెలిపారు.



నిజానికి స్మార్ట్ వాచ్‌లు పల్స్ రేట్‌ను మాత్రమే చూపిస్తాయని.. జనానికి ఈ రెండింటి మధ్య తేడా పెద్దగా తెలియదన్నారు. 'ప్రతీసారి గుండె కొట్టుకునేటప్పుడు రక్తప్రసరణలో వచ్చిన మార్పులను పరిశీలించడం ద్వారా గుండె కొట్టుకునే రేటును గణించడానికి స్మార్ట్ వాచ్‌లు ఫొటోప్లెథిస్మోగ్రఫీ(పీపీజీ)ని వాడతాయి. గుండె కొట్టుకునే రేటును కచ్చితంగా గణించడానికి ఎలక్ట్రోకార్డియోగ్రామ్(ఈసీజీ) బెస్ట్. పీపీజీ కూడా కొంత మొత్తంలో పని చేస్తుంది గానీ.. ఈసీజీతో పోలిస్తే.. అది కచ్చితంగా లెక్కించలేదు' అని చెప్పారు. చాలా చిన్నచిన్న మార్పులు పల్స్ రేట్‌ను ప్రభావితం చేస్తుంటాయని.. దీనివల్ల స్మార్ట్ వాచ్ హార్ట్ రేట్‌ను కచ్చితంగా చూపించలేదని చెప్పారు. 'నేను చాలాసార్లు ఇలాంటివారికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సి వచ్చింది. అదే పనిగా హార్ట్ రేట్, బీపీని స్మార్ట్ వాచ్‌లో చెక్ చేసుకోవడం కూడా ఒక రకమైన మానసిక సమస్యే' అని తెలిపారు. 2022లో ఫ్రాన్స్, కెనడా, నెదర్లాండ్స్‌కు చెందిన పరిశోధకులు ఒక పాపులర్ స్మార్ట్ వాచ్‌లోని ఈసీజీ సదుపాయాన్ని పరీక్షించి చూడగా.. ఫాల్స్ పాజిటివ్‌లు(తప్పుడు ఫలితం) ఎక్కువగా ఉన్నట్లు తేలింది. 'నిజంగానే గుండెకు సంబంధించి సమస్య ఉండి.. మీ ఖరీదైన స్మార్ట్ వాచ్ ఈసీజీలో అంతా నార్మల్ అని చూపిస్తే.. అప్పుడు ఆ రోగి వైద్యుడు వద్దకు వెళ్లడు. అది ప్రమాదకరం. హృదయ ధమనుల్లో ఏదైనా పూడికల్లాంటివి ఉంటే ఈసీజీలో తెలుస్తుంది. స్మార్ట్ ఫోన్ అలాంటి వాటిని పట్టుకోదు' అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కొన్ని నాణ్యమైన స్మార్ట్ వాచ్‌లు గుండె కొట్టుకోవడంలో తేడాలను(అరిథ్మియా) సరిగానే గుర్తిస్తున్నాయని చెప్పారు.



ఓ రోజున అమర్ అనే యువకుడు నాకు అత్యవసరంగా ఫోన్ చేశాడు. ఆ సమయంలో తను జిమ్‌లో ఉన్నాడు. తన స్మార్ట్ వాచ్ గుండె కొట్టుకునే రేటు నిమిషానికి 38 మాత్రమే చూపిస్తోందని చెప్పాడు. నిజానికి 60-100 మధ్యలో ఉండాలి. కానీ ఓసారి వాచ్ తీసి.. మళ్లీ వేసుకునే సరికి అది 100 చూపించింది. అది ఆ వాచ్ కచ్చితత్వంలో ఉన్న ఎర్రర్. కానీ ఆ సమయంలో నిజంగానే తనకు హార్ట్ అటాక్ వచ్చేస్తుందేమో అన్నంతగా తను టెన్షన్ పడ్డాడు..

ఓ కార్డియాలజిస్టు అనుభవం ఇది..

స్లీప్ ట్రాకర్



స్లీప్ ట్రాకర్ల విషయానికొస్తే.. మన నిద్ర ఆధారంగా అవి 0–100 వరకూ మార్కులిస్తుంటాయి. ఎక్కువ వస్తే.. మనం మంచిగా నిద్రపోయినట్లు అన్నమాట. 'స్మార్ట్ వాచ్‌లు సెన్సర్లను ఉపయోగిస్తాయి. ఆక్సిలరోమీటర్, గైరోస్కోప్, హార్ట్ రేట్ మానిటర్ ఇలా.. అవి నిద్రలోని వివిధ దశలను గుర్తించలేవు. నిజమైన నిద్రను స్లీప్ ఎలక్ట్రో ఎన్‌సెఫలోగ్రామ్‌తో లెక్కించవచ్చు. అంతేకాదు.. స్మార్ట్ వాచ్‌లు మన కదలికలను బట్టి.. నిద్రను గణిస్తాయి. ఒకవేళ మీరు పడుకోకున్నా.. కదలకుండా ఉంటే.. అది నిద్ర కింద లెక్క తీసుకుంటుంది' అని డయాబెటాలజీ అండ్ స్లీప్ మెడిసన్ కన్సల్టెంట్ డాక్టర్ స్మిత వివరించారు. సరైన స్లీప్ స్కోర్ రాలేదని టెన్షన్ పడే వాళ్ల సంఖ్య కూడా ఈ మధ్య పెరిగిందని చెప్పారు.

ఖర్చు చేసే కేలరీలు

కేలరీల ఖర్చు అంచనాల్లోనూ ఇదే పరిస్థితి. స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ చేసిన పరిశోధనలో కేలరీలు ఎంత ఖర్చయ్యాయి అన్న విషయాన్ని స్మార్ట్ వాచ్‌లు సరిగా గణించలేకపోయినట్లు తేలింది. 'ఇద్దరు 60 కేజీల బరువున్న వాళ్లను తీసుకుంటే.. ఒకరిలో 15 శాతం బాడీ ఫ్యాట్, రెండో వారిలో 45 శాతం బాడీ ఫ్యాట్ ఉంది అనుకుందాం. నిజానికి కేలరీల ఖర్చు అన్నది ఇద్దరిలో వేరువేరుగా జరుగుతుంది. స్మార్ట్ వాచ్‌లో మనం బరువు మాత్రమే నమోదు చేస్తాం కాబట్టి.. ఇద్దరికీ ఒకేలా కేలరీలు ఖర్చయినట్లు చెబుతుంది. కానీ శరీర తత్వం బట్టి.. కేలరీల ఖర్చు వేర్వేరుగా ఉంటుంది' అని న్యూట్రిషనిస్ట్ రాధిక తెలిపారు.

స్టెప్ కౌంట్

గతంలో 111 దేశాలకు చెందిన 7 లక్షలకు పైగా జనాన్ని శాంపిల్‌గా తీసుకుని అమెరికా, ఆస్ట్రేలియా పరిశోధకులు అధ్యయనం చేశారు. దీని ప్రకారం.. స్టెప్ కౌంట్ అనేది.. వాచీ స్థాయిని బట్టి 15–66 శాతం తేడా వస్తోందని తేలింది. అయితే, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందింపజేసుకోవడానికి స్మార్ట్ వాచ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని.. అదే సమయంలో ఆరోగ్యపరమైన అంశాల్లో వీటిపైనే అతిగా ఆధారపడటం మంచిది కాదని.. పైగా.. ఇది అనవసరమైన ఆందోళనకు తెర తీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అందుకే..
మీ స్మార్ట్ వాచ్ ఏం చెబుతోందో దాన్ని కాదు.. మీ శరీరం మీకు ఏం చెబుతుందో దాన్ని వినండి..
అని వైద్యులు సూచిస్తున్నారు.

ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీల కుదింపు!

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా 30 మహిళా ఎస్సీ డిగ్రీ కాలేజీలు
- వీటిలో 25 వేల సీట్లుంటే.. సగానికిపైగా ఖాళీ.. కాలేజీలను 20 లేదా 15కు తగ్గించాలని నిర్ణయం
- తక్కువ అడ్మిషన్లు ఉన్న కోర్సులు మరో కాలేజీకి బదిలీ
- ఇలా సైన్స్, ఆర్ట్స్ కాలేజీలుగా వేర్వేరుగా ఏర్పాటు.. ఒకటిరెండు రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశం

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలను కుదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కాలేజీలు ప్రారంభమైన నాటి నుంచి జరిగిన ప్రవేశాలు, ప్రస్తుత విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని వాటి సంఖ్యను కుదించాలని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ భావిస్తోంది. ఇందుకు సంబంధించి వారం రోజులుగా డిగ్రీ కాలేజీల ప్రిన్స్‌పాళ్లతో సొసైటీ కార్యదర్శి సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే వీటి సంఖ్యను కుదించి అక్కడున్న విద్యార్థులను సమీప కాలేజీల్లో విలీనం చేసే దిశగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

అరకొరగా ప్రవేశాలు

ప్రస్తుతం ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 30 మహిళా డిగ్రీ కాలేజీలున్నాయి. ప్రతి ఉమ్మడి జిల్లాకు 3 కాలేజీల చొప్పున ఏర్పాటు చేశారు. ఇవి 2016–17 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రాగా.. తొలి ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరం మాత్రమే ప్రారంభించారు. 2018–19 విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఒక్కో కాలేజీలో 7 కోర్సులు నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సులో 40 మంది చొప్పున 280 మంది విద్యార్థులుంటారు. 3 సంవత్సరాలకు కలిపి 840 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉంది. అయితే చాలాచోట్ల అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేవు. ప్రారంభంలో విద్యార్థులు బాగానే చేరినప్పటికీ, కోవిడ్ తర్వాత చేరికలు తగ్గుతూ వచ్చాయి. మరోవైపు ఇంజనీరింగ్, వృత్తివిద్యా కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతుండడంతో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు తగ్గాయి. దీంతో కాలేజీల నిర్వహణ భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాలేజీల సంఖ్యను కుదించేందుకు సొసైటీ చర్యలు చేపట్టింది.

సగం కాలేజీలు విలీనం

ఈ కాలేజీల్లో కోర్సులవారీగా ప్రవేశాలు, ఖాళీలను సొసైటీ అధికారులు విశ్లేషిస్తున్నారు. అడ్మిషన్లు సగం కంటే తక్కువగా వచ్చిన కోర్సులను సమీప కాలేజీలో విలీనం చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఏ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీని అదే వర్సిటీ పరిధిలోని మరో కాలేజీలో విలీనం చేయాలని నిర్ణయించారు. కొన్నింటిని పూర్తిగా సైన్స్ కాలేజీలుగా, మరికొన్నింటిని ఆర్ట్స్ కాలేజీలుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు కాలేజీలున్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఒక కాలేజీని సైన్స్ కాలేజీగా, మరో కాలేజీని ఆర్ట్స్ కాలేజీగా మార్చి, మూడో కాలేజీని పై రెండింటిలో విలీనం చేసేలా సొసైటీ ప్రధాన కార్యాలయంలోని అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. 30 కాలేజీల్లో కలిపి 25,200 సీట్లు ఉండగా, మొత్తం 12 వేలకు మించి విద్యార్థులు లేరని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కాలేజీలను 20కి తగ్గించాలా? 15కు కుదించాలా? అనే తర్జనభర్జన పడుతున్నారు. ఒకటిరెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



భద్రాచలం ఆలయంలో ముత్యాల రీసైక్లింగ్!

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తులకు విక్రయించగా మిగిలిన ముత్యాల తలంబ్రాలను నిల్వ చేయగా, అవి పాడైపోయినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం వెలుగు చూసింది. కొన్నేళ్లుగా స్వామివారి ముత్యాల తలంబ్రాలకు భక్తుల నుంచి అధిక ఆదరణ ఉంటోంది. ఈ నేపథ్యంలో గత శ్రీరామ నవమి తర్వాత ఏడాదిపాటు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను విక్రయించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. పెద్ద సంఖ్యలో ప్యాకెట్లు తయారు చేశారు. వేడుకల్లో విక్రయించిన అనంతరం భారీ స్థాయిలో ప్యాకెట్లు మిగిలిపోవడంతో వాటిని దాచిఉంచినట్లు సమాచారం. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తలంబ్రాలు పాడైపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆలయ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా సీఆర్వో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఓ సత్రంలో కొద్దిరోజులుగా పాడైపోయిన ప్యాకెట్లలోని తలంబ్రాలను, ముత్యాలను వేరుచేసే ప్రక్రియ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా వేరుచేసిన ముత్యాలను తిరిగి ప్యాకింగ్ (రీసైక్లింగ్) చేసే అవకాశం ఉంది. కాగా తలంబ్రాలు పూర్తిగా పాడైపోయే స్థితికి చేరేవరకు అధికారులు గమనించకపోవటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోవిడ్ అనంతరం ఇదేవిధంగా మిగిలిన తలంబ్రాలను రామాలయ అధికారులు గోశాలలో గుంతలు తీసి పూడ్చిపెట్టడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. తలంబ్రాలు పాడైన ఘటనపై ఆలయ ఈవో రమాదేవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మూడోరోజూ సోదాలు

- పలు కీలక రికార్డులు, భారీగా నగదు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: పన్ను ఎగవేతలకు సంబంధించి శ్రీ చైతన్య విద్యాసంస్థలపై సోమవారం ఉదయం ప్రారంభమైన ఐటీ సోదాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 32, రోడ్ నంబర్ 10లోని శ్రీచైతన్య డైరెక్టర్లు బొప్పన సుష్మ, సీమ ఇళ్లల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అయితే సోదాల సమయంలో వారు ఇంట్లో లేరని సమాచారం. అయిదేళ్లుగా ఆదాయం, ఐటీ చెల్లింపుల్లో అవకతవకలను సోదాల్లో గుర్తించారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని కార్పొరేట్ ఆఫీస్ సహా డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ ఇల్లు, ఆఫీసుల్లో పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం టౌన్‌లోని ఎన్టీఆర్ సర్కిల్ శ్రీచైతన్య కాలేజీలోనూ సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబైలోని ప్రాంతీయ కార్యాలయాల్లో హార్డ్ డిస్కులు, ఫీజుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో ఇప్పటికే భారీగా నగదు పట్టుబడినట్లు తెలిసింది. సెర్చ్ ఆపరేషన్ అనంతరం ఐటీ నోటీసులు జారీ చేసి, ఆదాయం, ఐటీ చెల్లింపులు, పన్ను ఎగవేత సమాచారంతో విచారించనుంది.



ROI starts at **4.99%*** | EMI starting from ₹**65 000*** | Special **Celebratory Benefits**** | Year-End **Depreciation Benefits*****

Silver Star: Hyderabad: Tel: 0-7288862888, Visakhapatnam: Tel: 0-8688407876 (CIN: U50102TG2015PTC098335) | **Mahavir Motors:** Hyderabad: Tel: 0-8801005555, Vijayawada: Tel: 0-8801005555 (CIN: U50100TG1998PTC028934)

Mercedes-Benz India Pvt. Ltd. (CIN: U34102PN1994PTC083160) Toll Free no.: 0008000501888. Email: cs.ind@cac.mercedes-benz.com, Website: mercedes-benz.co.in.
Accessories, colors and fitments shown may not be a part of standard specifications. For technical specification of the model available in India, please refer to the product brochure or contact the nearest Mercedes-Benz Franchise Partner. The Mercedes-Benz GLC meet Bharat Stage VI emission norms. ***Year-end depreciation benefits are subject to its applicability as per the Income Tax Act. **Special celebratory benefits of up to ₹ 200 000/- as per applicability of terms & conditions. Finance is at the sole discretion of the financier Mercedes-Benz Financial Services India Pvt Ltd (MBFSI) (CIN U67190TN2010FTC077890). STAR Agility+ is an optional financial scheme offered by the financier. The availability and applicability of the scheme are subject to the terms and conditions of the financier. *EMI is subject to change. *ROI is subject to change and applicable to selective models.

Scan the QR code to know more

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.





సైబీరియా నేస్తాలకు స్వాగతం

మహబూబాబాద్ జిల్లా మాధవపురం గ్రామంలో సైబీరియన్ కొంగలు సందడి చేస్తున్నాయి. ఏటా ఇక్కడికి సైబీరియన్ కొంగలు వలస వస్తుంటాయి. ఈ ఏడాది కూడా వందల సంఖ్యలో పక్షులు వచ్చి.. గ్రామంలోని గుబురు చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకున్నాయి. గుడ్లు పెట్టి వాటిని పొదిగి సంతానోత్పత్తి చేస్తాయి. అనంతరం వర్షాకాలం ప్రారంభంలో స్వస్థలాలకు వెళ్లిపోతాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

ఉద్యమంతోనే ఉద్యోగాలపై అవగాహన వచ్చింది

ప్రణాళికతో చదివా.. ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి

- 'సాక్షి'తో గ్రూప్‌– 2 మూడో ర్యాంకర్ మనోహర్‌రావు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'రాష్ట్రంలోనే అత్యంత మారుమూల ప్రాంతమైన సిర్గాపూర్ మండలంలోని ఉజ్జంపాడ్ గ్రామం మాది. ప్రభుత్వ ఉద్యోగాల పట్ల మా ప్రాంతంలో అవగాహన అంతంతే. నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై సాగిన తెలంగాణ ఉద్యమంతో మాకు ప్రభుత్వ ఉద్యోగాలపై కొంత అవగాహన వచ్చింది.. కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించొచ్చనే నమ్మకంతో ప్రిపరేషన్ మొదలుపెట్టి ఆరు ఉద్యోగాలు సాధించాను. పక్కా ప్రణాళికతో చదివితే ఉన్నత ఉద్యోగాలను సాధించొచ్చు'అని అంటున్నారు ఇటీవల విడుదలైన గ్రూప్‌– 2 ఫలితాల్లో మూడో ర్యాంక్ సాధించిన బీర్‌దార్ మనోహర్‌రావు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

కుటుంబ నేపథ్యం.. విద్యాభ్యాసం

మాది వ్యవసాయ కుటుంబం. నాన్న పండరినాథ్ కీర్తనకారుడు. పండరిపూర్ విఠలేశ్వరుని కీర్తనలు, ప్రవచనాలు బోధిస్తారు. మా ఉజ్జంపహాడ్ గ్రామం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉటుంది. నా భార్య మనీష గృహిణి. కూతురు మనస్విని 3వ తరగతి, కొడుకు మహేశ్వర్ ఒకటో తరగతి చదువుతున్నారు. కుటుంబమంతా ఆధ్యాత్మిక బాటలో నడుస్తున్నారు. నేను నిత్యం హనుమాన్‌చాలీసా చదువుతాను. ప్రస్తుతం మెదక్ జిల్లా కుల్చారం మండలం అంసాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఎకనామిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ పూర్తి చేశాను.

ఒక దాని తర్వాత మరోటి

ఇప్పటివరకు నాకు గవర్నమెంట్ కొలువులు ఆరు వచ్చాయి. గురుకుల పాఠశాలలకు సంబంధించి పీజీటీలో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు టీజీటీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌లో రెండో ర్యాంకు, 2016 గ్రూప్‌–2లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగంలో చేరా. కరోనా సమయంలో అనారోగ్య సమస్యలతో ఆ ఉద్యోగం మానేశా. తిరిగి స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరా. జూనియర్ లెక్చరర్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, తాజా గ్రూప్‌–2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు వచ్చింది. బుధవారం రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జూనియర్ లెక్చరర్ ఉద్యోగ నియమక పత్రం అందుకున్నా. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను.

డిప్యూటీ కలెక్టర్ కావాలని ఉంది

రాష్ట్ర ప్రభుత్వ నియామకాల్లో అత్యున్నతమైనది గ్రూప్‌–1. డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం సాధించడమే నా ముందున్న లక్ష్యం. గ్రూప్‌–1 పరీక్షలు కూడా రాశాను. 430 మార్కులు వచ్చాయి. త్వరలోనే ఈ ఫలితాలు వెలువడితే గ్రూప్‌–1 ఉద్యోగం కూడా వచ్చే అవకాశాలున్నాయి.

సిలబస్‌లో లేని అంశాలు చదివితే ఫలితముండదు

నోటిఫికేషన్ వచ్చాకే ప్రిపేర్ అవుతానంటే కష్టం. సంబంధిత సబ్జెక్టు మరిచిపోకుండా కనీసం రెండు గంటలైనా చదవాలి. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు ముఖ్యంగా నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. సిలబస్‌పై పూర్తి అవగాహన ఉండాలి. సిలబస్‌లో లేని అంశాలు చదివితే ఫలితం ఉండదు. పాత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రశ్నలు ఎలా వస్తున్నాయనే దానిపై అవగాహన పెంపొందించుకోవాలి. సమయం వృథా చేసుకోవద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే అంత సమయం కలిసొస్తుంది. కనీసం 8 గంటలు చదవాలి.

ప్రయాణ భద్రతలో టీ–సేఫ్ విప్లవం

- యాప్‌ను ప్రారంభించి ఏడాది పూర్తి
- 35 వేల ప్రయాణాలకు భద్రత కల్పించిన యాప్
- మహిళా రక్షణ విభాగం డీజీ శిఖా గోయల్



సాక్షి, హైదరాబాద్: మహిళలు, సాధారణ ప్రయాణికుల భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తెలంగాణ పోలీసులు ప్రారంభించిన 'టీ–సేఫ్' యాప్ ప్రారంభమై ఏడాది పూర్తయ్యింది. పోలీసుల ఆధ్వర్యంలో నిఘాతో కూడిన వినూత్న సేవగా ఇది నిలిచిందని తెలంగాణ మహిళా రక్షణ విభాగం డీజీ శిఖా గోయల్ ఈ సందర్భంగా తెలిపారు. 'టీ–సేఫ్'యాప్ ద్వారా రియల్–టైమ్ ట్రాకింగ్‌తో మహిళలు, సాధారణ ప్రజల ప్రయాణ సమయంలో అనుమానాస్పద అంశాలను గుర్తించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రయాణ మార్గంలో అనవసరమైన మార్పులు జరిగితే 'టీ–సేఫ్'యాప్ ఆటోమెటిక్‌గా 'డయల్ 100'కు సమాచారాన్ని పంపుతుందని శిఖా గోయల్ తెలిపారు. దీంతో తక్షణమే పోలీసు సహాయం అందుతుందని వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్‌తోపాటు ఫీచర్ ఫోన్ ద్వారా కూడా 'టీ–సేఫ్'అందుబాటులో ఉండటంతో ఎస్‌ఓఎస్ కాల్స్, ప్రయాణంలో నిరంతర నిఘా ఉంచుతుందని వివరించారు. 2024 మార్చి 12న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ యాప్ ఏడాది కాలంలో అనేక మైలురాళ్లను చేరుకుందని తెలిపారు. ఈ సందర్భంగా టీ–సేఫ్ సాధించిన ముఖ్యమైన విజయాలను ఆమె వివరించారు.

టీ–సేఫ్ విజయాలు

- ➤ 35,000లకు పైగా ప్రయాణాలు మానిటర్ చేయబడ్డాయి.
- ➤ 32,000లకు పైగా రిజిస్టర్డ్ యూజర్లతో 43,000లకు పైగా యాప్ డౌన్‌లోడ్లు నమోదయ్యాయి.
- ➤ గూగుల్‌ప్లే స్టోర్‌లో 4.8 రేటింగ్‌ను సాధించింది.
- ➤ 36,470 సార్లు వాహనాలు దారి మళ్లిన తేడాలను గుర్తించి, 19 మాడ్యూళ్ల సహాయంతో పరిష్కరించింది.
- ➤ 7 రాష్ట్రాల పోలీసులు ఈ యాప్‌ను తమ రాష్ట్రాల్లో అమలు చేయడానికి ఆసక్తి చూపారు.
- ➤ 'టీ–సేఫ్'ను ఓలా, ఉబర్, రాపిడో, మన యాత్రి, సేఫ్ గాడీ, అబిబస్ వంటి కంపెనీలతో ఇంటిగ్రేట్ చేయాలని నిర్ణయించారు.

తహసీల్దార్‌గా పనిచేస్తూనే గ్రూప్స్‌కి ప్రిపేరై..

- గతంలో టీచర్‌గా, ఏటీడబ్ల్యూఓగా విధులు నిర్వహించిన గ్రూప్‌–1 టాపర్ నాగార్జునరెడ్డి
- ప్రస్తుతం హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా బాధ్యతలు

నల్లగొండ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్‌–1 మెయిన్స్ ఫలితాల్లో నల్లగొండకు చెందిన మందడి నాగార్జునరెడ్డి టాపర్‌గా నిలిచారు. 900 మార్కులకు 488 మార్కులు సాధించారు. భగవంత్‌రెడ్డి, జయమ్మల ఏకైక కుమారుడైన నాగార్జునరెడ్డిది నల్లగొండ జిల్లా తిరుమలగిరిసాగర్ మండలం బోయగూడ. వీరిది వ్యవసాయ కుటుంబం.

పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే..

నాగార్జునరెడ్డి పదో తరగతి వరకు రాజవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్ హాలియాలోని సృజన జూనియర్ కాలేజీలో, డిగ్రీ హాలియాలోని రామకృష్ణ కళాశాలలో పూర్తి చేసి అన్నింటిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్ తర్వాత టీటీసీ నల్లగొండ డైట్‌కాలేజీలో పూర్తి చేశారు.

2006లో డీఎస్సీలో 7వ ర్యాంకు

2006లో నిర్వహించిన డీఎస్సీలో నాగార్జునరెడ్డి 100 మార్కులకు 91.5 మార్కులు సాధించి 7వ ర్యాంకు పొందారు. ఆ తర్వాత మూడేళ్ల పాటు ఎస్‌జీటీగా పనిచేస్తూనే 2011లో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష రాసి 359 మార్కులతో 6వ జోన్ పరిధిలో మొదటి ర్యాంకర్‌గా నిలిచారు. ఏటీడబ్ల్యూఓగా విధుల్లో చేరి ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తర్వాత హైదరాబాద్‌లో సంవత్సరం పాటు ఏటీడబ్ల్యూఓగా విధులు నిర్వహించారు. ఉద్యోగం నిర్వహిస్తూనే 2012లో గ్రూప్‌–2కు ఎంపికయ్యారు. 450 మార్కులకు 361 మార్కులు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. నిడమనూరు తహసీల్దార్‌గా మొదట పని చేసి ఆ తర్వాత నల్లగొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అక్కడ పనిచేస్తూనే గ్రూప్1కు ప్రిపేర్ అయ్యారు. గ్రూప్1 మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. కాగా, నక్షత్ర పబ్లికేషన్స్ పేర తెలంగాణ ఉద్యమం, చరిత్ర, జాగ్రఫీ, ఇండియన్ హిస్టరీని పోటీ పరీక్షలకు అవసరమయ్యే విధంగా నాగార్జునరెడ్డి పుస్తకాలు రాశారు.

భార్య కల్పన ప్రోత్సాహంతోనే...



నా భార్య కల్పన ప్రోత్సాహంతోనే గ్రూప్‌–1లో అధిక మార్కులు సాధించగలిగాను. నిత్యం విధుల్లో అలిసిపోయినప్పటికీ భార్య సహకారం వల్లే చదవగలిగాను. క్లిష్ట సమయంలో కుటుంబ బాధ్యతలు తానే చూసుకుంది. గతంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికి సలహాలు కూడా ఇచ్చాను.

–నాగార్జునరెడ్డి

పబ్లిక్ సర్వీస్ చేయాలని లక్ష్యం

సాయి కృష్ణారెడ్డి, గ్రూప్‌–2 స్టేట్ 11వ ర్యాంకర్, మోత్కూరు



మోత్కూరు: ఉద్యోగపరంగా పబ్లిక్ సర్వీస్ చేయాలనే లక్ష్యంతో గ్రూపు పరీక్షలకు సన్నద్ధమై రాశానని, గ్రూపు–2 స్టేట్ 11వ ర్యాంకర్ యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డి తన మనోగతాన్ని వెల్లడించారు. మోత్కూరుకు చెందిన గుర్రం మోహన్‌రెడ్డి స్వరాజ్యం దంపతులకు సాయికృష్ణారెడ్డి, సాయి సుప్రియ సంతానం. సామాన్య రైతు కుటుంబం. మోత్కూరులో కిరాణం దుకాణం నిర్వహిస్తున్నారు. మోత్కూరులోని సేక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో పదవ తరగతి వరకు, హైదరాబాద్ కొత్తపేట నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ పూర్తి చేశారు. అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్, సీఈసీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. గ్రూప్‌–2 ఫలితాల్లో 600 మార్కులకు గాను 422.91 ర్యాంకు సాధించి స్టేట్ లెవల్ 11వ ర్యాంకు పొందారు. సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'డిప్యూటీ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ పోస్టులు సాధించాలన్నదే నా లక్ష్యం. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో 4 సంవత్సరాలు హాస్టల్‌లో ఉంటూ స్టడీ హాల్‌కు వెళ్లి ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా గ్రూపు పరీక్షలకు సిద్ధమై రాశాను. మా పెద్ద తాత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసి ప్రజా సేవ చేసిన గుర్రం యాదగిరిరెడ్డి స్ఫూర్తితో నేను రాజకీయాలు కాకుండా ఉద్యోగం ద్వారా పబ్లిక్ సేవ చేయాలనే లక్ష్యంతో గ్రూపు పరీక్షలు రాస్తున్నాను. రూ.4 లక్షల ప్యాకేజీ జీతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని ప్రభుత్వ ఉద్యోగం కోసం వచ్చాను. ఇందులో ప్రధానంగా నా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ప్రభుత్వ ఉద్యోగమే చేయాలని అమ్మానాన్న పట్టుబట్టారు. గ్రూప్‌–4 ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించాను. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. మొదటి ప్రయత్నంలోనే ఈ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. గ్రూప్‌–3 పరీక్ష కూడా రాశాను. త్వరలో ఆ ఫలితాలు కూడా రానున్నాయి. మా చెల్లెలు సాయి సుప్రియ గ్రూపు–4 లో ర్యాంకు సాధించి మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది'అని తెలిపారు.

కిడ్నీ మార్పిడి కేసులో నిందితుడికి బెయిల్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అలకనంద ఆస్పత్రి కిడ్నీ మార్పిడి కేసులో ఓ నిందితుడికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని, ప్రతీ నెల ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దర్యాప్తు అధికారి వద్ద హాజరుకావాలని ఆదేశించింది. ఏప్రిల్ నుంచి మూడు నెలలు లేదా చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. కిడ్నీ మార్పిడి కేసులో బెయిల్ కోరుతూ ఏ– 13గా ఉన్న డాక్టర్ పి.రాజశేఖర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శరత్, ప్రభుత్వం తరఫున ఏపీపీ యాసర్ వాదనలు వినిపించారు. వీరి వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసులో ఏ–1, ఏ–2పైనే ప్రధాన ఆరోపణలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాజశేఖర్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల క్రితం కిడ్నీ మార్పిడి కేసు సంచలన సృష్టించగా, సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

ప్రభుత్వాన్ని అభాసుపాల్జేస్తున్న కల్వకుంట్ల కుటుంబం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సాక్షి, హైదరాబాద్: కులగణనలో పాల్గొనని దుర్మార్గులు కల్వకుంట్ల కుటుంబసభ్యులని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాల్జేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఆయన బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేస్తున్న బీఆర్‌ఎస్ తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాళేశ్వరంలో, ప్రతీ దాంట్లో కమీషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. మహిళలను కోటీశ్వరులు చేయడానికి ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చామని తెలిపారు. బీఆర్‌ఎస్ పింక్ సోషల్ మీడియా దుష్ప్రచారం ఆపాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులను సీఎం రేవంత్‌రెడ్డి సవరిస్తున్నారని చెప్పారు. సచివాలయంలో ఉండాల్సింది తెలంగాణ తల్లి విగ్రహం తప్ప.. కేసీఆర్ విగ్రహం కాదని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్‌కు గవర్నర్ అంటే గౌరవం లేదు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేతలకు గవర్నర్ అంటే గౌరవం లేదని, అసెంబ్లీ స్పీకర్ అంటే లెక్క లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గవర్నర్ ప్రస్తావించడాన్ని ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీని హర్షించలేని బీఆర్‌ఎస్.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. బీఆర్‌ఎస్‌లో నలుగురే సభను అడ్డుకుంటున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక్కరోజు సభకు వచ్చిపోవడం కాదని ఎద్దేవా చేశారు. ఆయన రోజూ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు.

దేశభక్తి సినిమాలను ప్రోత్సహించాలి

సాక్షి, న్యూఢిల్లీ: 'చావా'సినిమాతో యువత ఉత్తేజితులయ్యారని బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఈ నేపథ్యంలో దేశభక్తి, చరిత్ర, వారసత్వానికి సంబంధించిన సినిమాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజ్యసభలో ఎంపీ లక్ష్మణ్ ప్రత్యేక ప్రస్తావన సందర్భంగా దేశభక్తి సినిమాల గురించి మాట్లాడారు. ఇలాంటి సినిమాలకు ప్రభుత్వం తరఫున పన్ను రాయితీలు ఇవ్వడం, తక్కువ వడ్డీకి నిధులను కేటాయించాలని కోరారు. అంతేగాక ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో ఇలాంటి సినిమాలకు ప్రాధాన్యం దక్కేలా చూడాలన్నారు.

ఐటీఐఆర్‌ను నిలిపివేశాం..

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ 2008 మే 28న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను ప్రవేశపెట్టిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీఐఆర్ స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం (ఉమ్మడిఏపీ) నుంచి స్వీకరించిన దరఖాస్తును 2013 నవంబర్ 13న ఆమోదించామన్నారు. అయితే అనంతరం ఐటీఐఆర్ పాలసీ–2008పై సమీక్ష నిర్వహించి 2017లో ఐటీఐఆర్ పాలసీని నిలిపివేశామన్నారు. ఈ పాలసీ కింద అన్ని కార్యకలాపాలను ఆపివేశామని కేంద్రమంత్రి స్పష్టంచేశారు.

విజ్ఞాన్‌ధారతో రాష్ట్రంలో 4,002 మందికి లబ్ధి

సాక్షి, న్యూఢిల్లీ: విజ్ఞాన్‌ధార పథకంలో భాగంగా తెలంగాణలో మొత్తం 4,002 మంది లబ్ధి పొందారని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డా.జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఈ ఏడాది మార్చి 10వ తేదీ నాటికి మొత్తం రూ. 3.3 కోట్లు వినియోగించినట్లు లోక్‌సభలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



బయ్యారం సమీపంలో ఎండిపోయిన మున్నేరు వాగు

కన్నీరు 'మున్నేరు'

మహబూబాబాద్ జిల్లా గూడూరు, మహబూబాబాద్, బయ్యారం, గార్ల మండలాల మీదుగా ఖమ్మానికి ప్రవహించే మున్నేరు వాగు పూర్తిగా ఎండిపోయింది. పెద్దపెద్ద బండలు తేలి ఎడారిని తలపిస్తోంది. గత సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు పొంగిపొర్లిన వాగు ఇప్పుడిలా అడుగంటిపోయింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

చిట్టికొమ్మకు గట్టి గూళ్లు

చెరువులోకి వంగిన తుమ్మచెట్టుకో.. నిటారుగా పెరిగిన తాటిచెట్టుకో.. వ్యవసాయబావి అంచున అందనంత దూరంలో.. విద్యుత్ తీగలకో వేలాడే గిజిగాడిగూళ్ల నిర్మాణం అద్భుతం. పక్షుల ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనం. పిల్లలను పాములు, ఇతర శత్రువుల బారినుంచి కాపాడుకునేందుకు గూళ్లను ఇలా భద్రంగా నిర్మించుకుంటాయి. పిచ్చుకగూళ్ల నిర్మాణంలో సాంకేతిక నైపుణ్యం ఇంజనీర్లకు సైతం ఆశ్చర్యం కలిగిస్తోంది. పెద్దపల్లి పట్టణ శివారులోని ఒక వ్యవసాయ బావి అంచున.. తుమ్మచెట్టుకు పదుల సంఖ్యలో పిచ్చుకల గూళ్లు వేలాడుతూ కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



చిటారు కొమ్మన పదుల సంఖ్యలో పక్షుల గూళ్లు

క్లుప్తంగా...

సబ్ డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోండి

అటవీ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన



కొయ్యలగూడెం: గిరిజనుడిపై దాడి చేసి గాయపర్చిన సబ్ డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజనులు బుధవారం ఆందోళన చేట్టారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురం అటవీశాఖ కార్యాలయం వద్ద గిరిజనులు చేరుకుని సబ్ డీఎఫ్‌వోకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుట్టాయిగూడెం మండలం గుళ్లపూడికి చెందిన మడకం యాకోబును ఈనెల 11న అరెస్టు చేసి కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించి శారీరకంగా హింసించారని ఆరోపించారు. దీంతో యాకోబు తీవ్ర గాయాలపాలై జంగారెడ్డిగూడెం హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. గిరిజనులను అవమానించేలా యాకోబును దుర్భాషలాడినట్లు ఆరోపించారు. సబ్ డీఎఫ్‌వో అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కన్నాపురం అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ లేకపోవడంతో కొద్దిసేపు ఆందోళన నిర్వహించగా ఎస్‌ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడ లీగల్: సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేశారనే ఆరోపణలపై నమోదైన కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు గురువారానికి వాయిదా వేసింది. సత్యవర్ధన్ తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలుకు గడువు కోరడంతో విచారణ నేటికి వాయిదా పడింది. అలాగే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణను కోర్టు ఈనెల 17వ తేదీకి వాయిదావేసింది.

విద్యార్థులకు రాజ్యాంగాన్ని సబ్జెక్టుగా పెట్టండి

- విద్య, వైద్యంలో అసమానతలు కూడా తొలగించండి
- ప్రభుత్వానికి 'మండలి' చైర్మన్ సూచన



సాక్షి, అమరావతి: విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగాన్ని సబ్జెక్టుగా పెట్టాలని శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రభుత్వానికి సూచించారు. శాసన మండలిలో బుధవారం 'విద్యా రంగంలో సంస్కరణలు'పై జరిగిన లఘు చర్చలో రెండు సూచనలు చేశారు. ప్రస్తుత సమయంలో రాజ్యాంగంపై అపోహలున్నాయన్నారు. కొన్ని వర్గాల కోసమే రాసినదిగా, రిజర్వేషన్ల కోసం తెచ్చినదిగా చూడటం సరికాదన్నారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై చిన్న వయస్సు నుంచే వివక్ష కొనసాగుతోందన్నారు. దీనివల్ల సమాజం రెండు వర్గాలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు రాజ్యాంగాన్ని ఒక సబ్జెక్టుగా విద్యార్థులకు బోధిస్తున్నాయన్నారు. ఏపీలో కూడా రాజ్యాంగంపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. తద్వారా కొన్ని వర్గాల్లో 'మాకు రాజ్యాంగం ఏమీ చేయలేదు' అని నెలకొన్న అపోహలను తొలగించాలన్నారు. మరోవైపు.. విద్య, వైద్యంపై సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయని ప్రస్తావించారు. పేదవాళ్లకు ఒకలా, పెద్దలకు మరోలా ఈ రెండు సేవలు అందుతున్నాయన్నారు. దీనిని సమానత్వంలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు.

జూన్ నాటికి 3 లక్షల గృహాలు

సాక్షి, అమరావతి: వచ్చే జూన్ నెలాఖరులోగా రాష్ట్రంలో 3 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్రానికి మొత్తం 18.04 లక్షల గృహాలు మంజూరైతే, గత ప్రభుత్వం కేవలం 5.87 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేసి.. 12.20 లక్షల గృహ నిర్మాణాలను అసంపూర్తిగా విడిచిపెట్టిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అందించిన అదనపు సాయాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.1 లక్ష చొప్పున అదనపు సాయం అందిస్తామని వివరించారు. పీఎంఏవై 1.0, పీఎం జన్మన్ పథకాల కింద ఇప్పటికే గృహాలు మంజూరైన దాదాపు 5,98,710 లబ్ధిదారులకు ఈ అదనపు ఆర్థిక సాయం వర్తిస్తుందని వెల్లడించారు.

అమల్లోకి 'లిఫ్టు' బిల్లు

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు, ఎస్కలేటర్ల చట్టం–2025ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి (లీగల్, లెజిస్లేటివ్ అఫైర్స్, జస్టిస్, లా డిపార్ట్‌మెంట్) బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాసనసభలో ఈ బిల్లును మంగళవారం ప్రవేశ పెట్టారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ఈ బిల్లును రూపొందించి చట్ట సభల్లో ప్రవేశ పెట్టామని ఆయన వివరించారు.

23 మున్సిపాల్టీల్లో జూన్‌లోగా ఎన్నికలు పూర్తి

అమరావతి కోసం రూ.31 వేల కోట్ల రుణం

అసెంబ్లీలో మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలకవర్గాలు లేని 23 మున్సిపాల్టీలకు జూన్‌లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆ శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారు. బుధవారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.756 కోట్లతో అమృత్–2 పథకం కింద మెజార్టీ మున్సిపాల్టీలకు మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. మధ్యలో ఆగిపోయిన టిడ్కో ఇళ్లను రూ.4,500 కోట్ల హడ్కో రుణంతో పూర్తి చేస్తామన్నారు. అన్నా క్యాంటీన్లు లేని 63 గ్రామీణ నియోజకవర్గ కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. రూ.31 వేల కోట్ల రుణంతో అమరావతి పనులు చేపట్టామని, విశాఖ, విజయవాడ బీఆర్టీఎస్ రోడ్లపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ చార్జీలు పెంచం: మంత్రి గొట్టిపాటి

విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. దానికి అనుగుణంగానే అడుగులు వేస్తున్నామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే విద్యుత్ కొనుగోళ్లను 60 శాతం తగ్గించినట్టు తెలిపారు.

పారిశ్రామిక ప్రమాదాలపై అధ్యయనం: మంత్రి సుభాష్

పారిశ్రామిక వరుస ప్రమాదాలపై అధ్యయనానికి వసుధ మిశ్రా కమిటీ వేశామని, ఆ కమిటీ త్వరలోనే నివేదిక అందజేయనుందని కార్మిక, పరిశ్రమలు, బాయిలర్ల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కొత్తగా 9 ఈఎస్‌ఐ ఆస్పత్రులు మంజూరు చేయడంతో పాటు చంద్రన్న బీమా విధివిధానాలపై ఒక కమిటీ వేసినట్టు తెలిపారు. అనంతరం ఆర్థిక ప్రణాళిక శాఖకు రూ.36,144 కోట్లు, వాణిజ్య పన్నుల శాఖకు రూ.472 కోట్లు, పురపాలక శాఖకు రూ.13,862 కోట్లు, కార్మిక శాఖకు రూ.732 కోట్లు, ఇంధన శాఖకు రూ.13,609 కోట్ల విలువైన పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపింది.

కనీస జ్ఞానం లేకుండా యువత చదివేస్తున్నారు

'మండలి'లో ఎమ్మెల్సీ చిరంజీవి

సాక్షి, అమరావతి: కళాశాలల నుంచి డిగ్రీలు పట్టుకుని బయటకు వచ్చే యువతలో నాణ్యత ఉండట్లేదని.. పదో తరగతి నుంచి పీజీ వరకు కనీస జ్ఞానం కూడా లేకుండా చదివేస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్సీ చిరంజీవి వ్యాఖ్యానించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఐటీఐ, పాలిటెక్నిక్, వొకేషనల్ కాలేజీలను బలోపేతం చేయాలన్నారు. 'టెన్త్, ఇంటర్ చదువుకుని ఖాళీగా ఉన్న వారిని గుర్తించి స్కిల్ హబ్స్ ద్వారా నైపుణ్యాలు కల్పించాలి. మొబైల్ రిపేర్, లిఫ్ట్ రిపేర్, ఏసీ రిపేర్, టైల్స్ ఫిక్సేషన్ ఇలా అనేక రకాల స్కిల్ ఏరియాల్లో యువతకు శిక్షణ అందించాలి. ఇలాచేస్తే చంద్రబాబు చెప్పినట్లు 20లక్షల ఉద్యోగాలు అందించడం పెద్ద విషయమేమీ కాదు'.. అని ఆయన సూచించారు. శాసన మండలిలో బుధవారం 'విద్యా రంగంలో సంస్కరణల'పై జరిగిన లఘు చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

జిల్లా పరిషత్ బడ్జెట్ అంచనాలకు ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్‌లకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలకు లాంఛనప్రాయ ఆమోదం లభించింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ఆమోదాలు ఇలా... రూ. కోట్లలో

జిల్లా పరిషత్	ఆదాయం	వ్యయం
విశాఖ	1,363.16	1,362. 95
ప్రకాశం	1,248.51	1,130.16
గుంటూరు	869.00	828.83
విజయనగరం	1,019.76	1,016.60
కృష్ణా	957.36	943.04
నెల్లూరు	374.44	297.41
చిత్తూరు	4,133.00	4,039.44
పశ్చిమ గోదావరి	61.95	61.36
కర్నూలు	1,086. 45	1,068.58
తూర్పు గోదావరి	886.94	886.32
వైఎస్సార్ జిల్లా	253.26	179.53
అనంతపురం	840.11	818.72



పవన్, లోకేశ్ క్షమాపణ రాజకీయాలపై ఆసక్తికర చర్చ

- గతంలో తిరుపతి తొక్కిసలాటపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన పవన్‌కళ్యాణ్
- ఇప్పుడు పవన్ మంత్రిత్వ శాఖ పరిధిలో అన్నదాన సత్రాన్ని కూల్చివేతను తప్పుబడుతూ లోకేశ్ ట్వీట్

సాక్షి, అమరావతి:కాశినాయన ఆశ్రమానికి చెందిన అన్నదాన సత్రాలను అటవీ శాఖ అధికారులు కూల్చివేయడంపై మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేసిన ట్వీట్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ మధ్య నడుస్తున్న అధిపత్య పోరుకు నిదర్శనమనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అటవీ శాఖ అధికారులు అన్నదాన సత్రాలను కూల్చివేయడాన్ని తప్పుబట్టిన లోకేశ్ కూల్చివేతలకు ప్రభుత్వం తరఫున తాను క్షమాపణ చెబుతున్నట్టు ట్వీట్‌లో పేర్కొన్నారు. గతంలో తిరుపతిలో టీటీడీ టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనను పవన్‌కళ్యాణ్ తప్పుబట్టారు. ప్రభుత్వం తరఫున క్షమాపణ చెబుతున్నట్టు అప్పట్లో పవన్ ప్రకటించారు. ఇప్పుడు పవన్‌కళ్యాణ్ మంత్రిత్వ శాఖ పరిధిలో కూల్చివేతలను లోకేశ్ తప్పుబట్టడం, ప్రభుత్వం తరఫున క్షమాపణ చెబుతున్నట్టు ట్వీట్ చేయడం ద్వారా పవన్‌కు టిట్ ఫర్ టాట్‌గా సమాధానమిచ్చారనే చర్చ నడుస్తోంది. అప్పట్లో టీటీడీ చైర్మన్ రేసులో పవన్ సోదరుడు నాగబాబు కూడా ఉన్నారనే వార్తలు రాగా.. లోకేశ్ ఏరికోరి బీఆర్ నాయుడిని చైర్మన్‌గా ఎంపిక చేయించారని.. దీనిపై పవన్‌కళ్యాణ్ అసంతృప్తికి లోనయ్యారన్న చర్చ అప్పట్లో సాగింది. ఈ నేపథ్యంలోనే తిరుపతి తొక్కిసలాట ఘటనపై టీటీడీ చైర్మన్ సైతం క్షమాపణ చెప్పాలంటూ పవన్ అప్పట్లో డిమాండ్ చేశారు. ఇప్పుడు పవన్ పర్యవేక్షణలోని అటవీ శాఖ అధికారులు కాశినాయన అన్నదాన సత్రాలను కూల్చివేయడాన్ని అందివచ్చిన అవకాశంగా మలుచుకున్న లోకేశ్ ఈ ఘటనపై ప్రభుత్వం తరఫున తాను క్షమాపణ చెబుతున్నానని, సొంత నిధులతో ఆ సత్రాలను నిర్మిస్తానని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. అప్పట్లో టీటీడీ వ్యవహారంలో పవన్ వ్యవహరించిన తీరుకు ప్రతిగా ఇప్పుడు లోకేశ్ గట్టిగా చురకలు వేసినట్టయ్యిందనే చర్చ సాగుతోంది.

'విత్తనం'పై నీలి నీడలు

రాష్ట్రవ్యాప్తంగా ఏపీ సీడ్స్‌కు రూ.261.09 కోట్లు బకాయి పడ్డ సర్కారు



అనంతపురం అగ్రికల్చర్: కూటమి ప్రభుత్వం ఇప్పుడు రైతులకు నాణ్యమైన విత్తనాలూ అందకుండా ఏకంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)నే నిర్వీర్యం చేసే దిశగా సాగుతోంది. ఈ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోవడమే కాకుండా, ఇచ్చిన నిధులనూ వాడుకోకుండా సంస్థకు చెందిన బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేసేసినట్లు సమాచారం. కనీసం రైతులు చెల్లించిన నాన్ సబ్సిడీ సొమ్ము కూడా పూర్తిస్థాయిలో అందకుండా చేసినట్లు తెలుస్తోంది. రోజురోజుకు ఏపీ సీడ్స్ ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని అధికారవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అలా ఇచ్చి.. ఇలా లాగేసుకుంటోంది..

గతేడాది (2024–25) ఖరీఫ్, రబీ సీజన్లలో ఏపీ సీడ్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,79,245 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు రాయితీతో పంపిణీ చేశారు. దానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.261.09 కోట్లు బకాయి పడింది. ఇటీవల అందులో రూ.100 కోట్లు ఏపీ సీడ్స్ పీడీ అకౌంట్‌కు జమ చేస్తున్నట్లు జీవో ఇచ్చారు. సొమ్ము డ్రా చేసేలోపే రాష్ట్ర ప్రభుత్వం అకౌంట్‌ను ఫ్రీజ్ చేసినట్లు చెబుతున్నారు. ఇదే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ సీడ్స్ జిల్లా అకౌంట్లు కూడా ఫ్రీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల నిధులు ఇస్తున్నట్లు బయట చెప్పుకోవడానికి తప్ప ఏపీ సీడ్స్‌కు పైసా అందడంలేదు. గతంలో అంటే 2018–19లో అప్పటి చంద్రబాబు సర్కారు దిగిపోయే సమయంలో కూడా రాయితీ విత్తనాల పంపిణీకి సంబంధించి ఏపీ సీడ్స్‌కు రూ.171.99 కోట్లు బకాయి పెట్టి వెళ్లిపోయింది.

అర్హత పొందిన ఐదు నామినేషన్లు

సాక్షి, అమరావతి :ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో దాఖలైన ఐదు నామినేషన్లు స్క్రూటినీ అనంతరం అర్హత పొందినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. టీడీపీ నుంచి కావలి గ్రీష్మ ప్రసాద్, బి. తిరుమలనాయుడు, బీదా రవిచంద్రతో పాటు జనసేన నుంచి కొణిదెల నాగేంద్రబాబు, బీజేపీ నుంచి సోము వీర్రాజులు నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఉపాధ్యాయుల ద్వారానే సమాజంలో మార్పు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులతోనే సమాజంలో మార్పు సాధ్యమని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు చెప్పారు. క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు సహాయంతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధ్యాయ శిక్షణలు, వారి వృత్తిపరమైన అభివృద్ధి కార్యకలాపాలు, సీబీఏ వంటి మూల్యాంకన సంస్కరణలు చేపడతామని వివరించారు.

ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీ చైర్మన్‌గా అజయ్ జైన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్ (అనారోగ్య కారణాలకు సంబంధించిన) ప్రతిపాదనలు, సిఫారసులను పరిశీలించే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల కమిటీ చైర్మన్‌గా గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌ను ప్రభుత్వం నియమించింది. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలకు అర్హులైన వారిని ఈ కమిటీ సిఫారసు చేస్తుంది.

భూ కేటాయింపుల రద్దుపై హైకోర్టుకు 'హయగ్రీవ'



సాక్షి, అమరావతి : విశాఖపట్నం ఎండాడలో తమకు గతంలో చేసిన 12.5 ఎకరాల భూమి కేటాయింపులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ హైకోర్టులో బుధవారం అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేసింది. లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. ప్రభుత్వ న్యాయవాది (రెవెన్యూ) కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, అందువల్ల విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. భూమిని ఇప్పటికే ప్రభుత్వ స్వాధీనం చేసుకుందని తెలిపారు. తదుపరి విచారణ వరకు నిర్మాణాల విషయంలో ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోబోమని తెలిపారు. ఈ వివరాలను నమోదు చేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

మీరేమో ఒకర్ని.. పేదలేమో నలుగుర్ని కనాలా?

చంద్రబాబుపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం

సాక్షి, అమరావతి: చంద్రబాబు, లోకేశ్‌లు ఒక్కొక్క పిల్లోడితో సరిపెడితే.. గ్రామాల్లో ఉపాధి లేక అవస్థలు పడుతున్న పేదలు మాత్రం నలుగురేసి మందిని కనాలా? సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహించిన మహాధర్నాలో శ్రీనివాసరావు మాట్లాడారు. 'గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే సంక్షేమ పథకాలు కట్ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ఎక్కువ మందిని కంటే ప్రసూతి సెలవులు ఇస్తానంటున్నారు. అసలు చంద్రబాబు ఎంత మంది పిల్లల్ని కన్నారు? అని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు.

వ్యవసాయ సమస్యలు చెబుదామంటే.. పవన్ కలవట్లేదు!

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. కూలీల పొట్ట కొట్టేందుకే చంద్రబాబు అన్ని రంగాల్లోకి యంత్రాలు తెస్తానంటున్నారని మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అర్ధరాత్రి తలుపుతట్టినా పలుకుతానన్న పవన్ కు వ్యవసాయ కార్మికుల సమస్యలు చెబుదామని నెల రోజులుగా ప్రయత్నిస్తున్నా.. ఫలితం లేదన్నారు. కాగా, ప్రమాదాల్లో చనిపోయిన కూలీల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం, రెండెకరాల భూమి అందించాలని, ఉపాధి పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచన



సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మార్కెట్‌లో నిరంతర డిమాండ్ ఉన్న మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న సాగు విస్తీర్ణంలో మన దేశం ప్రపంచంలో 4వ స్థానంలో.. ఉత్పత్తిలో 7వ స్థానంలో ఉందన్నారు. వరితో పోల్చితే ఈ పంటకు నీటి వినియోగం తక్కువేనని తెలిపారు. 10 నుంచి 36 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలున్నా కూడా ఈ పంట దిగుబడులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఆహార వినియోగానికి, పౌల్ట్రీ, పశువుల దాణా తయారీకి ఉపయోగపడుతున్న మొక్కజొన్న పంట.. ఇప్పుడు ఇథనాల్ ఉత్పత్తిలో కీలకంగా మారిందని చెప్పారు. పెట్రోల్‌లో తప్పనిసరిగా 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. దీని వల్ల ఇథనాల్ యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున.. రైతులు మొక్కజొన్న సాగును పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ ప్రసాద్, సంయుక్త సంచాలకులు విజయ భారతి, ఉప సంచాలకులు బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ పరిధిలో విశాఖ పోర్టు మాదకద్రవ్యాల కేసు

ముక్తసరిగా బదులిచ్చిన హోంమంత్రి

సాక్షి, అమరావతి :2024లో విశాఖ పోర్టులో కంటైనర్ల ద్వారా భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టిబడిన కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పరిధిలో ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణ సంస్థలు ఏమైనా నివేదికలు సమర్పించాయా అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీటిపై బుధవారం మంత్రి.. కేసు సీబీఐ పరిధిలో ఉందని ముక్తసరిగా బదులిచ్చారు. ఇక మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో అగ్నిప్రమాదం ఘటనలో ఆర్డీఓలు మురళీ, హరిప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ రాజ్‌లను సస్పెండ్ చేశామని.. గౌతమ్ రాజ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నిలిచిన ఆస్తుల పంపిణీ..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణలకు 9, 10 షెడ్యూల్స్‌లోని రూ.2,02,314 లక్షల ఆస్తుల పంపిణీ నిలిచిపోయిందని శాసన మండలిలో బుధవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. జనాభా దామాషా ప్రాతిపదికన ఆస్తుల విభజన చేయాల్సి ఉందన్నారు.

ఏపీలో రెండు యురేనియం నిక్షేపాలు



సాక్షి, న్యూఢిల్లీ: 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ' (డీఏఈ) ఏపీలో 2 యురేనియం నిక్షేపాలను కనుగొన్నట్టు కేంద్ర వ్యక్తిగత, ప్రజా వ్యవహారాలు, పెన్షన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మౌఖిక సమాధానమిచ్చారు. ఒకటి వైఎస్సార్ జిల్లా తుమ్మలపల్లె, మరొకటి పల్నాడు జిల్లాలోని కొప్పునూరులో ఉన్నట్లు తెలిపారు. ఈ నిక్షేపాలలో మొత్తం 2,54,020 టన్నుల ఇన్–సిటు యురేనియం ఆక్సైడ్ ఉన్నట్లు అంచనా వేశారన్నారు. ఈ ప్రాంతాల్లోని చుట్టు పక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం కావడానికి మూల కారణాలు తెలుసుకునేందుకు యూసీఐఎల్, మైనింగ్ ప్రాజెక్ట్, వివిధ సంస్థలు పరిశోధనలు నిర్వహించాయని చెప్పారు.

కర్ణాటక సరిహద్దులో ప్రైవేట్ బస్సులు ఢీ

ఒకరి మృతి, నలుగురి పరిస్థితి విషమం


ఎదురెదురుగా ఢీకొన్న రెండు ప్రైవేట్ బస్సులు

మదనపల్లె: కర్ణాటక రాష్ట్ర సరిహద్దు, మదనపల్లెకు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలు కాగా 40 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న సువర్ణముఖి (సబర్బాల్) ప్రైవేట్ బస్సు మదనపల్లె మీదుగా బెంగళూరుకు వెళుతోంది. అదే సమయంలో బెంగళూరు నుంచి నంద్యాలకు వెళుతున్న ఏఆర్.బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్ణాటక సరిహద్దు రాయల్పాడు సమీపంలోని గెలిజగూరు వద్ద రాత్రి 1 గంట సమయంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఏఆర్ ట్రావెల్స్ బస్సు ముందువైపు వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ, ఎదురుగా వచ్చిన సువర్ణముఖి బస్సును ఢీకొంది. ప్రమాదంలో మదనపల్లె కమ్మవీధికి చెందిన సువర్ణముఖి ప్రైవేట్ బస్సు కండక్టర్ గంగాధర్ అలియాస్ బాబు(59) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వెనుక సీటులో ఉన్న మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంతో వారి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని శ్రీనివాసపురం ఆస్పత్రికి తరలించారు. 22 మంది ప్రయాణికులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో చింతామణికి చెందిన వెంకటేష్(40), కడపకు చెందిన ఆలీ(38), నంద్యాలకు చెందిన జవహరుద్దీన్(35), బెంగళూరుకు చెందిన జయకుమారి(30), ఆనందరెడ్డి(54), రాంప్రసాద్(57), రాయచోటికి చెందిన నిర్మల(38) తీవ్రంగా గాయపడగా, మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. రాయల్పాడు పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని క్షతగాత్రులను మదనపల్లె, బెంగళూరు, కోలారు,శ్రీనివాసపురం ఆస్పత్రులకు 108 అంబులెన్స్ వాహనాల్లో తరలించారు. ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రిస్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ కోసం కొత్త వెబ్ అప్లికేషన్

- ఈలోపే పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయించండి
- సీసీఎల్‌ఏను కోరిన వ్యవసాయ శాఖ

సాక్షి, అమరావతి: దేశంలోని రైతులందరి వివరాలు తెలిపే అగ్రిస్టాక్ (ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్) మాడ్యుల్‌ను త్వరలో డీయాక్టివేట్ చేయనున్న నేపథ్యంలో పెండింగ్ అనుమతులను తహసీల్దార్లు, వీఆర్‌వోలు క్లియర్ చేసేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖను కోరింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు లేఖ రాశారు. అగ్రిస్టాక్ పోర్టల్‌లో ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏపీఎఫ్ఆర్) ఆధారంగా రాష్ట్రానికి చెందిన రైతులందరికీ ఒక యునిక్ ఐడీని జారీ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ సహాయ అధికారులు (వీఏఏ)లను ఆ వివరాలను అప్‌లోడ్ చేసే ఆపరేటర్లుగా, వీఆర్‌వోలు, తహసీల్దార్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాటిని అనుమతించే అధికారులుగా నియమించి లాగిన్‌లు ఇచ్చారు.

రాష్ట్రంలో కల్తీ మందులు.. పారాహుషార్

ఔషధ నియంత్రణ వ్యవస్థ పనితీరుపై మంత్రి సమీక్ష

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోకి ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కల్తీ మందులు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాలని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మందుల నియంత్రణా వ్యవస్థ (డీసీఏ) పనితీరుపై బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న యాంటీబయోటిక్స్ వినియోగం ఆందోళన కలిగిస్తోందన్నారు. కల్తీ మందులు ఏ రాష్ట్రాల నుంచి వస్తున్నాయి.. మన రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్తున్నాయి.. ఎక్కడ ఎక్కువగా విక్రయిస్తున్నారు వంటి అంశాల సమాచార సేకరణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. రవాణా, విక్రయాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు.

మీడియా పాయింట్

మాయమాటలతో అధికారంలోకి వచ్చారు



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి కూటమి అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఒక్కరికి కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పాలన కూటమి ప్రభుత్వానిది. నిరుద్యోగులందరినీ చంద్రబాబు అండ్ కో మోసం చేశారు.

– కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ

నిరంకుశ ప్రభుత్వం



మండలిలో మా డిమాండ్లను వినిపించనివ్వడం లేదు. కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. మాకన్నా ఎక్కువ మంది మార్షల్స్‌ని పెట్టారు. జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోతే చొక్కా పట్టుకుని అడగమన్న లోకేశ్ ఇప్పుడు ఆ హామీ ఏమైందని నిలదీస్తుంటే మా గొంతు నొక్కాలని చూస్తున్నారు.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

మా హక్కులు కాలరాస్తున్నారు



బాబు చెప్పిన ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేకపోతున్నారు. డీఎస్సీ సహా ఏదీ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. ఫీజు పోరుకు మద్దతుగా మేం మండలిలో మాట్లాడితే మార్షల్స్‌తో దౌర్జన్యం చేయించారు. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కుల్ని అణచివేయాలనుకుంటున్నారు.

– ఇషాక్ బాషా, ఎమ్మెల్సీ

మీ హయాంలో ఏం ఉద్ధరించారు



గతంలో విద్యా శాఖ మంత్రిగా ఉపాధ్యాయుల బదిలీల్లో డబ్బులు మింగేశారనే ఆరోపణలున్న బొత్స సత్యనారాయణ ఏమీ ఎరగనట్టు ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడటం హాస్యాస్పదం. అంబేడ్కర్ విద్యాకానుక ద్వారా లక్షలాది మందిని విదేశాలకు పంపిస్తే.. మీ హయాంలో దీన్ని కొనసాగించలేదు.

– పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్సీ

మార్షల్స్‌తో నెట్టించే ప్రయత్నం దారుణం



కూటమి పార్టీలు మేనిఫెస్టోలో చేర్చిన హామీలకు కనీస గౌరవం ఇవ్వడం లేదు. అందుకే శాసనమండలిలో ప్రజాస్వామ్య బద్ధంగానే అడిగే ప్రయత్నం చేస్తే మార్షల్స్‌తో నెట్టించే ప్రయత్నం దారుణం. సభ్యుల సంఖ్య కంటే మూడింతలుగా మార్షల్స్‌ను సభలోకి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది. రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి యువత ఓట్లు దండుకున్నారు. ఉద్యోగాల భర్తీ ఊసే లేదు.

– ఆర్.రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ

సన్నిధి


లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం


లక్ష్మీ నరసింహ స్వామి


ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం


ప్రసన్నాంజనేయ స్వామి

ఉభయ దేవతా పుణ్యక్షేత్రం సింగరకొండ

ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా అద్దంకికి చేరువలో ఉన్న పుణ్యక్షేత్రం సింగరకొండలో లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రపతిగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రపాలకునిగా పూజలు అందుకుంటున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ల ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో అత్యంత వైభవంగా జరుపుతారు. ప్రస్తుతం 70వ తిరునాళ్ల మహోత్సవాలు ఫాల్గుణ శుద్ధ త్రయోదశి, బుధవారం ఆరంభం అయ్యాయి.

ఇక్కడ ఉన్న ఆంజనేయ స్వామి, ఉగ్ర నరసింహ స్వామి దేవాలయాలు ప్రసిద్ధి చెందినవి. శింగరకొండ అద్దంకి నుంచి 6 కి.మీ. దూరంలో భవనాసి చెరువు ఒడ్డున ఉంది. మొదట్లో సింగనకొండ అని పిలిచిన నరసింహ క్షేత్రం తర్వాత తర్వాత సింగరకొండ ఆంజనేయ స్వామి క్షేత్రం గానే ప్రఖ్యాతి గాంచింది.

సింగరకొండపై లక్ష్మీ నరసింహస్వామి కొలువై ఉండగా కొండ దిగువన చెరువు ఒడ్డున ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఉంది. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుంటే భూతప్రేత పిశాచ పీడలు నివారణ అవుతాయని, అనారోగ్య సమస్యలు నివారణ అవుతాయని, దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గుతాయని స్థానికులు చెబుతారు.

ఇక కొండ దిగువన ఉన్న ప్రసన్నాంజనేయ స్వామికి స్థల పురాణం ఉంది. తమ తల్లి కోసం వెతుకుతూ దక్షిణాపథం బయలుదేరిన ఆంజనేయుడు, ఇక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొన్నారని నమ్మకం. అందుకే ఇక్కడ ఆంజనేయుడు దక్షిణాముఖుడై కనపడతాడు.

అద్దంకి తాతాచార్యులు అనే గొప్ప భక్తుడు సింగరకొండలో కొండపై గల నరసింహ స్వామి గుడియందు ధ్వజారోహణ చేస్తుండగా, కొండకింద ఒక దివ్యపురుషుడు ఒక ఆంజనేయ విగ్రహానికి హారతి ఇస్తూ కనిపించడంతో పరుగు పరుగున కిందికి వెళ్లగా తాతాచార్యుల వారికి ఆ పురుషుడు మాయం అయ్యాడు. దివ్యకాంతులు వెదజల్లుతూ ఆంజనేయ విగ్రహం కనపడింది.

అలా మహర్షి ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడాన్ని తాతాచార్యులతోబాటు కొండమీద ఆలయ పనిలో ఉన్నవారెందరో చూశారు. వాళ్ళు కొండ దిగి వచ్చి చూసేసరికి ఆ పుణ్యమూర్తి కనిపించలేదు.

మహర్షి ప్రతిష్ఠించిన విగ్రహం మహోజ్వలంగా వెలిగిపోతూ కనిపించింది. దాంతో ఆ గ్రామస్తులు, చుట్టుపక్కలవారు కలిసి, లక్ష్మీ నసింహ దేవాలయ నిర్మాణం పూర్తయ్యాక కొండ దిగువన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం కూడా కట్టించారు.

సమీప దర్శనీయ ఆలయాలు: అయ్యప్పస్వామి వారి ఆలయం, షిర్డీ సాయిబాబావారి ఆలయం, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆలయం, శ్రీ గాయత్రీ మాత ఆలయం, కొండపై నెలకొని ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం, శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం, శ్రీ కోదండరామ స్వామివారి ఆలయం చూడదగ్గవి.

వసతి: సింగరకొండలో వసతి పొందాలనుకునే వారు దేవస్థానం ఏర్పాటు చేసిన కాటేజీలలో బస చేయవచ్చు. కనుక ఇక్కడికి వచ్చే యాత్రికులు మారుతి భవన్‌లో వసతి పొందవచ్చు. తక్కువ ధరకే అద్దెకు లభిస్తుంది. ఈ భవన్ రెండు అంతస్తుల సముదాయం.

ఎలా చేరుకోవాలంటే..?

హైదరాబాద్ నుంచి 290 కిలోమీటర్లు, విజయవాడ నుంచి 110 కిలోమీటర్లు, ఒంగోలు నుంచి 36 కిలోమీటర్లు, అద్దంకి నుంచి 5 కిలోమీటర్ల దూరం.

విమాన మార్గం ద్వారా: సమీప విమానాశ్రయం విజయవాడలోని గన్నవరం ఎయిర్ పోర్ట్. అక్కడ దిగి క్యాబ్ లేదా టాక్సీలలో సింగరకొండ చేరుకోవచ్చు.

రైలు మార్గం: ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపాన ఉంది. హైదరాబాద్, విజయవాడ నుంచి చెన్నై వెళ్ళే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్నీ ఒంగోలు స్టేషన్లో ఆగుతాయి.

రోడ్డు/ బస్సు మార్గం: సమీప బస్ స్టాప్ - అద్దంకి. హైదరాబాద్, విజయవాడ, ప్రకాశం నుంచి అద్దంకికి బస్సులు ఉన్నాయి.

ఒంగోలు నుంచి: బస్సు ప్రయాణీకులు అద్దంకి వెళ్లే బస్సు ఎక్కాలి. అద్దంకి నుంచి సింగరకొండకు ప్రతి అరగంటకీ బస్సులు ఉన్నాయి.

సింగరకొండ తిరునాళ్లగా ప్రసిద్ధికెక్కిన ఈ తిరునాళ్లు ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుంచి హోలీపూర్ణిమ వరకు మూడురోజులపాటు జరుగుతాయి. ఇరువురు స్వాములకూ విశేష పూజలు జరుగుతాయి.

పరిహారం

రుణబాధలా? పరిహారాలివిగో!

అప్పులు లేనివారు అధికసంపన్నులు అంటారు. అయితే అప్పులు కొందరికి తప్పవు. అలా తరచు అప్పుల పాలవుతూ ఉంటే...

- ప్రతినెలా పున్నమి, అమావాస్య రోజుల్లో శ్మశాన వాటికలకు చేరువలో ఉండే శివాలయాన్ని దర్శించుకుని అక్కడి శివలింగానికి పంచామృతాభిషేకం చేయించాలి. దశముఖ రుద్రాక్షను ధరించాలి.
- అష్టగంధాల మిశ్రమంతో 108 రావి ఆకులపై 'శ్రీరామ' అని రాసి, వాటిని మాలగా తయారు చేసి ఎనిమిది మంగళవారాలు ఆంజనేయ ఆలయంలో స్వామికి అలంకరణగా సమర్పించాలి.
- రాహు కేతువుల శాంతికి హోమం చేయించుకోవడం వల్ల ఫలితం ఉంటుంది. హోమం పూర్తయిన తర్వాత హోమకుండం నుంచి సేకరించిన విభూదిని తెల్లని వస్త్రంలో మూటగా కట్టి, ఆ మూటను ఇంట్లో లేదా వ్యాపార ప్రదేశంలో డబ్బు భద్రపరచే చోట ఉంచాలి.
- వ్యాపారంలో తరచు సమస్యల కారణంగా రుణబాధ ఎదురవుతున్నట్లయితే, వ్యాపారం కోసం కొనే వస్తువులతో పాటు పిల్లల ఆట వస్తువులను కొన్ని కొని వాటిని చిన్నారులకు కానుకగా ఇవ్వండి.
- ఆకలితో ఉన్న వృద్ధులు, అంధులు, వికలాంగులు తారసపడినట్లయితే వారికి తృప్తిగా భోజనం పెట్టండి.

- సాంఖ్యాయన

మంచిమాటలు

సర్దుకుపో అనటం మానేసి ఒకసారి ఆ మనిషిని అర్థం చేసుకోవటం మొదలు పెడితే తెలుస్తుంది.. జీవితంలో సర్దుకుపోవటం కంటే అర్థం చేసుకోవటం ముఖ్యం అని.

చేతిలో గీతను, నుదుటిపై రాతను మార్చలేనప్పుడు మన అలవాట్లను, పద్ధతులను మార్చుకోవాలి. అవే మన చేత్తో మన రాతను మనకు నచ్చినట్టు మార్చేస్తాయి.

సంతుష్టే మన స్వరూపం. ఇది తెలియక తృప్తి కొరకే తాను భుజిస్తున్నానని భావించి దానిపై అనురక్తుడైతే, ఆ అన్నమే అతనిని కబళించి, తీరని అసంతృప్తికి వశుని చేస్తుంది.

ఎవరి వద్ద ఎక్కువ ధనం ఉంటుందో వారే అదృష్టవంతులు కారు. ఎవరి వద్ద ఎక్కువ గుణం ఉంటుందో వారే నిజమైన అదృష్టవంతులు.

బాధ్యతతో చేసే పని చక్కగా ఉంటుంది.. ప్రేమతో చేసే పని అందంగా ఉంటుంది

మన స్థాయిని బట్టి మనల్ని గౌరవించే వారి కంటే మన మనసుని బట్టి మనల్ని ప్రేమించే వారే మనకు నిజమైన ఆప్తులు

మన తప్పుని తమ అవసరాల కోసం సమర్థించే వారు కాదు. ఆ తప్పుని ఎత్తి చూపి తప్పుని సరిదిద్దే వారే నిజమైన బంధువులు స్నేహితులు

బహిర్ముఖమైన అద్దం నీ రూపాన్ని చూపిస్తుంది. అంతర్ముఖమైన 'ధ్యానం' నీ స్వరూపాన్ని చూపిస్తుంది! 'పరుల లోని ప్రత్యేకతలను చూడు. నీలోని బలహీనతలను విడనాడు.'

నిర్మల వాణి

ప్రతి పురుషుని విజయం వెనుక ఓ స్త్రీ శక్తి

మన పురాణాలలో స్త్రీని శక్తి స్వరూపిణిగా వర్ణిస్తారు. ఒక స్త్రీ శక్తి స్వరూపిణిగా ఉంటూ చుట్టూ అందరి చేత గౌరవింప బడితే అక్కడ దేవతలు నివసిస్తారు అంటారు. అయితే ఆమె శక్తి ఏమిటి? ఆ శక్తికి ఏమైనా కొలమానం ఉందా? అది ఏ విధమైన శక్తి? ఎలా పని చేస్తుంది? ఇటువంటి ప్రశ్నలన్నింటికీ మాతాజీ నిర్మలా దేవి బోధనలలో మనకు సరైన సమాధానం లభిస్తుంది.

మన ఇతిహాసాలలో శ్రీ రాముని శక్తి సీత. శివుని శక్తి పార్వతి. శ్రీ కృష్ణుడి శక్తి రాధ. ఈ శక్తులు రాక్షస సంహారం కోసం కానీ యుద్ధం చేయడానికి కానీ రణరంగానికి వెళ్ళలేదు. శ్రీ కృష్ణుడు లేదా శ్రీ రాముడే యుద్ధం చేశారు. కానీ వారి శక్తి ప్రభావం వారి చేత యుద్ధం చేయించింది. దీని గురించి మాతాజీ నిర్మలా దేవి ఎలా వివరిస్తారు అంటే పురుషులది గతి శక్తి... స్త్రీలది స్థితి శక్తి. ఉదాహరణకు స్విచ్ వేసినప్పుడు ఫ్యాన్ తిరుగుతుంది. మనకు బయటకు చూడడానికి ఫ్యాన్ తిరుగుతున్నట్లే కనిపిస్తుంది. కానీ నిజానికి దానిని తిప్పుతున్నది దాని లోపల ప్రవహిస్తున్న విద్యుచ్ఛక్తి. అదే విధంగా పురుషులు బయటకు పనులు చేస్తున్నట్లు కనిపించినా వారి చేత ఆ పనులు చేయించే శక్తి మాత్రం స్త్రీల శక్తియే. అందుకే స్త్రీని శక్తి స్వరూపిణి అంటారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే జీవశాస్త్రం ప్రకారం కణంలో ఉండే శక్తి కేంద్రాన్ని మైటోకాండ్రియా అంటారు. ఈ మైటోకాండ్రియా మానవులలో ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించేటప్పుడు తల్లి నుండే లభిస్తుంది. అంటే ప్రతీ మానవునికి శక్తి తల్లి నుండే లభిస్తుంది. కావున సైన్స్ ప్రకారం కూడా శక్తికి మూలం స్త్రీ యే. ఈ తల్లులందరికీ మూలమైన తల్లిని హిందూ ధర్మంలో ఆదిశక్తి అని పిలుస్తారు. ఆమెనే గ్రీకులు అథెనా అనే దేవతగా కొలుస్తారు.

శక్తి అంటే మొత్తం అన్ని శక్తులు అని, ఏదో ఒక ప్రత్యేకమైన శక్తి అని కాదు. ఈ శక్తులన్నీ మన సూక్ష్మ శరీరంలో షట్చక్రాలన్నింటిపై ఉంటాయి. ఈ శక్తులు లేకుండా దేవతల ఏ పనీ జరగదు. ఉదాహరణకు శ్రీ కృష్ణుడి శక్తి శ్రీ రాధ, శ్రీ రాముడి శక్తి శ్రీ సీత; శ్రీ మహావిష్ణువు శక్తి శ్రీ లక్ష్మి. అదేవిధంగా శక్తులన్నింటి నివాసం దేవతలతో ఉంటుంది. శక్తి లేకుండా దేవతలు ఏమీ చేయలేరు. ఆ మొత్తం శక్తి అంతా శ్రీ జగదాంబగా మన మధ్య హృదయ చక్రంలో ఉంటుంది. ఈ జగదాంబ శక్తి చాలా ప్రబలమైనది. శక్తి ఆరాధన అంటే అందరు దేవతల అన్ని శక్తులకు పూజ జరుగుతుంది. ఈ శక్తులు చెడిపోవడం వలన మన చక్రాలు దెబ్బతింటాయి. అందువల్ల మనకు శారీరక, మానసిక, భావోద్వేగ పరమైన సమస్యలన్నీ వస్తాయి. అందుకే ఈ శక్తులను ఎల్లప్పుడూ ప్రసన్నంగా ఉంచుకోవడం ముఖ్యం. అందుకే దేవిని ప్రసన్నం చేసుకోవాలని అంటుంటారు. సహజ యోగ సాధన ద్వారా మన సూక్ష్మ శరీరంలో కుండలినీ శక్తి ని మేల్కొలపడం వలన ఈ శక్తి మరొక శక్తిని పొందుతుంది. ఈ శక్తులలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అవి ఆది శక్తి యొక్క సర్వవ్యాప్త శక్తి అయిన పరమ చైతన్యంతో ఏకమవుతాయి. ఆ విధంగా ఏకమవ్వడం వలన ఆ శక్తి మన లోపలికి ప్రవేశిస్తుంది. ఈ చిన్న చిన్న శక్తులన్నీ ఆ శక్తితో కలిసిపోతాయి. ఉదాహరణకు, మీ హృదయ శక్తి బలహీనంగా ఉంటే, అది పరమ చైతన్యంతో అనుసంధానించబడినప్పుడు, ఈ బలహీనమైన శక్తి తిరిగి బలాన్ని పొందుతుంది. ఆ సందేశం అన్ని శక్తులకు చేరుతుంది, ఇప్పుడు ఈ శక్తి బలాన్ని పొందింది కాబట్టి చింతించాల్సిన పనిలేదు అని. శక్తి స్వభావం స్త్రీ స్వభావం కాబట్టి స్త్రీని గౌరవించడం, గృహిణిని గృహలక్ష్మిగా చూడడమనేది పురుషులు నేర్చుకోవలసిన చాలా ముఖ్యమైన విషయం.


పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి

స్త్రీలు తమ భర్తను, పిల్లలను గృహ సంబంధ కార్యాలను చూసుకోవాలి. కానీ భర్తకు బయటి కార్యాలకు సంబంధించి, సంపాదన, ఆర్థిక వ్యవహారాలు లాంటి అనేక పనులు ఉంటాయి కాబట్టి. అదే విధంగా పురుషులు కూడా భార్యను బాగా చూసుకోవడం చాలా ముఖ్యం. భార్యను ఒక దేవిలా, తన గృహశక్తిలా చూడడం భర్త బాధ్యత. భార్యతో అతని అనుబంధం ప్రశాంతంగా, స్వచ్ఛంగా ఉండాలి. అప్పుడే ఆ గృహం స్వర్గసీమ అవుతుంది.

- డా. పి. రాకేష్
(పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

సువార్త

నిబద్ధత

క్రీ.పూ. 597లో యూదా రాజగు యెహోయాకీము పరిపాలించుచుండగా బబులోను రాజగు నెబుకద్నెజరు యెరూషలేము మీదికి వచ్చి ఆ రాజ్యంలోని దేవాలయంలోని శేషించిన ఉపకరణములతో బాటు ఇశ్రాయేలీయులు రాజవంశములలో ముఖ్యులై, లోపం లేని సౌందర్యాన్ని, సకల విద్యా ప్రవీణత, జ్ఞానం, తత్వజ్ఞానం కలిగిన బాలురను రప్పించమని రాజుయొక్క నపుంసకుల అధిపతి ఆజ్ఞాపించెను. రాజు తాను భుజించు ఆహారంలో నుంచి, తాను సేవించే ద్రాక్షరసం నుంచి అనుదిన భాగం మూడు సంవత్సరాలు పోషించిన తర్వాత వారిని తన యెదుట నిలువబెట్టుమని ఆజ్ఞాపించాడు.

యూదుల నుండి దానియేలు, హనన్యా, మిషాయేలు, అజర్యా అనువారు ప్రవాసులుగా కాబడిరి. కానీ దానియేలు రాజు భుజించు భోజనం పానం చేయు ద్రాక్షరసం పుచ్చుకొని తన్ను అపవిత్ర పరచుకోకూడదని ఉద్దేశించి నపుంసకుల అధిపతితో వాటిని పుచ్చుకొనకుండ సెలవిమ్మని వేడుకొనగా, దేవుడు నపుంసకుల అధిపతి దృష్టికి దానియేలు కృపాకటాక్షము నొంద అనుగ్రహించెను. కానీ ఆ యధిపతి దానియేలుతో ఇట్లనెను. మీకు అన్నపానములను అనుగ్రహించిన రాజుకు భయపడుచున్నానని, మీ వయస్సు బాలుర ముఖము కంటే మీ ముఖములు కృశించినట్లు రాజుకు కనపడినచో మీరు రాజుచే నాకు (అధిపతికి) ప్రాణాపాయము కలుగజేతురనగా, ఆ అధిపతితో దానియేలు ఇట్లనెను. భోజనమునకు శాకధాన్యాదులును, పానమునకు నీళ్ళు దాసులమైన మాకిప్పించి పది దినములు పరీక్షించిన తరువాత మా ముఖములు చూచి మాపట్ల జరిగించమని కోరగా అతడు అంగీకరించెను. అందుకు ఆ యధిపతి సమ్మతించి పది దినముల వరకు వారిని పరీక్షించి, పది దినముల తర్వాత వారి ముఖములు చూడగా రాజు భోజనము చేయు కొందరు బాలుర కంటే, వీరి ముఖములు సౌందర్యముగాను, కళగాను కనపడినవి.

రాజు వారికి నియమించిన భోజనమును, పానముకైన ద్రాక్షారసమును ఆ నియామకుడు తీసివేశాడు. వారికి శాకధాన్యాదులే ఇచ్చాడు. దానియేలు సకల విధాలైన దర్శనాలను స్వప్న భావం గ్రహించు తెలివిగలవాడు. మూడు సంవత్సరాల తదుపరి నెబుకెద్నజరు రాజు వారిని ఆయన సముఖమునకు రప్పించుడని ఆజ్ఞ ఇవ్వగా నపుంసకుల అధిపతి రాజు సముఖమున వారిని నిలువబెట్టాడు. రాజు వారితో మాటలాడగా దానియేలు, ఆయన ముగ్గురు స్నేహితులగు హనన్యా మిషాయేలు అజర్యా వంటి వారు ఎవ్వరూ కనపడలేదు. జ్ఞాన వివేక సంబంధమైన అన్ని విషయాలలో వీరు ఆ రాజ్యమంతట నుండు శకున గాండ్ర కంటే, గారడీ విద్య గల వారందరికంటే పదింతలు శ్రేష్ఠులని తెలియబడింది (దానియేలు 1-20).



నదీ జలాలలో స్వేచ్ఛగా విహరించే చేప జిహ్వాచాపల్యం కారణంగా మానవులు వేసే గాలానికి తలొగ్గి ప్రాణం మీదికి తెచ్చుకునే రీతిగా భోజన ప్రియులు ఎదుటివారు సమకూర్చే విందు వినోదాలకు లోనయ్యే వ్యసనపరులు ఎందరో అభాగ్యులున్నారు. కానీ దానియేలు నిబద్ధతతో రాజు భోజనం, పానీయమైన ద్రాక్షారసము ఆహారంగా ఏర్పాటు చేసినప్పటికీ అట్టి క్లిష్టపరిస్థితులలో కూడా నిబద్ధతను కోల్పోకుండా వుండటానికి దైవశక్తి ఉండుటయే కారణమని దానియేలు జీవితం భావితరాలకు ఆదర్శనీయం.

- కోట బిపిన్

ఇస్లాం వెలుగు

రమజాన్ ఆశయం

రమజాన్ మాసం విశ్వాస కుసుమాలను వికసింపజేసే వరాల వసంతం. దైవ ప్రసన్నత, దైవభీతి పరాయణతల సాధనకు అనుకూలమైన రుతువు. దేవుని కారుణ్య కడలిని. ఆయన మన్నింపు కెరటాలను ఉప్పొంగజేసే మహోజ్వలమైన మాసం. రమజాన్ ఆరంభం నుండి అంతం వరకు అపార దైవానుగ్రహాలను వర్షింపజేసే శుభాల సీజన్.

ఈ శుభ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ, తరావీహ్ నమాజులు చేస్తూ, ఖుర్ఆన్ పారాయణం చేస్తూ, బీదసాదలకు సహాయం చేస్తూ పూర్తి జీవితాన్ని దేవుని విధేయత పరిధిలో గడిపేవారు ఎంతో అదృష్టవంతులు. అయితే కేవలం ఆరాధనలు చేసినంత మాత్రాన మనం రమజాన్ శుభాలను పొందలేం. రమజాన్ శుభాలకు అర్హులు కావాలంటే, అంతరంగాల్లో దైవభీతి దృఢంగా నాటుకోవాలి. దాని ప్రభావం మన దైనందిన జీవితంలోనూ కనిపించాలి. అంటే, అన్ని విధాల చెడులను వదలిపెట్టి పరిశుద్ధమైన జీవితం గడపాలి.

'ఎవరైనా ఉపవాసం ఉండి కూడా అబద్ధాలు చెప్పడం, వాటిని అమలు చేయడం వదలుకోకపోతే ఆ వ్యక్తి అన్నపానీయాల్ని వదలిపెట్టడం పట్ల దేవునికి ఎలాంటి ఆసక్తి ఉండదు' అని ప్రవక్త(సల్లం) ప్రవచించారు.

ఉపవాసాలు పాటిస్తూ, నమాజులు చేస్తూ కూడా అబద్ధం చెప్పడం, అబద్ధాన్ని ఆచరించడం మానుకోని వ్యక్తి కష్టపడినా ఫలితం దక్కని రైతులాంటి వాడు. ఆ రైతు తీవ్రమైన ఎండలో చెమటలు చిందిస్తూ నాగలితో పొలం దున్ని విత్తనాలు చల్లుతాడు. అవి మొలకెత్తిన తర్వాత పెరగటానికి కావలసిన సదుపాయాలన్నీ కలగజేస్తాడు. రాత్రిళ్ళు మేల్కొని పొలానికి కాపలా కూడా కాస్తాడు. కానీ పంట పండి కొన్ని రోజుల్లో చేతికి వస్తుందనగా దాన్ని వదిలేస్తాడు. దాంతో ఆ పొలం ఒక వైపు కలుపు మొక్కలు, చీడ పురుగులతో, మరోవైపు పక్షులు, పశువులు అడపాదడపా మేయడంతో పంట చేతికి రాకముందే పూర్తిగా నాశనం అవుతుంది. ఈ విషయాన్నే దైవప్రవక్త(సల్లం) ఇలా తెలిపారు:

'ఎందరో ఉపవాసం పాటించే వారికి తమ ఉపవాసాల ద్వారా ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు. అలాగే ఎందరో తరావీహ్ నమాజ్ చేసే వారికి తమ తరావీహ్ నమాజ్ ద్వారా జాగరణ తప్ప మరేమీ ప్రాప్తం కాదు.'

దైవభీతి పరాయణత మస్జిద్ లోనే కాదు, మస్జిద్ వెలుపల బజారుల్లో, ఇండ్లల్లో, దుకాణాల్లో, కార్యాలయాల్లో, కార్ఖానాల్లో కూడా కనిపించాలి. ఏదైనా వ్యవహారంలో తప్పు చేస్తున్నప్పుడు దేవుడు చూస్తున్నాడనే భావన కలగాలి. మనిషిని చెడులకు దూరంగా ఉంచగలిగేది కేవలం దైవభయమే. హృదయంలో చెడు పట్ల వెగటు, మంచి పట్ల అభిమానం జనించాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, బయటి ఒత్తిళ్ళకు లొంగకుండా కేవలం దైవ ప్రసన్నత కోసం చెడులను మాని మంచిని అవలంబించాలన్న కోరిక కలగాలి. అధర్మ విషయాలను పూర్తిగా వదిలేసి దైవ ధర్మం మోపిన బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వహిస్తూ ఉండాలి.

ఈ విధేయతా భావం రమజాన్ నెల గడిచిపోగానే అంతరించకుండా సంవత్సరంలోని మిగిలిన పదకొండు నెలలు కూడా సజీవంగా ఉండేలా రమజాను ఉపవాసాలు శాశ్వత శిక్షణ ఇస్తాయి. హృదయంలో దైవభీతి పరాయణత, జీవిత వ్యవహారాలపై దాని ప్రభావం తాత్కాలికంగా కాకుండా జీవితాంతం ఉండినప్పుడే రమజాన్ అసలైన ఆశయం నెరవేరుతుంది.

- తహ్సీన్ హుమైర్వీ

బిజినెస్ రీల్

టీసీఎస్ చేతికి దర్శితా సదరన్ ఇండియా హ్యాపీ హోమ్స్

దీల్ విలువ రూ. 2,250 కోట్లు



న్యూఢిల్లీ: దర్శితా సదరన్ ఇండియా హ్యాపీ హోమ్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 2,250 కోట్లు. ఒప్పందంలో భాగంగా దర్శితాకు చెందిన స్థలం, భవంతి టీసీఎస్‌కు దక్కనున్నాయి. వీటిని తమ డెలివరీ సెంటర్ కోసం కంపెనీ ఉపయోగించుకోనుంది. 2004లో ఏర్పాటైన దర్శితా సదరన్ ఇండియా హ్యాపీ హోమ్స్.. కమర్షియల్ ప్రాపర్టీని అభివృద్ధి చేయడం, పరిశ్రమలకు లీజుకివ్వడం తదితర కార్యకలాపాలు సాగిస్తోంది.

ఐపీవోకు క్రిజాక్ లిమిటెడ్ రెడీ

- సెబీ నుంచి తాజాగా గ్రీన్‌సిగ్నల్
- రూ. 1,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: విద్యార్థుల రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ల కంపెనీ క్రిజాక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐపీవోలో భాగంగా ప్రమోటర్లు పింకీ అగర్వాల్ రూ. 841 కోట్లు, మనీష్ అగర్వాల్ రూ. 159 కోట్లు చొప్పున ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవో కోసం కంపెనీ తొలుత 2024 మార్చిలో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే జులైలో సెబీ ప్రాస్పెక్టస్‌ను వెనక్కి పంపింది. ఆపై తిరిగి నవంబర్‌లో మరోసారి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది.

ఐకూ నుంచి నియో 10ఆర్ స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ: కాలేజీ విద్యార్థులు, టెక్నాలజీ ఔత్సాహికులు, యువ గేమర్ల కోసం రూపొందించిన నియో10ఆర్ స్మార్ట్‌ఫోన్‌ను ఐకూ ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ. 24,999గా ఉంటుంది. అమెజాన్, ఐకూ ఈ-స్టోర్లలో మార్చి 19 నుంచి అందుబాటులో ఉంటుంది. దీనికోసం ప్రీ-బుకింగ్స్ ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 8ఎస్ థర్డ్ జనరేషన్ చిప్‌సెట్, 6400 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.78 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 ప్రైమరీ కెమెరా, ఫన్‌టచ్ ఓఎస్ 15 తదితర ఫీచర్లు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-3-2025

విశాఖ	415-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	685	4.43
TATAMOTORS	668.15	3.1
KOTAKBANK	1,979.95	2.31
BAJFINANCE	8,515.45	2.1
ITC	412.55	1.56

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,590.05	-4.31
WIPRO	268.2	-3.44
TECHM	1,437.15	-2.84
NESTLEIND	2,197.00	-2.42
HCLTECH	1,537.60	-1.93

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,883
ఎన్ఎస్ఈ	85,532
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,57,176
ఎఫ్ఐఐ	- 1,628
డీఐఐ	+ 1,510

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.74 (రాత్రి 11.30కు)	$ 66.25 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.97 (రాత్రి 11.30కు)	$ 69.56 (క్రితం ముగింపు)

అంకురాల్లోకి 600 బిలియన్ డాలర్లు

వచ్చే 3 ఏళ్లలో ప్రత్యామ్నాయ పెట్టుబడులు • నిపుణుల అంచనాలు

న్యూఢిల్లీ: దేశీ అంకురాలు గణనీయంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్టార్టప్‌ల వ్యవస్థలోకి భారీగా పెట్టుబడులు రానున్నాయనే అంచనాలు నెలకొన్నాయి. వచ్చే మూడేళ్లలో 600 బిలియన్ డాలర్ల మేర ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్‌లాంటి (పీఈ/వీసీ) ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్లు వస్తాయని నిపుణులు భావిస్తున్నారు. కొత్త ఆవిష్కరణలను, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి, కొత్త వెంచర్లు మనుగడ సాగించేలా అనువైన పరిస్థితులు కల్పించడానికి ఇవి తోడ్పడనున్నాయి. 2027 ఆర్థిక సంవత్సరానికల్లా భారత్ 5 ట్రిలియన్ డాలర్ల స్థాయిని సాధించాలంటే కావాల్సిన పెట్టుబడుల్లో (ప్రభుత్వ పెట్టుబడులు, కార్పొరేట్ డెట్, పీఈ/వీసీ ఫండింగ్ మొదలైనవి) ఇది 13 శాతమని ఐఎంటీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ మార్కెట్స్ (సీఎఫ్ఎం) ప్రారంభ కార్యక్రమంలో నిపుణులు తెలిపారు. భారత అంకుర సంస్థల సామర్థ్యాలను ఇన్వెస్టర్లు గుర్తిస్తున్న నేపథ్యంలో స్టార్టప్‌ల వ్యాపారం తీరుతెన్నుల్లో గణనీయంగా మార్పులు రాగలవని ఐఎంటీ ఘాజియాబాద్ డైరెక్టర్ ఆశిష్ చటోపాధ్యాయ పేర్కొన్నారు. బీఎఫ్ఎస్ఐ నిపుణులకు డిమాండ్ పెరుగుతుండటంతో సీఎఫ్ఎంలో కోర్సులకు మంచి ఆదరణ ఉంటుందని వివరించారు. పరిశ్రమ అవసరాలపై ప్రధానంగా దృష్టి పెడుతూ రూపొందించిన సర్టిఫికేషన్లు, అనుభవపూర్వకమైన విధంగా ఉండే బోధన మొదలైన అంశాలు, విద్యార్థులు వివిధ నైపుణ్యాలను సాధించేందుకు ఉపయోగపడగలవని హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నవనీత్ మునోట్ తెలిపారు.



క్యూ2లో కొలువుల జోరు..

- ఏప్రిల్-జూన్ కాలానికి సానుకూలత
- 55 శాతం కంపెనీలు రెడీ...
- మ్యాన్‌పవర్‌గ్రూప్ సర్వేలో వెల్లడి



ముంబై: రానున్న త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) నియామకాలు బలంగా ఉండనున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే, భారత కంపెనీలు ఈ ఏడాది క్యూ2లో అధిక నియామకాలను చేపట్టే ఉద్దేశ్యంతో ఉన్నట్టు మ్యాన్‌పవర్ గ్రూప్ 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్ సర్వే'లో తెలిసింది. నికర నియామక ఉద్దేశం (ఎన్ఈవో) 43 శాతానికి చేరింది. అంతర్జాతీయంగా చూస్తే వచ్చే త్రైమాసికానికి ఇది సగటున 18 శాతమే ఉంది. 42 దేశాలకు చెందిన 40,413 కంపెనీల అభిప్రాయాలను ఈ సర్వే కోసం మ్యాన్‌పవర్ గ్రూప్ పరిగణనలోకి తీసుకుంది. జనవరి 2 నుంచి 31 వరకు సర్వే జరిగింది.

సర్వే ఫలితాలు..

- తాము ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కొత్త నియామకాలు చేపడతామని 55 శాతం కంపెనీలు తెలిపాయి. జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చితే నియామకాలు తగ్గుతాయని 12 శాతం కంపెనీలు చెప్పగా, తమ సిబ్బందిలో ఎలాంటి మార్పులు ఉండవని 29 శాతం కంపెనీలు సంకేతమిచ్చాయి. మరో 4 శాతం కంపెనీలు ఏమీ చెప్పలేమని పేర్కొన్నాయి.
- ఐటీ రంగంలో 55 శాతం, ఇండస్ట్రియల్ అండ్ మెటీరియల్స్ రంగంలో 48 శాతం, హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్‌లో 42 శాతం, రవాణా, లాజిస్టిక్స్, ఆటోమోటివ్‌లో 40 శాతం, కమ్యూనికేషన్ సర్వీసెస్‌లో 38 శాతం చొప్పున నియామకాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల కాలంతో పోల్చి చూస్తే పెరగనున్నట్టు సర్వే ఫలితాల ఆధారంగా తెలుస్తోంది.
- ఫైనాన్షియల్ అండ్ రియల్ ఎస్టేట్ రంగంలో 43 శాతం మేర నియామకాలు పెరగనున్నాయి. కానీ, జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చితే ఒక శాతం తక్కువ.
- ఎనర్జీ అండ్ యుటిలిటీస్‌లో 32 శాతం, కన్జ్యూమర్ గూడ్స్ అండ్ సర్వీసెస్‌లో 32 శాతం, చొప్పున నియామకాల ఉద్దేశ్యం కనిపించింది. క్యూ1 కంటే 6 పాయింట్లు, 8 పాయింట్ల మేర తగ్గడం గమనార్హం.
- దక్షిణాదిన 39 శాతం, ఉత్తరం, తూర్పు భారత్‌లో 47 శాతం, పశ్చిమాదిలో 47 శాతం మేర అధిక నియామకాలు వచ్చే క్వార్టర్‌లో చోటుచేసుకోనున్నాయి.
- సిబ్బందిని పెంచుకోవడానికి కార్యకలాపాల విస్తరణ ప్రధాన కారణంగా ఉంది.

వ్యాపార సంస్థల్లో విశ్వాసం..



నియామకాల ఉద్దేశ్యం జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చితే ఏప్రిల్-జూన్ క్వార్టర్‌కు బలపడింది. మారుతున్న ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొనటంలో భారత వ్యాపార సంస్థల విశ్వాసాన్ని ఇది తెలియజేస్తోంది. టెక్నాలజీ, ఇండస్ట్రియల్, ఫైనాన్షియల్ రంగంలో బలమైన నియామకాల ధోరణి కొనసాగుతుంది

– సందీప్ గులాటి, మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ

గృహ రుణాలు రూ.33.53 లక్షల కోట్లు

- 2024 సెప్టెంబర్ నాటికి
- తక్కువ, మధ్యాదాయ వర్గాలకే ఎక్కువ
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నివేదిక




న్యూఢిల్లీ: గృహ రుణాలు 2024 సెప్టెంబర్ నాటికి రూ.33.53 లక్షల కోట్లుగా ఉన్నట్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ప్రకటించింది. ఏడాది కాలంలో 14 శాతం మేర పెరిగినట్టు తెలిపింది. ఇందులో మధ్యాదాయ వర్గాలు (ఎంఐజీ) తీసుకున్నవే ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. దేశంలో హౌసింగ్ రంగంలో ధోరణులు, పురోగతిపై ఎన్‌హెచ్‌బీ ఒక నివేదిక విడుదల చేసింది. "2024 సెప్టెంబర్ నాటికి వ్యవస్థ వ్యాప్తంగా బాకీ ఉన్న వ్యక్తిగత గృహ రుణాల విలువలో తక్కువ ఆదాయ విభాగానికి (ఎల్ఐజీ) సంబంధించి 39 శాతం ఉంటే, ఎంఐజీ విభాగానికి 44 శాతంగా ఉన్నాయి. మరో 17 శాతం అధిక ఆదాయ వర్గాలు (హెచ్ఐజీ) చెల్లించాల్సినవి" అని ఎన్‌హెచ్‌బీ నివేదిక తెలిపింది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.9.07 లక్షల కోట్ల వ్యక్తిగత గృహ రుణాలు మంజూరు కాగా, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల్లో రూ.4.10 లక్షల కోట్లు జారీ అయినట్టు పేర్కొంది. బడ్జెట్‌లో పీఎం ఆవాయస్ యోజన 2.0పై చేసిన ప్రకటన, పట్టణీకరణ, డిజిటైజేషన్‌తో గృహ రంగానికి భవిష్యత్ సానుకూలంగా ఉంటుందని అంచనా వేసింది.

హెచ్ఎఫ్‌సీలు కీలక పాత్ర

గృహ కొనుగోలుదారుల విస్తృతమైన అవసరాలను తీర్చడంలో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్ఎఫ్‌సీలు) కీలక పాత్ర పోషించినట్టు ఎన్‌హెచ్‌బీ తెలిపింది. అర్హతల ప్రమాణాల్లో వెసులుబాట్లు, బలమైన కస్టమర్ సేవలు, మెరుగైన డాక్యుమెంటేషన్, తక్కువ సమయంలో ప్రాసెస్ చేయడం వంటివి హెచ్ఎఫ్‌సీలను మెరుగైన స్థానంలో నిలబెట్టాయని పేర్కొంది. సేవల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలకూ గృహ రుణాలను విస్తరించేందుకు ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు కృషి చేస్తున్నాయంటూ.. బ్యాంక్‌లు-హెచ్ఎఫ్‌సీల కోలెండింగ్ ఈ దిశగా తీసుకున్న చర్యగా ప్రస్తావించింది.

ప్రాంతీయంగా అసమానతలు

హౌసింగ్ రంగం బలమైన వృద్ధిని చూపించినప్పటికీ.. రుణాల మంజూరులో ప్రాంతాల మధ్య నెలకొన్న అంతరాలు హెచ్ఎఫ్‌సీలకు పెద్ద సవాలుగా ఎన్‌హెచ్‌బీ పేర్కొంది. "దక్షిణాది, పశ్చిమాది, ఉత్తరాది రాష్ట్రాల్లోనే అధిక శాతం గృహ రుణాలు మంజూరవుతున్నాయి. అదే సమయంలో తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో రుణాల జారీ తక్కువగా ఉంటోంది"అని నివేదిక వివరించింది. ఈశాన్య ప్రాంతంలో హెచ్ఎఫ్‌సీల శాఖల విస్తరణ తక్కువగా ఉంటున్నట్టు తెలిపింది. ఈ తారతమ్యాల తగ్గింపునకు చర్యలు కొనసాగుతాయని పేర్కొంది.



6.5 శాతం పైనే జీడీపీ వృద్ధి

- 2025-26 సంవత్సరానికి మూడీస్ అంచనా
- బ్యాంకింగ్ రంగానికి స్థిరమైన అవుట్‌లుక్

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి 2025-26 సంవత్సరంలో 6.5 శాతాన్ని మించుతుందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం మూడీస్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది 6.3%గా ఉంటుందన్నది మూడిస్ రేటింగ్స్ గత అంచనా. ప్రభుత్వం నుంచి అధిక మూలధన వ్యయాలు, పన్నుల తగ్గింపుతో పెరిగే వినియోగం, వడ్డీ రేట్ల తగ్గింపు ఇవన్నీ వృద్ధికి అనుకూలిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. భారత బ్యాంకింగ్ రంగం పట్ల స్థిరమైన దృక్పథాన్ని (స్టెబుల్ అవుట్‌లుక్) ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల నిర్వహణ వాతావరణం మెరుగ్గా ఉంటుందని పేర్కొంది. ఇటీవలి సంవత్సరాల్లో బ్యాంకుల రుణ ఆస్తుల నాణ్యత గణనీయంగా మెరుగుపడగా, మోస్తరుగా క్షీణించొచ్చని తెలిపింది. అన్ సెక్యూర్డ్, సూక్ష్మ రుణాల్లో (మైక్రోఫైనాన్స్) ఒత్తిళ్లను ప్రస్తావించింది. రేట్ల తగ్గింపు నేపథ్యంలో నికర వడ్డీ మార్జిన్లపై ప్రభావం పెద్దగా ఉండదని, బ్యాంకుల లాభదాయకత పటిష్టంగా ఉంటుందని అంచనా వేసింది. 2024 మధ్య నుంచి భారత వృద్ధి నిదానించగా, తిరిగి వేగాన్ని అందుకుంటుందని.. ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ 5.6%కి పడిపోగా, డిసెంబర్ క్వార్టర్‌లో తిరిగి 6.2%కి పుంజుకోవడం గమనార్హం. 2025-26లో సగటు ద్రవ్యోల్బణం 4.5%కి దిగొస్తుందని మూడీస్ పేర్కొంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ ఎంపీసీ రెపో రేటును పావు% తగ్గించడం తెలిసిందే. "అమెరికా వాణిజ్య విధానాలతో అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లో.. ఆర్‌బీఐ కాస్త అప్రమత్త ధోరణిని అనుసరించొచ్చు. దీంతో తదుపరి రేట్ల కోత మోస్తరుగా ఉండొచ్చు"అని మూడీస్ పేర్కొంది. 2025-26లో రుణాల వృద్ధి 11-13 శాతం మధ్య ఉండొచ్చని అంచనా వేసింది.

ఉచితాలతో పేదరికం పోదు

ఇన్ఫీ నారాయణ మూర్తి వ్యాఖ్యలు



ముంబై: ఉచిత పథకాలతో కాకుండా ఉద్యోగాల కల్పనతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు వినూత్న వ్యాపారాలను సృష్టించి, ఉద్యోగాలు కల్పిస్తే పేదరికం ఇట్టే మాయమైపోగలదని ఆయన చెప్పారు. టైకాన్ ముంబై 2025 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మూర్తి ఈ విషయాలు తెలిపారు. ఎంట్రప్రెన్యూర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 'మీలో ప్రతి ఒక్కరు వందలు, వేల కొద్దీ ఉద్యోగాలను కల్పించగలరనడంలో నాకెలాంటి సందేహం లేదు. పేదరిక సమస్యను ఆ విధంగానే పరిష్కరించగలం. ప్రపంచంలో ఏ దేశమూ ఉచితాలివ్వడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించిన దాఖలాల్లేవు' అని తెలిపారు. కొన్ని ఉచితాలు ఇచ్చినా వాటికి బదులుగా నిర్దిష్ట ప్రయోజనాలను రాబట్టే విధంగా అవి ఉండాలని పేర్కొన్నారు. ఉదాహరణకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తే, ఓ ఆరు నెలలు పోయాక ఆ ఇళ్లలోని పిల్లలు మరింత శ్రద్ధగా చదువుకుంటున్నారా, పిల్లలపై తల్లిదండ్రుల ఆసక్తి మరింత పెరిగిందాలాంటి అంశాలపై ప్రభుత్వం ఓ సర్వేలాంటిది చేయడం ద్వారా సదరు పథకం ప్రయోజనాలను మదింపు చేయొచ్చని మూర్తి చెప్పారు. మరోవైపు, రాజకీయాలు లేదా గవర్నెన్స్ గురించి తనకు పెద్దగా తెలియదని, కేవలం విధానాలపరంగా తీసుకోతగిన చర్యలను మాత్రమే సూచించానని ఆయన వివరణ ఇచ్చారు.

ఇన్ఫీలో శ్రుతి శిబూలాల్ పెట్టుబడి

29.84 లక్షల షేర్లు కొనుగోలు



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో ఎస్‌డీ శిబూలాల్ కుమార్తె శ్రుతి కంపెనీ షేర్లను కొనుగోలు చేశారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా 29.84 లక్షల షేర్లను సొంతం చేసుకున్నారు. ఇందుకు శ్రుతి శిబూలాల్ దాదాపు రూ. 470 కోట్లు వెచ్చించారు. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 1,574 సగటు ధరలో వీటిని కొనుగోలు చేశారు. ఎస్‌డీ శిబూలాల్ కుటుంబ సభ్యులలో ఒకరైన గౌరవ్ మన్‌చందా ఈ షేర్లను విక్రయించారు. కాగా.. మంగళవారం సైతం శ్రుతి శిబూలాల్ రూ. 494 కోట్ల విలువైన ఇన్ఫోసిస్ వాటాను కొనుగోలు చేయడం గమనార్హం!

ఇన్ఫోసిస్ షేరు ఎన్ఎస్ఈలో 4.3 శాతం పతనమై రూ. 1,590 వద్ద ముగిసింది.

మిత్సుబిషీ కోసం ఆజాద్ ఇంజినీరింగ్ తయారీ కేంద్రం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ఐ) కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆజాద్ ఇంజినీరింగ్ వెల్లడించింది. దీని విస్తీర్ణం 7,200 చ.మీ.గా ఉంటుంది. ఎంహెచ్ఐతో పలు దశాబ్దాల భాగస్వామ్యంలో ఇదొక మైలురాయని కంపెనీ చైర్మన్ రాకేష్ చోప్దార్ తెలిపారు. ప్రస్తుతం ఇందులో 200 మంది నిపుణులు ఉండగా, ఈ సంఖ్యను గణనీయంగా పెంచుకోనున్నట్లు పేర్కొన్నారు. తమ గ్యాస్, స్టీమ్ టర్బైన్‌లకు అవసరమైన కీలక ఉత్పత్తులను ఆజాద్ సరఫరా చేస్తున్నట్లు ఎంహెచ్ఐ ఎనర్జీ సిస్టం ఎస్‌వీపీ మసహిటో కెటవోకా వివరించారు. ఈ సందర్భంగా ఆజాద్ ఇంజినీరింగ్‌కు ప్రతిష్టాత్మక పార్టనర్ ఆఫ్ ది ఇయర్ 2024 సర్టిఫికెట్, ట్రోఫీని అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్విక్ కామర్స్‌లో.. 5.5 లక్షలకు కొలువులు

- వచ్చే ఏడాదిలో టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా
- హబ్‌లుగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ



ముంబై: వేగంగా వృద్ధి చెందుతున్న దేశీ క్విక్-కామర్స్ రంగం త్వరలో 5 బిలియన్ డాలర్లకు చేరనున్న నేపథ్యంలో వచ్చే ఏడాదిలో ఈ విభాగంలో సిబ్బంది సంఖ్య 5 - 5.5 లక్షల మందికి చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం క్యూ-కామర్స్ రంగంలో 2.5 - 3 లక్షల మంది ఔట్‌డోర్ డెలివరీ పార్ట్‌నర్స్, 70,000-75,000 మంది ఉద్యోగులు (క్లరికల్, ఆఫీస్ వర్కర్లు మొదలైనవారు) ఉన్నారు. టీమ్‌లీజ్ సర్వీసెస్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 'భారతీయ క్యూ-కామర్స్ మార్కెట్ అసాధారణమైన వేగంతో వృద్ధి చెందుతోంది. వార్షికంగా 10-15 శాతం వృద్ధి రేటుతో 2025 నాటికి 5 బిలియన్ డాలర్లకు చేరనుంది. వివిధ రకాల ఉత్పత్తులు, నగరాల సంఖ్యతో పాటు అమ్మకాల పరిమాణం పెరుగుతుండటంతో లాస్ట్ మైల్ డెలివరీ, డార్క్ స్టోర్స్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ మొదలైన విభాగాల సిబ్బందికి డిమాండ్ నెలకొంది' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ సీనియర్ వీపీ బాలసుబ్రమణియన్ తెలిపారు.

అట్రిషన్ అధికం..

అట్రిషన్ (ఉద్యోగుల వలసలు) రేటు చాలా అధికంగా ఉన్నందున, సిబ్బందికి నైపుణ్యాలు కల్పించడంపైన, ఉద్యోగులను అట్టిపెట్టుకోవడానికి తగిన వ్యూహాలపైన, ఏఐ ఆధారిత సిబ్బంది నిర్వహణ మొదలైన వాటికి వ్యాపార సంస్థలు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. 2024 జనవరి నుంచి డిసెంబర్ మధ్యకాలంలో 19,000 మంది పైచిలుకు టీమ్‌లీజ్ అసోసియేట్స్ సేకరించిన డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం క్యూ-కామర్స్ ఉద్యోగాలకు కర్ణాటక (20 శాతం), మహారాష్ట్ర (19 శాతం), తెలంగాణ (13 శాతం) పెద్ద హబ్‌లుగా ఉంటున్నాయి. పరిశ్రమలో ఎంట్రీ లెవెల్ సిబ్బంది ఎక్కువగా ఉండగా, వీరిలో 71 శాతం మందికి 10 లేదా 12వ గ్రేడ్ విద్యార్హతలు ఉంటున్నాయి. తీవ్రమైన పోటీ, తరచుగా ఉద్యోగాలు మారిపోవడం వంటి అంశాల కారణంగా అట్రిషన్ రేటు అత్యధికంగా ఉండటం వల్ల పరిశ్రమ తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటోందని నివేదిక వివరించింది. దీన్ని అధిగమించడానికి పరిశ్రమ తమ సిబ్బందికి శిక్షణనివ్వడంపై, ఉద్యోగులు వెళ్లిపోకుండా అట్టిపెట్టుకునే వ్యూహాలపై కంపెనీలు ఇన్వెస్ట్ చేస్తున్నాయని పేర్కొంది.

లధానీ గ్రూప్ భారీ పెట్టుబడులు

ఐదేళ్లలో రూ. 11,000 కోట్లకు రెడీ

న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం కోకకోలాకు దేశీయంగా అతిపెద్ద బాట్లింగ్ కంపెనీగా వ్యవహరిస్తున్న లధానీ గ్రూప్ భారీ పెట్టుబడులకు తెరతీస్తోంది. రానున్న ఐదేళ్లలో రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ప్రణాళికలు వేసింది. కంపెనీ కార్యకలాపాలు విస్తరించిన ఆతిథ్యం, కెమికల్స్ తదితరాల రంగాలలో పెట్టుబడులు వెచ్చించనుంది. ప్రధానంగా గ్రూప్‌లోని ప్రధాన కంపెనీ ఎస్ఎల్ఎంజీ బెవరేజెస్‌కు రూ. 8,000 కోట్లు కేటాయించనుంది. తద్వారా కోకకోలా బాట్లింగ్ ఫ్రాంచైజీను మరింత విస్తరించనుంది. ఇందుకు ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కొత్తగా యూనిట్లను ఏర్పాటు చేయనుంది. గ్లోబల్‌స్థాయిలో ఎస్ఎల్ఎంజీ బెవరేజెస్ టాప్-15 బాట్లింగ్ కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. దీనిలో భాగంగా భారత్‌సహా విదేశాలలో ఫ్రాంచైజీ అవకాశాలకు సిద్ధపడుతున్నట్లు కంపెనీ జేఎండీ పరితోష్ లధానీ పేర్కొన్నారు.

60 కోట్ల మందికి ఫోన్‌పే



న్యూఢిల్లీ: నమోదిత వినియోగదారుల సంఖ్య 60 కోట్లు దాటిందని ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే తెలిపింది. 4 కోట్ల మందికిపైగా వర్తకులు ఫోన్‌పే వేదికగా కస్టమర్ల నుంచి డిజిటల్ చెల్లింపులను అందుకుంటున్నారు. 10 సంవత్సరాల ప్రయాణంలో కంపెనీ తన కార్యకలాపాలను వెల్త్ మేనేజ్‌మెంట్, పిన్‌కోడ్ ద్వారా ఈ-కామర్స్ రంగంలోకి ప్రవేశించింది. 2023లో జరిగిన చివరి నిధుల సమీకరణ రౌండ్‌లో కంపెనీని 12 బిలియన్ డాలర్లుగా విలువ కట్టారు. ఫోన్‌పే డిజిటల్ చెల్లింపుల యాప్ 2016 ఆగస్టులో ప్రారంభమైంది. 2024 మార్చి నాటికి సంస్థ ఖాతాలో నమోదిత వినియోగదారులు దాదాపు 53 కోట్ల మంది ఉన్నారు. ఫోన్‌పే రోజుకు 33 కోట్లకు పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తోంది. వార్షికంగా వీటి మొత్తం చెల్లింపుల విలువ రూ.150 లక్షల కోట్లకుపైగా ఉంటుందని సంస్థ వెల్లడించింది.

ఫైనల్ చేరేదెవరో!

- గుజరాత్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ ఢీ
- రాత్రి గం. 7:30 నుంచి నుంచి 'స్టార్ స్పోర్ట్స్', జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

నేడు డబ్ల్యూపీఎల్ ఎలిమినేటర్


ఆష్లీ గార్డ్‌నర్, హర్మన్‌ప్రీత్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. గురువారం జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ ఆడనుంది. తాజా సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ముంబై జట్టునే విజయం వరించగా... ముచ్చటగా మూడోసారి కూడా గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై జట్టు భావిస్తోంది. మరోవైపు ఆష్లీ గార్డ్‌నర్ కెప్టెన్సీలోని గుజరాత్ జెయింట్స్ జట్టు తొలిసారి ఫైనల్ చేరాలని తహతహలాడుతోంది. లీగ్ దశలో ఆడిన 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో నిలిచింది. ముంబై ఇండియన్స్ కూడా 5 మ్యాచ్‌లు నెగ్గినప్పటికీ రన్‌రేట్‌లో ముంబై కంటే మెరుగ్గా ఉన్న ఢిల్లీ జట్టు నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టుకు ఇది వరుసగా మూడో ఫైనల్ కావడం విశేషం. మరోవైపు 4 విజయాలతో 8 పాయింట్లు సాధించి గుజరాత్ జెయింట్స్ జట్టు ఎలిమినేటర్‌కు చేరింది. మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో పటిష్టంగా కనిపిస్తోంది. సొంతగడ్డపై మ్యాచ్ ఆడనుండటం హర్మన్‌ప్రీత్ బృందం బలాన్ని మరింత పెంచుతోంది. హేలీ మాథ్యూస్, నాట్ సివర్ బ్రంట్, అమేలియా కెర్, హర్మన్‌ప్రీత్ కౌర్, అమన్‌జ్యోత్ కౌర్, సజన, యస్తిక భాటియా రూపంలో ముంబై జట్టుకు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉంది. ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలు ఇస్తున్న హేలీ మాథ్యూస్... బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు తీస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇక బ్యాటింగ్‌లో సివర్ బ్రంట్ ఫుల్ ఫామ్ చాటుకుంటోంది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన సివర్... 416 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా కొనసాగుతోంది. ఇందులో 4 అర్ధ శతకాలు ఉన్నాయి. ఇరు జట్ల మధ్య చివరగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ విజృంభించింది. మిడిలార్డర్‌లో ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగి జట్టు భారీ స్కోరుకు బాటలు వేసింది. బౌలింగ్‌లో షబ్నిమ్ ఇస్మాయిల్, హేలీ మాథ్యూస్, సివర్ బ్రంట్, పారుణిక, అమేలియా, సంస్కృతి, అమన్‌జ్యోత్ కీలకం కానున్నారు. మరోవైపు ఈ సీజన్‌లో ముంబైతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన గుజరాత్... వాటికి బదులు తీర్చుకోవాలని భావిస్తోంది. ఆష్లీ గార్డ్‌నర్, బెత్ మూనీ, లిచ్‌ఫీల్డ్, డియాండ్రా డాటిన్, హర్లీన్ డియోల్ కలిసికట్టుగా కదంతొక్కాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. గత మ్యాచ్‌లో భారీ షాట్లతో ముంబైని వణికించిన భారతి ఫూల్‌మాలి నుంచి అదే తరహా మెరుపులు కొనసాగాలని కోరుకుంటోంది. బౌలింగ్‌లో డాటిన్, తనుజ, కాశ్వి, ప్రియ, మేఘన కీలకం కానున్నారు.



రోహిత్... పైపైకి!

మూడో ర్యాంక్‌లో భారత కెప్టెన్

- టాప్-10లో నలుగురు భారత క్రికెటర్లు
- శుబ్‌మన్ గిల్ అగ్రస్థానం పటిష్టం
- ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఎగబాకాడు. చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ ఫైనల్లో చక్కటి ఇన్నింగ్స్‌తో భారత జట్టుకు మూడోసారి ట్రోఫీ దక్కడంలో కీలకపాత్ర పోషించిన రోహిత్ శర్మ తాజా ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి చేరాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తుదిపోరులో అర్ధశతకంతో ఆకట్టుకున్న రోహిత్ రెండు ర్యాంక్‌లు మెరుగు పర్చుకొని 756 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. భారత యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (784 పాయింట్లు) ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... టాప్-10లో మొత్తం నలుగురు భారత ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. చాంపియన్స్ ట్రోఫీలో 218 పరుగులు చేసి ఆకట్టుకున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (736 పాయింట్లు) ఒక స్థానం కోల్పోయి 5వ ర్యాంక్‌లో నిలవగా... మిడిలార్డర్‌లో కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్ (704 పాయింట్లు) 8వ ర్యాంక్‌లో స్థిరంగా కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్ ప్లేయర్ రచిన్ రవీంద్ర 14 స్థానాలు ఎగబాకి 14వ ర్యాంక్‌కు చేరగా... డారిల్ మిషెల్ ఒక స్థానం మెరుగు పర్చుకొని ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ (650 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి భారత్ తరఫున అత్యుత్తమంగా మూడో ర్యాంక్‌లో నిలిచాడు. రవీంద్ర జడేజా (616 పాయింట్లు) కూడా మూడు స్థానాలు మెరుగు పరుచుకొని పదో ర్యాంక్‌కు చేరాడు. న్యూజిలాండ్ సారథి సాంట్నర్ (657 పాయింట్లు) రెండో ర్యాంక్‌కు చేరగా... శ్రీలంక ఆఫ్ స్పిన్నర్ తీక్షణ (680 పాయింట్లు) 'టాప్' ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో భారత్ నుంచి రవీంద్ర జడేజా (10వ ర్యాంక్) ఒక్కడే టాప్-10లో కొనసాగుతున్నాడు.

భారత్ ఆడకుంటే రూ.45 కోట్ల నష్టం!

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్

లండన్: భారత జట్టు వరుసగా రెండుసార్లు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌లలో ఆడింది. 2021లో న్యూజిలాండ్ చేతిలో ఓడగా... 2023లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. 2025 ఫైనల్‌కు మాత్రం అర్హత సాధించడంలో టీమిండియా విఫలమైంది. ఈసారి జూన్‌లో లార్డ్స్ మైదానంలో జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. అయితే భారత్ ఫైనల్లో లేకపోవడం మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తున్న మెరిలిబోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ)పై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపనుంది. ఎంసీసీ ఏకంగా 40 లక్షల పౌండ్లు (సుమారు రూ.45 కోట్లు) నష్టపోనుందని సమాచారం. భారత్ ఫైనల్ చేరుకుంటుందనే గట్టి నమ్మకంతో ఎంసీసీ మ్యాచ్ టికెట్ రేట్లను భారీగా పెంచగా, ఇప్పుడు వాటిని తగ్గించాల్సి వస్తోంది. దాంతో పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోనుంది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు వరకు కూడా భారత్ సునాయాసంగా ఫైనల్ చేరుతుందని అంతా భావించారు. కివీస్ చేతిలో 0-3తో ఓటమితో అంతా మారిపోయి రేసులో టీమిండియా వెనుకబడిపోయింది. భారత్ ఫైనల్ చేరే అవకాశం ఉన్న సమయంలో పెట్టిన గరిష్ట టికెట్ ధరకంటే కనీసం 50 పౌండ్లు తగ్గించి అమ్మాల్సి వస్తోంది. ఇదంతా కూడా ఎంసీసీ ఆదాయానికి గండి కొడుతోంది. గత ఏడాది లార్డ్స్‌లో ఇంగ్లండ్, శ్రీలంక మధ్య జరిగిన టెస్టుకు టికెట్ రేట్ భారీగా ఉండటంతో కేవలం 9 వేల మంది హాజరయ్యారు. దాంతో ఎంసీసీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం కాస్త అందుబాటులో ఉంటే టికెట్లను ఉంచాల్సి వస్తోంది.

గిల్ మూడోసారి...

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపికైన భారత బ్యాటర్

దుబాయ్: భారత యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఫిబ్రవరి నెలకుగాను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. గత నెలలో ఐదు వన్డేలు ఆడిన గిల్ 101.50 సగటు, 94.19 స్ట్రయిక్ రేట్‌తో 406 పరుగులు చేశాడు. ఈ పురస్కారం కోసం ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్, న్యూజిలాండ్ ప్లేయర్ గ్లెన్ ఫిలిప్స్‌తో పోటీపడి గిల్ విజేతగా నిలిచాడు. గత నెలలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో గిల్ వరుసగా 87, 60, 112 పరుగులు చేశాడు. ఫలితంగా టీమిండియా 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేయగా... అనంతరం ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ గిల్ అదే జోరు కొనసాగించాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి పోరులో అజేయ సెంచరీ (101 నాటౌట్) చేసిన అతడు... దాయాది పాకిస్తాన్‌పై 46 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇటీవల ఫార్మాట్‌తో సంబంధం లేకుండా నిలకడగా రాణిస్తున్న గిల్... చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు వైస్‌కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు దక్కించుకోవడం గిల్‌కు ఇది మూడోసారి. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్‌లోనూ గిల్ ఈ పురస్కారం దక్కించుకున్నాడు. అత్యధికంగా మూడుసార్లు ఈ అవార్డుకు ఎంపికైన భారత క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో బుమ్రా (2024 జూన్, డిసెంబర్) రెండుసార్లు ఈ అవార్డు దక్కించుకోగా... రిషభ్ పంత్ (2021 జనవరి), రవిచంద్రన్ అశ్విన్ (2021 ఫిబ్రవరి), భువనేశ్వర్ కుమార్ (2021 మార్చి), శ్రేయస్ అయ్యర్ (2022 ఫిబ్రవరి), విరాట్ కోహ్లి (2022 అక్టోబర్), యశస్వి జైస్వాల్ (2024 ఫిబ్రవరి) ఒక్కోసారి ఈ పురస్కారం పొందారు.



తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీజ, మనిక





చోంగ్‌కింగ్ (చైనా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టూర్‌లో భాగంగా చోంగ్‌కింగ్ చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. బరిలో దిగిన భారత నంబర్‌వన్ మనిక బత్రా, భారత రెండో ర్యాంకర్ ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ 28వ ర్యాంకర్ మనిక బత్రా 8-11, 6-11, 7-11తో ప్రపంచ 40వ ర్యాంకర్ డూ హోయ్ కెమ్ (హాంకాంగ్) చేతిలో... ప్రపంచ 29వ ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి శ్రీజ 4-11, 8-11, 6-11తో ప్రపంచ 8వ ర్యాంకర్ సత్సుకి ఒడో (జపాన్) చేతిలో ఓడిపోయారు. డూ హోయ్ కెమ్‌తో మ్యాచ్‌లో మనిక సొంత సర్వీస్‌లో 16 పాయింట్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో ఓడిన మనిక, శ్రీజలకు 8000 డాలర్ల (రూ. 6 లక్షల 97 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

వైశాలికి రజతం

పట్నా: జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి బడ్డి వైశాలి రజత పతకం సాధించింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో వైశాలి రెండో స్థానంలో నిలిచింది. వైశాలి మొత్తం 4224 పాయింట్లు స్కోరు చేసింది. 'ద్రోణాచార్య' అవార్డు గ్రహీత, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కోచ్ నాగపురి రమేశ్ వద్ద వైశాలి శిక్షణ తీసుకుంటోంది. అనామిక అజేశ్ (కేరళ; 4270 పాయింట్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... హర్షిత (కర్ణాటక; 4128 పాయింట్లు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది.



ఐఓసీ పీఠం ఎవరిదో?


అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్న అభ్యర్థులు డేవిడ్ లాపర్టియెంట్, క్రిస్టీ కొవెంట్రీ, యువాన్ ఆంటోని సమరాంచ్, ఫైజల్ అల్ హుసేన్, మెరినరి వతనబె, జోహన్ ఎలియాష్, సెబాస్టియన్ కోలతో ప్రస్తుత అధ్యక్షుడు థామస్ బాచ్ (ఎడమ వైపు నుంచి నాలుగో వ్యక్తి)

బరిలో ఏడుగురు అభ్యర్థులు

- క్రిస్టీ కొవెంట్రీ, సెబాస్టియన్ కో, సమరాంచ్ మధ్య అసలు పోరు
- ఈ నెల 18 నుంచి 21 వరకు ఎన్నికలు

లుసానే: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష ఎన్నికకు సమయం ఆసన్నమైంది. ప్రస్తుత అధ్యక్షుడు థామస్ బాచ్ (జర్మనీ) పదవీకాలం ముగియనుండటంతో... చైర్మన్ పదవి కోసం ఎన్నిక జరగనుంది. అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడానికి మొత్తం ఏడుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. వివిధ క్రీడా సమాఖ్యల్లో కీలక పదవులు నిర్వర్తిస్తున్న విశేష అనుభవం ఉన్నవారు పోటీలో ఉండటంతో ఎన్నిక రసవత్తరంగా మారింది. ఐఓసీలోని మొత్తం 109 మంది సభ్యులు 'రహస్య బ్యాలెట్' పద్ధతిలో ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు. అధ్యక్షుడి పదవీ కాలం 8 సంవత్సరాలు కాగా... నాలుగేళ్లకోసారి పునరుద్ధరించే అవకాశం ఉంది. ఈ ఎన్నికను ఎగ్జిక్యూటివ్ బోర్డు పర్యవేక్షిస్తుంది. ఈ నెల 18 నుంచి 21 మధ్య గ్రీస్‌లో ఓటింగ్ జరగనుంది. ప్రస్తుత చైర్మన్ థామస్ బాచ్ పదవీకాలం అధికారికంగా జూన్ 23తో ముగియనుంది.

→ ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో ఐఓసీ అధ్యక్ష రేసులో ముందు వరుసలో ఉన్నాడు. బ్రిటన్‌కు చెందిన సెబాస్టియన్‌కు క్రీడా పరిపాలన రంగంలో విశేష అనుభవం ఉంది.

→ ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యురాలు క్రిస్టీ కొవెంట్రీ కూడా అధ్యక్ష పీఠంపై కన్నేసింది. జింబాబ్వేకు చెందిన 41 ఏళ్ల ఈ ప్రఖ్యాత స్విమ్మర్ ప్రస్తుతం జింబాబ్వే కేబినెట్‌లో క్రీడా శాఖ మంత్రిగా పనిచేస్తోంది. ఒలింపిక్స్‌లో ఏడు పతకాలు సాధించిన క్రిస్టీ కొవెంట్రీ విజయంపై ధీమాగా ఉంది.

→ అంతర్జాతీయ స్కీయింగ్, స్నోబోర్డ్ సమాఖ్య అధ్యక్షుడు జోహన్ ఎలియాష్ కూడా పోటీలో ముందున్నారు. బ్రిటన్, స్వీటన్ కేంద్రంగా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎలియాస్... ప్రకృతి ప్రేమికుడిగా, పర్యావరణ పరిరక్షకుడిగా కూడా సుపరిచితుడే.

→ ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడిగా ఉన్న జోర్డాన్ యువరాజు ఫైజల్ అల్ హుసేన్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. యుద్ధ విద్యల్లో మంచి అనుభవం ఉన్న ఫైజల్ ఇప్పుడు క్రీడా పరిపాలనలోనూ తనదైన ముద్ర వేయాలని భావిస్తున్నారు.

→ అంతర్జాతీయ సైక్లింగ్ చీఫ్ డేవిడ్ లాపర్టియెంట్, అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్య అధ్యక్షుడు మెరినరి వతనబె కూడా చైర్మన్ పదవి కోసం పోటీ పడుతుండగా... ప్రస్తుతం ఐఓసీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న యువాన్ ఆంటోనీ సమరాంచ్ జూనియర్ అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకున్నాడు. పరిపాలనలో విశేష అనుభవం ఉన్న స్పెయిన్‌కు చెందిన ఈ సీనియర్ ఉపాధ్యక్షుడు... చైర్మన్‌గా తనకు మద్దతు కూడగట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

→ కొత్తగా ఎన్నిక కానున్న ఐఓసీ అధ్యక్షుడి ముందు క్రీడల్లో కృత్రిమ మేధ వినియోగం... డిజిటల్ మాధ్యమాల ద్వారా యువతను భాగం చేయడం. మారుతున్న వాతావరణ పరిస్థితులకు తగ్గట్లు ప్రణాళికలు రచించడం... క్రీడారంగంలో మహిళలకు పెద్దపీట వేయడం వంటి పలు సవాళ్లు ఉన్నాయి.

→ జింబాబ్వేకు చెందిన క్రిస్టీ కొవెంట్రీని చైర్మన్‌గా ఎంపిక చేయాలని ప్రస్తుత అధ్యక్షుడు థామస్ బాచ్ భావిస్తున్నాడు. అయితే ఐఓసీ సీనియర్ ఉపాధ్యక్షుడు యువాన్ సమరాంచ్, ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో కూడా పీఠం అధిరోహించాలని పట్టుదలతో ఉన్నారు.

→ ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు... విశ్వక్రీడల భవిష్యత్తును నిర్మించనున్నారు. ఆటల ఎంపిక, నిర్వహణ పద్ధతి, అథ్లెట్ల సంక్షేమం, వేదికల ఏర్పాటు ఇలా లెక్కకు మిక్కిలి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

→ 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేపథ్యంలో ఐఓసీ అధ్యక్ష ఎన్నికపై మన దగ్గర కూడా ఆసక్తి నెలకొంది.



దోల్‌జాతర- హోలీ మిలన్ ఉత్సవంలో బుధవారం దాండియా నృత్యం చేస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ



బెంగాల్‌లోని నదియాలో గులాల్‌తో రంగోలీ ఆడుతున్న మహిళలు



త్రిపురలోని అగర్తలాలో గులాల్‌తో యువతుల హోలీ సంబరాలు

300 ఏళ్ల కులవివక్షకు ముగింపు

బెంగాల్‌లోని గిద్దేశ్వర్ శివాలయంలోకి ప్రవేశించిన దళితులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఓ గ్రామంలో మూడు దశాబ్దాల కులవివక్షకు దళితులు ముగింపు పలికారు. 300 ఏళ్ల తరువాత 130 దళిత కుటుంబాలు తమ ఇష్టదైవం ఆలయంలోకి ప్రవేశించాయి. పూర్బా బర్ధమాన్ జిల్లాలోని గిద్దేశ్వర్ శివాలయం ఈ చారిత్రాత్మక సన్నివేశానికి వేదికైంది. కత్వా సబ్ డివిజన్‌లోని గిద్‌గ్రామ్ గ్రామంలోని దస్పార ప్రాంతానికి చెందిన ఐదుగురు సభ్యుల బృందం బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆలయం మెట్లు శివలింగంపై పాలు, నీరు పోసి మహదేవునికి అభిషేకం చేశారు. దాస్ ఇంటి పేర్లు కలిగిన దళిత కుటుంబాలు చెప్పులు కుట్టడం, నేత సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయి. అయితే స్థానికంగా ఉన్న గిద్దేశ్వర్ శివాలయం 300 ఏళ్ల కిందట స్థాపించారు. అప్పటి నుంచి వీరికి ఆలయంలోకి ప్రవేశం లేదు. శివుడిని పూజించేందుకు అనుమతించాలని మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా కూడా వారు పూజలు చేయడానికి ప్రయత్నించగా వారిని ఆలయ ప్రాంగణం నుంచి తరిమివేశారు. అంతేకాదు దాదాపు గ్రామ బహిష్కరణ చేశారు. వారికి నిత్యావసర వస్తువులు అమ్మడంతో పాటు వారి నుంచి పాలవంటివి కొనడం మానేశారు. దీంతో దళితులు స్థానిక యంత్రాంగం, పోలీసుల సహాయం కోరారు. దస్పారా గ్రామస్తులతో పలుమార్లు చర్చలు జరిపిన పోలీసులు.. సమస్యను పరిష్కరించారు. అంతేకాదు దళితుల నుంచి పాలను కూడా సేకరించాలని పాలకేంద్రాలను పోలీసులు ఆదేశించారు. అలా యంత్రాంగం, పోలీసుల జోక్యంతో వందల ఏళ్ల అణచివేతను ఎదిరించిన దళితులు బుధవారం ఆలయంలో పూజలు చేశారు. పూజలు చేసే హక్కు లభించినందుకు సంతోషంగా ఉందని, అందరూ బాగుండాలని దేవుడిని కోరుకున్నానని సంతోష్ దాస్ అనే వ్యక్తి తెలిపారు. అయితే ఈ సంతోషం తాత్కాలికమా? దీర్ఘకాలికమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసులు, యంత్రాంగం ఉండగా కిమ్మనకుండా ఉన్న గ్రామస్తులు.. వాళ్లు వెళ్లిపోయాక కూడా తమను అనుమతిస్తారా? అని దళితులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. వారి సందేహాలకు ఊతమిస్తూ ఆలయ సేవకుడు సనత్ మండల్ మాత్రం ఈ నిర్ణయాన్ని విముఖతతోనే అంగీకరించారు. ఆలయంలోకి దళితులు ప్రవేశిస్తే ఆలయ పురాతన సంప్రదాయాలు, స్వచ్ఛత, పవిత్రత పెద్ద ప్రశ్నలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆలయంలోకి దళితుల ప్రవేశంతో పెద్ద ప్రతిష్టంభన తొలగిందని ఇది స్వాగతించాల్సిన విషయమని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అపూర్వ ఛటర్జీ అన్నారు.



గిద్దేశ్వర్ శివాలయంలో పూజలు చేసి వస్తున్న దళిత కుటుంబాలు

సెంట్రల్ వర్సిటీల్లో 5,400 అధ్యాపక ఖాళీలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీల్లో 5,400 పైచిలుకు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం బుధవారం రాజ్యసభలో తెలిపింది. ఇందులో సగం పోస్టులు ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసినవని వెల్లడించింది. ఓబీసీ కేటగిరీలో 1,521 పోస్టులు, ఎస్సీ కేటగిరిలో 788 పోస్టులు, ఎస్టీ కేటగిరిలో 472 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ప్రత్యేక నియామక డ్రైవ్‌ల ద్వారా సెంట్రల్ యూనివర్సిటీల్లో 7,825 అధ్యాపక పోస్టులను భర్తీ చేశామని విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. రిటైర్‌మెంట్లు, రాజీనామాల కారణంగా ఖాళీలు ఏర్పడుతున్నాయని, విద్యార్థుల సంఖ్యను పెంచడం వల్ల కూడా కొత్త అధ్యాపకులు అవసరమవుతున్నారని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా నియామకాలు చేపట్టాలని సెంట్రల్ వర్సిటీలను ఆదేశించామని మజుందార్ తెలిపారు.

లాట్ సాహెబ్‌కు పటిష్ట బందోబస్తు

ఈసారి ఒకేరోజు హోలీ, రంజాన్ ప్రార్థనలు

షాజహాన్‌పూర్/అయోధ్య: ఈ ఏడాది హోలీ పండుగ, రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ఒకేరోజు శుక్రవారం వస్తున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్తరప్రదేశ్ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. షాజహాన్‌పూర్‌లో హోలీ సందర్భంగా 'లాట్ సాహెబ్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం శతాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఎద్దుల బండిపై లాట్ సాహెబ్ అనే బ్రిటిష్ పాలకుడి బొమ్మను ఏర్పాటు చేస్తారు. దానిపై జనం చెప్పులు విసురుతారు. షాజహాన్‌పూర్ వీధుల్లో ఈ బండిని ఊరేగిస్తారు. ఊరేగింపు జరిగే మార్గంలో మసీదులను బయటకు కనిపించకుండా టార్పలీన్‌తో పూర్తిగా కప్పివేయాలని అధికారులు నిర్ణయించారు. అలాగే భారీ బందోబస్తు ఏర్పాటు చేయబోతున్నారు. ఊరేగింపు జరిగే మార్గంలో బారికేడ్లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. హోలీ, రంజాన్ ప్రార్థనల నేపథ్యంలో మత విద్వేషాలు సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. హోలీ రోజు నగరంలో మొత్తం 18 లాట్ సాహెబ్ ప్రదర్శనలు జరుగుతాయి. మరో విశేషం ఏమిటంటే.. లాట్ సాహెబ్ బొమ్మ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకోగానే అక్కడి పోలీసులు సెల్యూట్ చేస్తారు. లంచంగా కొంత నగదు అందజేస్తారు. షాజహాన్‌పూర్‌లో 1728 నుంచి లాట్ సాహెబ్ కార్యక్రమం జరుగుతున్నట్లు ఆధారాలున్నాయి. బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకిస్తూ ఈ సంప్రదాయం మొదలైనట్లు స్థానికులు చెప్పారు. దీన్ని నిలిపివేయాలని 1990వ దశకంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కానీ, హైకోర్టు వాటిని తిరస్కరించింది. రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్ వంటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు షాజహాన్‌పూర్‌లోనే జన్మించారు.

అయోధ్యలో మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ప్రార్థనలు

అయోధ్యలోని అన్ని మసీదుల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ముస్లింలు ప్రార్థనలు చేసుకోవాలని మత పెద్ద మొహమ్మద్ హనీఫ్ బుధవారం సూచించారు. ఆ రోజు జరిగే హోలీ వేడుకలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా జుమా నమాజ్ ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల దాకా జుమా నమాజ్ చేసుకోవచ్చని మొహమ్మద్ హనీఫ్ వెల్లడించారు. హోలీ రోజు ముస్లింలు సహనంతో వ్యవహరించాలని, ఎవరైనా రంగులు చల్లితే చిరునవ్వుతో ప్రతిస్పందించాలని, హోలీ శుభాకాంక్షలు చెప్పాలని కోరారు. సోదరభావాన్ని చాటడానికి ఇదొక చక్కటి అవకాశమని అన్నారు.

సైబర్ నేరాలు మూడింతలు పెరిగాయి

న్యూఢిల్లీ: 2022తో పోలిస్తే 2024లో డిజిటల్ అరెస్టులు, సంబంధిత సైబర్ ఆర్థిక నేరాలు మూడింతలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం బుధవారం రాజ్యసభకు తెలిపింది. సైబర్ నేరాలకు జనం మోసపోయిన సొమ్ము ఏకంగా 21 రెట్లు పెరిగిందని ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 2022లో 39,925 సైబర్ నేరాలు నమోదు కాగా.. జనం కోల్పోయిన సొమ్ము రూ. 91 కోట్లుగా ఉందని వివరించారు. 2024కు వచ్చేసరికి నేరాలు మూడింతలై 1,23,672 చేరాయని తెలిపారు. ప్రజలు నష్టపోయిన సొమ్ము రూ. 1,935.51 కోట్లని చెప్పారు. ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 17,718 సైబర్ నేరాల కేసులు నమోదు కాగా జనం రూ. 210 కోట్లు నష్టపోయారని వివరించారు.

డూప్లికేట్ ఓటర్ ఐడీలపై చర్చ

రాజ్యసభలో తృణమూల్ డిమాండ్

న్యూఢిల్లీ: డూప్లికేట్ ఓటర్ ఐడీ కార్డు నంబర్లపై పార్లమెంటులో చర్చ జరిగి తీరాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. ఆ పార్టీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ బుధవారం ఈ అంశాన్ని రాజ్యసభలో లేవనెత్తారు. దీన్ని 176వ నిబంధన కింద సభాపతి వచ్చే వారం చర్చకు స్వీకరించాలని డిమాండ్ చేశా రు. విపక్ష పార్టీలన్నీ దీనిపై లోతైన చర్చకు ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేసినట్టు గుర్తు చేశారు. 176వ నిబంధన కింద ఏ సభ్యుడైనా ప్రజాప్రయోజన అంశాన్ని అత్యవసర చర్చ నిమిత్తం సభలో లేవనెత్తవచ్చు. ఇతర సభ్యులు కూడా చర్చలో పాల్గొన్నాక చివరగా సంబంధిత మంత్రి బదులిస్తారు. దేశమంతటా ఎన్ని డూప్లికేట్ ఓటరు కార్డులున్నాయో కేంద్ర ఎన్నికల సంఘం లెక్కలు తీయాలని ఆర్జేడీ సభ్యుడు మనోజ్‌కుమార్ ఝా డిమాండ్ చేశారు. జీరో అవర్లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. అలాగే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు, చేర్పులు తదితరాలకు సంబంధించి పూర్తి జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అంతకుముందు టీఎంసీతో పాటు కాంగ్రెస్, ఆప్ తదితర పార్టీల సభ్యులు కూడా డూప్లికేట్ ఓటర్ కార్డులపై 267వ నిబంధన కింద చర్చ కోరుతూ నోటీసులిచ్చారు. వాటన్నింటినీ తిరస్కరిస్తున్నట్టు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటించారు. రైల్వేలను ప్రైవేటీకరించేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని అంతకుముందు విపక్షాలు దుయ్యబట్టాయి. ఇది ప్రయాణికుల భద్రతను పణంగా పెట్టడమేనని విమర్శించాయి. కేరళలో డ్రగ్స్ భూతం జడలు విప్పుతోందంటూ ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ ఆందోళన వెలిబుచ్చారు. ఇతర విపక్షాలతో పాటు బీజేపీ సభ్యులు కూడా ఆయనతో గొంతు కలిపారు. ''ఈ సమస్య దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. దీని కట్టడికి తక్షణం చర్యలు తీసుకోవాలి''అని అభిప్రాయపడ్డారు.

లోక్‌సభలో...: పాక్ సరిహద్దుల సమీపంలో ఇంధన ప్రాజెక్టులకు అనుమతివ్వడంపై కాంగ్రెస్ ఆందోళన వెలిబుచ్చింది. జాతీయ భద్రతతో మోదీ సర్కారు రాజీ పడుతోందని పార్టీ సభ్యుడు మనీశ్ తివారీ మండిపడ్డారు. ఈ అంశంపై కాంగ్రెస్, డీఎంకే సభ్యులు సభలో నిరసనకు దిగారు. దీనిపై కేంద్రం సరిగా స్పందించడం లేదంటూ వాకౌట్ చేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తమిళనాడు వంటి రాష్ట్రాలకు తీరని నష్టం చేకూరుస్తుందని అంతకుముందు డీఎంకే ఎంపీ కతీర్ ఆనంద్ ఆందోళన వెలిబుచ్చారు. ''జనాభాను మాత్రమే కాకుండా జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం, మౌలిక సదుపాయాల వంటివాటిని పునర్విభజనకు గీటురాళ్లుగా తీసుకోవాలి. అన్ని రాష్ట్రాలకూ న్యాయం జరిగేలా చూడాలి''అని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

లోక్‌సభలో చమురు క్షేత్రాల బిల్లు

పెట్రోలియం కార్యకలాపాలను ఇతర మైనింగ్ కార్యకలాపాలను నుంచి వేరు చేసేందుకు ఉద్దేశించిన చమురు క్షేత్రాల (నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు, 2024ను పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇది రాష్ట్రాల హక్కులను హరించబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లును రాజ్యసభ గత డిసెంబర్లోనే ఆమోదించింది.

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 9 ఇండియన్ వర్సిటీలు

సబ్జెక్టుల వారీగా టాప్-50 వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ విడుదల

ఐఐటీలు, ఐఐఎంలు, జేఎన్‌యూకు దక్కిన స్థానం

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక క్యూఎస్ వరల్డ్ టాప్-50 విద్యా సంస్థల ర్యాంకింగ్స్‌లో ఇండియాలోని 9 యూనివర్సిటీలు, విద్యా సంస్థలకు స్థానం లభించింది. సబ్జెక్టుల వారీగా 15వ ఎడిషన్ టాప్-50 వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ బుధవారం విడుదలయ్యాయి. ఇంజనీరింగ్-మినరల్ అండ్ మైనింగ్ విభాగంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్(ఐఎస్ఎం)-ధన్‌బాద్‌కు 20వ స్థానం దక్కింది. ఇండియాలో ఈ సంస్థకు తొలి స్థానం లభించింది. ఇదే సబ్జెక్టులో ఐఐటీ-బాంబే, ఐఐటీ-ఖరగ్‌పూర్ 28, 45వ స్థానాల్లో నిలిచాయి. ఇక ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఐఐటీ-ఢిల్లీ, ఐఐటీ-బాంబే 45వ ర్యాంకును పంచుకున్నాయి. బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ఐఐఎం-అహ్మదాబాద్‌కు 27వ ర్యాంకు, ఐఐఎం-బెంగళూరుకు 40వ ర్యాంకు దక్కింది. పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ-మద్రాసు, డెవలప్‌మెంట్ స్టడీస్‌లో జేఎన్‌యూ-ఢిల్లీ టాప్-50 ర్యాంకింగ్స్‌లో నిలిచాయి. ఈసారి సబ్జెక్టుల వారీగా క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ నూతన ఎంట్రీల్లో చైనా, అమెరికా, యూకే, దక్షిణ కొరియా విద్యా సంస్థలు తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతీయ విద్యాసంస్థలు ఐదో స్థానంలో ఉన్నాయి. డేటా సైన్స్, ఏఐ విభాగంలో ఐఐటీ-మద్రాసు, వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తొలిసారిగా ఎంట్రీ సాధించాయి. ఇంజనీరింగ్-మినరల్ అండ్ మైనింగ్‌లో ఐఐఎస్సీ-బెంగళూరు, ఐఐటీ-కాన్పూర్ మొదటిసారి ఎంట్రీ సాధించాయి. ఈసారి మొత్తం 79 ఇండియన్ యూనివర్సిటీలు వివి విభాగాల్లో 533 ఎంట్రీలు సాధించాయి. గత ఏడాది ఈ సంఖ్య 424 మాత్రమే. ఈ 533లో 156 ఎంట్రీలు ర్యాంక్‌ను మెరుగుపర్చుకోగా, 101 ఎంట్రీల ర్యాంకు పడిపోయింది. 154 ఎంట్రీల ర్యాంకు స్థిరంగా ఉంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో గత ఏడాది 28 ఎంట్రీలు లభించగా, ఈసారి 42 లభించాయి. ఈ రంగంలో అమెరికా నుంచి 119 ఎంట్రీలు, యూకే నుంచి 62, చైనా నుంచి 58 ఎంట్రీలు వచ్చాయి. కృత్రిమ మేధ(ఏఐ), గ్రీన్ అండ్ డిజిటల్ స్కిల్స్‌లో భారతీయ విద్యాసంస్థల పనితీరు మెరుగ్గా ఉందని క్యూఎస్ సీఈఓ జెస్సికా టర్నర్ చెప్పారు. వ్యాపార సామర్థ్యాల్లో శిక్షణ ఇవ్వడంలో వెనుకంజలో ఉందని వెల్లడించారు. ఉన్నత విద్యారంగంలో సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధితో ఈ సమస్యను అధిగమించాలని, భవిష్యత్తు అవసరాలకు తగిన గ్రాడ్యుయేట్లను తయారు చేయాలని సూచించారు.

సంభాల్ గురించి 5 వేల ఏళ్ల క్రితమే గ్రంథాల్లో ఉంది

అక్కడి విష్ణు ఆలయాన్ని 1526లో ధ్వంసం చేశారు

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి వ్యాఖ్యలు

లక్నో: సంభాల్ మసీదు వివాదం మరోసారి వార్తల్లోకెక్కింది. ఆ స్థలంలో విష్ణు ఆలయం ఉందని, 1526లో దానిని ధ్వంసం చేశారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఆ తరువాత రెండేళ్లకు అంటే 1528లో అయోధ్యలోని రామాలయాన్ని ధ్వంసం చేశారని వెల్లడించారు. 5వేల ఏళ్ల కిందటే సంభాల్ గురించి గ్రంథాల్లో ప్రస్తావించారని, వాటిలో విష్ణువు భవిష్యత్ అవతారం గురించిన ప్రస్తావనలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇస్లాం కేవలం 1,400 ఏళ్లకిందటే ఉద్భవించిందని, కానీ తాను ఇస్లాంకంటే కనీసం 2వేల ఏళ్లముందున్న చరిత్ర గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ వారపత్రికలు ఆర్గనైజర్, పాంచజన్యలు లక్నోలో నిర్వహించిన 'మంథన్ : కుంభ్ అండ్ బియాండ్'కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంభాల్ ఎప్పుడూ తీర్థయాత్ర స్థలమని, ఇక్కడున్న 68 పవిత్ర స్థలాల్లో కేవలం 18నే తిరిగి పొందగలిగామని చెప్పారు. 19 పురాతన బావులను పునరుద్ధరించామని, 56 ఏళ్ల తరువాత మొదటిసారిగా సంభాల్‌లోని శివుని ఆలయంలో అభిషేకం చేశామని చెప్పారు. ప్రతిపక్షపార్టీల నాయకులు ఇంతకాలం మతం, కులం పేరుతో ప్రజలను విభజించడంలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభా కలిగిన దేశమైన ఇండోనేషియా రామ్‌లీలను జాతీయ పండుగగా జరుపుకొంటోందని కొనియాడారు. ఆ దేశ కరెన్సీలో గణేశుడి చిత్రం ఉందని, తన విమానయాన సంస్థకు గరుడ పేరు పెట్టిందని, ఇది మనదేశంలోని చాలా మందికి పాఠం కావాలని ఆకాంక్షించారు. మనదేశ వనరులతో బాగుపడుతున్నవారు విదేశీ ఆక్రమణదారులను కీర్తిస్తున్నారని మండిపడ్డారు. తాను యోగినని, ప్రతి శాఖ, సమాజ ఆరాధన విధానాన్ని గౌరవిస్తానని చెప్పారు. గోరఖ్‌నాథ్‌పీఠంలో ఎక్కడా వివక్ష ఉండదని, అన్ని కులాలు, ప్రాంతాలు, వర్గాల ప్రజలు కలిసి కూర్చుని ఒకే కంచంలో తింటారని, అన్ని రకాల సాధువులు వారి మతాలతో సంబంధం లేకుండా కలిసి భోంచేస్తారని, ఒకరినొకరు గౌరవించుకుంటారని తెలిపారు. ప్రతి ఆరాధనలో స్వాభావికంగా కొంత మంచి ఉంటుందని, కానీ బలవంతంగా ఒకరి నమ్మకాలను అణచివేయాలని చూడటం ఆమోదయోగ్యం కాదన్నారు.



బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానిని మర్యాదపూర్వకంగా కలిసిన ఢిల్లీ సీఎం రేఖాగుప్తా

సైబర్ నేరగాళ్ల నుంచి 549 భారతీయులకు విముక్తి

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుపోయిన 549 భారతీయులను దేశానికి తీసుకొచ్చారు. మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో ఉన్న సైబర్ క్రైమ్ సెంటర్ల నుంచి రెండు సైనిక విమానాల్లో తరలించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. నకిలీ జాబ్ ఆఫర్లకు భారతీయులు బలైపోయారని అధికారులు తెలిపారు. వీరంతా మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందినవారని వెల్లడించారు. మయన్మార్‌లోని మైవడి ప్రాంతంలో ఉన్న సైబర్ క్రైమ్ కేంద్రాలకు వీళ్లను తీసుకెళ్లారు. వారిని స్వదేశానికి రప్పించేందుకు మయన్మార్, థాయ్‌లాండ్‌లోని భారత రాయబార కార్యాలయాలు ప్రభుత్వంతో కలిసి పనిచేశాయి.

మరో ఐదేళ్లు నేనే సీఎం: సిద్ధరామయ్య

బెంగళూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, మరో ఐదేళ్లపాటు తానే సీఎం పదవిలో కొనసాగుతానని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను హామీ కమిటీ చైర్మన్లు, సభ్యులుగా నియమించడం ద్వారా ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అవమానించిందని బీజేపీ ఆరోపించింది. ఇలాంటి నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు సంకేతాలిస్తోందని ప్రతిపక్షనేత ఆర్.అశోక ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెంటనే స్పందించారు. 'మేం ఎక్కడికీ పోం. మేం మళ్లీ గెలుస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఉప ఎన్నికలు జరిగిన చన్నపట్న, షిగ్గావ్, సండూర్‌లలో బీజేపీ ఓటమిని సీఎం గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు దమ్ముందా అంటూ తమకు సవాల్ విసిరారని, ఆ తరువాత ఫలితాలను చూశారని ఎద్దేవా చేశారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని, తదుపరి ముఖ్యమంత్రిగా తానే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తనకు మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు నేపథ్యంలో సిద్ధరామయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

కాగా, ప్రభుత్వ హామీల అమలు కోసం ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలకు చైర్మన్లు, సభ్యులుగా కాంగ్రెస్ తమ పార్టీ వారిని నియమించింది. దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ కమిటీలను రద్దు చేయాలని కోరుతూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌ను బుధవారం కలిసి బీజేపీ.. వినతిపత్రం సమర్పించింది. ఇది శాసనసభ్యుల హక్కుల ఉల్లంఘనని బీజేపీ ఆందోళనకు దిగింది. అసెంబ్లీలో రెండో రోజు నిరసనను కొనసాగించింది. దీంతో మధ్యాహ్న భోజనం తరువాత అసెంబ్లీలో గందరగోళం ఏర్పడింది. అయితే ఎమ్మెల్యేలను అగౌరవ పరిచే పనిని తాను చే యబోనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ప్రభుత్వ పాలనలో పార్టీ కార్యకర్తల భాగస్వామ్యం ముందు నుంచి ఉన్నదేనని, గతంలో బీజేపీ కూడా ఇలాగే చేసిందని చెప్పారు. బోర్డులు, కార్పొరేషన్లకు చైర్మన్లుగా పార్టీ కార్యకర్తలను చేయడం దుర్వినియోగం కాదా అని ప్రశ్నించారు. మహారాష్ట్రలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను మంత్రుల వ్యక్తిగత సహాయకులుగా చేశారని గుర్తు చేశారు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేల నినాదాలతో సభా కార్యకలాపాలు మరింత గందరగోళంగా మారాయి. అయితే కాంగ్రెస్ కార్యకర్తలను కమిటీ చైర్మన్లను చేయడానికి తాము వ్యతిరేకం కాదని, వారికి కార్యాలయం ఇవ్వడం, నెలకు రూ. 18 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయడంపైనే తమ అభ్యంతరమని ప్రతిపక్ష నేత అశోక తెలిపారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

మహాభారతాన్ని మొదట 'జయసంహిత' అని ఎవరు పిలిచారు?

వైదిక నాగరికత

భారతదేశ చరిత్రలో క్రీ.పూ. 1500-600 మధ్య కాలాన్ని వైదిక యుగంగా పేర్కొంటారు. ఈ కాలంలో వైదిక నాగరికత విలసిల్లింది. ఈ నాగరికత నిర్మాతలు ఆర్యులు. ఈ నాగరికత కాలాన్ని రెండు దశలుగా విభజిస్తారు. క్రీ.పూ. 1500 నుంచి 1000 మధ్య కాలాన్ని 'తొలివేద నాగరికత' లేదా 'రుగ్వేద నాగరికత'గా, క్రీ.పూ. 1000 నుంచి 600 మధ్య కాలాన్ని 'మలివేద నాగరికత'గా వ్యవహరిస్తారు.

ఆర్యులు నార్డిక్ జాతికి చెందినవారు. వీరి జన్మస్థలంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీనికి కారణం స్పష్టమైన ఆధారాలు లేకపోవడం. ఆర్యుల జన్మస్థలంపై ఉన్న వాదనల్లో ముఖ్యమైనవి..

1. **మధ్య ఆసియా వాదం:** ఇండో-యూరోపియన్ భాషల తులనాత్మక అధ్యయనం ఆధారంగా మాక్స్‌ముల్లర్ ఆర్యుల జన్మభూమి మధ్య ఆసియా అని పేర్కొన్నారు. మిగిలిన వాదనల కంటే ఇది అర్థవంతంగా ఉండటంతో అత్యధికుల ఆమోదం పొందింది.
2. **జర్మనీ వాదం:** ఆర్యుల జన్మభూమి జర్మనీ అని పెంకాతో పాటు ఇతర యూరోపియన్ చరిత్రకారులు వాదించారు.
3. **ఆర్కిటిక్ వాదం:** ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి భారతదేశానికి వలస వచ్చారని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు. దీనిపై ఆయన 'ఆర్కిటిక్ ది హోం ఆఫ్ ఆర్యన్స్' అనే గ్రంథాన్ని రాశారు.
4. ఆస్ట్రో-హంగేరీ ప్రాంతమే ఆర్యుల జన్మస్థలమని డాక్టర్ గైల్ అనే చరిత్రకారుడు వాదించారు.
5. **టిబెట్ వాదం:** ఆర్యుల జన్మభూమి టిబెట్ అని దయానంద సరస్వతి వాదన.
6. **స్వదేశీ వాదం:** ఆర్యులు భారతదేశంలోని సప్తసింధూ ప్రాంతానికి చెందిన స్థానికులే అని డాక్టర్ ఎ.సి.దాస్ అభిప్రాయం. ఆర్యులు విదేశీయులు, బయటి ప్రాంతాల నుంచి భారత్‌కు వలస వచ్చారు అనే వాదనలను ఆయన ఖండించారు.

ఆర్యుల సాహిత్యం

'వేదసాహిత్యం' భారతదేశంలో లభిస్తున్న అత్యంత ప్రాచీన సాహిత్యం. దీన్ని వెలువరించినవారు ఆర్యులు. వేద సాహిత్యాన్ని శ్రుతి సాహిత్యం, స్మృతి సాహిత్యం అని రెండు రకాలుగా విభజించారు.

1. **శ్రుతి సాహిత్యం:** ఇందులో నాలుగు వేదాలతో పాటు బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఉన్నాయి.
   వేదాలు: వేదాలను 'అపౌరుషేయాలు' అంటారు. అంటే ఇవి మానవమాత్రులు రచించినవి కావు, దివ్యగ్రంథాలు అని అర్థం.

రుగ్వేదం: ఇది భారతదేశంలోనే కాకుండా మొత్తం ఇండో-యూరోపియన్ సాహిత్యంలోనే అతి

ఆర్యుల రాకతోనే భారతదేశంలో చారిత్రక యుగం ప్రారంభమైంది. ఈ కాలం నుంచే భారతదేశ చరిత్రకు సంబంధించిన లిఖిత ఆధారాలు లభిస్తున్నాయి. 'ఆర్య' అనేది భాషకు సంబంధించిన పదం. ఆర్య భాషను ఉపయోగించడం వల్ల వీరిని ఆర్యులనీ, వీరి నాగరికతను 'ఆర్య నాగరికత' అని అంటారు. ఈ నాగరికతకు ప్రధానాధారం వేద సాహిత్యం. అందువల్ల దీన్ని 'వేద నాగరికత' అంటారు.

ప్రాచీనమైంది. తొలి వేదకాలం గురించి తెలుసుకోవడానికి ఇది ప్రధాన ఆధారంగా ఉంది. ఇందులో మొత్తం 1028 శ్లోకాలున్నాయి. దీన్ని 10 మండలాలుగా విభజించారు. పదో మండలంలోని పురుష సూక్తంలో చాతుర్వర్ణ వ్యవస్థ తొలి ప్రస్తావన ఉంది. మూడో మండలంలో ప్రసిద్ధమైన గాయత్రి మంత్రం ఉంది.

సామవేదం: ఇందులో 1600కు పైగా శ్లోకాలున్నాయి. ఇది సంగీత ప్రధానమైంది. యజ్ఞాల సమయంలో పఠించే మంత్రాలకు అనువుగా ఈ సంగీతాన్ని రూపొందించారు. భారతీయ సప్త స్వరాలకు మూలం దీంట్లోనే ఉన్నట్లు చెబుతారు.

యజుర్వేదం: ఈ గ్రంథంలో యజ్ఞయాగాలు, క్రతువులు, కర్మకాండలు, బలిదానాలు తదితర సందర్భాల్లో పఠించే మంత్రాలు ఉన్నాయి. రాజులు నిర్వహించే రాజసూయ,వాజపేయ లాంటి యాగాలకు సంబంధించిన తొలి ప్రస్తావన ఇందులో కనిపిస్తుంది. తొలి రెండు వేదాలకు భిన్నంగా దీన్ని పద్య, గద్య శైలి రెండింటిలోనూ రాశారు. దీంట్లో సుమారు రెండువేల శ్లోకాలున్నాయి.

అధర్వణ వేదం: ఇది మంత్రతంత్రాలతో కూడిన గ్రంథం. దీన్ని ఆర్యేతరులకు సంబంధించిందిగా భావిస్తున్నారు. ఆర్యేతరుల ఆచారాలు, సాంప్రదాయాలు ఇందులో కనిపిస్తాయి. దీంట్లో దుష్టశక్తులను పారదోలడానికి, వ్యాధులను నివారించేందుకు ఉపయోగించే మంత్రతంత్రాలున్నాయి. ఇందులో మొత్తం 711 శ్లోకాలున్నాయి. దీన్ని రెండు భాగాలు గా విభజించారు. అవి: పైప్పలాద, సౌనక.

బ్రాహ్మణాలు: ఇవి పూజా ప్రార్థనలు, యజ్ఞ యాగాలు, బలిదానాలు, ఉత్సవాలకు సంబంధించిన గ్రంథాలు. నాలుగు వేదాలకు అనుబంధంగా మొత్తం ఏడు బ్రాహ్మణాలు ఉన్నాయి. ఇవి నాటి ప్రజల ఆచార వ్యవహారాలు, సామాజిక జీవితాలను ప్రతిబింబిస్తున్నాయి. వీటిలో అతి పురాతనమైంది 'తాండ్యమాహ బ్రాహ్మణం'.అన్నిటికంటే ముఖ్యమైనది 'శతపథ బ్రాహ్మణం'. ప్రతి బ్రాహ్మణం ఏదో ఒక వేదంతో అనుబంధమై ఉంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

అరణ్యకాలు: వీటిని వేదాలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులకు మధ్య అనుసంధానాలుగా భావిస్తారు. బ్రాహ్మణాలు వేదాలకు అనుబంధంగా ఉంటే అరణ్యకాలు బ్రాహ్మణాల కు అనుబంధంగా ఉన్నాయి. ఇవి అడవుల్లో నివసించే రుషులను ఉద్దేశించినవి. వీటిలో ప్రధానాంశం సన్యాసవాదం. వీటిలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యమైన అరణ్యకాలు-ఐతరేయ, కౌసితాకి.

ఉపనిషత్తులు: యజ్ఞ యాగాలకు బదులుగా భక్తి, జ్ఞానానికి ప్రాధాన్యమిచ్చే తాత్త్విక గ్రంథాలివి. భారతీయ తత్త్వ శాస్త్రానికి మూలం ఇవేనని భావిస్తున్నారు. శంకరాచార్యులు, రామానుజాచార్యుల తత్త్వ సిద్ధాంతాలకు కూడా మూలం ఇవే. పునర్జన్మ సిద్ధాంతానికి సంబంధించిన ప్రస్తావన మొదటగా వీటిలోనే కనిపిస్తుంది. ఉపనిషత్తుల మొత్తం సంఖ్య 108. వీటిలో చాందొగ్య, బృహదారణ్యక, ముండక, జబల, ఐతరేయ, కౌసితాకి, శ్వేతాశ్వతార,కథ, కేన లాంటివి ముఖ్యమైనవి. జబల ఉపనిషత్తులో తొలిసారిగా నాలుగు ఆశ్రమాల ప్రస్తావన కనిపిస్తుంది. ముండకోపనిషత్తులో 'సత్యమేవ జయతే'అనే ప్రముఖ శ్లోకం కనిపిస్తుంది. ఉపనిషత్తులు కూడా నాలుగు వేదాలకు అనుబంధంగా ఉన్నాయి.

2. **స్మృతి సాహిత్యం:** ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా లభించిన సాహిత్యం కాబట్టి దీన్ని 'స్మృతి సాహిత్యం' అంటారు. ఇందులో వేదాంగాలు, సూత్రాలు, ఇతిహాసాలు, ఉపవేదాలు, పురాణాలు, షడ్దర్శనాలు ఉన్నాయి.

వేదాంగాలు: ఇవి మొత్తం ఆరు. మానవులు రచించినవే కాబట్టి వేదాల్లా ఇవి అపౌరుషేయాలు కావు

- **శిక్ష:** ఇది ఉచ్చారణకు సంబంధించింది.
- **కల్ప:** ఇది వేదాంగాల్లో అతి ముఖ్యమైంది. క్రతువుల గురించి తెలియజేస్తుంది.
- **వ్యాకరణ:** భాషా వ్యాకారణానికి సంబంధించింది.
- **నిరుక్త:** పద వ్యుత్పత్తిని వివరిస్తుంది.
- **ఛందస్సు:** ప్రాస, లయలకు చెందింది.
- **జ్యోతిష:** ఖగోళ శాస్త్రానికి సంబంధించిన వేదాంగం.

సూత్రాలు: ఇవి మూడు రకాలు.

శ్రౌత సూత్రాలు: ఇవి యజ్ఞ యాగాలు, క్రతువులు, కర్మకాండల గురించి వివరిస్తాయి. సుళ్వ సూత్రాలు ఇందులో ఒక భాగం. సుళ్వ సూత్రాల్లో రేఖా గణిత శాస్త్ర మూలాలు ఉన్నాయి.

గృహ్య సూత్రాలు: గృహస్థు తన జీవిత కాలంలో ఆచరించాల్సిన క్రతువులు, కర్మకాండల గురించి తెలియజేస్తాయి. వీటి ప్రకారం ఒక మనిషి పుట్టుక నుంచి మరణం వరకు మొత్తం 16 క్రతువులు, కర్మకాండలను నిర్వహించాలి.

ధర్మసూత్రాలు: చట్టాలు, ప్రజల ఆచార వ్యవహారాల గురించి తెలియజేస్తాయి. న్యాయశాస్త్రాలకు వీటినే మూలంగా భావిస్తారు. మనుస్మృతి లాంటి వివిధ ధర్మ శాస్త్రాలకు ఇవి ప్రాతిపదికగా ఉన్నాయి. అందువల్ల ఇవి చరిత్రకారులకు అత్యంత ప్రధానమైనవి.

షడ్దర్శనాలు: ఇవి భారతీయ తత్త్వశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలు. ఇవి యజ్ఞయాగాలు, క్రతువులను నిరసిస్తాయి. సచ్ఛీలత, నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తాయి. వివిధ సిద్ధాంతాలు - ప్రవచించిన రుషుల వివరాలను కింద గమనించవచ్చు.

- **సాంఖ్య దర్శనం** - కపిల మహర్షి
- **వైశేషిక** - ఉలూక కనద రుషి
- **న్యాయ** - గౌతమ
- **యోగ దర్శన** - పతంజలి
- **పూర్వ మీమాంస** - జైమిని మహర్షి
- **ఉత్తర మీమాంస** - బాదరాయణుడు

ఉపవేదాలు: స్మృతి సాహిత్యంలో నాలుగు ఉపవేదాలున్నాయి. అవి:

1. **ఆయుర్వేదం:** వైద్య శాస్త్రానికి సంబంధించింది.
2. **గాంధర్వ వేదం:** గానం, సంగీతాలకు సంబంధించింది.
3. **శిల్పవేదం:** వాస్తు, శిల్పకళలను వివరిస్తుంది.
4. **ధనుర్వేదం:** ఇది యుద్ధ విద్యలకు ముఖ్యం గా ధనుర్విద్యకు సంబంధించింది.

పురాణాలు: స్మృతి సాహిత్యంలో భాగంగా ఉన్న మొత్తం 18 పురాణాలూ గుప్తుల అనంతర కాలానికి చెందినవే. కానీ వాటిలోని కథలు ప్రాచీనమైనవి. ఇవి ప్రధానంగా ప్రాచీన కాలానికి చెందిన రాజుల వంశానుక్రమాన్ని వివరిస్తాయి. ప్రపంచ సృష్టి, వినాశనం, పునఃసృష్టి, సూర్య, చంద్ర వంశీకుల చరిత్ర మొదలైన అంశాలపై వివరాలను అందిస్తున్నాయి.

ముఖ్యమైన పురాణాలు: వాయు, విష్ణు, బ్రహ్మ, శివ, గరుడ, భాగవత, భవిష్య, పద్మ, స్కంధ పురాణాలు. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైంది వాయు పురాణం.

ఇతిహాసాలు:

- **రామాయణం:** పురాణాల ప్రకారం దీన్ని క్రీ.పూ. 500 ఏళ్ల కిందట రచించారు. దీనికి తొలిరూపం ఇచ్చిన వారు వాల్మీకి. ఇందు లో మొత్తం 7 కాండాలున్నాయి. మొదటి, చివరి కాండాలు మినహా మిగిలినవి ప్రాచీనమైనవి.
- **మహాభారతం:** వేదవ్యాసుడు రచించారు. భగవద్గీత కూడా ఇందులో అంతర్భాగమే. మహాభారతాన్ని మొదట 'జయసంహిత' అని పిలిచారు. ఇందులో మొత్తం 18 పర్వాలున్నాయి.

ధర్మశాస్త్రాలు (స్మృతులు): మానవుడి జీవితాన్ని నియమబద్ధం చేసేందుకు వీటిని రచించారు. ఇవి చాతుర్వర్ణాలు, వర్ణాశ్రమ ధర్మాలు, షోడష కర్మలు, సంస్కారాలు, ఆచారాలు, వ్యవహారాలు, శిక్షలు లాంటి అనేక అంశాల గురించి వివరిస్తాయి.

ముఖ్యమైన స్మృతులు:

- **మనుస్మృతి:** అత్యంత ప్రాచీనమైన ధర్మశాస్త్రం . తర్వాతి కాలంలో వచ్చిన అనేక ధర్మశాస్త్రాలకు ఇది మూలంగా ఉంది.
- **యాజ్ఞవల్క్య స్మృతి:** యాజ్ఞ వల్క్య మహర్షి రచించారు. దీనిపై క్రీ.శ. 11వ శతాబ్దంలో విజ్ఞానేశ్వరుడు 'మితాక్షర' అనే వ్యాఖ్యానాన్ని రచించాడు.
- **పరాశర స్మృతి:** దీన్ని రచించినవారు పరాశర మహర్షి. ఇందులో కొంత ఆధునిక భావాలు కనిపిస్తాయి. దీన్ని కలియుగానికి అనువైందిగా భావిస్తారు.
- **నారద స్మృతి:** నారద మహర్షి రచించారు. వీటితోపాటు బృహస్పతి స్మృతి, కాత్యాయన స్మృతి కూడా ముఖ్యమైనవి.

మాదిరి ప్రశ్నలు

1. **'ఆర్య' అనేది జాతికి సంబంధించిన పదం అని వాదించిన విదేశీ చరిత్రకారుడు?**
   1) పెంకా 2) సర్ విలియమ్ జోన్స్
   3) మాక్స్ ముల్లర్ 4) గైల్
2. **రుగ్వేదంలోని గాయత్రీమంత్రం ఏ దేవతకు సంబంధించింది?**
   1) అధితి 2) ఉషస్సు
   3) సావిత్రి 4) అరణ్యాని
3. **వేదాలు - వాటి పురోహితులకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?**
   1) రుగ్వేదం- హోత్రి
   2) సామవేదం - ఉద్గాత్రి
   3) యజుర్వేదం - అధ్వర్యు
   4) అధర్వణ వేదం - శ్రామణుడు
4. **'కుటుంబ గ్రంథం' అని ఏ వేదాన్ని పిలుస్తారు?**
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
5. **సుప్రసిద్ధ 'తమసోమా జ్యోతిర్గమయ' శ్లోకం ఏ గ్రంథంలో ఉంది?**
   1) ఐతరేయ బ్రాహ్మణం
   2) బృహదారణ్యక ఉపనిషత్తు
   3) యజుర్వేద సంహిత
   4) భాగవత పురాణం
6. **ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?**
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
7. **అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైనది?**
   1) విష్ణు పురాణం 2) భాగవత పురాణం
   3) వాయుపురాణం
   4) గరుడ పురాణం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 1;
5) 2; 6) 1; 7) 3.

Language labs are particularly good for..



Model Questions

1. Learning can happen best when it is shared with others. This is the belief of
   1) Communical Approach
   2) Collaborative Approach
   3) Structural Approach
   4) Electic Approach
2. One of the features of Reflective teaching is _____
   1) Predicting 2) Clarifying
   3) Summarizing
   4) Gathering new evidences
3. Computer Assisted Language Learning programmes employ _____.
   1) Communicative method
   2) Grammar-translation method
   3) Direct method
   4) Trilingual method
4. An approach has a_____.
   1) a method behind it
   2) Learning principle behind it.
   3) Some language patterns behind it.
   4) a technique behind it.
5. The function-based and task-centered approach is the_____.
   1) Structural approach
   2) S-O-S approach
   3) Communicative approach
   4) Situational approach
6. B.F. Skinner, an educationist, felt sad and said, our kitchens are more mechanized than our classrooms' because_____.
   1) Some teachers get their learners to prepare teaching learning materials.
   2) Teachers buy the teaching learning materials form the local market.
   3) Most teachers use only the course books in the classrooms while teaching.
   4) Most teachers use a large number of teaching-learning materials.
7. To remedy spelling errors made by pupils, or to prevent them from making spelling errors, the teacher should_____.
   1) get pupils to learn them by heart every word.
   2) get pupils to write each word ten times.
   3) have lists of English words hung on the class room walls.
   4) help them read books other than their books.
8. Which one of the following is not a technique?
   1) Writing a lesson plan
   2) Oral presentation by the teacher.
   3) Reading the lesson by the teacher.
   4) Oral drills.
9. Identify the correct statement.
   1) We can have some approaches under a method.
   2) There can be some methods based on a certain approach.
   3) There can be some approaches under a technique.
   4) We cannot have some methods under some approach.
10. Language labs are particularly good for_____
    1) listening to sounds and drilling them.
    2) listening to sounds
    3) learning word stress
    4) practicing communication in artificial situations
11. Arrange the following levels of learners according to their categories in ascending order. 1.Advanced 2. beginner 3.elementary 4. Intermediate
    1) 2, 3, 4, 1 2) 1,2,3,4
    3) 4,3,2,1 4) 1,4,3,2
12. A study of grammar improves_____.
    1) Accuracy 2) Fluency
    3) Literacy 4) Articulation
13. Language games are useful _____.
    1) teaching aids in teaching English
    2) teaching techniques to teach English
    3) tools for learners assessment
    4) methods to teach English
14. The method adopted in writing present day school textbooks is
    1) text followed by functional and communicative activities
    2) text followed by comprehension exercises
    3) text followed by grammar and vocabulary
    4) text followed by structures and vocabulary
15. The following method presents grammar through the study of rules
    1) Audio-lingual Method
    2) Grammar Translation Method
    3) Bilingual Method
    4) Reading Method
16. Micro teaching_____.
    1) does not give any scope for feedback
    2) improves the efficiency of a teacher
    3) makes teaching situation very complex
    4) is planned for 45 minutes of teaching
17. The principle involved in Deductive Method is_____.
    1) specific example to generalization of rule
    2) generic example to generalization of rule
    3) generalized rule to specific example
    4) specific example to special rule
18. Read the following statements. The correct statement is_____
    1) Group method of reading brings in indiscipline.
    2) Role pay is difficult to administer in the classroom.
    3) Audio-lingual method does not consider language skills
    4) Information gap activities promote language used in real-life situations.
19. Practical devices used by the teacher in the classroom are called_____.
    1) Exercises 2) Approaches
    3) Methods 4) Techniques
20. Direct Method does not believe in__.
    1) exposure to language through situations
    2) examples followed by rules
    3) association of ideas and objects
    4) teaching through translation
21. Reading Method is propounded by_____.
    1) C J Dodson 2) Michael West
    3) Harold Palmer 4) C C Fries
22. Small-group talk among children, and undertaking activities that nurture the abilities to compare and contrast, to wonder and remember, to guess and challenge, to judge and evaluate will facilitate this:
    1) Effective language learning in a stress free environment
    2) Effective reading in a stressful environment
    3) Effective reading in a stress free environment
    4) Ineffective language learning in a stress free environment
23. In Direct Method, the following is not found_____.
    1) Grammar is taught indirectly
    2) Concepts are taught by means of objects or by natural contexts
    3) Oral training helps in reading and writing
    4) Translation
24. In the communicative language teaching context, mistakes are __
    1) Completely ignored
    2) Completely corrected
    3) Noted and addressed as a group later
    4) Noted but never addressed
25. Bangalore Project was undertaken by_____.
    1) West Bengal Government
    2) N. S. Prabhu 3) CBSE
    4) British Council
26. COST stands for_____.
    1) Communication Oriented Situational Teaching
    2) Communication Oriented Structural Teaching
    3) Communication Oral Situational Teaching
    4) Communicative Oriented Situational Teaching
27. _____ employs association of ideas and objects or concepts 'experience with expressions'.
    1) Reading Method
    2) Bilingual Method
    3) Direct Method
    4) Grammar Translation Method
28. ______ establishes a relation between theory and practice.
    1) Approach 2) Method
    3) Technique 4) All
29. A method is an overall plan for the orderly presentation of language material. Within one approach there can be_____.
    1) two methods 2) four methods
    3) many methods
    4) six methods
30. Grammar translation method does not:
    1) give importance to grammar
    2) encourage learning through mother tongue
    3) help learn English grammar
    4) enhance the learner's communicative skills immediately
31. The grammar translation method dominated the field of teaching and learning during this period
    1) 1840 to 1940 2) 1990 to 2005
    3) 1840 to 1841 4) 1950 to 2000
32. The three levels of conceptualization identified by Edward Anthony are :
    1) Approach, method and technique
    2) Approach, philosophy and technique
    3) Principle, approach and method
    4) Philosophy, principle and approach
33. Grammar translation method lays stress on :
    1) accuracy 2) similarity
    3) listening skills
    4) hand writing
34. The objective of the Direct method is:
    1) to develop personality
    2) to develop a command over the target language
    3) to develop health
    4) to increase the power of comprehension
35. The following method stresses on the spoken language.
    1) The Translation method
    2) The Reading method
    3) The Direct method
    4) The Communicative method
36. (CLT) Communicative Language Teaching believes that
    1) Language learning happens best when the atmosphere is relaxed and learner receives encouragement
    2) Language learning happens when the atmosphere is rule based
    3) Language learning happens best when the teacher dominates the class while teaching.
    4) Language learning happens when reading is given top priority.
37. Along with 'translation' what is the predominant feature of 'Translation method ?
    1) Comprehension
    2) Comparison
    3) Grammar
    4) Explanation
38. What are the given statements associated with -
    » It is not re-teaching
    » It is highly specific and need based
    » It has more practice than theory
    » At the end there is always a test and the achievement is expected to the very high
    1) Micro teaching
    2) Reflective teaching
    3) Remedial teaching
    4) Practice teaching
39. In ________ Mother Tongue is totally banned
    1) Grammar Translation Method
    2) Direct Method
    3) Bilingual Method
    4)Reading Method
40. Language learning is a natural process in ________ approach.
    1) Structural 2) Oral
    3) Communicative 4) Eclectic

KEY

1) 2	2) 4	3) 3	4) 3	5) 3
6) 3	7) 4	8) 1	9) 2	10) 4
11) 1	12) 1	13) 2	14) 1	15) 2
16) 2	17) 3	18) 4	19) 4	20) 4
21) 2	22) 1	23) 4	24) 3	25) 2
26) 2	27) 2	28) 1	29) 3	30) 4
31) 1	32) 1	33) 1	34) 2	35) 3
36) 1	37) 3	38) 3	39) 2	40) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

'కణజాలవర్ధన పితామహుడు' ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. 'బయోటెక్నాలజీ' (జీవ సాంకేతిక శాస్త్రం) అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
   1) జాన్‌కోల్ రీటర్ 2) వాక్స్‌మెన్
   3) కార్ల్ ఎరికే 4) లీవెన్ హాక్
2. కిందివాటిలో సరైన వాక్యాలు ఏవి?
   ఎ) 'డాలి'.. ప్రపంచంలో మొదటిసారిగా సృష్టించిన క్లోన్డ్ గొర్రెపిల్ల. దీన్ని 'రోస్‌లిన్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ సృష్టించారు
   బి) 'ఈవ్'.. మొదటి క్లోన్డ్ బేబీ. దీన్ని సృష్టించిన సంస్థ 'సియోల్ నేషనల్ యూనివర్సిటీ'
   సి) సంరూప, గరిమా అనే పెయ్య దూడలను సృష్టించింది నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ), కర్నాల్ (హర్యానా)
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
3. 'ఇంటర్‌ఫెరాన్'లను ప్రధానంగా ఏ జీవులు ఉత్పత్తి చేస్తాయి?
   1) అకోశరుకాలు 2) సకోశరుకాలు
   3) బ్యాక్టీరియాలు 4) శిలీంధ్రాలు
4. ఇంటర్‌ఫెరాన్‌లను కనుగొన్నవారు?
   1) గిల్‌బర్ట్, వీస్‌మన్
   2) కోహ్లర్, మిల్‌స్టీన్
   3) నాథన్స్ 4) థామ్సన్
5. కిందివాటిలో జన్యు పరివర్తిత మొక్కకు ఉదాహరణ?
   1) వరిలో IR - 8 2) గోల్డెన్ రైస్
   3) సజ్జలో పూసా మోతి
   4) వేరుశనగలో TMV - 3
6. కిందివాటిలో 'బ్యాక్టీరియల్ పెస్టిసైడ్' ఏది?
   1) బాసిల్లస్ ఆంత్రాసిస్
   2) బాసిల్లస్ పాలిమిక్సా
   3) క్లాస్ట్రీడియం బొట్యులినమ్
   4) బాసిల్లస్ థురింజియాన్సిస్
7. 'తైపేయి' అనేది ఏ పంట రకం?
   1) జొన్న 2) గోధుమ
   3) వరి 4) సజ్జ
8. 'గోల్డెన్ రైస్'ను ఏవిధంగా ఉత్పత్తి చేస్తారు?
   1) వరిలోని పూసా రకాన్ని IR-8 రకంతో సంకరణం చేయడం ద్వారా
   2) తైపేయి అనే వరి రకంలో 'విటమిన్-ఎ'ను ఉత్పత్తి చేసే మూడు జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   3) అధిక దిగుబడిని సాధించడానికి వరిలోని 'అనామిక' రకంలోకి జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   4) వరిలోని 'బీరాజ్' రకంలో ఉత్పరివర్తనాలను కలిగించడం ద్వారా
9. సూక్ష్మజీవులను ఉపయోగించి.. నేల లేదా నీటి నుంచి అనవసర వ్యర్థ పదార్థాలు, కాలుష్య కారకాలను తొలగించే పద్ధతిని ఏమంటారు?
   1) బయోఇన్ఫర్మేటిక్స్
   2) ప్రోటియోమిక్స్
   3) బయోరెమిడియేషన్ 4) జీనోమిక్స్
10. జున్ను ఉత్పత్తికి ఉపయోగించే జంతు ఎంజైమ్ ఏది?
    1) పపేన్ 2) రెన్నెట్
    3) లైపాక్సిజినేజ్ 4) లైపేజ్
11. మాంసం మృదుత్వానికి, తోళ్లను మెత్తబరచడానికి ఉపయోగించే ఎంజైమ్‌లు వరుసగా?
    1) పపేన్, రెన్నెట్
    2) పపేన్, ప్రోటియేజ్
    3) ప్రోటియేజ్, ట్రిప్సిన్
    4) రెన్నెట్, లైపేజ్
12. 'గోల్డెన్ రైస్'ను సృష్టించిన శాస్త్రవేత్త?
    1) కొహ్లెర్ 2) నాథన్స్
    3) నార్మన్ బోర్లాగ్ 4) ఇంగోపాట్రికస్
13. కిందివాటిలో జన్యుపరివర్తిత మొక్కకు ఉదాహరణ?
    1) బంగారు వరి 2) బంగారు వేరుశనగ
    3) బి.టి. పత్తి 4) పైవన్నీ
14. కణజాలవర్ధనం (టిష్యూ కల్చర్) ప్రధానంగా ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
    1) కణ సిద్ధాంతం
    2) సెల్యులార్ టోటిపొటెన్సీ
    3) కణ వంశానుక్రమ సిద్ధాంతం
    4) ఓమ్నిస్ సెల్యులా - ఇ - సెల్యులా
15. 'సెల్యులార్ టోటిపొటెన్సీ' అంటే..?
    1) ఒక కణం క్షయకరణ విభజన చెందగలిగే శక్తి
    2) సరైన నియంత్రణ పరిస్థితుల్లో.. ఆక్సిన్ - సైటోకైనిన్‌లను ఉపయోగించి ప్రకాండ వ్యవస్థను ప్రేరేపించడం
    3) అతి శీతల అభిచర్య జరిపి ఒక మొక్కలో పుష్పోత్పత్తిని ప్రేరేపించడం
    4) అనుకూల పరిస్థితుల్లో కొత్త మొక్కను ఏర్పర్చగలిగే కణం అంతర్గత సామర్థ్యం
16. తొలిసారిగా 'టోటిపొటెన్సీ' అనే పదాన్ని ఉపయోగించినవారు?
    1) మోర్గాన్ 2) స్టీవార్డ్
    3) ముల్లర్ 4) హేబర్ లాండ్
17. 'కణజాలవర్ధన పితామహుడు' ఎవరు?
    1) ఎఫ్.సి. స్టీవార్డ్ 2) మోర్గాన్
    3) హేబర్ లాండ్ 4) ముల్లర్
18. కణజాలవర్ధనంలో యానకం pH విలువ ఏ విధంగా ఉండాలి?
    1) 3.0 - 5.0 2) 7.2 - 8.0
    3) 5.6 - 6.0 4) 6.3 - 7.4
19. కణజాలవర్ధనంలో ఎక్కువగా ఉపయోగించే యానకం ఏది?
    1) B.S. యానకం 2) S.M. యానకం
    3) M.S. యానకం 4) L.S. యానకం
20. మౌలిక (బేసిక్) యానకంలో లోపించేవి?
    1) సూక్ష్మ మూలకాలు 2) విటమిన్‌లు
    3) కార్బోహైడ్రేట్‌లు
    4) వృద్ధి నియంత్రకాలు
21. కణజాలవర్ధనంలో ఏర్పడే 'అవయవ విభేదనం' చెందని కణాల సముదాయాన్ని ఏమంటారు?
    1) కాలస్ 2) కాలోస్
    3) క్లోన్ 4) ఎక్స్‌ప్లాంట్
22. 'సోడియం ఆల్జినేట్'తో రక్షణ కవచాలను ఏర్పర్చి, గుళికలుగా మార్చే నిర్మాణాలను ఏమంటారు?
    1) ప్లాస్మిడ్‌లు 2) ప్లాస్టిడ్‌లు
    3) సంశ్లేషిత/ కృత్రిమ విత్తనాలు
    4) సైటోప్లాస్ట్‌లు
23. జతపరచండి.
    జాబితా - I
    a) సోడియం హైపోక్లోరైట్
    b) మెర్క్యురిక్ క్లోరైడ్
    c) సోడియం ఆల్జినేట్
    d) సాయిల్ రైట్
    జాబితా - II
    i) విత్తనాల ఉపరితలాన్ని సూక్ష్మజీవ రహితం చేయడం
    ii) వర్ధనం చేసిన మొక్కలను నాటడం
    iii) ఎక్స్‌ప్లాంట్‌ను సూక్ష్మజీవరహితం చేయడం
    iv) పిండాలను గుళికలుగా మార్చడం

	a	b	c	d
1)	iii	i	iv	ii
2)	iii	i	ii	iv
3)	iv	ii	iii	i
4)	i	iii	ii	iv

24. జతపరచండి.
    జాబితా - I
    a) సోమాక్లోనల్ వైవిధ్యాలు
    b) సూక్ష్మ వ్యాప్తి
    c) శాఖీయ పిండోత్పత్తి
    d) అక్లిమటైజేషన్ (వాతావరణానుకూలత)
    జాబితా - II
    i) కాలస్ నుంచి పిండాల లాంటి నిర్మాణాల అభివృద్ధి
    ii) కణజాలవర్ధనంలో ఏర్పడిన మొక్క ప్రదర్శించే వైవిధ్యాలు
    iii) కణజాలవర్ధనం ద్వారా పెద్దమొత్తంలో తక్కువ స్థలంలో మొక్కలను ఉత్పత్తి చేయడం
    iv) కణజాలవర్ధనం ద్వారా ఏర్పడిన మొక్కలు వాతావరణ అనుకూలతను ప్రదర్శించడం

	a	b	c	d
1)	ii	iii	iv	i
2)	ii	iii	i	iv
3)	i	ii	iii	iv
4)	ii	i	iii	iv

25. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
    ఎ) బయోపెస్టిసైడ్ → బాసిల్లస్ థురింజియాన్సిస్ → మాంసం మృదుత్వానికి ఉపయోగపడుతుంది
    బి) బాక్యులో వైరస్ → ఎన్. పి. వి. → ఆర్థ్రోపాడ్ కీటకాలను వ్యాధిగ్రస్థం చేస్తుంది
    సి) వరిలో తైపేయి రకం → గోల్డెన్ రైస్ → విటమిన్-ఎ ను ఉత్పత్తి చేస్తుంది
    డి) బీటీ పత్తి → బీటీ విషపదార్థం → తోళ్లను మెత్తబరుస్తుంది
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, సి 4) ఎ, డి
26. జతపరచండి.
    జాబితా - I
    a) బయోఇన్ఫర్మేటిక్స్
    b) బయోరెమిడియేషన్
    c) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    d) జన్యు థెరపీ
    జాబితా - II
    i) సూక్ష్మజీవులను ఉపయోగించికాలుష్యాన్ని తొలగించడం
    ii) నేరస్థులను, వ్యక్తి అసలైన తల్లిదండ్రులను గుర్తించడం
    iii) జన్యు సంబంధ వ్యాధుల నిర్ధారణ
    iv) జీవశాస్త్ర అధ్యయనానికి తోడ్పడే సమాచార సాంకేతిక శాస్త్రం

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	i	ii	iii
3)	iv	i	iii	ii
4)	iii	ii	i	iv

డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్

డీఎన్ఏ అణువులోని నత్రజని క్షారాల వరస క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, ఆ డీఎన్ఏ ఇతర ఏ వ్యక్తి డీఎన్ఏతో పోలి ఉంటుందో నిర్ధారించే పరీక్షను 'డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్' అంటారు. ఇంగ్లండ్‌లోని లీచెస్టర్ యునివర్సిటీకి చెందిన అలెక్ జెఫ్రీస్ 'డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ప్రక్రియ'ను మొదటిసారిగా 1985లో రూపొందించాడు.

ఏ ఇద్దరు వ్యక్తుల డీఎన్ఏ వరస క్రమం కచ్చితంగా ఒకే విధంగా(సమరూప కవలల్లో తప్ప) ఉండదు. అయితే మానవుడి డీఎన్ఏ అణువులో ఉండే 3 బిలియన్ల న్యూక్లియోటైడ్‌లలో 99.9% ఇతర వ్యక్తుల డీఎన్ఏను పోలి ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే వ్యక్తిగత వైవిధ్యాలు కేవలం 0.1 శాతం న్యూక్లియోటైడ్‌లలోమాత్రమే ప్రధానంగా కనిపిస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి డీఎన్ఏలోని న్యూక్లియోటైడ్‌ల వరస క్రమంలోని వైవిధ్యం డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్‌కు మూలాధారం.

డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్‌లో 4 రకాల డీఎన్ఏ మార్కర్‌లను ఉపయోగిస్తారు.

అవి.. RFLP, VNTR, STR, SNP.

సేకరించే నమూనాలు

నేరం జరిగిన ప్రదేశంలో లభించే రక్తం (ముఖ్యంగా తెల్ల రక్త కణాలు), తల వెంట్రుకల మూలాలు, వీర్యం, యోని స్రావం, చర్మంలోని కొంత భాగం లేదా చాలా కాలం కిందట పూడ్చిపెట్టిన శవం ఎముకల నుంచి డీఎన్ఏను సేకరిస్తారు.

దోషిని గుర్తించే పద్ధతి

సేకరించిన డీఎన్ఏను పీసీఆర్ ప్రక్రియ ద్వారా అనేక వందల రెట్లు పెంచి ఆ నేరానికి సంబంధించిన అనుమానిత వ్యక్తి రక్తం నుంచి సేకరించిన డీఎన్ఏ స్వరూపంతో సరిపోల్చి నేరాన్ని నిర్ధారిస్తారు.

భారత్‌లో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్

మనదేశంలో ఈ పద్ధతిని మొదటిసారిగా ఉపయోగించి, వ్యాప్తిలోకి తెచ్చినవారు సీసీఎంబీ డైరెక్టర్ డా. లాల్జీసింగ్. ఈయన కేరళలోని న్యాయస్థానంలో దాఖలైన అత్యాచార కేసులో దోషిని గుర్తించడంలో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.

ఈ పరీక్ష జరిపే 'సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్' సంస్థను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేశారు.

అనువర్తనాలు

1. ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా దొంగలు, హంతకులు, అత్యాచారం చేసినవారిని గుర్తించవచ్చు. తల్లిదండ్రులు - పిల్లల మధ్య ఉన్న రక్త సంబంధాన్ని నిర్ధారించవచ్చు.
2. అంతరించిపోయే జాతుల సంరక్షణకు దీన్ని ఉపయోగిస్తున్నారు.
3. మెడికో, లీగల్ వివాదాల పరిష్కారాల్లో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ ద్వారా మాతృత్వం, పితృత్వాన్ని కచ్చితంగా కనుక్కోవచ్చు.
4. జంతువులు, మానవుల వర్గ వికాస చరిత్రను తెలుసుకోవచ్చు.

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 1	5) 2
6) 4	7) 3	8) 2	9) 3	10) 2
11) 2	12) 4	13) 4	14) 2	15) 4
16) 1	17) 3	18) 3	19) 3	20) 4
21) 1	22) 3	23) 1	24) 2	25) 3
26) 2				

All the students of a school were instructed by

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Read the questions carefully and answer the following:

Directions (Q. No. 1-5): Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.

Mark (a) if only assumption I is implicit

Mark (b) if only assumption II is implicit

Mark (c) if either I or II is implicit

Mark (d) if neither I nor II is implicit

Mark (e) if both I and II are implicit

1. **Statement:-**
   The government has decided to provide monetary relief to the farmers in the drought-hit areas.
   Assumptions:
   I. The farmers of the affected areas may accept the government relief.
   II. The government machinery may be able to reach the affected farmers to provide relief.
2. **Statement:-**
   All the students of a school were instructed by the Principal to reach school at least 15 minutes before the stipulated time for the coming month.
   Assumptions:
   I. The parents of the students of the school may protest against the Principal's instruction.
   II. The parents may request the Principal to withdraw the instruction.
3. **Statement:-**
   Railway authority has started Internet booking facility of long-distance trains and also delivering the tickets at the doorstep through courier service at a little extra cost.
   Assumptions:
   I. Many customers may now book their tickets through Internet, resulting into fewer crowds at ticket booking offices.
   II. Most of the customers may still buy their railway tickets at the booking counters.
4. **Statement:-**
   "If you have obtained 75 per cent or more marks in X Std examination, your admission to our coaching class for XII Std is guaranteed." An advertisement.
   Assumptions:
   I. Bright students do not generally opt for attending coaching classes.
   II. The coaching class has adequate capacity to accommodate all such students.
5. **Statement:-**
   The municipal corporation has given permission for holding fun fairs in the local football ground during the holiday season.
   Assumptions:
   I. The local residents may protest against the corporation's decision.
   II. Many people may not participate in the fun fair.

Directions (Q. No. 6-10): In making decisions about important questions, it is desirable to be able to distinguish between "strong" arguments and "weak" arguments in so far as they relate to the question. Strong arguments are those which are both important and directly related to the question. Weak arguments are those which are of minor importance and also may not be directly related to the question or may be related to a trivial aspect of the question.

Instructions: Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a strong argument and which is a weak argument.

Give answer 1 if only argument I is strong

Give answer 2 if only argument II is strong

Give answer 3 if either I or II is strong

Give answer 4 if neither I nor II is strong and

Give answer 5 if both the arguments I and II are strong.



6. Should graduation be made minimum educational qualification for entry-level jobs in any public sector organization?
   Arguments:-
   I. Yes, graduates always perform better than non-graduates by virtue of their higher level of education.
   II. No, there are quite a few people who cannot afford to remain unemployed till the completion of graduation and are capable of performing equally well as the graduate candidates.
7. Should the examination bodies for all university examinations permit the use of calculators?
   Arguments:-
   I. No, it is necessary for the students to know the methods of manual calculations.
   II. Yes, manual calculations are no more required with extensive use of computers in all fields.
8. Should the knowledge of Hindi language be made compulsory for all the employees of public sector organizations?
   Arguments:-
   I. Yes, it is necessary for dealing with people from the educationally backward strata of the society.
   II. No, it is not necessary for every employee to have the knowledge of Hindi language.
9. Should it be made compulsory for all the private sector organizations to reserve quota for society backward classes?
   Arguments:-
   I. No, the private sector should not be governed by the Government rules.
   II. Yes, private sector organizations should also contribute in upliftment of socially backward classes.
10. Should the women be advised not to travel alone at night in view of the increasing incidences of rape and sexual abuse?
    Arguments:-
    I. No, instead the Government should take measures to control such incidences.
    II. Yes, it is difficult even for the police department to control such cases.

Directions (Q. No. 11 - 13): Read the questions carefully and answer the following:

11. **Cause:-**
    All the major rivers in the state have been flowing way over the danger level for the past few weeks. Which of the following is /are possible effect (s) of the above cause?
    (A) Many villages situated near the riverbanks are submerged, forcing the residents to flee.
    (B) Govt has decided to provide alternate shelter to all the affected villagers residing near the river banks.
    (C) The entire state has been put on high flood alert.
    (1) Only (A) (2) Only (A) and (B)
    (3) Only (B) and (C)
    (4) All (A), (B) and (C)
    (5) None of these
12. **Effect:-**
    This year majority of the final year students of the management institute have opted for finance specialization.
    Which of the following can be a probable cause of the above effect?
    (1) Last year most of the students with HR specialization got better job offers than other specializations.
    (2) The management institute offers only finance specialization to its final year students.
    (3) Last year the students with finance specialization bagged most of the lucrative offers vis-à-vis students with other specializations.
    (4) The management institute has recently started its finance specialization in addition to Marketing and HR being offered earlier.
    (5) None of these
13. **Effect:-**
    Govt allowed all the airlines to charge additional amount as peak time congestion charges for the flights landing between 6.00 a.m. and 10.00 a.m.
    Which of the following is a probable cause of the above effect?
    (1) All the airline companies had threatened to suspend their services during peak hours.
    (2) The Govt has increased its tax for peak time flights.
    (3) The aircrafts are routinely put on hold over, causing extra fuel consumption.
    (4) The airline companies can now charge unlimited additional charge for peak time flights.
    (5) None of these

Solutions

1. When the government has decided to provide relief to the farmers, it must be assuming that the plan can be executed, and the farmers respond positively. Hence, both I and II are implicit. **Ans: 5**
2. If Principal is instructing students, he must be assuming that the students will abide by his instruction, and the parents will also accept it. Hence, both I and II are not implicit **Ans: 4**
3. The initiative taken by the railway authority has been aimed at providing better service-customer. Hence, I is implicit. II may nor may not be an assumption. Hence II is not implicit **Ans: 1**
4. From the advertisement, it is clear that the advertiser must be assuming II. Hence, II is implicit. Assumption I is rather contradicting the statement. Hence, I is not implicit. **Ans: 2**
5. Since assumptions I and II go against the spirit of the given statement, both I and II are not implicit. **Ans: 4**
6. Note "graduates ALWAYS perform". Hence, I is not necessarily true. Hence I is not strong. II deviates from the core issue. Hence, II is not strong. **Ans: 4**
7. I is a simple declaration. Hence, it is not strong. II is strong as it explains the reason behind it. **Ans: 2**
8. I is strong because it is true to a large extent. But II is simplistic and hence weak. **Ans: 1**
9. I is not the correct way of arguing. Hence, I is not strong. Upliftment of socially backward classes is necessary. Hence, II is strong. **Ans: 2**
10. **Ans:** 4.
11. All the three are the possible effects of the given cause. **Ans: 4**
12. Only (3) seems to be the probable cause. **Ans: 3**
13. As aircrafts incur extra fuel consumption charges, government allowed all the airlines to charge additional amount. **Ans: 3**